www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

గురువారం | 29-2-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 | సంచిక (Issue) : 315
శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం, బహుళపక్షం; తిథి: పంచమి తె. 6.24 తదుపరి షష్ఠి; నక్షత్రం: చిత్ర ఉ. 10.23 తదుపరి స్వాతి; వర్జ్యం: సా.4.33-6.18; దుర్ముహూర్తం: ఉ.10.32-11.18, మ.3.12-5.58; అమృతఘడియలు: తె.3.07-4.53; రాహుకాలం: మ.1.30-3.00; సూర్యోదయం: 6.38; సూర్యాస్తమయం: 6.18 | హైదరాబాద్ సిటీ *

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

రూ.100 మాత్రతో క్యాన్సర్ వ్యాప్తికి చెక్

మెటాస్టాసిస్ ప్రక్రియను అడ్డుకునే ట్యాబ్లెట్

మళ్లీ తిరగబెట్టకుండా ఉండే చాన్స్ 30%

రేడియేషన్, కీమో థెరపీ దుష్ప్రభావాలను దాదాపు 50% మేర తగ్గించే సామర్థ్యం

ముంబైలోని టీఐఎఫ్‌ఆర్ శాస్త్రజ్ఞుల ఘనత

జూన్, జూలైకల్లా ప్రజలకు అందుబాటులోకి!



ముంబై, ఫిబ్రవరి 28: క్యాన్సర్ బాధితులకు శుభవార్త! కీమో, రేడియేషన్ వంటి చికిత్సలతో తగ్గిపోయిన క్యాన్సర్.. మళ్లీ తిరగబెట్టకుండా అడ్డుకునే మాత్రను ముంబైలోని ప్రతిష్ఠాత్మక క్యాన్సర్ పరిశోధన సంస్థ 'టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రిసెర్చ్ (టీఐఎఫ్ఆర్)' శాస్త్రజ్ఞులు రూపొందించారు. వారి దశాబ్దకాల పరిశోధనల ఫలితం ఈ ట్యాబ్లెట్. దీని గురించి టాటా మెమోరియల్

మిగతా 2వ పేజీలో...



నేడు డీఎస్సీ నోటిఫికేషన్!

11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి జారీ

గత ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ రద్దు

గ్రూప్-1 నోటిఫికేషన్ తరహాలో నిర్ణయం

గతంలో దరఖాస్తు చేసిన అభ్యర్థులు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదు

5,089 పోస్టులకు గతంలో నోటిఫికేషన్

అదనంగా 5973 పోస్టులతో తాజా ప్రకటన

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు శుభవార్త. రాష్ట్ర ప్రభుత్వం 11,062 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసేందుకు గురువారం నోటిఫికేషన్ జారీ చేసే అవకాశం ఉంది. ఇందుకోసం గత ప్రభుత్వం 5,089 పోస్టులతో జారీ చేసిన నోటిఫికేషన్‌ను ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేసింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ అధికారులు బుధవారం ప్రకటన విడుదల చేశారు. గత నోటిఫికేషన్ ఇచ్చినప్పుడు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం గత ప్రభుత్వం 5,089 పోస్టులతో 2023 సెప్టెంబరు 6వ తేదీన నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. దీంతో సుమారు 1.77 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. అయితే రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం మెగా డీఎస్సీ నిర్వహిస్తామని ప్రకటించింది. ఈ మేరకు కొత్తగా మరో 5,973 ఖాళీ పోస్టుల భర్తీకి ఆమోదం

మిగతా 13వ పేజీలో...

ఓఆర్‌ఆర్ టెండర్లపై విచారణ



సీబీఐ లేదా అదే స్థాయి సంస్థతో దర్యాప్తు

సమగ్ర విచారణకు సీఎం రేవంత్ నిర్ణయం

హెచ్ఎండీఏ పరిధిలో విచారణ జరిపి పూర్తి వివరాలివ్వాలని అధికారులకు ఆదేశం

నివేదిక అందిన అనంతరం క్యాబినెట్‌లో చర్చించి దర్యాప్తు సంస్థకు అప్పగిస్తాం

ఏవైనా ఫైళ్లు మాయమైతే సంబంధిత ఉద్యోగులపై కేసులు నమోదు చేయండి

హెచ్ఎండీఏ స్థలాల పరిరక్షణకు ప్రత్యేక అధికారులను నియమించాలి

హుస్సేన్‌సాగర్ చుట్టూ దుబాయ్ తరహా పర్యాటక ఏర్పాట్లు చేయాలి


హెచ్ఎండీఏ అధికారులతో సమీక్షలో సీఎం



హైదరాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగురోడ్డు(ఓఆర్ఆర్) టోల్ టెండర్ల విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ టెండర్లలో అవకతవకలు జరిగాయంటూ మొదటినుంచీ ఆరోపిస్తున్న సీఎం.. దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని నిర్ణయించారు. సీబీఐ లేదా ఆ స్థాయి దర్యాప్తు సంస్థకు విచారణ బాధ్యతలు అప్పగించనున్నట్లు ప్రకటించారు. బుధవారం సచివాలయంలో హెచ్ఎండీఏ అధికారులతో సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి.. ఈ సందర్భంగా ఓఆర్ఆర్‌పై టోల్ టెండర్ల అంశాన్ని ప్రస్తావించారు. ప్రభుత్వానికి రావాల్సిన భారీ ఆదాయానికి గండిపడేలా తక్కువ ధరకే టోల్ టెండర్లు కట్టబెట్టారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీస ధర నిర్ణయించకుండా టెండర్లు ఎలా పిలిచారని హెచ్ఎండీఏ అధికారులను ప్రశ్నించారు. ఇందులో ఎవరెవరి ప్రమేయం ఉంది? ఏయే స్థలాలు ఉన్నాయి? ఎవరెవరు బాధ్యులు? అనే విషయాలపై

మిగతా 13వ పేజీలో...

ఆస్తిపన్ను బకాయిల వడ్డీపై 90% రాయితీ! .. సర్కారు ఉత్తర్వులు 11



200 దాటితే మొత్తం బిల్లు కట్టాల్సిందే!

ఒక్క యూనిట్ ఎక్కువ వచ్చినా అంతే..

200 యూనిట్లలోపు వినియోగం ఉంటేనే ఫ్రీ

బకాయిలు చెల్లించకున్నా ఉచిత కరెంట్

సమగ్ర మార్గదర్శకాలు ఇవ్వాలంటున్న అధికారులు

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): గృహజ్యోతి ఉచిత విద్యుత్తు పథకం కేవలం 200 యూనిట్లలోపు వినియోగానికే ఉంటుందని, ఆపైన ఒక్క యూనిట్ వాడకం పెరిగినా.. మొత్తానికి బిల్లు చెల్లించాల్సి ఉంటుందని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. అంటే.. ఎవరైనా లబ్ధిదారుడు ఒక్క యూనిట్‌ను అదనంగా వాడినా.. 201 యూనిట్లకూ డబ్బు చెల్లించాలి. అంతే కాదు.. 200 యూనిట్లు దాటితే టారిఫ్ మారిపోయి, బిల్లు మొత్తం తడిసి మోపెడవుతుంది. ఆధార్ అనుసంధానం జరిగిన తెల్లరేషన్/ఆహార భద్రత కార్డులున్న వారంతా ఈ నెల విద్యుత్తు వాడకానికి సంబంధించి జీరో బిల్లు(మార్చి 2 నుంచి జారీ చేస్తారు) పరిధిలోకి వస్తారు. ఒకవేళ ఎవరైనా వినియోగదారుడు ఈ నెల 200లోపు విద్యుత్తు వాడి, జీరో బిల్లు

మిగతా 11వ పేజీలో...

ఇంట్లో గ్యాస్ కనెక్షన్ ఎవరి పేరుమీదున్నా సబ్సిడీ!

ఆ పేరు రేషన్ కార్డులో తప్పనిసరి 11

ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకొని ఉండాలి

తిరస్కరణకు గురైన అర్హులకు మరొక చాన్స్

సవరణలకు పౌరసరఫరాల శాఖ మార్గదర్శకాలు

రాధ, రాజారెడ్డి దంపతులకు సంగీత నాటక అకాడమీ ఫెలోషిప్

గంగాధర శాస్త్రి, పేరిణి ప్రకాశ్, మండా సుధారాణికి అవార్డులు

సాహిత్య అకాడమీ కార్యదర్శి శ్రీనివాసరావుకు డాక్టరేట్ 2

డ్రగ్స్ రాకెట్ గుట్టురట్టు!

3,312 కిలోల నిషేధిత మాదకద్రవ్యాలు సీజ్

మార్కెట్ విలువ 2 వేల కోట్లు

గుజరాత్ తీరంలో చేపల పడవలో స్వాధీనం

ప్యాకెట్లపై పాకిస్థాన్ కంపెనీ పేరు

ఐదుగురు విదేశీయుల అరెస్ట్

ఎన్‌సీబీ డైరెక్టర్ జనరల్ వెల్లడి 2

2029లో జమిలి ఎన్నికలు!

లా కమిషన్ ఓకే!

రాజ్యాంగంలో కొత్త అధ్యాయం చేర్చాలంటూ సిఫారసు



జయం మనదే!

మాది విన్నింగ్ టీమ్.. వైసీపీది చీటింగ్ టీమ్.. మా పొత్తు గెలవాలి.. రాష్ట్రం వెలగాలి

టీడీపీ అగ్నికి జనసేన తోడైంది.. ఇక అన్‌స్టాపబుల్.. మా కలయిక రాష్ట్రం కోసం 11

బాదుడులేని అభివృద్ధి.. కోతలు లేని సంక్షేమం.. ఇరు పార్టీల శ్రేణులకు న్యాయం చేస్తాం

పులివెందులలోనూ జగన్‌ను ఓడిస్తాం.. 'తెలుగు-జన విజయకేతనం' సభలో చంద్రబాబు

4న రాష్ట్రానికి మోదీ

ఆదిలాబాద్‌లో శంకుస్థాపనలు, సభ

5న సంగారెడ్డి సభకు ప్రధాని

హైదరాబాద్/పటాన్‌చెరు/ఆదిలాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలంగాణ పర్యటన ఖరారైంది. మార్చి మొదటి వారంలో ఆయన రాష్ట్రానికి రానున్నారు. 4, 5 తేదీల్లో ఆదిలాబాద్, సంగారెడ్డి బహిరంగ సభల్లో పాల్గొననున్నారు. మార్చి 4న ఆయన నాగ్‌పూర్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్ ద్వారా ఆదిలాబాద్‌కు వస్తారు. పదేళ్ల తర్వాత ప్రధాని మోదీ ఆదిలాబాద్ పర్యటనకు

మిగతా 13వ పేజీలో...

ఆర్టికల్ 370 రద్దు తర్వాత తొలిసారి కశ్మీర్‌కు ప్రధాని 2

7న శ్రీనగర్‌లో మోదీ బహిరంగ సభ



హాలియా పరీక్ష కేంద్రంలో రోదిస్తున్న విద్యార్థినులు

24 మందికి కన్నీళ్లు మిగిల్చిన ఒక్క నిమిషం

ఇంటర్ పరీక్షలకు ఆలస్యంగా వెళ్లడంతో అనుమతించని అధికారులు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్ పరీక్షలు బుధవారం ప్రారంభమవగా.. పరీక్ష కేంద్రానికి చేరుకోవడంలో జరిగిన కొద్దిపాటి ఆలస్యం పలువురు విద్యార్థులకు కన్నీళ్లను మిగిల్చింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 18 మంది పరీక్ష కేంద్రానికి ఆలస్యంగా రావడంతో మూల్యం చెల్లించుకోవాల్సి

మిగతా 14వ పేజీలో...

గోదావరి, కృష్ణా పరీవాహకాలకు మహర్దశ



నిర్వహణకు ఐఐటీలతో కేంద్రం ఒప్పందాలు

గోదావరికి ఐఐటీహెచ్, ఎన్ఈఈఆర్ఐ..

కృష్ణాకు ఎన్ఐటీ వరంగల్, సూరత్కాల్‌తో

దేశంలోని మరో 4 కీలక నదులకు కూడా

2 కేంద్ర జలశక్తి మంత్రి షెకావత్ వెల్లడి

రూ.100 మాత్రతో క్యాన్సర్ వ్యాప్తికి చెక్




(మొదటి పేజీ తరువాయి)

ఆస్పత్రిలోని సీనియర్ క్యాన్సర్ సర్జన్, ఈ పరిశోధనల్లో పాలుపంచుకున్న డాక్టర్ రాజేంద్ర బద్వే వివరించారు. ప్రయోగాల్లో భాగంగా తాము కొన్ని ఎలుకల శరీరాల్లోకి.. మానవ క్యాన్సర్ కణాలను చొప్పించామని, ఆ ఎలుకల్లో క్యాన్సర్ కణితులు ఏర్పడ్డాక వాటిని రేడియేషన్, కీమో థెరపీలతో, సర్జరీ ద్వారా తొలగించామని తెలిపారు. "ఆ చికిత్సలతో చనిపోయిన క్యాన్సర్ కణాలు.. 'సెల్ ఫ్రీ క్రోమాటిన్ పార్టికల్స్' అనే చిన్నచిన్న తునకలుగా మారిపోవడం మేం గమనించాం. ఆ పార్టికల్స్ రక్తప్రసరణ వ్యవస్థ ద్వారా శరీరంలోని ఇతర అవయవాలకు ప్రయాణిస్తాయి. అవి అక్కడ ఆరోగ్యవంతమైన కణాల్లోకి ప్రవేశించి వాటిని క్యాన్సర్ కణాలుగా మారుస్తాయి" అని ఆయన వివరించారు. కొన్ని సీఎఫ్‌సీహెచ్‌పీఎస్‌లు ఆరోగ్యవంతమైన క్రోమోజోములతో కలిసిపోయి కొత్త కణితులకు కారణమవుతాయని వెల్లడించారు. "ఈ సమస్యకు చెక్ పెట్టడానికి ఎలుకలకు మేము రెజ్వెరెట్రాల్, కాపర్ (ఆర్+సీయూ)తో కూడిన ప్రో-ఆక్సిడెంట్ ట్యాబ్లెట్లను ఇచ్చి చూశాం. ఈ ట్యాబ్లెట్లు కడుపులో ఆక్సిజన్ రాడికల్స్‌ను ఉత్పత్తి చేస్తాయి. ఆక్సిజన్ రాడికల్స్ కూడా రక్తప్రసరణ వ్యవస్థలోకి ప్రవేశించి.. ఎక్కడ సెల్ ఫ్రీ క్రోమాటిన్ పార్టికల్స్ కనిపించినా వాటిని నాశనం చేస్తాయి. తద్వారా మెటాస్టాసిస్.. అంటే క్యాన్సర్ కణాలు ఒకచోటు నుంచి మరొకచోటుకు వ్యాపించే ప్రక్రియకు చెక్ పెడతాయి." అని తెలిపారు. ఈ ట్యాబ్లెట్ క్యాన్సర్ తిరగబెట్టకుండా కాపాడడంలో 30 శాతం ప్రభావవంతంగా పనిచేస్తుందని.. కీమోథెరపీ దుష్ప్రభావాల నుంచి కూడా 50% దాకా రక్షణ ఇస్తుందని చెప్పారు. ఈ ట్యాబ్లెట్ విశిష్టత గురించి తెలిపే ప్రజెంటేషన్‌కు వారు.. 'మ్యాజిక్ ఆఫ్ ఆర్+సీయూ' అని పేరు పెట్టడం విశేషం. దీన్ని మార్కెట్లోకి అందుబాటులోకి తేవడానికి సంబంధించిన అనుమతుల కోసం టీఐఎఫ్‌ఆర్ శాస్త్రజ్ఞులు ఎఫ్ఎస్ఎస్ఏఐకి దరఖాస్తు చేశారు. అనుమతులు రాగానే.. జూన్ జూలై నుంచి ఈ టాబ్లెట్ మార్కెట్లో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని డాక్టర్ రాజేంద్ర తెలిపారు. అంతేకాదు.. ఈ టాబ్లెట్ సామాన్యులకు సైతం భారం లేకుండా రూ.100కే అందుబాటులోకి వస్తుందని ఆయన వెల్లడించారు.

బర్డ్ ఫ్లూ కోళ్ల వల్ల సోకదు..!

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 28: "బర్డ్ ఫ్లూ అనేది వైరస్ కాదు.. అంటురోగం అంతకంటే కాదు.. అది కోళ్ల వల్ల సోకదు" అని నేషనల్ ఎగ్ అండ్ చికెన్ ప్రమోషన్ కౌన్సిల్ కన్వీనర్ డాక్టర్ కె.బాలస్వామి స్పష్టం చేశారు. నెల్లూరులోని జర్నలిస్టు భవన్‌లో కోళ్ల ఉత్పత్తిదారులు, విక్రయదారులు, వినియోగదారులతో జరిగిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఇటీవల పొదలకూరు, కోవూరు తదితర ప్రాంతాల్లో బ్రాయిలర్ కోళ్లకు బర్డ్ ఫ్లూ రావడం, జిల్లాలో చికెన్ దుకాణాలు మూసివేశారని తెలిసి నెల్లూరులో ఈ సదస్సు ఏర్పాటు చేశామన్నారు. దేశంలో 2006 నుంచి బర్డ్ ఫ్లూ కోళ్లకు వస్తూ పోతూ ఉందని, ఏనాడైనా కోళ్ల నుంచి మనుషులకు ఆ వ్యాధి సోకి చనిపోయిన జాడలేదని అన్నారు. బర్డ్ ఫ్లూ ద్వారా మనిషి చనిపోయాడని రుజువు చేసిన వారికి నెక్ (నేషనల్ ఎగ్ కో ఆర్డినేషన్ కమిటీ) రూ.కోటి బహుమతి ఇస్తుందని ప్రకటించారు. బర్డ్ ఫ్లూ సోకిన కోళ్లు, గుడ్లు తింటే మనుషులు చనిపోతారంటూ.. వ్యాక్సిన్లు తయారు చేసే విదేశీ కంపెనీలు దుష్ప్రచారం చేస్తున్నాయని ఆయన చెప్పారు. చికెన్, గుడ్డుతో బర్డ్ ఫ్లూ ప్రజలకురాదని తెలిపారు.

లోకం తీరు



ఝార్ఖండ్‌లో రైలు ఢీకొని 12 మంది మృతి?

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28: ఝార్ఖండ్‌లో బుధవారం సాయంత్రం రైలు ఢీకొన్న ఘటనలో కనీసం 12మంది మరణించినట్టు అనుమానిస్తున్నారు. రైల్వే అధికార వర్గాలు మాత్రం ఇద్దరు ప్రాణాలు కోల్పోయినట్టు చెబుతున్నాయి. జామ్‌తారా-కర్మతాండ్ స్టేషన్ల మధ్య ఉన్న కాలా ఝరియా వద్ద ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. బాగల్పూర్ వెళ్తున్న అంగ ఎక్స్‌ప్రెస్ నుంచి దిగిన ప్రయాణికులు ఝాఝా నుంచి అసన్‌సోల్ వెళ్తున్న మెమూ రైలు కింద పడి మరణించారు. ట్రాక్ వద్ద దుమ్ము, పొగలాంటిది కనిపించడంతో అనుమానించిన అంగ ఎక్స్‌ప్రెస్ లోకోపైలట్ దాన్ని కాలా ఝరియా వద్ద నిలిపివేశాడు. మంటలు వ్యాపించాయేమోనన్న భయంతో కిందికి దిగిన కొందరు ప్రయాణికులు పక్క ట్రాక్ మీదుగా నడుస్తూ వెళ్లారు. ఆ ట్రాక్‌పై మెమూ రైలు వస్తున్న విషయాన్ని గమనించక దాని కింద పడి నలిగిపోయారు. అంగ ఎక్స్‌ప్రెస్ నిలిపిన దాదాపు 2కి.మీ. దూరంలో ఈ దుర్ఘటన జరిగిందని తూర్పు రైల్వే వర్గాలు తెలిపాయి. అంగ ఎక్స్‌ప్రెస్‌లో అగ్నిప్రమాదం జరగలేదని పేర్కొన్నాయి. సమాచారం అందుకున్న అధికార యంత్రాంగం సహాయ చర్యలు చేపట్టింది. ఆధార్ కార్డుల ఆధారంగా ప్రయాణికులను గుర్తించి తగుసేవలు అందిస్తున్నారు.

గోదావరి, కష్ణా పరీవాహకాలకు మహర్దశ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28: గోదావరి, కష్ణా పరీవాహకాలకు మహర్దశ పట్టనుంది. వీటి నిర్వహణకు సమగ్ర ప్రణాళికలు రూపొందించాలంటూ 12 ఐఐటీలు, ఇతర అత్యున్నత సంస్థలతో బుధవారం ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు కేంద్ర జలశక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ వెల్లడించారు. గోదావరి, కృష్ణాతోపాటు దేశంలోని మొత్తం 6 నదుల పరీవాహకాల అభివృద్ధికి జలశక్తి మంత్రిత్వ శాఖ పరిధిలోని జాతీయ నదుల పరిరక్షణ డైరెక్టరేట్(ఎన్ఆర్‌సీడీ) ఆయా సంస్థలతో ఒప్పందాలను కుదుర్చుకున్నట్లు ఆయన వివరించారు. గంగానది పరీవాహక నిర్వహణ విషయంలో ఐఐటీ-కాన్పూర్ నేతృత్వంలోని ఏడు విద్యా సంస్థలు ఇచ్చిన ప్రణాళిక సత్ఫలితాలనిస్తున్న నేపథ్యంలో కృష్ణా, గోదావరి, కావేరి, మహానది,పెరియార్, నర్మదానదులపై దృష్టిసారించామన్నారు. 2019లో సంయుక్త పార్లమెంట్ సమావేశం సందర్భంగా అప్పటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నదులను శుభ్రం చేయించడం, పరీవాహక ప్రాంతాల నిర్వహణపై ప్రతిపాదనలు చేసినట్లు గుర్తుచేశారు. ఆమేరకు సమగ్ర ప్రణాళిక కోసం బుధవారం ఒప్పందాలు జరిగాయన్నారు.

కేంద్రం ఒప్పందాల వివరాలు..

నది	ఒప్పందం జరుపుకొన్న సంస్థ
గోదావరి	ఐఐటీ-హైదరాబాద్, ఎన్ఈఈఆర్ఐ-నాగ్‌పూర్
కృష్ణ	ఎన్ఐటీ-వరంగల్, ఎన్ఐటీ-సూరత్కాల్
మహానది	ఐఐటీ-రాయ్‌పూర్, ఐఐటీ-రూర్కీ
నర్మద	ఐఐటీ-ఇండోర్, ఐఐటీ-గాంధీనగర్
కావేరి	ఐఐఎస్‌సీ(బెంగళూరు), ఎన్ఐటీ-త్రిచి
పెరియార్	ఐఐటీ-పాలక్కాడ్, ఎన్ఐటీ-కాలికట్

రాజీవ్ హత్య కేసులో దోషి శాంతన్ మృతి

చెన్నై, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ హత్యకేసులో దోషి శాంతన్(56) అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. గత జనవరి నుంచి చెన్నైలోని రాజీవ్‌గాంధీ స్మారక సర్వజనీన ఆస్పత్రి (జీహెచ్)లో కాలేయ సమస్యలతో అతడు చికిత్స పొందుతున్నాడు. బుధవారం వేకువజామున హఠాత్తుగా గుండెపోటు రావటంతో మృతిచెందినట్టు వైద్యులు ప్రకటించారు. రాజీవ్ హత్య కేసులో శాంతన్‌కు ప్రత్యేక కోర్టు ఉరిశిక్ష విధించగా పలు ఉన్నత న్యాయస్థానాలను ఆశ్రయించి...సుప్రీంకోర్టులో ఊరట పొందాడు. 32ఏళ్లపాటు జైలుజీవితం అనుభవించిన శాంతన్ సుప్రీంకోర్టు పుణ్యమా అని 2022లో విడుదలయ్యాడు. గత జనవరిలో తీవ్ర అనారోగ్యానికి గురైన ఆయన్ను తిరుచ్చి ప్రభుత్వ ఆస్పత్రికి, మెరుగైన చికిత్స కోసం చెన్నై జీహెచ్‌లో చేర్పగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. శాంతన్‌కు తన స్వదేశం శ్రీలంకకు వెళ్లేందుకు ఇటీవలే అనుమతి లభించింది.

దేశంలో అత్యంత ధనిక పార్టీ బీజేపీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): దేశంలో అత్యంత సంపన్న పార్టీ బీజేపీయేనని అసోసియేషన్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్) వెల్లడించింది. 2022-23సంవత్సరంలో తమ ఆదాయం రూ. 2,360.84 కోట్లు ఉంటుందని బీజేపీ ప్రకటించింది. కాంగ్రెస్, సీపీఎం, ఆప్, బీఎస్పీ, నేషనల్ పీపుల్స్ పార్టీ కూడా తమ ఆదాయాన్ని వెల్లడించాయి. గత ఆర్థిక సంవత్సరంలో కాంగ్రెస్ రూ.452.37 కోట్లు, సీపీఎం రూ.141.66 కోట్లు, ఆప్ రూ.85.17 కోట్లు, బీఎస్పీ రూ.29.27 కోట్లు, నేషనల్ పీపుల్స్ పార్టీ రూ.7.56 కోట్ల మేరకు తమ ఆదాయం ఉంటుందని ప్రకటించాయి. 2023 అక్టోబరు 31నాటికి ఈ పార్టీలు ఎన్నికల కమిషన్‌కు తమ ఆడిట్ నివేదికలను సమర్పించాల్సి ఉండగా.. కేవలం సీపీఎం మాత్రమే తన నివేదికను సకాలంలో సమర్పించింది. కాగా బీజేపీకి గత ఏడాది ఎన్నికల బాండ్ల రూపంలో రూ.1,294.15 కోట్లు రాగా, కాంగ్రెస్‌కు రూ. 171.02కోట్లు వచ్చాయి.

భువనేశ్వర్ మురికివాడలో బిల్‌గేట్స్

భువనేశ్వర్, ఫిబ్రవరి 28: మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ బుధవారం భువనేశ్వర్‌లోని మురికివాడలో పర్యటించారు. మా మంగ్లా బస్తీలోని బిజు ఆదర్శ్ కాలనీని సందర్శించారు.స్థానికులతో, స్వయం సహాయక సంఘాలతో మాట్లాడారు. వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఒడిశా ప్రభుత్వంలోని వివిధ శాఖలు 'బిల్ అండ్ మెలిండా గేట్స్ ఫౌండేషన్'తో కలిసి పనిచేస్తున్నాయి. మురికివాడలోని ప్రజలకు కల్పిస్తున్న భూ హక్కులు, కుళాయి నీరు, పారిశుధ్య, విద్యుత్ సౌకర్యాల గురించి రాష్ట్ర అభివృద్ధి కమిషనర్ అను గార్గ్.. బిల్‌గేట్స్‌కు వివరించారు. కాగా, ప్రపంచ ఆరోగ్యానికి, ముఖ్యంగా వ్యాక్సినేషన్ రంగానికి భారత్ ఎంతగానో సహకరిస్తోందని గేట్స్ తన బ్లాగ్‌లో ప్రస్తావించారు. అల్పాదాయ దేశాల్లో 100 కోట్ల మంది పిల్లలకు వ్యాక్సిన్లు వేయడం మామూలు విషయం కాదని, ప్రపంచంలోనే అతిపెద్ద వ్యాక్సిన్ ఉత్పత్తిదారుగా భారత్ నిలిచిందని కొనియాడారు.

గండం గట్టెక్కినట్లే!

హిమాచల్‌లో కాంగ్రెస్ సర్కారుకు ఉపశమనం

- శాసనసభలో నాటకీయ పరిణామాలు
- 15 మంది బీజేపీ ఎమ్మెల్యేల సస్పెన్షన్
- బడ్జెట్ ఆమోదం.. సభ నిరవధిక వాయిదా


కాంగ్రెస్ పరిశీలకులతో సీఎం సుఖ్వీందర్ సింగ్

సిమ్లా/న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28: రాజ్యసభ ఎన్నికల సందర్భంగా హిమాచల్‌ప్రదేశ్‌లో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. మంగళవారం రాజ్యసభ ఎన్నికల్లో ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీజేపీ అభ్యర్థికి ఓటేయడంతో సుఖ్వీందర్‌సింగ్ సర్కారు మైనారిటీలో పడిందని బీజేపీ వాదించింది. కాంగ్రెస్ ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానానికి సిద్ధమైంది. బుధవారం ఉదయం ప్రతిపక్ష నేత జైరాం ఠాకూర్ గవర్నర్‌ను కలిశారు. 2024-25 ఆర్థిక బిల్లును ఓటింగ్ ద్వారానే ఆమోదించేలా చూడాలని కోరారు. హిమాచల్‌ప్రదేశ్ అసెంబ్లీలో మొత్తం 68 స్థానాలు ఉండగా.. కాంగ్రెస్‌కు 40, బీజేపీకి 25 సీట్లు ఉన్నాయి. మరో ముగ్గురు స్వతంత్ర ఎమ్మెల్యేలు ఉన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి అభిషేక్ మను సింఘ్వీ, బీజేపీ అభ్యర్థి హర్ష్ మహాజన్‌కు చెరో 34 ఓట్లు వచ్చాయి. డ్రా తీయగా విజయం మహాజన్‌ను వరించింది. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆరుగురు, స్వతంత్రులు ముగ్గురు బీజేపీకి అనుకూలంగా ఓటు వేశారు. దీంతో కాంగ్రెస్ సర్కారు మైనారిటీలో పడిపోయిందని బీజేపీ చెబుతోంది. ఈ క్రమంలో బుధవారం ఉదయం అసెంబ్లీలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. బీజేపీ సభ్యులు ఆర్థిక బిల్లును అడ్డుకునేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. స్పీకర్ సభను మధ్యాహ్నానికి వాయిదా వేశారు. తర్వాత జైరాం ఠాకూర్ సహా 15 మంది బీజేపీ సభ్యులను సస్పెండ్ చేశారు. అంతకుముందే 10 మంది సభ్యులు వాకౌట్ చేశారు. అనంతరం మూజువాణీ ఓటుతో బడ్జెట్‌ను ఆమోదించి, సభను నిరవధికంగా వాయిదా వేశారు. ఇదిలా ఉండగా.. సీఎం సుఖ్వీందర్ పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ ప్రజాపనుల శాఖ మంత్రి విక్రమాదిత్య సింగ్ బుధవారం తన పదవికి రాజీనామా చేశారు. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రచారమంతా తన తండ్రి వీరభద్రసింగ్ పేరు మీదే జరిగిందని కానీ, గెలిచిన తర్వాత మాత్రం ఆయన విగ్రహం పెట్టడానికి స్థలాన్ని కూడా ప్రభుత్వం నిర్ణయించలేకపోయిందని ఆరోపించారు.

రంగంలోకి కాంగ్రెస్ అధిష్ఠానం

హిమాచల్‌లో రాష్ట్ర ప్రభుత్వం ప్రమాదంలో పడడంతో దిద్దుబాటు చర్యలు చేపట్టింది. సీనియర్ పరిశీలకులు భూపేశ్ బఘేల్, భూపిందర్‌సింగ్ హుడా, డీకే శివకుమార్‌లను హుటాహుటిన సిమ్లా పంపింది. కాంగ్రెస్ ఎమ్మెల్యేలందరితో మాట్లాడి, సమస్యను పరిష్కరించాలని పార్టీ జాతీయ అధ్యక్షుడు ఖర్గే వారిని ఆదేశించినట్లు జైరాం రమేశ్ తెలిపారు. అసంతృప్త ఎమ్మెల్యేలతోనూ చర్చించి, సాధ్యమైనంత త్వరగా తనకు సమగ్ర నివేదికను అందజేయాలని స్పష్టం చేసినట్లు వెల్లడించారు. అన్ని అవకాశాలనూ పరిశీలిస్తున్నామని, కఠిన చర్యలు తీసుకునేందుకు కూడా వెనకాడబోమని పేర్కొన్నారు. కాగా, గురువారం సాయంత్రానికల్లా పరిశీలకులు నివేదిక ఇస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి. హిమాచల్ ప్రజలు ఇచ్చిన తీర్పును రక్షించాలని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కాపాడుకోవాలన్నదే ఖర్గే అభిమతమని రమేశ్ చెప్పారు. బీజేపీ దొడ్డిదారిలో అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ సర్కారును పడగొట్టే చాన్స్ మోదీ ప్రభుత్వానికి ఇవ్వబోమన్నారు.

ప్రజా తీర్పును విరుద్ధం: ప్రియాంక

హిమాచల్‌లో ప్రజలు ఇచ్చిన తీర్పును అణచివేయాలని బీజేపీ ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక ఆరోపించారు. అధికార దుర్వినియోగం, కేంద్ర సంస్థలను ఉసిగొల్పడం ద్వారా బీజేపీ రాజకీయ అనిశ్చితి సృష్టించాలని చూస్తోందని ధ్వజమెత్తారు. తమకు ఇష్టమైన ప్రభుత్వాన్ని ఎన్నుకొనే హక్కు ప్రజలకు ఉంటుందని.. బీజేపీ అధికార దాహంతో ఆ హక్కును కాలరాస్తోందన్నారు.

రెండు రోజుల్లో సుఖాంతం

బెంగళూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): హిమాచల్ ప్రదేశ్ కాంగ్రెస్ ప్రభుత్వంలో అసమ్మతి తీవ్రరూపం దాల్చడంతో పరిస్థితిని చక్కదిద్దేందుకు కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను పార్టీ అధిష్ఠానం రంగంలోకి దింపింది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ సూచన మేరకు డీకే శివకుమార్ బుధవారం ఉదయం హుటాహుటిన హిమాచల్‌ప్రదేశ్‌కు బయల్దేరివెళ్లారు. వెళ్లబోయే ముందు ఆయన మీడియాతో మాట్లాడుతూ, హిమాచల్‌ప్రదేశ్‌లో తమ పార్టీ ఎమ్మెల్యేలందరూ ఐక్యంగానే ఉంటారని, రెండు మూడు రోజుల్లో సుఖాంతం అవుతుందని విశ్వాసం చేశారు. రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ సీనియర్ నేత అభిషేక్ మను సింఘ్వీ ఓటమి పాలుకావడం బాధాకరమని అన్నారు. దేశంలోని ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన కాంగ్రెస్ ప్రభుత్వాలను కుప్పకూల్చేందుకు బీజేపీ శతవిధాలా ప్రయత్నిస్తోందని ఆయన అన్నారు.

జమిలి ఎన్నికలకు లా కమిషన్ ఓకే!

- రాజ్యాంగంలో కొత్త అధ్యాయం చేర్చాలని సిఫార్సు చేసే అవకాశం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28: ఒకే దేశం-ఒకే ఎన్నిక అన్న లక్ష్య సాధనకు అనుకూలంగా లా కమిషన్ సిఫార్సులు చేయనున్నట్టు బుధవారం విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఇందుకోసం రాజ్యాంగంలో కొత్త చాప్టర్‌నుగానీ, పార్ట్‌నుగానీ జోడించాలని సలహా ఇవ్వనున్నట్లు పేర్కొన్నాయి. మూడు అంచలైన... లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలతో పాటు స్థానిక సంస్థలైన మున్సిపాలిటీలు/గ్రామ పంచాయతీలు అన్నింటికీ ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలని సూచించనున్నట్లు, విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ రుతురాజ్ అవస్థి ఆధ్వర్యంలోని లా కమిషన్ ఈ మేరకు నివేదిక సమర్పించే అవకాశం ఉన్నట్లు ఆ వర్గాలు తెలిపాయి. "జమిలి ఎన్నికల నిర్వహణకు తొలుత అన్ని రాష్ట్రాల అసెంబ్లీల కాలపరిమితి ఒకే సమయానికి ముగిసేలా ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. ఇందుకు కొన్ని అసెంబ్లీల కాలపరిమితిని తగ్గించాల్సి ఉండగా, మరికొన్నింటిని పొడిగించాల్సి ఉంటుంది. రానున్న అయిదేళ్ల కాలంలో మూడు దశల్లో ఎన్నికలు నిర్వహిస్తే ఇది సాధ్యపడుతుంది. తద్వారా 2029 మే-జూన్‌ల మధ్య నిర్వహించే 19వ లోక్‌సభ ఎలక్షన్ల సందర్భంగా ప్రప్రథమ ఏకకాల ఎన్నికలు జరపడానికి వీలు కలుగుతుంది. ఇందుకు అనుగుణంగా రాజ్యాంగంలో నిబంధనలు పొందుపరచాల్సి ఉంటుంది. దీనికి అవసరమైతే రాజ్యాంగ సవరణ చేయాలని లా కమిషన్ సిఫార్సు చేయనుంది" అని వివరించాయి. అవిశ్వాస తీర్మానం కారణంగా ప్రభుత్వం పడిపోయి, కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేని పరిస్థితి తలెత్తితే వెంటనే అసెంబ్లీని రద్దు చేయకుండా అన్ని పార్టీలతో కూడిన 'యూనిటీ గవర్నమెంట్'ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించనున్నట్లు తెలుస్తోంది.

రాజ్యసభలో మెజారిటీకి చేరువలో ఎన్డీయే

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28: బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి ఈ ఏడాది ఏప్రిల్‌లో రాజ్యసభలో మెజారిటీ మార్క్ సాధించే అవకాశాలున్నాయి. నామినేటెడ్ కేటగిరీలో ఖాళీగా ఉన్న ఆరు స్థానాల భర్తీ, కొత్తగా ఎన్నికయిన అభ్యర్థుల ప్రమాణస్వీకారాల తర్వాత ఎన్డీయే మ్యాజిక్ ఫిగర్‌ను సాధించే చాన్స్ ఉంది. 245 మంది సభ్యులు ఉన్న రాజ్యసభలో మెజారిటీ మార్క్ 123గా ఉంది. ప్రస్తుతం బీజేపీకి 96 మంది సభ్యులు ఉన్నారు. దాంతో మొత్తం ఎన్డీయేకు ఎగువసభలో 113 మంది సభ్యులు ఉన్నారు. ఈ క్రమంలో కొంతమంది స్వతంత్ర సభ్యులు, నామినేటెడ్ సభ్యుల మద్దతుతో ఏప్రిల్‌లో ఎన్డీయే మెజారిటీ మార్క్‌ను చేరుకునే అవకాశాలున్నాయి. ఈ ఏప్రిల్‌లో ఖాళీ కానున్న 56 రాజ్యసభ సీట్లలో 41 సీట్లు ఏకగ్రీవంగా కాగా మిగిలిన సీట్లకు ఈనెల 27న ఎన్నికలు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ 56 సీట్లలో బీజేపీ 30, కాంగ్రెస్ 9, ఎస్పీ 2, టీఎంసీ 4, వైయస్ఆర్‌సీపీ 3, ఆర్జేడీ 2, బీజేడీ 2, ఎన్సీపీ, శివసేన, బీఆర్ఎస్, జేడీ(యూ)లు ఒక్కొక్కటి చొప్పున సీట్లు గెలుచుకున్నాయి.

మణిపూర్‌లో ఏఎస్పీ కిడ్నాప్

ఇంఫాల్, ఫిబ్రవరి 28: మణిపూర్‌లో సాయుధ తీవ్రవాదులు ఏకంగా ఓ పోలీసు అధికారినే కిడ్నాప్ చేశారు. తూర్పు ఇంఫాల్‌లోని వాంగ్‌ఖీలో మైతేయీ తెగకు చెందిన ఓ సాయుధ ముఠా సభ్యులు అడిషనల్ ఎస్పీ అమిత్ కుమార్ ఇంటిపై మంగళవారం రాత్రి దాడికి పాల్పడ్డారు. విచ్చలవిడిగా కాల్పులు జరిపి ఇంటిని, నాలుగు వాహనాలను ధ్వంసం చేశారు. ఆ సమయంలో ఇంట్లో ఉన్న అమిత్ కుమార్ తండ్రి.. కుమారుడికి విషయం చెప్పగా.. ఆయన తన బృందంతో కలిసి అక్కడికి వచ్చారు. అయితే, పెద్ద సంఖ్యలో ఉన్న సాయుధ తీవ్రవాదులను వారు అడ్డుకోలేకపోయారు. తీవ్రవాదులు అమిత్ కుమార్‌ను బంధించి తమ వెంట తీసుకెళ్లారు. ఆయన అంగరక్షకులను తీవ్రంగా కొట్టి గాయపరిచారు. విషయం తెలిసిన రాష్ట్ర పోలీసులు కొన్ని గంటల్లోనే ఏఎస్పీని విడిపించుకోగలిగారు. ప్రస్తుతం ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

మార్చి 7న కశ్మీర్‌కు ప్రధాని మోదీ

ఆర్టికల్ 370 రద్దు తర్వాత ఇదే తొలిసారి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28: జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించే ఆర్టికల్ 370ని రద్దు చేసి, రాష్ట్రాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించిన తర్వాత తొలిసారిగా ప్రధాని నరేంద్ర మోదీ కశ్మీర్‌లో పర్యటించనున్నారు. శివరాత్రికి ఒక్క రోజు ముందు.. మార్చి 7న కశ్మీర్ పర్యటనకు వెళుతున్నారు. ఇందులో భాగంగా ఆ రోజున శ్రీనగర్‌లో జరిగే సభలో ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. అంతేకాక, పలు పథకాలను కూడా ప్రారంభించనున్నారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ మోదీ కశ్మీర్ పర్యటన అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. సరికొత్త కశ్మీర్(నయా కశ్మీర్) తాము సాధించిన గొప్ప విజయంగా బీజేపీ ఈ ఎన్నికల్లో ప్రచారం చేసుకోనుంది. ప్రధాని పర్యటన నేపథ్యంలో కశ్మీర్‌లో హై అలెర్ట్ ప్రకటించారు. శ్రీనగర్‌లో సభా వేదిక కూడా నిర్ణయం కావడంతో పోలీసులు, పారామిలటరీ బలగాలు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నాయి. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి వాహన తనిఖీలు చేపడతున్నాయి. సభావేదిక పరిసరాలను జల్లెడ పడుతున్నాయి. కాగా, ఫిబ్రవరి 20న జమ్మూలో పర్యటించిన ప్రధాని మోదీ రూ.32వేల కోట్ల విలువైన పనులను ప్రారంభించారు.

సచిన్ పర్యటనపై మోదీ స్పందన

టీమిండియా మాజీ క్రికెటర్ సచిన్ తన కుటుంబంతో కలిసి ఇటీవల జమ్మూకశ్మీర్‌లో పర్యటించారు. ఇందుకు సంబంధించి సచిన్ బుధవారం ఎక్స్‌లో ఓ వీడియో పోస్ట్ చేశారు. "జమ్మూకశ్మీర్ పర్యటన ఓ అందమైన అనుభవంగా ఎప్పటికీ నా జ్ఞాపకాల్లో ఉండిపోతుంది. మనం దేశంలో సందర్శించాల్సిన ప్రదేశాలు చాలా ఉన్నాయని ప్రధాని మోదీ చెప్పిన మాటలను ఈ పర్యటన తర్వాత నేను ఏకీభవిస్తున్నా. ఇక్కడ తయారయ్యే కశ్మీర్ విల్లో బ్యాట్లు మేక్ ఇన్ ఇండియా, మేక్ ఆఫ్ వరల్డ్‌కు మంచి ఉదాహరణ. జమ్మూకశ్మీర్ అందాలను ఆస్వాదించాలని ప్రజలకు నేను పిలుపునిస్తున్నా" అని అందులో పేర్కొన్నారు. ఈ వీడియోపై స్పందించిన మోదీ.. కశ్మీర్‌లో సచిన్ పర్యటనను చూసిన యువత రెండు విషయాలు తెలుసుకోవాలన్నారు. దేశంలోని వేర్వేరు ప్రాంతాలను సందర్శించడం అందులో ఒకటైతే.. మేక్ ఇన్ ఇండియా ప్రాముఖ్యతను గుర్తించడం రెండోదని అన్నారు. అందరం కలిసి వికసిత్, ఆత్మనిర్భర్ భారత్ నిర్మిద్దామని పిలుపునిచ్చారు.

నేడో రేపో బీజేపీ తొలి జాబితా!

లోక్‌సభ అభ్యర్థుల ఎంపికపై బీజేపీ అధిష్ఠానం బుధవారం ప్రత్యేకంగా సమావేశమైంది. పలు రాష్ట్రాలకు చెందిన అభ్యర్థులు, వారి విజయావకాశాలపై మేధోమథనం నిర్వహించింది. గురువారం పార్టీ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ సమావేశమై పలు రాష్ట్రాల్లో అభ్యర్థులను ఖరారు చేయనుంది. అనంతరం, బీజేపీ లోక్‌సభ అభ్యర్థుల తొలిజాబితాను ప్రకటించనుంది. తొలి జాబితాలో 100మంది పేర్లు ఉంటాయని పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ జాబితాలోనే ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా లాంటి సీనియర్ నాయకుల పేర్లతో పాటు 2019లో ఓడిపోయిన పలు స్థానాలకు కూడా అభ్యర్థులను ప్రకటిస్తారని పేర్కొన్నాయి. 2019లో కూడా బీజేపీ తొలి జాబితాలోనే మోదీ, అమిత్ షా పేర్లను ప్రకటించింది. అయితే, అప్పుడు లోక్‌సభ షెడ్యూల్ వెలువడిన తర్వాత తొలి జాబితాను వెల్లడించింది.


తమిళనాడులోని తూత్తుకుడిలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తున్న మోదీ

ఇస్రో కీర్తికిరీటంలో మరో కలికితురాయి

చెన్నై, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఇస్రో కీర్తికిరీటంలో మరో కలికితురాయి చేరింది. తమిళనాడులోని తూత్తుకుడి జిల్లా తిరుచెందూరు సమీపంలోని కులశేఖరపట్టణం వద్ద కొత్త రాకెట్ ప్రయోగ కేంద్రం నిర్మాణానికి ప్రధాని మోదీ బుధవారం శంకుస్థాపన చేశారు. తేలికపాటి, మధ్యతరహా రాకెట్లను ప్రయోగించేందుకు అనువుగా దీన్ని నిర్మిస్తున్నారు. తూత్తుకుడి హార్బర్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ రాకెట్ ప్రయోగకేంద్రం నిర్మాణానికి ప్రధాని శంకుస్థాపన చేశారు. అలాగే, రూ.17,300 కోట్ల వ్యయంతో తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో వివిధ అభివృద్ధి పనులకు కూడా ఈ సందర్భంగా ప్రధాని శ్రీకారం చుట్టారు. కేంద్రప్రభుత్వం తమిళనాడులో ఎన్నో అభివృద్ధి పథకాలను అమలు చేస్తున్నా.. ఆ వివరాలను ప్రసార మాధ్యమాల్లో రాకుండా డీఎంకే ప్రభుత్వం అడ్డుకుంటోందని ఇదే సభలో మోదీ ఆరోపించారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా రాష్ట్రాభివృద్ధికి పాటుపడతానని చెప్పారు. కాగా, ఇస్రో కొత్త రాకెట్ ప్రయోగ కేంద్రం శంకుస్థాపన సందర్భంగా తమిళనాడు ప్రభుత్వం పత్రికలకు ఇచ్చిన వాణిజ్య ప్రకటనల్లో చైనా రాకెట్‌ను ముద్రించడం వివాదం రేపింది. తిరునల్వేలిలో బీజేపీ నిర్వహించిన బహిరంగ సభలో మోదీ ఈ అంశాన్ని ప్రస్తావించారు. చైనా రాకెట్ ఫొటోను ముద్రించడాన్ని బట్టి డీఎంకే పాలకుల దేశభక్తి స్పష్టమవుతోందని ఎద్దేవా చేశారు.

రాధ, రాజారెడ్డి దంపతులకు సంగీత నాటక అకాడమీ ఫెలోషిప్



న్యూఢిల్లీ, హైదరాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కూచిపూడి నృత్య కళాకారులు రాధా రెడ్డి-రాజారెడ్డి దంపతులలకు ప్రతిష్ఠాత్మకమైన సంగీత నాటక అకాడమీ ఫెలోషిప్ లభించింది. కొన్ని దశాబ్దాలుగా ఢిల్లీలో కూచిపూడి నృత్య కళను పరిరక్షిస్తూ వేల మందికి శిక్షణ నిచ్చిన రాధా రాజారెడ్డి దంపతులకు గతంలోనే పద్మశ్రీ, పద్మవిభూషణ్ పురస్కారాలు వరించాయి. సంగీత నాటక అకాడమీ ఫెలోషిప్‌లో భాగంగా వారికి రూ 3 లక్షల మేరకు నగదు పురస్కారం లభిస్తుంది. 2022, 23 సంవత్సరాలకు సంగీత నాటక అకాడమీ సంగీతం, నృత్యం, రంగస్థలం, సంప్రదాయ, జానపద, గిరిజన సంగీత, నృత్య కళల్లో 92 మందికి అవార్డులు ప్రకటించింది. మరో 80 మంది యువకళాకారులకు కూడా 2022, 23 సంవత్సరాలకు ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ యువ పురస్కారాలను ప్రకటించింది. 2023 సంవత్సరానికి గాను సంగీత నాటక అకాడమీ పురస్కారాలు లభించిన వారిలో తెలుగువారు ప్రముఖ గాయకుడు, భగవద్గీతను గానం చేసిన ఎల్వీ గంగాధర శాస్త్రి, మద్దాలి ఉషా గాయత్రి (కూచిపూడి), నటరాజ రామకృష్ణ శిష్యుడు పేరిణి ప్రకాశ్ (పేరిణి నాట్యం) ఉన్నారు 2022 సంవత్సరానికి గాను మండా సుధారాణి (గాత్రం), వినుకొండ సుబ్రహ్మణ్యం (డోలు వాయిద్యం), భాగవతుల సేతురామ్ (కూచిపూడి)లకు సంగీత నాటక పురస్కారాలు లభించాయి. ఈ పురస్కారం కింద తామపత్రం, రూ.లక్ష నగదు ఇస్తారు. 2023 సంవత్సరానికి గాను ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ యువ పురస్కారాలు అందుకున్నవారిలో తెలుగువారు బి మల్లికార్జున రావు (రంగస్థల కళ- మేకప్), అంగడి భాస్కర్ (జానపద సంగీతం) ఉండగా, 2022 సంవత్సరానికి ప్రముఖ సినీనటుడు రక్త కన్నీరు సి నాగభూషణం మనుమరాలు శ్వేతా ప్రసాద్ (గాత్రం), టి.రెడ్డి (కూచిపూడి) ఉన్నారు. యువపురస్కారాల కింద తామపత్రం, రూ.25వేల నగదు ఇస్తారు. కాగా కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి కృత్తివెంటి శ్రీనివాసరావుకు జగదల్‌పూర్‌లోని మహేంద్ర కర్మ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ పట్టా ప్రదానం చేస్తున్నట్లు ప్రకటించింది.

3,312 కిలోల డ్రగ్స్ సీజ్

- మార్కెట్ విలువ దాదాపు రూ.2 వేల కోట్లు
- గుజరాత్ తీరంలో చేపల పడవలో స్వాధీనం
- ఐదురుగు విదేశీయులను అరెస్ట్ చేసిన ఎన్‌సీబీ

పోర్‌బందర్/న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28: దేశంలో మరో భారీ డ్రగ్ రాకెట్‌ను నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ) అధికారులు ఛేదించారు. గుజరాత్ తీరంలో భారత సముద్ర జలాల్లోకి ప్రవేశించిన పడవ నుంచి ఏకంగా 3,312 కిలోల నిషేధిత మాదకద్రవ్యాలను నావికా దళం సహాయంతో స్వాధీనం చేసుకున్నారు. వీటిలో 158.3 కిలోల క్రిస్టల్ మెథాంఫేటమిన్ (మెథ్)తో పాటు 3,100 కిలోల హషీష్, 26.6 కిలోల హెరాయిన్ ఉంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ఈ సరుకు విలువ రూ.2వేల కోట్ల వరకూ ఉంటుందని ఎన్‌సీబీ డైరెక్టర్ జనరల్ ఎస్.ఎన్. ప్రధాన్ ఢిల్లీలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వెల్లడించారు. దేశ సముద్ర జలాల్లో ఇంత భారీ పరిమాణంలో డ్రగ్స్ స్వాధీనం చేసుకోవడం ఇదే మొదటిసారని తెలిపారు. భారత తీరానికి 60నాటికల్ మైళ్ల దూరంలో, అంతర్జాతీయ సముద్ర సరిహద్దు రేఖ వెంబడి అరేబియా సముద్రంలో మంగళవారం ఉదయం అనుమానాస్పదంగా సంచరిస్తున్న చేపల పడవను అధికారులు అడ్డుకొని తనిఖీలు చేపట్టారు. ఇరాన్‌లోని చాబహార్ పోర్టు నుంచి ఈ పడవ బయలుదేరినట్లు గుర్తించారు. అందులో లభించిన డ్రగ్స్ ప్యాకెట్లపై పాక్‌కు చెందిన 'రాస్ అవద్ గూడ్స్ కంపెనీ' పేరు ముద్రించి ఉందని ఎన్‌సీబీ వర్గాలు తెలిపాయి. ఈ దాడుల్లో భాగంగా పడవలో ఉన్న ఐదుగురు విదేశీయులను అరెస్ట్ చేశారు. వారివద్ద ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేవని, వీరు పాకిస్థాన్ లేదా ఇరాన్‌కు చెందినవారు అయి ఉండొచ్చని ఎన్‌సీబీ డిప్యూటీ డైరెక్టర్(ఆపరేషన్స్) జ్ఞానేశ్వర్ సింగ్ వెల్లడించారు. సాగర్‌మథన్-1 పేరిట ఈ ఆపరేషన్ నిర్వహించినట్లు తెలిపారు. ఎన్‌సీబీ, గుజరాత్ పోలీసులను కేంద్ర హోంమంత్రి అమిత్ షా అభినందించారు.

2028లో చంద్రయాన్-4 ప్రయోగాన్ని చేపట్టనున్నట్లు ఇస్రోకు చెందిన స్పేస్ అప్లికేషన్ సెంటర్ (ఎస్ఏసీ) అధికారి డాక్టర్ నిలేశ్ దేశాయ్ చెప్పారు. 2040 నాటికి చంద్రుడి పైకి భారత వ్యోమగాములను పంపాలనేది కూడా ఇస్రో లక్ష్యమని ఆయన తెలిపారు. - న్యూఢిల్లీ

రాడిసన్‌లో డ్రగ్స్ కేసు..

రాడిసన్‌లో కొకైన్ పార్టీ వ్యవహారం..
విచారణకు హాజరుకాని క్రిష్



- రెండ్రోజుల తర్వాత వస్తానన్న డైరెక్టర్
- ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇతరులకూ సందేశాలు
- వివేకానంద, అబ్బాస్ ఫోన్లలో డేటా సేకరిస్తున్న విచారణాధికారులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి28 (ఆంధ్రజ్యోతి): రాడిసన్ కొకైన్ పార్టీ వ్యవహారంలో సినీ దర్శకుడు క్రిష్ బుధవారం పోలీసుల ముందు విచారణకు హాజరవుతారని భావించగా.. ఆయన రాలేదు. తాను ముంబైలో ఉన్నానని, వచ్చేందుకు మరో రెండు రోజులు పడుతుందని పోలీసులకు సమాచారమిచ్చినట్టు తెలిసింది. విచారణకు పూర్తిగా సహకరిస్తానని ఆయన చెప్పారు. ఆయనతోపాటు పార్టీలో పాల్గొన్న మిగతా ఐదుగురూ విచారణకు హాజరుకావాలని సందేశాలు పంపినట్లు పోలీసులు తెలిపారు. వారు త్వరలోనే విచారణకు హాజరయ్యే అవకాశాలున్నాయని తెలుస్తోంది. వీరిని విచారించిన తర్వాత తదుపరి విచారణకు నోటీసులిచ్చే అవకాశం ఉంది. ఈ వ్యవహారంలో ప్రధానంగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వివేకానందకు కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో ఆయనకు రిమాండ్ తప్పింది. పార్టీ జరిగిన ప్రాంతంలో తక్కువ మోతాదులో కొకైన్ లభించడంతో కేసు తీవ్రత తగ్గిందన్న చర్చలు జరుగుతున్నాయి. అయితే పార్టీలో పాల్గొన్న వారు డ్రగ్స్ తీసుకున్నారా లేదా అనేది వారిని విచారించిన తర్వాతనే నిర్ధారణ అవుతుందని పోలీసులు చెబుతున్నారు.

అబ్బాస్ కీలకం...

పార్టీ నిర్వహించిన వివేకానందతో పాటు డ్రగ్స్ సరఫరా చేసిన అబ్బాస్ విచారణలో కీలకంగా మారారు. గతంలో జరిగిన పార్టీల్లో పాల్గొన్నవారి వివరాలు... డ్రగ్స్ సరఫరా చేసిన పరిమాణం గురించి వారిద్దరి ద్వారానే వివరాలు వెల్లడయ్యే అవకాశముంది. వారి ఫోన్ల ద్వారా ఇప్పటికే కొంత సమాచారం సేకరించిన పోలీసులు.. డిలీట్ అయిన డేటాను రికవరీ చేసే పనిలో నిమగ్నమయ్యారు. అబ్బాస్ సినీ పరిశ్రమలో వారికి కూడా డ్రగ్స్ సరఫరా చేసి ఉంటాడని భావిస్తున్నారు.

బుధవారం రాత్రి మరికొన్ని లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలకు వైసీపీ అభ్యర్థులను ప్రకటించారు. ఒంగోలు ఎంపీ స్థానానికి చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డి, గంగాధర నెల్లూరుకు డిప్యూటీ సీఎం కె.నారాయణ స్వామి కుమార్తె కృపాలక్ష్మి, కందుకూరుకు కనిగిరి ఎమ్మెల్యే మధుసూదన్ యాదవ్, గుంటూరు ఎంపీ అభ్యర్థిగా పొన్నూరు ఎమ్మెల్యే కిలారు రోశయ్యను నిర్ణయించారు. పొన్నూరు అసెంబ్లీకి అంబటి మురళిని రంగంలోకి దింపారు. -అమరావతి

గల్ఫ్ కార్మికులకు అండగా ఉంటాం

పార్టీ తరఫున, వ్యక్తిగతంగానూ సాయం చేస్తాం .. రాష్ట్ర ప్రభుత్వమూ హామీ నిలుపుకోవాలి

- కేరళ తరహా ఎన్నారై పాలసీని అమలు చేయాలి
- నకిలీ ఏజెంట్ల చేతుల్లో మోసపోవద్దు
- రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు పెరిగాయి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- దుబాయి జైలు నుంచి విడుదలై వచ్చిన వారిని పరామర్శించిన నేత



సిరిసిల్లలో గల్ఫ్ బాధితులను పరామర్శిస్తున్న కేటీఆర్

సిరిసిల్ల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): గల్ఫ్ కార్మికులకు అండగా ఉంటామని సిరిసిల్ల ఎమ్మెల్యే, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పారు. గల్ఫ్ బాధితులకు సహాయం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిందని, ఆ మాటను నిలుపుకోవాలని కోరారు. దుబాయిలో ఓ హత్య కేసుకు సంబంధించి సుదీర్ఘ కాలం జైలు శిక్ష అనుభవించి ఇటీవల విడుదలై వచ్చిన నలుగురు తెలంగాణ వాసులను, వారి కుటుంబసభ్యులను కేటీఆర్ బుధవారం పరామర్శించారు. వీరిలో వారం కిందట వచ్చిన రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని పెద్దూర్‌కు చెందిన శివరాత్రి మల్లేశం, శివరాత్రి రవి, అంతకుముందు విడుదలై వచ్చిన కోనారావుపేటకు చెందిన దండుగుల లక్ష్మణ్, జగిత్యాలకు చెందిన హన్మంత్ ఉన్నారు. 'మీ దయవల్లనే వచ్చాం' అని బాధితులు, వారి కుటుంబసభ్యులు భావోద్వేగంతో కన్నీరు పెట్టుకోగా వారిని కేటీఆర్ ఓదార్చారు. ఈ సందర్భంగా మీడియాతో కేటీఆర్ మాట్లాడుతూ.. మల్లేశం, రవి, లక్ష్మణ్, హన్మంత్, నాంపల్లి వెంకటి జైలు పాలై 18 ఏళ్ల కుటుంబాలకు దూరమయ్యారని, గల్ఫ్ కష్టాలకు వారి జీవితాలే ఒక ఉదాహరణ అని చెప్పారు. వీరు గల్ఫ్ జైల్లో ఉన్నారని 2011లో తమ దృష్టికి వచ్చిందని, వారిని విడిపించేందుకు అప్పటి నుంచే ప్రయత్నాలు ప్రారంభించామని తెలిపారు. హత్యకు గురైన వ్యక్తి నేపాల్ దేశస్థుడు కావటంతో ఆ దేశ రాజధాని ఖాట్మండుకు వెళ్లి అతడి కుటుంబ సభ్యులకు రూ.15 లక్షలు పరిహారం అందజేశామని, దీంతో వారు నిందితుల విడుదలకు అంగీకారం తెలిపారని గుర్తు చేశారు. ఈ మేరకు ఐదుగురు వెంటనే విడుదలవుతారని ఆశించామని, కానీ, దుబాయి చట్టాలలో చోటుచేసుకున్న మార్పులతో విడుదల ఆలస్యమైందన్నారు. ఎంతోమంది కృషితో.. ఇంకా ఏడేళ్ల జైలు శిక్షా కాలం మిగిలి ఉండగానే వారు బయటకు రావడం సంతోషంగా ఉందన్నారు. వారి విడుదల కోసం తనకు సహకరించిన కేంద్ర ప్రభుత్వంతోపాటు ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు అని పేర్కొన్నారు. చందుర్తికి చెందిన నాంపల్లి వెంకటి విడుదల ఆలస్యమైందని, మరో నెలలో బయటకొస్తాడని కేటీఆర్ తెలిపారు. బాధితులు తమ కాళ్లమీద నిలబడే విధంగా, స్వయంఉపాధి అవకాశాలు అందిపుచ్చుకునే విధంగా తాను వ్యక్తిగత స్థాయిలోనూ సాయం చేస్తానని హామీ ఇచ్చారు. నకిలీ ఏజెంట్ల చేతుల్లో మోసపోవద్దని, తెలంగాణలో అవకాశాలు కోకొల్లలుగా ఉన్నాయని, ఇక్కడే కుటుంబాలతో ఉంటూ సంతృప్తికరమైన జీవితాలను గడపాలని సూచించారు. సాగునీటి సదుపాయాలు పెరగటంతో రాష్ట్రంలో వ్యవసాయం, ఇతర రంగాల్లో ఉపాధి అవకాశాలు పెరిగాయని, నాట్లు వేయడానికి బిహార్, బెంగాల్ తదితర రాష్ట్రాల నుంచి వస్తున్నారని తెలిపారు. సిరిసిల్లలో మరమగ్గాల కార్ఖానాలకు వెళ్లినపుడు ఇతర జిల్లాలు, రాష్ట్రాలవారు పని చేయడం కనిపించిందన్నారు. గల్ఫ్‌కు వెళ్లి జైలు పాలైన వారిని విడిపించే ప్రయత్నం చేస్తామని, గల్ఫ్ బాధితులను ప్రభుత్వం పట్టించుకున్నా పట్టించుకోకపోయినా వారికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా గల్ఫ్ బాధితుల కోసం ఏదో చేస్తానని అంటోందని, ఏం చేస్తుందో చూడాలని కేటీఆర్ పేర్కొన్నారు. కేరళ తరహాలో ఎన్నారై పాలసీని అమలు చేయాలని భావించామని, కరోనాతో చేయలేకపోయామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. గల్ఫ్ బాధితుల మీద సినిమా తీస్తే బాగుంటుందని, సినిమా తీసేవారికి తమ కష్టాలు చెబుతామని బాధితుడు మల్లేశం కేటీఆర్‌కు సూచించగా.. 'ముందు మీరు నిలదొక్కుకోండి. సినిమా తరువాత తీయవచ్చు' అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణా రాఘవరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళా చక్రపాణి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

ఆటో ఎక్కిన కేటీఆర్

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో కేటీఆర్ కప్ పేరుతో నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో విజేతలకు కేటీఆర్ బహుమతులు అందజేశారు. ఆ సమయంలో సిరిసిల్లకు చెందిన మల్యాల దేవరాజు.. బీసీ బంధు పథకం కింద అందిన రూ.లక్ష సాయంతో ఆటో కొనుగోలు చేసి నడుపుతున్నానని, ఒకసారి ఆటోలో కూర్చోవాలని కేటీఆర్‌ను కోరాడు. అందుకు కేటీఆర్ అంగీకరించి కొద్దిసేపు మైదానంలో ఆటోలో తిరిగారు.

ఔటర్‌పై డివైడర్‌ను ఢీకొని కారు బోల్తా

ఒకరి మృతి.. ముగ్గురికి తీవ్ర గాయాలు.. లాస్య నందిత కారు ప్రమాదం జరిగిన చోటే ఘటన

పటాన్‌చెరు, ఫిబ్రవరి 28: ఉరిమే ఉత్సాహంతో కూడిన ఇరవై-ఇరవై రెండేళ్ల వయసు! కారు స్టీరింగ్ పడితే వేగంగా దూసుకెళ్లాలన్న తపనే తప్ప.. సురక్షిత ప్రయాణంపై అవగాహన ఉంటుందా? ఓ యువకుడు ఇలా మితిమీరిన వేగంతో కారు నడుపుతూ నియంత్రణ కోల్పోవడంతో వాహనం బోల్తా పడింది. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పరిధిలోని రామేశ్వరంబండ శివారులో ఎమ్మెల్యే లాస్య నందిత కారు ప్రమాదానికి గురైన ప్రదేశంలోనే ఈ కారు పల్టీకొట్టింది. ఈ ఘటనలో ఓ యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. తొమ్మిదేళ్ల బాలుడు సహా ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. మేడ్చల్‌కు చెందిన అర్చిత్‌రెడ్డి అనే యువకుడి తమ్ముడు చార్విక్ రెడ్డి సదాశివపేటలోని సెయింట్ ఆంథోనీ స్కూల్లో నాలుగో తరగతి చదువుతున్నాడు. బుధవారం ఉదయం బాలుడిని స్కూల్లో దింపేందుకు కారులో అర్చిత్‌రెడ్డి బయలుదేరాడు. మార్గం మధ్యలో అర్చిత్‌రెడ్డి స్నేహితులు శీషిక్(20), వర్షిత్‌రెడ్డి(20) మల్లంపేట వద్ద కారెక్కారు. సదాశివపేటలో చార్విక్‌ను స్కూల్లో దింపేందుకు అంతా కలిసి పటాన్‌చెరు వైపు బయలుదేరారు. అతివేగంగా వెళ్తున్న కారు పటాన్‌చెరు శివారులో ఎమ్మెల్యే లాస్య నందిత కారు ప్రమాదం జరిగిన చోటుకు రాగానే అదుపు తప్పింది. డివైడర్‌ను ఢీకొట్టి అవతలివైపు రోడ్డులోకి వచ్చి పడింది. ఈ ఘటనలో శీషిక్ తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన చార్విక్‌రెడ్డికి అంబులెన్స్ సిబ్బంది ఘటనాస్థలిలోనే సీపీఆర్ నిర్వహించి రక్షించారు. తీవ్రంగా గాయపడిన అర్చిత్‌రెడ్డి, వర్షిత్‌రెడ్డిని అతికష్టం మీద బయటకు తీసి మియాపూర్ శ్రీకర్ ఆస్పత్రికి తరలించారు. గంటకు 120 కిలోమీటర్ల వేగంతో కారు దూసుకుపోవడంతోనే అదుపు తప్పిందని తెలిసింది. మృతుడు శీషిక్ నిజామాబాద్ జిల్లా మావాల్ గ్రామ వాస్తవ్యుడు. మేడ్చల్‌లో నివాసముంటూ ఇంజనీరింగ్ చదువుతున్నాడు.

లోన్‌యాప్ ఏజెంట్ల వేధింపులకు మరో ప్రాణం బలి!

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 28: లోన్ యాప్ ఏజెంట్ల వేధింపులకు మరో ప్రాణం బలైంది. సిరిసిల్లకు చెందిన చిప్ప సాయిరాజు(28) అనే యువకుడు మానేరుడ్యాంలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సిరిసిల్లలో పవర్‌లూం కార్మికుడిగా పని చేసే సాయిరాజు ఓ లోన్ యాప్ ద్వారా రుణం తీసుకుని సకాలంలో ఈఎంఐలు చెల్లించలేకపోయాడు. దీంతో ఏజెంట్లు ఫోన్లు చేసి రుణం చెల్లించాలని వేధించేవారు. ఈ క్రమంలో సోమవారం ఇంట్లో నుంచి వెళ్లిన సాయిరాజు రాత్రైనా ఇంటికి తిరిగి రాలేదు. భార్య సంధ్యారాణి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు సాయిరాజు కోసం గాలించగా మానేరుడ్యాం ఒడ్డున అతని ద్విచక్రవాహనం కనిపించింది. మృతదేహం డ్యాం ఒడ్డుకు బుధవారం కొట్టుకొచ్చింది.

17 ఎంపీ సీట్లు గెలిచి మగతనం నిరూపించుకో

- సీఎం రేవంత్‌కు బీఆర్ఎస్ నేత కడియం సవాల్

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 28: లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని 17 స్థానాలు గెలిచి సీఎం రేవంత్‌రెడ్డి తన మగతనాన్ని నిరూపించుకోవాలని బీఆర్ఎస్ సీనియర్ నేత, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సవాల్ విసిరారు. ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష పార్టీలపై విరుచుకుపడుతూ మగతనం అనే పదాన్ని రేవంత్ పదేపదే ఉచ్చరిస్తున్నారని.. సీఎం అయినా తన భాష మార్చుకోలేదని మండిపడ్డారు. బుధవారం హనుమకొండలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాళేశ్వరానికి రూ.93 వేల కోట్లు పెట్టిస్తే.. అందులో మేడిగడ్డకు ఖర్చు చేసింది కేవలం రూ.3 వేల కోట్లేనన్న విషయం మరిచిపోవద్దన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చే ఆలోచన బీఆర్ఎస్‌కు లేదని, సొంత పార్టీ వారితోనే రేవంత్ పదవికి ముప్పు పొంచి ఉందని వ్యాఖ్యానించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

భారత్ కొత్త సరిహద్దు

భారతదేశం నుంచి రోదసిలోకి వెడుతున్న గగన్‌యాన్ వ్యోమగాములను దేశానికి పరిచయం చేశారు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ. ప్రతి దేశానికి అభివృద్ధి విషయంలో సమయం ఆసన్నమవుతుందనీ, ఇప్పుడు వచ్చిందనీ అంటూ గతేడాది చంద్రుడి దక్షిణ ధ్రువంపై ల్యాండర్ వాలిన ఘట్టాన్ని గుర్తుచేశారు. అభివృద్ధి అంతా తన హయాంలోనే జరిగిందని ఆయన నమ్ముతారు కనుక, అంతరిక్ష రంగంలో పదేళ్ళకు ముందు జరిగిన ప్రయోగాలను, ఇస్రో సాధించిన విజయాలను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించకపోవడం సహజం. నలభైయేళ్ళ తరువాత భారతీయులు అంతరిక్షంలోకి వెడుతున్నారు అని ఆయన మాటమాత్రంగా అన్నందుకు, నాలుగుదశాబ్దాల క్రితం రాకేశ్ శర్మ అంతరిక్షయానాన్ని, ఆ సందర్భంగా అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ప్రశ్నకు సమాధానంగా 'సారే జహాసే అచ్చా' అంటూ వచ్చిన జవాబును ఇప్పుడు చాలామంది గుర్తుచేసుకుంటున్నారు. ఎనిమిదిరోజుల పాటు అంతరిక్షంలో గడిపిన ఆ ఎయిర్‌ఫోర్స్ మాజీ పైలట్ శిక్షణపొందిన యూరీగగారిన్ కాస్మోనాట్ ట్రైనింగ్ సెంటర్‌లోనే ఇప్పటి గగనయాన వీరులూ శిక్షణ తీసుకున్నారు. అప్పటి యాత్ర సోవియట్ వ్యోమనౌకలో, ఇప్పుడు స్వదేశీ వాహనంలో.

భారత్–సోవియట్‌లు సంయుక్తంగా చేపట్టిన ఆ మిషన్ దేశ అంతరిక్ష పరిశోధనలకు ఊతం ఇచ్చినట్టుగానే, భారత వాయుసేనకు చెందిన గ్రూప్ కెప్టెన్ల ఈ గగనయానంతో దేశప్రతిష్ఠ ఇనుమడిస్తుంది, ప్రపంచంలో నాలుగోస్థానంలో నిలుస్తుంది. నలభైయేళ్ళలో దేశప్రధాని ఇస్రోను సందర్శించడం ఇదే తొలిసారని ఆ సంస్థ చైర్మన్ సంతోషిస్తున్నారు. ప్రధానుల రాకలూ, ప్రత్యక్ష వీక్షణాలు, ప్రసంగాలు, పరామర్శలతో నిమిత్తం లేకుండానే ఇస్రో దశాబ్దాలుగా స్వయంకృషితో చక్కగా ఎదిగివచ్చిందని ఆయనకు తెలియనిదేమీ కాదు. ఇక, ఈ నలుగురు వీరులను యాత్రకు సిద్ధం చేయడంద్వారా గగన్‌యాన్ విషయంలో దేశం మరో కీలకమైన ముందడుగువేసింది. గత ఏడాది అక్టోబర్‌లో క్రూ ఎస్కేప్ వ్యవస్థను ఇస్రో విజయవంతంగా పరీక్షించిన విషయం తెలిసిందే. అనుకోని అవాంతరాలు ఏర్పడిన పక్షంలో వ్యోమగాములను కాపాడుకొనేందుకు ఉద్దేశించిన వ్యవస్థ ఇది. వచ్చే ఏడాది యాత్రకు అన్ని ఏర్పాట్లూ వేగం పుంజుకుంటున్న తరుణంలో 2009లో ఓ పన్నెండున్నర వేలకోట్లతో అనుకున్నది ఇప్పటికి సాధ్యపడబోతున్నదని అర్థం. 2019 సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో 2018లో మోదీ ప్రభుత్వం దీనికి తొమ్మిదివేలకోట్ల కేటాయింపుతో తిరిగి పట్టాలెక్కించింది. ఆ ఏడాది స్వాతంత్ర్యదినోత్సవ ప్రసంగంలో 2022లోనే గగన్‌యాన్ అని మోదీ ప్రకటించారు. కరోనా సహా చాలా కారణాలతో అది సాధ్యపడలేదు. ముగ్గురు వ్యోమగాములను 400 కిలోమీటర్ల ఎత్తులోని అంతరిక్ష కక్ష్యలోకి పంపి, మూడురోజులు ఉంచి వెనక్కు క్షేమంగా తీసుకొచ్చే ఈ ప్రాజెక్టు నిజానికి అంగారక యాత్రకంటే, చంద్రయానం కంటే ఖరీదైనదీ, క్లిష్టతరమైనది కూడా.

గగనయానానికి ఎంపికైనవారిని దేశానికి ఇలా పరిచయం చేయడానికి కొద్దిరోజుల ముందే అంతరిక్షరంగంలో నూరుశాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు అనుమతిస్తూ కేంద్రమంత్రివర్గం ఓ నిర్ణయం తీసుకుంది. 'ఇండియన్ స్పేస్ పాలసీ–2023' ఆశయాలకు, లక్ష్యాలకు అనుగుణంగా ఈ నిర్ణయం జరిగింది. అంతరిక్ష ఆర్థికంలో ప్రైవేటుభాగస్వామ్యం అత్యంత కీలకమైనదని, అంతరిక్షంలో వాణిజ్యపరమైన ఉనికిని పెంచుకోవడం దేశానికి ముఖ్యమని ఆ పాలసీ అంటున్నది కనుక, ఏ ఆటంకాలూ, అంక్షలూ లేని విదేశీపెట్టుబడుల ప్రవాహానికి దారులు తెరుచుకున్నాయి. ప్రైవేటురంగం భాగస్వామ్యాన్ని పెంచి, ఉపగ్రహాల నుంచి అంతరిక్ష నౌకల తయారీవరకూ సకలకార్యకలాపాలను ఉధృతం చేసేందుకు ఎఫ్‌డీఐ నిబంధనల సడలింపు దోహదం చేస్తుంది. అంతరిక్షమార్కెట్‌లో మన వాటా పెంచుకోవడానికి ఇతోధికంగా దోహదపడుతుంది. పెట్టుబడులతో పాటు పరిజ్ఞానం ఎంతమేరకు ప్రవహిస్తుందో తెలియదు కానీ, అత్యంత కీలకమైన, వ్యూహాత్మకంగా ముఖ్యమైన రంగంలోకి చిన్నాపెద్దా గ్లోబల్ సంస్థలను ప్రత్యక్షంగానో, పరోక్షంగానూ ప్రవేశించనీయడం సమంజసమేనా అన్నది ప్రధానం. భారత అంతరిక్ష అన్వేషణలూ, అధ్యయనాలు పెద్దదేశాలతో పోటీపడుతూ, పైచేయి సాధించడానికి ఉద్దేశించినవి కాదని, నేలమీద నిలబడి, సమాజంలోని సమస్యలను పరిష్కరించడానికి ఉద్దేశించినవని 1960లో విక్రమ్ సారాభాయ్ అన్నారట. దశాబ్దాలపాటు అదే దిశలో ప్రయాణం సాగింది కూడా. ఇప్పుడు శాస్త్రీయపరంగా కొత్త అన్వేషణలు, సామాజిక ప్రయోజనాల కంటే స్పేస్ సూపర్‌పవర్ అనిపించుకోవాలన్నదే ప్రధానంగా పాలసీలు తయారవుతున్నాయి. తదనుగుణంగా సొంత అంతరిక్ష కేంద్రం నిర్మాణం, చంద్రుడిమీద కాలూనడం వంటివి ప్రధానమవుతున్నాయి. ప్రపంచం మనవైపు చూడాలన్న కోరికా పెరుగుతోంది.

దృశ్యాల వెనుక అదృశ్య ప్రయోజనాలు!





▪ కె. శ్రీనివాస్

సందర్భం

అందరూ వేషాలు వేస్తారు, మాటలూ చెబుతారు. కానీ, అందరి పప్పులూ ఉడకవు. ఏమి చూపించినా, ఏమి చెప్పినా, జనానికి ఏమి కనిపించిందన్నదే ముఖ్యం. దర్పా ప్రదర్శించబోతాం, జనం మాత్రం దర్పాన్ని చూస్తారు. మంచితనం చూపబోతాం, మెతకదనమే కనిపించవచ్చు.

అప్పుడిక మార్గం ఏమిటంటే, ఎట్లా కనబడితే అనుకున్న ప్రయోజనం దొరుకుతుందో, అట్లా కనిపించగలగాలి. అదొక విద్య దానికో శాస్త్రం ఉంది. కొందరు నిపుణులున్నారు. ఈ ఇంద్రజాలికులు, జనం దృక్పలయంతో యథేచ్ఛగా విన్యాసాలు చేయగలరు. అబ్బురపరిచి, తన్మయపరిచి, వశీకరణం చేసుకోగలరు. వారు కనికట్టు చేసినప్పుడు, ఒక దృశ్యాన్ని చూసినప్పుడు పారవశ్యం కలుగుతుంది. మనకు కలిగే మనోభావాలు ఎవరో సంకల్పించి జొప్పించినవి అని కనిపెట్టలేము. నాడీమండలం పూర్తిగా పరాధీనం అయిపోతుంది. ఏది హితవో ఏది కాదో విచక్షణ ఉండదు.

నరేంద్రమోదీ ద్వారక దగ్గర చేసిన పని ఏదో, ఆయన కేవలం తన సొంత భక్తిలో భాగంగా చేసి ఉంటారని, లేదా, యథాలాపంగా జరిగి ఉంటుందని అనుకోలేము. ఆ ప్రక్రియ అంతటినీ దృశ్యీకరించి ప్రపంచంతో పంచుకున్నారు కాబట్టి, దానికి ఒక సార్వజనీన విలువ ఉంటుంది, ఒక ప్రయోజనమూ ఉంటుంది. ఆయనను అట్లా చూసిన ప్రజలు రకరకాల భావసంచలనాలను పొంది ఉంటారు. అట్లా పొందడం కోసమే ఆ సన్నివేశం ఏర్పడి ఉంటుంది. మోదీ వంటి నాయకుడి ప్రతిక్షణమూ, ప్రతిచర్యా అతి జాగ్రత్తగా ముందస్తు రూపకల్పనతో, నిర్దిష్ట లక్ష్యంతో నిర్మితమవుతుంది. అందుకోసం పెద్ద పటాలమే పనిచేస్తూ ఉంటుంది.

ఎన్నో రాచకార్యాలతో ఎంతో పనిఒత్తిడిలో ఉండే పదవిలో ఉన్నారు మోదీ. పైగా, ఎన్నికలు సమీపిస్తున్నందున, రాజకీయమైన పనిభారం కూడా ఆయన మీద చాలా ఉన్నది. వీటన్నిటి మధ్య ఆయన ద్వారక సందర్శన చేశారంటే, స్వామి కార్యంతో పాటు స్వకార్యం కూడా ఉండి ఉండాలి. ఈ మధ్య నరేంద్రమోదీ ఎక్కడికి ఏ అధికారిక, రాజకీయ కార్యక్రమానికి వెళ్లినా, అక్కడికి సమీపంలోని గుడులు గోపురాలను సందర్శిస్తున్నారు. రామ మందిర ప్రతిష్ఠకు ముందు అయితే, దేశవ్యాప్తంగా అనేక దేవాలయాల్లో ఆయన ఆలయసేవ చేశారు, నిద్రచేశారు. వీటన్నిటిని గమనిస్తున్నవారు, ఆయన దేశానికి ప్రధానమంత్రా, ప్రధాన అర్చకుడా అని హాస్యాలు కూడా చేశారు. రెంటికి మధ్య సరిహద్దులు చెరిగిపోయే కాలంలో జీవిస్తున్నామని ఆ వేళాకోళాల వారికి తెలియనట్టుంది. మోదీ తమ పార్టీ బలాన్ని 370కి, కూటమి బలాన్ని 400కు పెంచే మహాకార్యంలో ఉన్నారు. ద్వారక సందర్శనతో సహా అన్ని ఆలయ పర్యటనలూ ఆ మహాకార్యంలో భాగాలే.

ఒక వయసు వచ్చిన తరువాత రామా, కృష్ణా అనుకోవాలని పెద్దవాళ్లు చెబుతుంటారు. పార్టీ సహచరులలో ముప్పాతిక వయసు వచ్చినవారందరినీ వానప్రస్థానికి పంపించివేసిన నరేంద్రమోదీ, తాను మాత్రం ముచ్చటగా మూడోసారి పదవికి సిద్ధపడుతున్నారు. పదవిలో ఉంటూ కూడా రామా, కృష్ణా అనుకోవడంలో ఆయనకు పుణ్యం, పురుషార్థం రెండూ ఉన్నాయి. అయోధ్య కార్యక్రమంతో రామస్మరణ జరిగింది, ద్వారక విన్యాసంతో కృష్ణ కృష్ణ అని కూడా అనుకున్నారు. మరోపక్క వారణాసిలో హరహరమహదేవుడు కూడా సిద్ధమవుతున్నాడు. ద్వారక శిథిలాలు ఉన్న సముద్ర భాగంలో నీటిలోపల మోదీ కూర్చుని, నెమలీకలు సమర్పించి భక్తి ప్రదర్శించిన దృశ్యాన్ని చూసి, చాలా మంది ప్రజలు పులకించిపోయి ఉంటారు. రామాలయాన్ని మోదీయే సాధించారని ఒక వాడుక స్థిరపడిన వాతావరణంలో, ఇప్పుడు మరో అవతార పురుషుడి రాజ్యస్థానంలో, ఎంతో ప్రమాదానికి సిద్ధపడి భక్తి ప్రదర్శించడం ఆయనను జన హృదయాలలో మరొక మెట్టు ఎక్కించింది. మ్లేచ్ఛ నామం కలిగిన అరేబియా సముద్రం నుంచి ద్వారకను పైకి తీసుకు రాగలిగిన ధీరుడు అని కూడా మోదీ మీద అంచనాలు పెరిగి ఉండవచ్చు. మోదీ అనే ఒక సజీవ విగ్రహాన్ని తాము సంకల్పించిన రూపురేఖలతో నిర్మించడానికి, వాటిని మెచ్చేటట్టుగా ప్రజలను తీర్చిదిద్దడానికి గత దశాబ్దంగా జరుగుతున్న ప్రయత్నాల్లో భాగంగానే ద్వారక రంగస్థలం రూపొందింది.

> భక్తినివేదనను ఈ రూపంలో ప్రదర్శించి, ప్రచారం చేయడంలో నరేంద్రమోదీ ఉద్దేశం వ్యక్తిగతం కాదు. ఆయన వంటి రాజకీయనాయకుడు ప్రదర్శించే అన్ని వ్యక్తిత్వ లక్షణాలూ వాస్తవంలో ఉండనక్కరలేదు. హిమాలయాల్లో పర్వతగుహల్లో ధ్యానం చేయడం, సముద్రతీరంలో వాలుకుర్చీలో సేదతీరడం, సఫారీ వాహనం మీద వేటగాడి వేషంలో సంచరించడం, డిస్కవరీ ఇంటర్వ్యూ కోసం వనవిహారం చేయడం, సముద్రం ఒడ్డున స్వచ్ఛభారత్ చేయడం... బహుముఖ ప్రజ్ఞలు, సకల కళలు ఉన్న మహానాయకుడుగా మోదీ కనిపించి, ఆశ్చర్యపరుస్తారు. ధీరుడు, వీరుడు, కర్కశుడు, కారుణ్యమూర్తి, విహారి, వినోది, భక్తుడు, ఈ వ్యక్తిత్వాలను అన్నిటిని జనహృదయాలలో ప్రతిష్ఠించిన ప్రజాసంబంధాల ప్రచారవ్యవస్థను అభినందించవచ్చు.

అట్లాగని, నరేంద్రమోదీకి భక్తి లేదని కాదు. భక్తినివేదనను ఈ రూపంలో ప్రదర్శించి, ప్రచారం చేయడంలో ఉద్దేశం వ్యక్తిగతం కాదు. ఆయన వంటి రాజకీయ నాయకుడు ప్రదర్శించే అన్ని వ్యక్తిత్వ లక్షణాలూ వాస్తవంలో ఉండనక్కరలేదు. హిమాలయాల్లో పర్వత గుహల్లో ధ్యానం చేయడం, సముద్రతీరంలో వాలు కుర్చీలో సేదతీరడం, సఫారీ వాహనం మీద వేటగాడి వేషంలో సంచరించడం, డిస్కవరీ ఇంటర్వ్యూ కోసం వన విహారం చేయడం, సముద్రం ఒడ్డున స్వచ్ఛభారత్ చేయడం... బహుముఖ ప్రజ్ఞలు, సకల కళలు ఉన్న మహానాయకుడుగా మోదీ కనిపించి, ఆశ్చర్యపరుస్తారు. ధీరుడు, వీరుడు, కర్కశుడు, కారుణ్యమూర్తి, విహారి, వినోది, భక్తుడు, ఈ వ్యక్తిత్వాలను అన్నిటిని జన హృదయాలలో ప్రతిష్ఠించిన ప్రజాసంబంధాల ప్రచార వ్యవస్థను అభినందించవచ్చు.

వేషభాషలు, ఇతర ప్రదర్శనలు రాజకీయరంగంలో ఎప్పటినుంచో ఉన్నాయి. గాంధీజీకి తన ఆహార్యమే పెద్ద రాజకీయ ఆయుధం. చైనా నేత మావోసేటుంగ్ 1960 దశకం మధ్యలో కమ్యూనిస్టు పార్టీలో బలహీన పడినప్పుడు, 73వ ఏట యాంగ్సీ నదిని మరోసారి ఈది, తన దృఢత్వాన్ని ప్రదర్శించాడు. ప్రజలకు తెలుగుదేశం పార్టీ ఆరంభదినాల్లో ఖాకీ డ్రెస్‌లోనూ, తరువాత కాషాయంలోను ఎన్టీయార్ ఉద్దేశించిన ప్రయోజనాలు రాజకీయమైనవే. బేఖాతరు జులాయి అధ్యక్షుడిగా కనిపించడం వల్లనే డొనాల్డ్ ట్రంప్ 2020లో ఓడిపోయారు. జో బైడెన్ తనను తాను అమెరికాకు అవసరమైన అనుభవశాలినని అనుకుంటుంటే, ప్రజలు మాత్రం ఇప్పుడు తడబడునడకల నీరస వృద్ధుడిగా చూస్తున్నారు.

భౌతిక శాస్త్రంలోనే కాదు, రాజకీయాలలోనూ 'ఆప్టిక్స్' దృశ్యనిర్వహణగా ఇప్పుడు మంచి డిమాండ్‌లో ఉన్నది. 'ఆప్టిక్స్'ను సమర్థంగా నిర్వహించాలని బీజేపీ అనుకోవడం సహజమే. అందుకు కావలసిన హంగు, సమర్థతా కూడా ఆ పార్టీకి ఉన్నాయి. మరి వ్యూహకర్తలు సంకల్పించిన దృశ్యాలను జనం వడగట్టుకోరా? ఆ కనికట్టులోకి అందరూ జారిపోతారా? మోదీ ద్వారక సన్నివేశాన్ని ప్రశంసాపూర్వకంగా చూసేవారు, నిజంగా ఆయన ప్రయత్నంలో రాజకీయ ఉద్దేశ్యాలు లేవని అనుకుంటారా? లేక, భక్తిని రాజకీయాలకు వాడుకోవడం కాక, రాజకీయాలనే భక్తివ్యాప్తికి ఉపయోగించుకుంటున్నారని మెచ్చుకుంటారా? ఆలయ సందర్శనల మధ్య విరామంలో, రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ లేదా గగన్‌యాన్ వ్యోమగాముల ప్రకటన కార్యక్రమంలోనో మోదీ కనిపిస్తారు. వైజ్ఞానిక, మౌలిక వసతుల అభివృద్ధివాదిగా ప్రదర్శిస్తున్న మరో ముఖాన్ని కూడా ప్రజలు సీరియస్‌గా తీసుకుంటారా? దైనందిన జీవితానికి ఎంతో కీలకమయిన అవసరాలను నెరవేర్చడంలో విఫలమైన నాయకుడి ముఖాన్ని మరచిపోతారా? ఓటు మీట నొక్కేముందు ఏ ముఖం వారికి గుర్తుకు వస్తుంది?

వాస్తవమైన, భౌతికమయిన కష్టనష్టాలు, స్థితిగతులు ప్రధానం కాకుండా, ఉద్వేగపూరిత ప్రపంచంలోకి పంపించడం ఈ ప్రక్రియల లక్ష్యం. చారిత్రక అన్యాయం, వర్తమానంలో దాని నివృత్తి, ఒక ప్రజాసమూహంపై కృత్రిమ ఆధిక్య ప్రదర్శన, ఇవన్నీ వాస్తవజీవితాన్ని మెరుగుపరిచేవి కావు. ద్వేషాన్ని కల్పించి, అది లక్ష్యంగా చూపే కల్పిత శత్రువుని నిర్మూలించి, కృత్రిమ ఉపశమనాన్ని, బూటకపు విజయభావాన్ని పొందే మేధావరణంలో విచక్షణ, హేతువులకు ప్రవేశమే ఉండదు.

> మ్లేచ్ఛ నామం కలిగిన అరేబియా సముద్రం నుంచి ద్వారకను పైకి తీసుకురాగలిగిన ధీరుడు అని కూడా మోదీ మీద అంచనాలు పెరిగి ఉండవచ్చు. మోదీ అనే ఒక సజీవ విగ్రహాన్ని తాము సంకల్పించిన రూపురేఖలతో నిర్మించడానికి, వాటిని మెచ్చేటట్టుగా ప్రజలను తీర్చిదిద్దడానికి గత దశాబ్దంగా జరుగుతున్న ప్రయత్నాల్లో భాగంగానే ద్వారక రంగస్థలం రూపొందింది.

ఫోటో, వీడియో ఏదైనా కానీ, దృశ్యం అనేది బలమైన కమ్యూనికేషన్ సాధనం. అటువంటి దృశ్యంలో ఆలోచనాత్మక సందేశం కాక, ఉద్వేగాత్మక సందేశాన్ని దట్టించినప్పుడు, వీక్షకుల మనసులో అది ముద్రలనే వేస్తుంది. పదే పదే ఒకే ముద్ర పడినప్పుడు, ఆలోచనకు ఉద్వేగం అవకాశమివ్వనపుడు, ప్రజల ఎంపికలు వారిచేతిలో ఉండవు. మరబొమ్మలుగా మారిపోతారు. తమ మీద తాము అదుపుతప్పిపోతారు. రాజకీయ దృశ్యశాస్త్రజ్ఞులు దానినే కోరుకుంటారు. దీనికి ఔషధం ఏమిటి? ఉద్వేగం మీద ఆలోచన పైచేయి కావడం ఎట్లా? పారవశ్యం నుంచి, పూనకం నుంచి మనిషి వివేచనాయుత హృదయాన్ని ఉద్ధరించడం ఎట్లా? ప్రతి దృశ్యం వెనుక ఉండే అసలు అర్థాన్ని ఆవిష్కరించడం ఎట్లా? మీడియాను వినోద సాధనంగా, సమాచార సాధనంగా మాత్రమే కాకుండా, ఒక రాజకీయ పరికరంగా కూడా అర్థంచేసుకోవాలి. ప్రతి అక్షరాన్ని, శబ్దాన్ని, దృశ్యాన్ని వడగట్టకుండా లోపలికి తీసుకోగూడదు, సంశయించకుండా స్వీకరించకూడదు.

దండకారణ్యంలో అప్రకటిత యుద్ధం!

దేశ ప్రజల మీద భారత రాజ్యం ఆకాశ యుద్ధానికి దిగింది. నాలుగేళ్ల క్రితం నుంచే ఛత్తీస్‌గఢ్ ఆదివాసుల మీద అప్పుడు రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం, కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కలిసి హెలికాప్టర్లలో బాంబింగ్‌ను మొదలుపెట్టాయి. ఇప్పుడు రాష్ట్రంలో కూడా బీజేపీ ప్రభుత్వం వచ్చాక ఈ యుద్ధం తీవ్రమైంది. దండకారణ్యంలో జరుగుతున్న ఈ వైమానిక యుద్ధానికి వ్యతిరేకంగా ఆదివాసులు నాలుగేళ్లుగా నిరాయుధ పోరాటాన్ని నడుపుతున్నారు.

దండకారణ్యంలో సహజ వనరులను కార్పొరేట్లకు ఇవ్వడానికి వ్యతిరేకంగా ఆదివాసీలు జరుపుతున్న పోరాటానికి పాటలను, కళారూపాలను అందించి సాంస్కృతిక రంగంలో పని చేయడానికి మూలవాసీ సాంస్కృతిక కళా మంచ్ ఏర్పడింది. ఈ సంస్థ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కార్పొరేట్ హిందుత్వ విధానాలను, వాటికి వ్యతిరేకంగా సాగుతున్న ఛత్తీస్‌గఢ్ ఆదివాసుల పోరాటాలను, వాటి మీద జరుగుతున్న వైమానిక యుద్ధాన్ని సమాజానికి తెలియజేయడానికి పని చేస్తున్నది.

ఛత్తీస్‌గఢ్‌లో సైనికీకరణ రూపంలో జరుగుతున్న ఈ యుద్ధానికి కారణం కార్పొరేటీకరణ. రాష్ట్రంలో 26 రకాల విలువైన ఖనిజ సంపదలు వున్నాయి. ఇక్కడ ఇనుము, బొగ్గు, బాక్సైట్, డోలమైట్, క్రోమెట్, మెగ్నీషియం, సున్నపు రాళ్లు, సిలికాన్, గ్రానైట్, లిథియం లాంటివి ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వాలు వీటిని కార్పొరేట్ కంపెనీలకు ఇచ్చేందుకు పథకాలు వేసుకొని అమలు చేస్తున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లో 31శాతం ఖనిజ సంపదలు, అటవీ సంపదలు ప్రభుత్వాలకు కోట్లాది ఆదాయాన్ని ఇస్తున్నాయి. కానీ ఈ ఆదాయాన్ని ఆదివాసీ ప్రజల మౌలిక అవసరాలకు కేటాయిస్తున్నది మాత్రం చాలా తక్కువ. దీన్ని అధికారంలో వున్న రాజకీయ నాయకులు, అధికారులు, కార్పొరేట్ కంపనీలు, సామ్రాజ్యవాదశక్తులు కలిసి దోచుకుంటున్నాయి.



దండకారణ్యంలో నెలకొన్న యుద్ధ పరిస్థితిపై వాస్తవాలను వెలికి తీయడానికి, ఆదివాసులకు సంఘీభావం తెలియజేయడానికి రచయితలు, విద్యార్థులు, ప్రజాస్వామికవాదులు ఇక్కడికి వచ్చి క్షేత్ర పరిశీలన చేయాలి. ఇది కేవలం ఆదివాసుల పోరాటమే కాదు. హిందుత్వ కార్పొరేట్ శక్తులపై సాగుతున్న ఫాసిస్టు వ్యతిరేక పోరాటం.

ఇప్పుడు ఛత్తీస్‌గఢ్‌లో విష్ణుదేవ్ సాయి బీజేపీ అధికారంలోకి రావడంతో డబల్ ఇంజన్ బుల్డోజర్ సర్కార్ కార్పొరేట్లకు నమ్మకమైన సేవకురాలిగా, వాళ్లకు అనుకూలమైన విధానాలను అమలు చేస్తున్నది. ఛత్తీస్‌గఢ్ బొగ్గు గనులను అదాని కంపెనీలకు ఇచ్చింది. ఐటీఐ ట్రైనింగ్ టాటా కంపెనీకి ఇచ్చింది. ఎన్‌ఎమ్‌డిసి బైలాడిల్లా కంపెనీని ప్రైవేటీకరణ చేసేందుకు తయారుగా వుంది. ఇందుకుగాను లక్షల కోట్ల రూపాయల ఒప్పందాలు జరగనున్నాయి. గతంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్, ఇప్పుడు వచ్చిన బీజేపీ ప్రభుత్వాలు గత నాలుగేళ్లుగా 104 ఎంఓయూలను చేసుకున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లో ప్రభుత్వాలు చేసుకున్న ఒప్పందాల ప్రకారం ఆ కంపెనీలకు అన్నిరకాల సౌకర్యాలు త్వరగా పూర్తి చెయ్యాలి. కార్పొరేట్లకు అనేక రకాల సౌకర్యాలు కల్పించేందుకే బస్తర్‌లో సైనికీకరణ – ప్రైవేటీకరణలో భాగంగా ప్రభుత్వం ప్రజలపై యుద్ధం ప్రకటించింది.

బస్తర్ సంబాగ్‌లో గత నాలుగేళ్ళగా కొత్తగా నిర్మించే పోలీసు క్యాంపులకు వ్యతిరేకంగా ప్రజలు పోరాడుతున్నారు. ఐదవ షెడ్యూల్డ్ ప్రాంతంలో గ్రామ సభ అనుమతి లేకుండానే రాత్రికి రాత్రి పెద్దయెత్తున బలగాలు వచ్చి పోలీసు క్యాంపులు ఏర్పాటు చేస్తున్నారు. ప్రశ్నించే ప్రజల్ని పోరాడే ప్రజల్ని బూటకపు కేసులతో అరెస్టులు చేసి నక్సలైట్ కేసుల పేరుతో జైళ్లలో పెడుతున్నారు. ప్రజల్ని భయాందోళనలకు గురిచేసేలా బూటకపు ఎదురు కాల్పుల్లో ప్రజలను చంపేస్తున్నారు. ఇటీవల ఆరునెలల పసిపాపను కూడా హత్య చేశారు.

2021 ఏప్రిల్ 19న మొదటిసారిగా సుక్మా జిల్లాలోని పాలగూడెం, బొత్తిలంక, ఈతగూడెం గ్రామాల పరిసర అటవీ ప్రాంతంలో భారత సరిహద్దులో ఉపయోగించే డ్రోన్లతో బాంబులు వేశారు. రెండవసారి 2022 ఏప్రిల్ 14న సుక్మా జిల్లాలోని సాకిలేరు, చంద, ఇంకాల్, మెట్టగూడెం గ్రామాల మధ్య డ్రోన్లతో బాంబులు వేశారు. మూడవసారి 2023 జనవరి 11న ఇదే జిల్లాలోని బొట్టెం, ఎర్రం గ్రామాల మధ్య హెలికాప్టర్లలో వచ్చి విచ్చలవిడిగా కాల్పులు జరుపుతూ డ్రోన్లతో బాంబింగ్ చేసారు. ఈ దాడిలో ఒక మహిళ చనిపోయింది. మరికొందరు గాయపడ్డారు. నాల్గవ సారి 2023 ఏప్రిల్ 7న సుక్మా–బీజాపూర్ జిల్లాల సరిహద్దుల్లో మీనగట్ట, జబ్బాల్, కావుర్గట్ట, బొట్టెం, గుండం గ్రామాల మధ్య డ్రోన్ల ద్వారా పెద్ద ఎత్తున బాంబింగ్ చేస్తూ, మరొక వైపు హెలికాప్టర్లతో విచ్చలవిడిగా కాల్పులు జరిపారు. ఈ దాడులన్నీ కేవలం ప్రజా గెరిల్లా విముక్తి సైన్యాన్ని లక్ష్యంగా చేసుకొని జరిగినవి కావు. ప్రజలను లక్ష్యంగా చేసుకొని జరిగిన దాడులే.

2024 ప్రారంభం నుండే కార్పెట్ సెక్యూరిటీ విస్తరణలో భాగంగా ఛత్తీస్‌గఢ్ వ్యాప్తంగా వేలాది బలగాలను మోహరించి పదుల సంఖ్యలో కొత్తగా క్యాంపులు నిర్మాణం చేసారు. అందులో భాగంగా సుక్మా జిల్లాలోని దూలేడ్, మెట్టగూడెం గ్రామాల మధ్య క్యాంపు ఏర్పాటు చేసి జనవరి 13న రాకెట్ లాంచర్లతో దాని చుట్టుపక్కల ఉన్న గ్రామాలను, అడవులను లక్ష్యంగా చేసుకొని పెద్ద ఎత్తున దాడులు చేసారు. ఈ దాడుల్లో ప్రజలు చెల్లాచెదురై పరుగెత్తుతూ తమ ప్రాణాల్ని కాపాడుకున్నారు. జనవరి 30న బీజాపూర్ జిల్లాలోని టేకులగూడెం పోలీసు క్యాంపు నుండి అర్ధరాత్రి ప్రజలందరు నిద్రించే సమయంలో అకస్మాత్తుగా రాకెట్ లాంచర్లతో విచ్చలవిడిగా దాని చుట్టుపక్కల గ్రామాలపై షెల్లింగ్ చేయడంతో క్యాంపునకు 5కి.మీ దూరంలో ఉన్న పువ్వారు గ్రామంలోని ప్రజల నివాస స్థలాలకు 10మీటర్ల దూరంతో పడి అవి పేలాయి. ప్రజలు చిన్న పిల్లలనూ, వృద్ధులనూ మోసుకొని పరుగులు తీసారు. ఇలా విచ్చలవిడిగా కాల్పులు చేస్తూ ఈ మధ్య కాలంలో 10 మందికి పైగా ప్రజలను హత్య చేసారు.

వేలాది పోలీసు బలగాలు పగలంతా రోడ్ల నిర్మాణాలకు రక్షణగా ఉంటూ కూంబింగ్ పేరుతో అడవులను గాలిస్తూ విచ్చలవిడి కాల్పులు జరుపుతూ ప్రజలెవరిని ఇండ్లల్లో నుండి బయటకు రాకుండా భయోత్పాతాన్ని సృష్టిస్తున్నాయి. మహిళలపై అత్యాచారాలకు అంతు లేకుండా పోయింది. దండకారణ్యంలోని ఆదివాసీలపై అప్రకటిత యుద్ధం కొనసాగుతున్నది. ఈ దాడులపై ప్రజలు తమ నిరసనను తెలియజేసే అవకాశం లేకుండా ఇక్కడ యుద్ధ పరిస్థితి నెలకొన్నది. ఇక్కడున్న నిర్బంధాన్ని ఇతర ప్రాంతాలకు తెలియజేయకుండా మీడియాను భయపెట్టి నియంత్రణలో ఉంచుకొని కేవలం పోలీసు అధికారులు ఇచ్చే ప్రకటనలే ప్రసారం అయ్యేలా కట్టడి చేస్తున్నారు. దండకారణ్యంలో ప్రజలపై కొనసాగుతున్న అమానవీయ యుద్ధంలో భాగంగా హత్యలను, అత్యాచారాలను ప్రపంచానికి తెలియజేయాల్సిన బాధ్యత అందరిపై ఉంది. ఈ వాస్తవాలను వెలికి తీయడానికి వారికి సంఘీభావం తెలియజేయడానికి రచయితలు, విద్యార్థులు, ప్రజాస్వామికవాదులు ఇక్కడికి వచ్చి క్షేత్ర పరిశీలన చేయాలి. ఇది కేవలం ఆదివాసుల పోరాటమే కాదు. హిందుత్వ కార్పొరేట్ శక్తులపై సాగుతున్న ఫాసిస్టు వ్యతిరేక పోరాటం. త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల సందర్భంగా దండకారణ్య ప్రాంతంలో కార్పొరేట్ దోపిడీని, ఆదివాసులపై సైనిక, వైమానిక యుద్ధాన్ని చర్చనీయాంశం చేయాలని కోరుతున్నాం.

◆ కురుసం శంకర్
మూలవాసీ సాంస్కృతిక కళామంచ్

ఆహార తనిఖీలు చేయని అధికారులపై చర్యలేవీ?

ఉరుకుల పరుగుల హైదరాబాద్ నగరంలో అనేక రకాల ఫుడ్ సెంటర్లు రోడ్ల వెంబడి వెలుస్తున్నాయి. భాగ్యనగరంలో దాదాపు 25 వేల వరకు హోటళ్ళు ఉంటాయి. అందరికీ కావలసింది తిండే కదా! లక్షలాది మంది ఇష్టమైనది తింటూనే ఉంటారు. ఆహారంలో కల్తీ, రోగాలతో కుస్తీ సామాన్యులకు తప్పడం లేదు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు కార్యాలయం నుంచి కదలరు. అవినీతి అధికారులు కరోనా కన్నా ప్రమాదకరం. తనిఖీలు లేకపోవడంతో ప్రజలు నాణ్యత లేని ఆహారాన్ని తిని అనారోగ్యం పాలవుతున్నారు. నాణ్యమైన మంచి నూనె వాడరు, వాడిన నూనెనే పలుసార్లు వాడినా అడిగే నాథుడు లేడు. బిర్యానీలో ఆకర్షించే రంగులు, నూడుల్స్ రుచిగా ఉండేందుకు కొన్ని రసాయనిక పదార్థాలు కలుపుతున్నారు. ఇక, మార్కెట్లో పలురకాల అప్పడాలు, పచ్చళ్ళు, చిప్స్, కారం, చిన్న పిల్లలు తినే తిండి ప్యాకెట్లు ఊరూపేరూ లేనివి అనేకం కనిపిస్తున్నాయి. వంటకాలకు రంగు తెప్పించేందుకు నిషేధిత టార్ట్రాజైన్ అనే సింథటిక్ రసాయనాన్ని కలుపుతున్నారు. యూరియాతో పాలు తయారుచేస్తున్న వైనం కూడా వెలుగులోకి వచ్చింది. కడుపునిండా తినడానికి కూడా సమయం లేని సామాన్యులకు తమ సమస్యమీద ఫిర్యాదు చేసేంత శ్రద్ధ, ఆలోచన ఉండవు. ఒకవేళ ఫిర్యాదుచేయాలని కొందరు అనుకున్నా ఎక్కడ, ఎవరికి ఇవ్వాలో తెలియని స్థితి. అందువల్ల ప్రతి ఫుడ్ సెంటర్‌లోనూ, హోటళ్ళలోనూ సంబంధిత ఫుడ్ ఇన్‌స్పెక్టర్ పేరు, ఫోన్ నెంబర్ వివరాలను ప్రజలకు తెలిసేలాగా ఉంచితే ఎంతో ప్రయోజనం ఉంటుంది. ఆహారంలో కుళ్లిన మాంసం, బూజు వంటివి ఉన్నా, నాణ్యత లేకున్నా ప్రజలు ఫోటోలు, వీడియోలతో సంబంధిత అధికారికి ఫిర్యాదు చేస్తే, వాటిని పరిశీలించి, చర్యలు తీసుకున్న తరువాత ఆ విషయాన్ని సదరు అధికారి ఫిర్యాదుదారునికి తెలియజేయాలి. ప్రజలకు ఈ సౌకర్యం ఉన్నప్పుడు వ్యాపారం చేసే వారికి భయం కూడా ఉంటుంది. అప్పుడే ఈ కల్తీలు అరికట్టవచ్చు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆహార కల్తీని నివారించే విషయంలో కూడా దృష్టిపెట్టి, అవినీతి అధికారులపై కఠిన చర్యలు తీసుకొని ప్రజారోగ్యానికి పాటుపడాలి.

– పూసాల సత్యనారాయణ, సామాజిక కార్యకర్త

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

రాష్ట్ర చిహ్నాల్లో మార్పు చేర్పులు అవసరమేనా?

బలమైన గొంతుతో పార్టీ ప్రచారం చేసి కాంగ్రెస్‌ని అధికారంలోకి తీసుకువచ్చిన రేవంత్ రెడ్డి ఇప్పుడు రాష్ట్రంపైన తన ముద్ర స్థాపించే ప్రయత్నంలో ఉన్నారు. తదనుగుణంగా వివిధ రాజకీయ కార్యకలాపాలతోపాటు రాష్ట్ర చిహ్నాలను మార్చే పనిలో ఉన్నారు. ప్రతి దేశానికి ఒక జాతీయ పతాకం, దేశ మాత రూపం (Personification of Motherland) ఒక జాతీయ గీతం, జాతీయ పక్షి, జాతీయ జంతువు, జాతీయ ముద్ర ఇలా కొన్ని ఉంటాయి. వీటిని State Insignia అని అంటారు. తెలుగులో రాజ్యచిహ్నాలు అనవచ్చు. ఆ కోవలోనే దేశంలో అంతర్గత భాగాలైన రాష్ట్రాలకు కూడా రాష్ట్రగీతం, రాష్ట్రమాత (అన్ని రాష్ట్రాలు పెట్టుకోలేదు), రాష్ట్ర అధికార చిహ్నం (Emblem), రాష్ట్ర పక్షి, రాష్ట్ర జంతువు ఇలా కొన్ని ఉంటాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడగానే అధికారంలోకి వచ్చిన టీఆర్ఎస్‌కు రాష్ట్ర నామానికి క్లుప్తపదం (Abbreviation), రాష్ట్రమాత, రాష్ట్ర అధికార చిహ్నం, రాష్ట్రపక్షి ఇలా రాజ్యచిహ్నాలను రూపకల్పన చేసే అవకాశం అదృష్టం దక్కాయి. ఇప్పుడు వీటిని మార్చాలని కాంగ్రెస్ ప్రభుత్వం తలపెట్టింది. 'రాష్ట్రాన్ని ఇచ్చిన పార్టీగా మొదట అధికారంలోకి రాలేదు కనుక వీటి రూపకల్పనకు అవకాశం రాలేదు. ఇప్పుడు వచ్చింది కనుక చేస్తున్నాము' అనే ధోరణిలో కాంగ్రెస్ ఉంది.

రాష్ట్ర క్లుప్త నామాన్ని TS కాక TGగా మార్చాలన్నది ఎంత వరకు సబబో చూద్దాం. రాష్ట్ర విభజన చట్టంలోనే TG అనే క్లుప్తీకరణని వాడారు. అంతేకాదు ఉద్యమం జరుగుతున్న రోజుల్లోనే ఉద్యమకారులు తమ వాహనాలపైన AP తీసివేసి TG అని పెట్టుకొని అభిమానాన్ని చాటుకున్నారు. దీన్ని నాటి టీఆర్ఎస్ సమర్థించింది. అయితే రాష్ట్రం వచ్చిన తర్వాత ప్రభుత్వం TGని కాకుండా TSని అధికారికంగా అమలులోనికి తెచ్చింది. అంటే Telangana State అని పిలవాలని ఉద్దేశం. ఈ నిర్ణయాన్ని మొదట్నుంచీ కాంగ్రెస్ విమర్శిస్తూనే వచ్చింది. ఇది TRSకి దగ్గరగా ఉంది కాబట్టి పెట్టారని దీనిపైన విమర్శ. రేవంత్ దీన్ని కూడా ఎన్నికల ప్రచారాస్త్రాలలో ఒకటిగా చేశారు.

దేశంలో ఉన్న రాష్ట్రాల పేర్ల క్లుప్త నామాలను పరిశీలిస్తే కొన్ని విషయాలు అవగతమౌతాయి. రాష్ట్రానికి రెండు పదాల పేరు కానీ మూడు పదాల పేరు కానీ ఉంటే చిక్కే లేదు. కాని ఒకటే పదంతో ఉన్నప్పుడు క్లుప్తనామాన్ని ఎలా తయారు చేయాలి? ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్ ఉంటే AP, వెస్ట్ బెంగాల్ అంటే WB అని వచ్చింది. మరి, ఒక్క పదం ఉన్నప్పుడు ఎలా అన్నదానికీ ఒక పద్ధతి ఉంది. ఆ పదంలో ఊనిక, అంటే ఏ అక్షరాలపై ఎక్కువ ఒత్తిడితో పలుకుతారో వాటిని పెడతారు. కేరళ అంటే KL – ఇక్కడ 'క' మీద 'ల' మీద ఊనిక ఉంది కనుక KL తీసుకున్నారు. హర్యానాలో HR, పంజాబ్‌లో PB, ఝార్ఖండ్‌లో JH, బిహార్ BH... ఇలా వాటిని గ్రహించారు. ఈ పద్ధతిలో తెలంగాణ అనే పదంలో ఊనిక TG పైనే ఉంది. కనుక తెలంగాణకి రాష్ట్ర క్లుప్తపదం TG అని ఉండడమే సరైనది. కనుక రేవంత్ రెడ్డి ప్రభుత్వం TGగా మార్చడాన్ని సమర్థించవచ్చు.

రాష్ట్ర గీతం విషయంలోనూ రేవంత్ సరైన నిర్ణయమే తీసుకున్నారు. ప్రజాకవి అందెశ్రీ రాసిన 'జయజయహే తెలంగాణ జననీ జయకేతనం' ఉద్యమంలో ఊరూరా ప్రతిధ్వనించింది. తర్వాతి కాలంలో ఇదే అధికారిక గీతం అవుతుందని అనుకున్నారు. కానీ గేయ రచయితతో రాజకీయంగా అభిప్రాయ భేదాలు ఉన్న కారణంగా కేసీఆర్ దీన్ని పక్కన పెట్టారని విమర్శలు వచ్చాయి. అందెశ్రీ బాహాటంగానే టీఆర్ఎస్ పాలనను, కేసీఆర్‌ను విమర్శించారు. ఇది అమలు కాకపోవడానికి ఇదే ప్రధాన కారణం గావచ్చు. ఇటీవల మరో కారణం ముందుకు వచ్చింది. కేసీఆర్ ఆ పాటని అంగీకరించారని, కానీ పాటలో 12 చరణాలు ఉన్నాయని, అంత సుదీర్ఘంగా పాడితే ఇరవై నిముషాల దాకా పట్టే గీతం రాష్ట్ర ప్రార్థన గీతంగా సాధ్యం కాదని, దాన్ని కొంత కుదిస్తే ఆమోదించాలని భావించారనీ, కానీ అందెశ్రీ అంగీకరించకపోవటం వల్ల అది వీలుకాలేదనీ బీఆర్ఎస్ వర్గాలు చెప్పాయి. ఏది ఏమైనా ఇప్పటికైనా ఈ పాట అంగీకారం పొందింది. కాని దాని పరిమాణం మూడు నిముషాల కంటే ఎక్కువ వస్తే అది పాడినంత సేపూ అందరూ నిలబడి గౌరవించడం సాధ్యం కాదు. పది పదిహేను నిముషాల ప్రార్థనా గీతాలు ఎక్కడా ఉండవు. గీతం కుదింపునకు అటు ప్రభుత్వం, ఇటు అందెశ్రీ అంగీకరించాలి.

ఇక, తెలంగాణ తల్లి రూపురేఖలు రాజరికపు స్త్రీలాగా ఉన్నాయని, తెలంగాణలోని ఒక సాధారణ స్త్రీ రూపంలో ఉండేలాగా తెలంగాణ తల్లికి మళ్ళీ రూపకల్పన చేయాలని తలపెట్టారు. తెలంగాణలోని ప్రముఖ శిల్పి, శిల్ప శాస్త్రం నేర్పే తెలుగు విశ్వవిద్యాలయం ఆచార్యుడు బివిఆర్ చారి తెలంగాణ తల్లికి రూపకల్పన చేసారు. 2007లోనే ఈ విగ్రహానికి ప్రచారం వచ్చింది, ఎన్నో ప్రాంతాలలో ప్రతిష్ఠించారు. దేశాన్ని కానీ రాష్ట్రాన్ని కానీ మాతగా భావించినప్పుడు (Personification) ఆమెను దేవతగానే ఊహిస్తారు కానీ సాధారణ మహిళగా రూపకల్పన చేయరు. తెలంగాణ తల్లి విగ్రహ రూపకల్పన కూడా ఒక దేవతలాగా భావించి చేసినదేనని ముఖ్యమంత్రి గమనించాలి. ఇక కొందరు కాంగ్రెస్ నాయకులు తెలంగాణ తల్లి దొరల స్త్రీలాగా ఉందని, కొందరైతే అది కల్వకుంట్ల కవిత పోలికలతో ఉందని విమర్శించారు. కానీ ఒక్కో తెలంగాణ తల్లి విగ్రహం ఒక్కో పోలికతో ఉన్నాయి. ఈ విమర్శ నిలిచేది కాదు. శిల్పి బీవీఆర్ చారి రాజకీయాలతో సంబంధం లేనివాడు. విగ్రహంలో తెలంగాణ సాంస్కృతిక ప్రతీక బతకమ్మ పూలసిడి ఒక చేత, మరో చేత మన పంట సిరి జొన్నకంకి, ముఖంలో నిర్మలమైన భావం కనిపిస్తుంది. కాంగ్రెస్ కొత్తగా రూపకల్పన చేయాలనుకుంటే చేయవచ్చు. కానీ తెలంగాణ సాధారణ మహిళ అంటే రూపం ఎలా ఉంటుంది అనేది ప్రశ్న. ఒక్కో పరిశ్రమ చేసే మహిళ ఒక రూపంలో కనిపిస్తుంది. ఒక్కో కులం మహిళలు ఒక్కోరకమైన ఆభరణాలు ధరిస్తారు. మరి, ఏ రూపాన్ని తీసుకుంటారు? ప్రభుత్వం వివిధ రంగాలలో ఉన్న మేధావి వర్గంతో చర్చించి మాత్రమే నిర్ణయం తీసుకోవాలి. ప్రతిష్ఠకు పోయి పట్టుదల చూపాల్సిన అవసరం లేదు.

> రాష్ట్ర చిహ్నాలను మార్చే విషయంలో, కేవలం కేసీఆర్ లేదా బీఆర్ఎస్ పట్ల వ్యతిరేక భావనతో కాక, నిజంగా మార్పు అవసరమైతేనే చేయాలి. అప్పుడు కూడా వివిధ రంగాల మేధావి వర్గంతో చర్చించి నిర్ణయాలు తీసుకుంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి, రేవంత్‌రెడ్డికి మంచి పేరు వస్తుంది.



ఇక, రాష్ట్ర ఎంబ్లెమ్ అంటే అధికారిక చిహ్నం ప్రస్తుతం ఒక రౌండ్ సీల్ ఆకారంలో గుండ్రంగా ఉండి తెలంగాణ పేరు తెలుగు, ఇంగ్లీషు, ఉర్దూ భాషలలో ఉంది. లోపలి రూపంలో కాకతీయుల ద్వారతోరణం, చార్మినార్ బొమ్మ ఉన్నాయి. ఈ చిహ్నాన్ని రూపకల్పన చేసింది ప్రసిద్ధ చిత్రకారుడు ఏలే లక్ష్మణ్. ఆయనకూ రాజకీయాలతో సంబంధం లేదు. రేవంత్ విమర్శ ఏమంటే ఇది రాచరికపు చిహ్నాలతో ఉన్నదని. అధికార చిహ్నం ప్రజాస్వామ్యయుతంగా ఉండాలన్నది ఆయన అభిప్రాయం. కానీ దీన్ని రాచరికపు చిహ్నంగానే చూడడానికి వీలు లేదు. కాకతీయులను తెలంగాణ సంస్కృతి, చరిత్రల నుంచి విడదీయలేం. వారు దక్షిణాపథం మొత్తాన్ని పరిపాలించినారు. వారు నిర్మించిన తటాకాలు నేటికీ సేవ చేస్తున్నాయి, నిర్మించిన ఆలయాలు నేటికీ పూజలందుకుంటున్నాయి. కాకతీయ ద్వారతోరణం కేవలం రాచరిక చిహ్నం కాదు, మన వారసత్వ సంపద. చార్మినార్ కూడా అంతే. తెలంగాణలో ముస్లిం పాలన వందల ఏళ్ళ పాటు సాగింది. కుతుబ్‌షాహీ పాలనకు, హిందూ – ముస్లిం సోదరత్వానికి చిహ్నంగా దాన్ని అధికారిక చిహ్నంలో ఉంచారు. అన్ని రాష్ట్రాలు వాటి వాటి చారిత్రక వారసత్వ చిహ్నాలనే ఎంబ్లెమ్‌లో పెట్టుకున్నాయి. ఈ కారణాల దృష్ట్యా ముఖ్యమంత్రి అందులోని బొమ్మలను రాచరికపు చిహ్నాలుగా కాక, మన చారిత్రక, సాంస్కృతిక ఆధ్యాత్మిక వారసత్వ సంపదలుగా చూడాలి. రాష్ట్ర చిహ్నాలను మార్చే విషయంలో, కేవలం కేసీఆర్ లేదా బీఆర్ఎస్ పట్ల వ్యతిరేక భావనతో కాక, నిజంగా మార్పు అవసరమైతేనే చేయాలి. అప్పుడు కూడా వివిధ రంగాల మేధావి వర్గంతో చర్చించి నిర్ణయాలు తీసుకుంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి, రేవంత్‌రెడ్డికి మంచి పేరు వస్తుంది.

● పులికొండ సుబ్బాచారి





ఓ కళాశాల తనిఖీలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

5,547 మంది గైర్హాజరు



ఎస్ఆర్‌నగర్‌లోని ఓ కేంద్రం వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు

- గ్రేటర్‌లో తొలిరోజు ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు
- నిమిషం నిబంధనతో కేంద్రాల వద్దకు విద్యార్థుల పరుగులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్‌లో ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. బోర్డు విధించిన నిమిషం నిబంధన నేపథ్యంలో కేంద్రాల వద్దకు ఉదయం పూట విద్యార్థులు ఉరుకులు, పరుగులతో చేరుకున్నారు. కొంతమంది అరగంట ముందుగానే సెంటర్లకు వచ్చారు. అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. గదికి 25 మంది చొప్పున సీటింగ్ కేటాయించడంతోపాటు సీసీ కెమెరాల నిఘాలో ప్రశ్నాపత్రాలను తెరిచారు. మాస్ కాపీయింగ్‌ను అరికట్టేందుకు సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు కేంద్రాల్లో తనిఖీలు చేపట్టాయి. సెంటర్ల ప్రవేశద్వారాల వద్ద పోలీసుల ఆధ్వర్యంలో అధికారులు విద్యార్థుల హాల్‌టికెట్లను పరిశీలించి, తనిఖీలు చేసిన తర్వాతే లోపలికి అనుమతించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన పరీక్ష సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకు పోలీసులు గట్టి బందోబస్తు చేపట్టారు. మూడు జిల్లాల్లో తొలిరోజు 5,547 మంది గైర్హాజరైనట్లు అధికారులు వెల్లడించారు.

కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

పరీక్ష కేంద్రాల్లో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది సమన్వయం చేసుకుంటూ సజావుగా జరిగేలా చూడాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులకు సూచించారు. ఇంటర్ పరీక్షలను పురస్కరించుకుని బుధవారం ఆయన సెక్రటేరియట్ ఎదురుగా ఉన్న సహారా కాంప్లెక్స్‌లోని పిట్టీ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పరీక్ష నిర్వహణను పర్యవేక్షించడంతో పాటు రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడకుండా ఇన్విజిలేటర్లు జాగ్రత్త వహించాలన్నారు. కాగా, సైబరాబాద్ పరిధిలోని పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉన్నట్లు కమిషనర్ అవినాశ్ మహంతి తెలిపారు.

పరుగులు పెడుతూ పరీక్షా కేంద్రం వద్దకు



'గ్రేటర్' రిలీఫ్.!

- ఆస్తి పన్ను వడ్డీపై 90 శాతం రాయితీ

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆస్తిపన్ను బకాయిదారులకు శుభవార్త. పన్ను బకాయిలపై 90శాతం వడ్డీ మాఫీ చేస్తూ పురపాలకశాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2022- 23 ఆర్థిక సంవత్సరం నాటికి ఉన్న బకాయిలకు ఈ పథకం వర్తించనుంది. వన్ టైం స్కీమ్ (ఓటీఎస్)లో భాగంగా కేవలం 10 శాతం వడ్డీతో పన్ను బకాయి చెల్లించవచ్చని జీఓలో పేర్కొన్నారు. ఇప్పటికే వడ్డీతోపాటు ఎవరైనా మొత్తం పన్ను చెల్లించి ఉంటే.. 90 శాతం వడ్డీని తదుపరి ఆర్థిక సంవత్సరం పన్నులో సర్దుబాటు చేయనున్నారు. ఇప్పటి వరకు రూ.8 వేల కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. ఇందులో అసలు పన్ను రూ.5 వేల కోట్లు కాగా.. వడ్డీ రూ.3 వేల కోట్లు. ఓటీఎస్ ప్రకటనతో బకాయిలు వసూలవుతాయని జీహెచ్‌ఎంసీ అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



ఆర్టీసీ 'ఉచిత'టికెట్లు 8 కోట్లు

- 'మహాలక్ష్మి'తో కిక్కిరిసిపోతున్న ఆర్టీసీ బస్సులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మహాలక్ష్మి పథకం కింద గ్రేటర్‌జోన్‌లో ఇప్పటి వరకు ఆర్టీసీ 8 కోట్ల ఉచిత ప్రయాణ టికెట్లను జారీ చేసింది. సోమవారం రికార్డుస్థాయిలో 12 లక్షల మంది మహిళలు జీరో టికెట్లతో బస్సుల్లో ప్రయాణించారు. బస్సుల సంఖ్య పెంచితే ప్రయాణికుల సంఖ్య మరింత పెరిగే అవకాశముంటుందని ఆ దిశగా ప్రభుత్వం, టీఎస్ ఆర్టీసీ చర్యలు తీసుకోవాలని రవాణారంగ నిపుణులు సూచిస్తున్నారు. ఉచిత ప్రయాణంతో గ్రేటర్‌లో ఆర్టీసీ బస్సుల ఆక్యుపెన్సీ 100 శాతానికి చేరింది. అంతకు ముందు 70 శాతం మాత్రమే ఉండేది.



దేశంలో ఎక్కడ డ్రగ్స్ కేసు వెలుగులోకి వచ్చినా.. హైదరాబాద్, తెలుగు ఇండస్ట్రీతో ఏదో ఒక లింకు బయట పడుతోంది. మూడురోజుల క్రితం రాడిసన్ బ్లూ హోటల్లో వెలుగులోకి వచ్చిన డ్రగ్స్ కేసులోనూ పరిశ్రమకు చెందిన పలువురు సెలబ్రిటీల పేర్లు వెలుగులోకి రావడం మరోసారి టాక్ ఆఫ్ ది టాలీవుడ్‌గా మారింది.

గమ్మత్తు చిత్రం..!

- టాలీవుడ్‌ను కుదిపేస్తున్న డ్రగ్స్ మహమ్మారి
- కొందరి నిర్వాకం వల్ల అందరికీ చెడ్డపేరు
- వరుసగా పట్టుబడుతున్న నిర్మాతలు, డైరెక్టర్లు, నటులు
- త్వరలో సినీ పెద్దలతో సమావేశం : సీపీ

హైదరాబాద్ సిటీ/బంజారాహిల్స్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆరు నెలల క్రితం సినీ నిర్మాత కేపీ.చౌదరి సైబరాబాద్ పోలీసులకు చిక్కారు. అతని కాల్‌లిస్టులో సినీ, రాజకీయ, వ్యాపారవర్గాలకు చెందిన ప్రముఖుల జాబితా చూసి పోలీసులు విస్తుపోయారు. బెంగళూరు, గోవా, హుబ్లీ తదితర ప్రాంతాల్లో వీకెండ్ పార్టీలు నిర్వహించినట్లు పోలీసులు గుర్తించారు. డ్రగ్స్ కేసుకు సంబంధించి కేపీ.చౌదరి కాల్‌లిస్టు పరిశీలించగా 800 మంది పేర్లు వెలుగులోకి వచ్చినట్లు తెలిసింది. వారిలో 300 మందికి పైగా తెలుగు రాష్ట్రాలకు చెందిన రాజకీయ, వ్యాపార, సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. చౌదరి పట్టుబడ్డ రెండు నెలలకే మరో నిర్మాత కారుమూరి వెంకటరత్నాకర్ రెడ్డి అలియాస్ వెంకట్‌రెడ్డి అలియాస్ వెంకట్‌ను మాదాపూర్‌లో డ్రగ్స్‌తో రేవ్‌పార్టీ నిర్వహిస్తుండగా తెలంగాణ నార్కొటిక్ బ్యూరో (టీఎస్ న్యాబ్) అధికారులు అరెస్ట్ చేశారు. ఆయనను విచారించగా అనేక విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆయన కాల్‌లిస్టు పరిశీలించగా డ్రగ్స్ వినియోగిస్తున్న నగరానికి చెందిన 18 మంది పేర్లు వెలుగులోకి వచ్చాయి. వారంతా స్నాప్‌చాట్ ద్వారా నిర్మాత వెంకటరత్నానికి కాంటాక్టులో

మిగతా 8వ పేజీలో..

సినీ పెద్దలు సహకరించాలి..

డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టడానికి సినిమా పరిశ్రమ పెద్దలు సహకరించాలని సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి కోరారు. త్వరలో సినీ పెద్దలతో సమావేశం కానున్నట్లు వెల్లడించారు. గంజాయి, డ్రగ్స్ మహమ్మారిని ప్రోత్సహిస్తూ యువతను నాశనం చేస్తున్న పబ్స్, బార్ అండ్ రెస్టారెంట్ నిర్వాహకులనూ సీపీ హెచ్చరించారు. డబ్బు, హోదా కోసం చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిని కఠినంగా శిక్షిస్తామన్నారు.

పదిరోజులైనా.. పత్తాలేని హౌస్ కమిటీ



హోర్డింగ్‌లను తొలగిస్తున్న సిబ్బంది

- విచారణ అధికారి ఎక్కడ..?
- ప్రకటనల విభాగంలో దిద్దుబాటు చర్యలు
- అక్రమాలు బయటకు రాకుండా చేసేందుకే..

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి):

'ప్రకటనల విభాగంలో అవినీతిపై హౌస్ కమిటీ వేయాలి'

- 20వ తేదీన జరిగిన కౌన్సిల్ సమావేశంలో చేసిన తీర్మానం ఇది. అదే సమయంలో విచారణ అధికారిని నియమించాలని కమిషనర్‌ను మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఆదేశించారు.

సమావేశం ముగిసి నేటికి పది రోజులు. అయినా ఇప్పటి వరకు హౌస్ కమిటీ ఊసే లేదు. విచారణ అధికారి నియామకమూ జరగలేదు. ఆరోపణలున్న డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(డీఈఈ) కార్తీక్‌ను బదిలీ చేశారు. పలుప్రాంతాల్లో అక్రమంగా ఏర్పాటు చేసిన బస్‌షెల్టర్లు, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న యాడ్ డిస్‌ప్లేలను తొలగించారు. 80కిపైగా అనుమతి లేని బస్ షెల్టర్లున్నట్టు ప్రాథమిక పరిశీలనలో గుర్తించారు. తొలగింపు ప్రక్రియ కొనసాగుతుందని అధికారులు పేర్కొంటున్నారు. కానీ సోమవారం.. అదీ రాత్రి పూట షెల్టర్లు తొలగించిన సిబ్బంది.. మర్నాడు ఆ ఊసెత్తలేదు. సంస్థకు ఆర్థికంగా నష్టం చేసేలా ఏర్పాటు చేసిన బస్ షెల్టర్లు, ట్రాఫిక్ అంబరిల్లాల తొలగింపు ఒక్కరోజుతోనే ఎందుకు నిలిచిపోయింది..? అంటే ఉన్నతస్థాయి ఒత్తిళ్లే కారణమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. .

అసలు పని వదిలేసి..

అక్రమ నిర్మాణాలు, ఆక్రమణల కూల్చివేత, ఉన్నతస్థాయి ఆదేశాల మేరకు సంస్థలోని అక్రమాలపై విచారణ, వరద ముంపు, ఏదైనా దుర్ఘటనలు జరిగినప్పుడు సహాయక చర్యలు చేపట్టేందుకు ఏర్పాటు చేసిన విభాగం ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ (ఈవీడీఎం). కానీ ఆ సంస్థ అసలు బాధ్యత కంటే ఇతర పనులపైనే ఎక్కువ దృష్టి సారించింది. రవాణా, ప్రకటనల విభాగం బాధ్యతలు ఈవీడీఎం డైరెక్టర్‌కు అప్పగించారు. ఉన్నతస్థాయి ఆదేశాలతోనే అప్పటి కమిషనర్ ఈవీడీఎం డైరెక్టర్‌ను అదనపు కమిషనర్‌గా నియమించినట్టు తెలిసింది. ఆ తరువాతే ప్రకటనల విభాగంలో అవినీతి మొదలైంది. హోర్డింగ్‌లు, యూనిపోల్స్‌పై నిషేధం నేపథ్యంలో డిమాండ్ అధికంగా ఉండడంతో అనుమతి లేకుండా

మిగతా 6వ పేజీలో..

కిసాన్ సంఘీభావ ర్యాలీ



రైతులకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో జరుగుతున్న రైతు ఉద్యమానికి సంఘీభావం తెలుపుతూ కిసాన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఎల్బీ స్టేడియం నుంచి నెక్లెస్‌రోడ్ రోటరీ చౌరస్తాలోని ఇందిరాగాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని మోదీకి వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. రైతుల ఆదాయాన్ని రెండింతలు చేస్తానని హామీ ఇచ్చిన ప్రధాని మోసగించారని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేత కోదండరెడ్డి, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. - ఖైరతాబాద్ (ఆంధ్రజ్యోతి)



ఆర్.కృష్ణయ్యతో 'పట్నం' భేటీ

ఎంపీ ఆర్.కృష్ణయ్యతో మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, ఆయన సతీమణి సునీతారెడ్డి బుధవారం సమావేశమయ్యారు. విద్యానగర్‌లోని బీసీభవన్‌కు వచ్చిన మహేందర్‌రెడ్డి దంపతులు కృష్ణయ్యతో అరగంటపాటు సమావేశమయ్యారు. ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన మహేందర్‌రెడ్డి దంపతులు కృష్ణయ్యతో భేటీ కావడం రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది. పాత మిత్రులం కాబట్టి కలిశామని కృష్ణయ్య మీడియాకు తెలిపారు.

- రాంనగర్ (ఆంధ్రజ్యోతి)

మల్కాజిగిరి.. మస్తుపోటీ!



- బీజేపీ టికెట్ ఆశావహులెందరో.. ● తాజాగా ఈటల బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) మల్కాజిగిరి పార్లమెంట్ టికెట్ కోసం బీజేపీలో తీవ్ర పోటీ ఏర్పడింది. ఎవరికి వారు టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. బీజేపీ మధ్యప్రదేశ్ రాష్ట్ర ఇన్‌చార్జి మురళీధర్‌రావు, జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్, ఢిల్లీ పబ్లిక్‌స్కూల్ చైర్మన్ ఎం.కొమురయ్య, సీనియర్ నాయకులు చాడ సురేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, తూళ్ల వీరేందర్‌గౌడ్, పన్నాల హరీష్‌రెడ్డి, సామ రంగారెడ్డి, మల్లారెడ్డి ఈసీటును ఆశిస్తున్నారు. తాజాగా ఓఆర్ఆర్ పక్కన పూడూరు పరిధిలోని తన నివాసంలో ఈటల బుధవారం బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్ ఏర్పాటుచేయడం, అధిక సంఖ్యలో అభిమానులు తరలిరావడంతో ఆసక్తి ఏర్పడింది. ఒకటి, రెండు రోజుల్లో అధిష్ఠానం అభ్యర్థులను ఖరారు చేయనున్నట్లు ప్రచారం జరుగుతోంది. గత పార్లమెంట్ ఎన్నికల్లో ఇక్కడి నుంచి మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచందర్‌రావు పోటీ చేసి, 3,04,282 ఓట్లు సాధించారు.

ప్రధానంగా వారి మధ్యే..

మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో మేడ్చల్, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఉప్పల్, ఎల్బీనగర్, సికింద్రాబాద్, కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, ఉప్పల్, ఎల్బీనగర్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీజేపీకి మంచి పట్టు ఉంది. దీంతో ఇక్కడి పోటీ చేసేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు. ప్రధానంగా మురళీధర్‌రావు, ఈటల మధ్య గట్టి పోటీ ఉన్నట్లు తెలుస్తోంది. మల్క కొమురయ్యకు ఆర్ఎస్ఎస్, ఏబీవీపీ అండదండలున్నాయని ప్రచారం జరుగుతోంది.

హైదరాబాద్ పార్లమెంట్‌లో బీజేపీ జెండా ఎగురవేస్తాం : డా. కె.లక్ష్మణ్ 6

బోగస్, డూప్లికేట్ ఓటర్లు 6.60 లక్షలు

- హైదరాబాద్ లోక్‌సభ పరిధిలో.. ● ఎన్నికల కమిషన్ స్పందించాలి : ఫిరోజ్ ఖాన్



సమావేశంలో మాట్లాడుతున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఫిరోజ్ ఖాన్

పంజాగుట్ట, ఫిబ్రవరి28(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో మొత్తం 21 లక్షల ఓటర్లు ఉండగా, అందులో 6.64 లక్షల నకిలీ ఓటర్లు అని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఫిరోజ్‌ఖాన్ తెలిపారు. బోగస్, డూప్లికేట్ ఓటర్ల వల్లే తాను గత ఎన్నికల్లో నాంపల్లి అసెంబ్లీ, అంతకు ముందు హైదరాబాద్ పార్లమెంటు నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓడిపోయానన్నారు. ఎన్నికల కమిషన్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ స్పందించి ప్రత్యేక డ్రైవ్ ద్వారా బోగస్, డూప్లికేట్ ఓటర్లను తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజాపాలనలో భాగంగా తన బృందంతో రెండు నెలల పాటు బోగస్, నకిలీ ఓటర్లపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించగా

మిగతా 6వ పేజీలో..

నియోజకవర్గం	రెం.ని.ఫా	రెం.ఓ. ఉ	ఒ.ఇ.ఓ	మృ.చెం.ఓ
మలక్‌పేట	20,090	48,733	28,462	3,458
కార్వాన్	20,763	38,318	27,653	1,538
గోషామహల్	12,553	8,835	24,482	1,877
చార్మినార్	11,254	42,329	14,035	2,479
చాంద్రాయణగుట్ట	17,620	52,093	25,420	1,830
యాకత్ పురా	23,254	57,457	29,327	2,777
బహదూర్ పురా	10,863	41,191	25,611	1,066

నోట్ రెం.ని.ఫా : రెండు నియోజకవర్గాల్లో ఫొటోలు ఒకేలా ఉన్నవి. రెం.ఓ.ఉ : రెండు నియోజకవర్గాలో ఓట్లు ఉన్నవి. ఒ.ఇ.ఓ : ఒకే ఇంట్లో ఒకే ఓటు ఉన్నవి. మృ.చెం.ఓ : మృతి చెందినా ఓటర్లుగా ఉన్నవారు

హైదరాబాద్ పార్లమెంట్ స్థానంలో..
బీజేపీ జెండా ఎగరేస్తాం: కె.లక్ష్మణ్

చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ పార్లమెంట్ స్థానంలో బీజేపీ జెండా ఎగరేస్తామని ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. బుధవారం నగరంలో విజయసంకల్ప యాత్ర నిర్వహించారు. శాలిబండ నుంచి ప్రారంభమైన యాత్ర పలు ప్రాంతాల మీదుగా ఛత్రినాక చేరుకుంది. అక్కడి చౌరస్తాలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కే.లక్ష్మణ్, ఎమ్మెల్యే రామారావు పటేల్ మాట్లాడుతూ బీజేపీ విజయ సంకల్ప యాత్రలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీకి మద్దతు కూడగడుతున్నామని, మూడోసారి మోదీని ప్రధాని చేయాలని దేశవ్యాప్తంగా ప్రజలు కోరుకుంటున్నారన్నారు. మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఓవైసీపై పాతబస్తీలో వ్యతిరేకత వ్యక్తమవుతోందని, ఆయన బడావ్యాపారులకు మాత్రమే కొమ్ముకాస్తున్నారని, మతం పేరిట రాజకీయాలు చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల పేరుతో గారడీ చేసి, అధికారంలోకి వచ్చాక ప్రజలను మభ్యపెడుతోందన్నారు. మజ్లిస్ అక్రమఆస్తులను కాపాడుకునేందుకు ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ పంచన చేరడం వారికి అలవాటయ్యిందన్నారు. బీజేపీకి అవకాశం ఇస్తే హైదరాబాద్ రూపురేఖలను మారుస్తామని హామీ ఇచ్చారు. అంతకు ముందు యాకుత్‌పురా నియోజకవర్గంలో ఐఎస్‌సదన్ వద్ద ఏర్పాటు చేసిన సభలో కూడా లక్ష్మణ్ మాట్లాడారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఆలే భాగ్యలక్ష్మి, శ్వేతారెడ్డి, జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్ రెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్‌జీ, మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్ర పాల్గొన్నారు. ఇదిలావుండగా ఛత్రినాక పరిధిలో బీజేపీ విజయసంకల్ప యాత్రలో పాల్గొన్న ఒక మహిళ ఫిట్స్ వచ్చి పడిపోయింది. స్థానికులు ఆమెకు సపర్యలు చేయడంతో కొద్దిసేపటికి తేరుకుంది.

హౌస్ కమిటీ అంతేనా..?

(5వ పేజీ తరువాయి)

బస్‌షెల్టర్లు, ట్రాఫిక్ అంబరిల్లాలు, లాలీపాప్స్ ఏర్పాటు చేసేందుకు కొన్ని యాడ్ ఏజెన్సీలు ప్రాధాన్యమిచ్చాయి. రూ.కోట్లలో ఆదాయం వస్తుండడంతో అదే స్థాయిలో గత అధికారులకు ముడుపులు ముట్టాయన్న ఆరోపణలున్నాయి.

ఈవీడీఎం.. అక్రమాల పుట్ట...

అక్రమాలు వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో గతంలో ఈవీడీఎం, ప్రకటనల విభాగంలో పనిచేసిన పలువురు అధికారుల తీరు చర్చనీయాంశంగా మారింది. ఆధునికీకరించిన బుద్ధభవన్‌లో పలు ఏర్పాట్ల కోసం ఉన్నతాధికారులు ఇష్టానికి నిర్ణయాలు తీసుకున్నట్టు తెలిసింది. ఎస్ఎస్ఆర్‌లో లేని వస్తువుల కొనుగోలుకు బహిరంగ ప్రకటన ద్వారా కొటేషన్లు తీసుకోవాలి. కానీ నచ్చిన సంస్థల నుంచి కొటేషన్లు తీసుకున్నట్టు తెలిసింది. ఆ మేరకు బిల్లులు చెల్లించినట్టు సమాచారం. ఎలక్ట్రికల్ జనరేటర్ ఎస్ఎస్ఆర్‌లో రూ.4 లక్షల వరకు ఉండగా, రూ.5.5 లక్షలకు కొటేషన్ తీసుకొని చెల్లింపులు చేసినట్టు తెలిసింది. ఈ పనుల కోసం బిల్లు రూపొందించనందుకు విచారణ జరుపుతామని ఓ అధికారిని హెచ్చరించినట్టు తెలిసింది. తెలంగాణ స్టేట్ టెక్నాలజీ సర్వీసెస్(టీఎస్‌టీఎస్) ద్వారా సర్వర్ ఏర్పాటు చేయాల్సి ఉండగా, ఇష్టానికి నిర్ణయాలు తీసుకున్నారు. దీనికి సంబంధించిన బిల్లులపై ఆడిట్ విభాగంలో అప్పటి అధికారి ఒకరు అభ్యంతరం తెలపగా.. ఆ ఆఫీసర్‌ను భయపెట్టి మరీ బిల్లు పాస్ చేయించుకున్నట్టు విమర్శలున్నాయి. విపత్తుల నిర్వహణ పరికరాల కొనుగోలూ సక్రమంగా జరగలేదన్న ఆరోపణలున్నాయి. ప్రకటనల విభాగానికి సంబంధించి ఇష్టానికి నిర్ణయాలు తీసుకొని తదనుగుణంగా పని చేయాలని కింది స్థాయి ఉద్యోగులపై ఒకరిద్దరు అధికారులు ఒత్తిడి తీసుకువచ్చినట్టు చెబుతున్నారు. ఆ అధికారుల జోక్యంతోనే హౌస్ కమిటీ ఏర్పాటు, విచారణ అధికారి నియామకంలో ముందడుగు పడడం లేదన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

బోగస్, డూప్లికేట్ ఓటర్లు 6.60 లక్షలు

(5వ పేజీ తరువాయి)

విస్తుపోయే నిజాలు వెలుగు చూశాయన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. పార్లమెంటు పరిధిలోని మలక్‌పేట, కార్వాన్, గోషామహల్, చార్మినార్, చాంద్రాయణగుట్ట, యాకుత్‌పురా, బహదూర్‌పురా నియోజకవర్గాల్లో ఇంటింటికీ తిరుగుతూ ఓటర్ల లిస్టు తనిఖీ చేశామన్నారు. 6.64 లక్షల బోగస్, నకిలీ, డూప్లికేట్ ఓటర్లున్నారనే విషయం వెలుగు చూసిందన్నారు. అందుకు ఆధారాలు, మృతి చెందిన వారి డెత్‌సర్టిఫికెట్లు సేకరించామన్నారు. ఒక్క పార్లమెంట్ నియోజకవర్గంలోనే ఈస్థాయిలో నకిలీ ఓటర్లుంటే, దేశంలో పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. బూత్ లెవెల్ ఆఫీసర్స్ (బీఎల్ఓ) అవినీతి, అక్రమాలతోనే బోగస్ ఓటర్లు నమోదయ్యాయని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల ముందు రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్‌రాజ్, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ నకిలీ ఓటర్లపై చర్యలకు ఉపక్రమించిన కొద్దిరోజులకే, అప్పటి మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ వారిపై ఒత్తిడి తెచ్చారని ఆరోపించారు. యాకుత్‌పురా నియోజకవర్గంలో ఒకే ఇంటి నెంబర్‌పై 662 ఓట్లు ఉన్నట్లు వెల్లడించారు. ఒక మహిళా ఓటరు రెండేళ్ల క్రితం మృతి చెందినా, 2024 జనవరిలో వచ్చిన అదనపు ఓటరు జాబితాలో ఆమె పేరును చేర్చారన్నారు. బోగస్ ఓట్లను తొలగిస్తే ఎంఐఎం కేవలం రెండునియోజకవర్గాల్లోనే గెలుస్తుందని ఫిరోజ్‌ఖాన్ చెప్పారు.

ఘనంగా జాతీయ సైన్స్ డే

విద్యార్థులు వ్యవసాయ ప్రాముఖ్యతను తెలుసుకోవాలి: శాస్త్రవేత్తలు

● పాఠశాలల్లో సైన్స్ ఎగ్జిబిషన్లు

● ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శన



రాకెట్ లాంచర్ నమూనాను పరిశీలిస్తున్న రాజేంద్రనగర్ మండల గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం ప్రధాన కార్యదర్శి శరవణ్ కుమార్

రాజేంద్రనగర్/చాంద్రాయణగుట్ట/ పహాడిషరీఫ్ ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): జాతీయ సైన్స్ డేను ఘనంగా జరుపుకొన్నారు. ఫిబ్రవరి 28న భారతీయ భౌతిక శాస్త్రవేత్త సర్ సీవీ రామన్ గుర్తుగా జాతీయ సైన్స్ దినోత్సవాన్ని జరుపుకున్నారు. బుధవారం రాజేంద్రనగర్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రైస్ రీసెర్చ్ (ఐఐఆర్ఆర్)లో నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రిల్చరల్ సైన్సెస్ హైదరాబాద్ చాప్టర్‌తో కలసి 'వ్యవసాయం - ప్రాముఖ్యత'పై పరిసర ప్రాంతాల్లోని 13 పాఠశాలల విద్యార్థులకు అవగాహన కల్పించారు. అహార భద్రత, వ్యవసాయ విద్యపై స్టాళ్లు ఏర్పాటు చేసి వ్యసాయ ప్రాముఖ్యతను వివరించారు. రాజేంద్రనగర్‌లోని నార్మ్‌లో పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులకు వ్యవసాయ రంగం యొక్క ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.


బహుమతి అందజేస్తున్న నార్మ్ జాయింట్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు

నార్మ్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్‌రావు వర్చువల్‌గా విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థులను రెండు బ్యాచ్‌లుగా విభజించి అగ్రో టెక్నాలజీ పార్కు, బయోడైవర్సిటీ పార్క్, హెర్బల్ గార్డెన్, నర్సరీ లకు తీసుకెళ్లి డ్రిప్ వివిధ విధానాలపై వివరించారు. అత్తాపూర్ శ్రీచైతన్య టెక్నో పాఠశాలలో సైన్స్ ఫెయిర్ నిర్వహించగా 1వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు.

పాత బస్తీలో సైన్స్ డే

తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం పాత బస్తీ గౌలిపురాలోని జ్ఞాన భారతీ మోడల్ హైస్కూల్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఛత్రినాక్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఆధునిక భారతీయ విజ్ఞాన శాస్త్రవేత్తల పరిశోధన ప్రతిభను అంతర్జాతీయస్థాయికి ఇనుమడింపచేసిన వ్యక్తుల్లో సర్ సీవీ రామన్ అగ్రగణ్యుడని కొనియాడారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే శాస్త్రీయ, సాంకేతిక పరిశోధనలపై దృష్టి సారించాలన్నారు.



పాతబస్తీలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

'విద్యార్థుల నైపుణ్యాన్ని వెలికి తీయొచ్చు'

వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థులలోని నైపుణ్యాన్ని వెలికి తీయవచ్చని కోటి పాఠశాల కరెస్పాండెంట్ దామోదర్ సచిన్‌సోని అన్నారు. బుధవారం కోటి విద్యాలయ పాఠశాలలో జాతీయ సైన్స్ డే కార్యక్రమం నిర్వహించారు.

ప్రతి పనిలోనూ సైన్స్...

రాజేంద్రనగర్ సర్కిల్ బాబుల్‌రెడ్డి నగర్‌లో ఉన్న శ్రీవిద్యానికేతన్ హై స్కూల్‌లో బుధవారం సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. స్కారీ రూమ్, స్పేస్‌రూమ్, నేచర్ రూమ్, ఆర్ట్ గ్యాలరీ పేరుతో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. రాకెట్ లాంచర్ నమూనా, అటల్ థింకర్ ల్యాబ్ పరికరాల గురించి విద్యార్థులు వివరించారు. వాతావరణ మార్పులను తట్టుకోవడం ఎలా, సోలార్ విద్యుత్, వ్యవసాయం, పర్యావరణ పరిరక్షణ ఇలా అనేక ప్రదర్శనలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.


వరి సాగు గురించి తెలుసుకుంటున్న విద్యార్థులు


ఆసక్తిగా వింటున్న విద్యార్థులు


సైన్స్ ఫెయిర్‌ను తిలకిస్తున్న పాఠశాల కరస్పాండెంట్ లక్ష్మణ్, ప్రిన్సిపాల్ నాగలక్ష్మి


వైజ్ఞానిక ప్రదర్శనలో అయోధ్య రామాలయం నమూనాను చూపుతున్న విద్యార్థులు



అత్తాపూర్ శ్రీచైతన్య టెక్నో పాఠశాలలో సైన్స్ ఫెయిర్‌ను పరిశీలిస్తున్న ఎస్ఐ మౌనిక


ఆధునిక బ్రీత్ ఎనలైజర్ పరికరాలను అందజేస్తున్న డియాజియో సంస్థ ప్రతినిధులు

మద్యం తాగి వాహనాలు నడపడం ప్రమాదకరం: డీజీపీ రవిగుప్తా

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడపడం తమతోపాటు ఎదుటి వారికి ప్రమాదకరమని డీజీపీ రవిగుప్తా అన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌ను కట్టడి చేసి ప్రజలను ప్రమాదాల బారి నుంచి కాపాడేందుకు పోలీస్ శాఖ నిరంతరం పనిచేస్తుందని తెలిపారు. డీజీపీ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో డియాజియో కార్పొరేట్ ఎఫైర్స్ సీనియర్ జనరల్ మేనేజర్ రవివర్మ తెలంగాణ పోలీస్ శాఖకు 50 అత్యాధునిక బ్రీత్ ఎనలైజర్ పరికరాలను అందజేశారు. డీజీపీ రవిగుప్తా మాట్లాడుతూ డియాజియో అందించిన పరికరాలు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఉపయోగపడుతాయని చెప్పారు. బాధ్యతాయుతంగా వాహనాలు నడపడం వల్ల తమతోపాటు ఇతరుల ప్రాణాలు కాపాడవచ్చని అదనపు డీజీపీ(రోడ్డు భద్రత) మహేష్ భగవత్ అన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిని కట్టడి చేసేందుకు హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు స్పష్టమైన ప్రణాళికతో పనిచేస్తున్నారని అడిషనల్ సీపీ విశ్వప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో డియాజియో సంస్థ ప్రతినిధులు, పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

నాటక రంగ అభివృద్ధికి.. 'రసరంజని' సంస్థ ఎనలేని కృషి


నాటకంలోని సన్నివేశం

రవీంద్రభారతి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రసరంజని సంస్థ నాటక రంగ అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తోందని వక్తలు అన్నారు. ప్రతి నెలా నాటకం, ప్రేక్షకుడికి వినోదం, నటుడికి ఆనందం అనే నినాదంతో ముందుకు సాగుతున్నదని వారన్నారు. బుధవారం రవీంద్రభారతిలో రసరంజని సంస్థ ఆధ్వర్యంలో భక్త పోతన నాటకాన్ని ప్రదర్శించారు. చింతలపాటి సోమరాజు సాంస్కృతిక సేవా సంస్థ సమర్పనలో దివంగత పి.ఎస్.ఆర్. ఆంజనేయులు రచించిన ఈ నాటకానికి డా.చింతలపాటి శూలపాణి దర్శకత్వం వహించారు. పదిహేనవ శతాబ్దం సహజ పండితుడిగా పేరొందిన పోతన విశిష్టతను చాటుతూ సాగిన ఈ నాటకం ప్రేక్షకుల్ని రంజింపజేసింది. చక్కటి నటనతో కళాకారులు ఆకట్టుకున్నారు. పలువురు నాటకరంగ ప్రయోక్తలు పాల్గొని కళాకారులను సత్కరించి అభినందించారు. నాటక రంగ అభివృద్ధికి రసరంజని సంస్థ చేస్తున్న కృషిని కొనియాడారు.


సందల్‌కు స్వాగతం పలుకుతున్న ఇన్‌స్పెక్టర్‌లు, స్థానికులు, ముతవల్లీలు

బాబా షర్ఫుద్దీన్ ఉర్సు ప్రారంభం

● మంగళవారం అర్ధరాత్రి ఊరేగింపుగా బయలుదేరిన సందల్

పహాడిషరీఫ్ ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పహాడిషరీఫ్‌లోని బాబా షర్ఫుద్దీన్ 758వ ఉర్సు ప్రారంభమైనది. ఉర్సు సందల్ బాలాపూర్‌లోని బాబా షర్ఫుద్దీన్ నివాసం నుంచి బయలు దేరింది. మంగళవారం అర్ధరాత్రి 12 గంటలకు ప్రత్యేక ప్రార్థనలు జరిపి, సందల్ ఊరేగింపు నిర్వహించారు. బాలాపూర్ నుంచి బయలుదేరిన సందల్ కొత్తపేట్, బిస్మిల్లా కాలనీ, పీరేకే మండి, జమ్‌జమ్ బేకరి, షాహీన్ నగర్, హైవే హోటల్, జల్‌పల్లిగేట్ మార్గాన పహాడిషరీఫ్ దర్గా వద్దకు బుధవారం ఉదయం 7 గంటలకు చేరుకుంది. కందుకూర్ ఇన్‌స్పెక్టర్లు, ముతవల్లీలు, బడంగ్‌పేట్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహరెడ్డి, కార్పొరేటర్లు ప్రభాకర్‌రెడ్డి, మనోహర్ జైహింద్, బాలు నాయక్ చాదర్ సమర్పించారు. బుధవారం బీఆర్ఎస్ పార్టీ అధికార ప్రతినిధి పటోళ్ల కార్తీక్‌రెడ్డి బాబా షర్ఫుద్దీన్ దర్గాను దర్శించుకొని చాదర్ సమర్పించారు. ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న ర్యాంపు పనులను పరిశీలించిన ఆయన, పనులు వేగవంతంగా పూర్తి చేసేందుకు సహకారం అందిస్తానని, దర్గా అభివృద్ధికి కృషి చేస్తానని పటోళ్ల కార్తీక్ రెడ్డి చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు దస్తగిర్ నయీమ్, జల్‌పల్లి మున్సిపాలిటీ వైస్ చైర్మన్ ఫర్హాన యూసుఫ్ పటేల్, అఫ్జల్, మేరాజ్ ఖాన్, అవినాష్ రెడ్డి, మన్నన్, కొండల్ యాదవ్, శ్రీధర్, ముతవల్లీలు మొయినుద్దీన్, అహ్మద్ అలీ, సలీం, ఇమ్రాన్, ఇర్ఫాన్, నాసిర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

'ప్రార్థనలకు ఇబ్బందులు లేకుండా మసీదుల వద్ద అవసరమైన ఏర్పాట్లు చేయిస్తా'

పహాడిషరీఫ్ ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మసీద్‌ల వద్ద ముస్లింల ప్రార్థనలకు ఇబ్బందులు లేకుండా అవసరమైన ఏర్పాట్లు చేయిస్తానని మాజీ ఎంపీటీసీ షేక్ అఫ్జల్ చెప్పారు. బుధవారం వాదీ ఏ ముస్తా బస్తీలోని మసీదుల కమిటీల సభ్యులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రంజాన్ మాసంలో మసీదుల వద్ద చేపట్టాల్సిన పనులపై వారిని అడిగి తెలుసుకున్నారు. సమస్యలను జల్‌పల్లి మున్సిపాలిటి చైర్మన్, కమిషనర్‌ల దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరిస్తానని వారికి హామీ ఇచ్చారు.

కేఎల్ఆర్‌పై ఆరోపణలు సరికాదు: జహంగీర్


మాట్లాడుతున్న కాంగ్రెస్ జల్‌పల్లి కో-ఆర్డినేటర్ జహంగీర్

పహాడిషరీఫ్ ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మహేశ్వరం నియోజక వర్గ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి (కేఎల్ఆర్)పై ఆరోపణలు చేయడం సరికాదని కాంగ్రెస్ జల్‌పల్లి మున్సిపాలిటీ కో- ఆర్డినేటర్ షేక్ జహంగీర్ హితవు పలికారు. బుధవారం జల్‌పల్లిలో విలేకరుల సమావేశంలో జహంగీర్ మాట్లాడారు. ఈ నెల 26న జల్‌పల్లి చెరువు కింద ఎఫ్‌టీఎల్‌లో వెలసిన అక్రమ నిర్మాణాలను కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి పరిశీలించారు. దాంతో కొందరు భూకబ్జాదారులు రాత్రి సమయంలో గోడలపై 'ఈ భూములు కాంగ్రెస్ పార్టీకి చెందినవి' రాసి బద్నాం చేసేందుకు కుట్ర పన్నారన్నారు. స్వాతంత్ర సమరయోధుడి కుటుంబాన్ని తెరపైకి తీసుకొచ్చి ఆరోపణలు చేయించడం వెనుక కబ్జాదారుల హస్తం ఉందని ఆయన ఆరోపించారు. రికార్డుల్లో ఆ సర్వే నంబర్లలో సమరయోధుడికి సంబంధించిన స్థలం లేదన్నారు. గోడలపై రాతలు రాసిన వారిపై చర్యలు తీసుకోవాలని పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని జహంగీర్ తెలిపారు. సమావేశంలో జల్‌పల్లి గ్రామ కో ఆర్డినేటర్ చింతకింది నవీన్ గౌడ్, నాయకులు బాలాజీ, నవాజ్, బాబు, యంజాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాలుష్య కోరల్లో ప్రపంచం

● అంబేడ్కర్ వర్సిటీలో జాతీయ సైన్స్ దినోత్సవం


మాట్లాడుతున్న డా.ఎస్.వెంకట మోహన్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రపంచం పూర్తిస్థాయిలో కాలుష్య కోరల్లో చిక్కుకుంటోందని, ఇది భవిష్యత్ తరాల మనుగడనే ప్రశ్నార్థకంగా మారుస్తుందని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ) సీనియర్ శాస్త్రవేత్త డా.ఎస్.వెంకట మోహన్ పేర్కొన్నారు. అంబేడ్కర్ వర్సిటీలో వికసిత్ భారత్‌లో భాగంగా జాతీయ సైన్స్ దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. సైన్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన 'సుస్థిర అభివృద్ధి సాంకేతిక జోక్యం'పై ఆయన కీలకోపన్యాసం చేశారు. వాతావరణంలో కాలుష్య పరిమాణం రోజురోజుకూ పెరుగుతూ ఆందోళన వ్యక్తం చేశారు. ఇది భవిష్యత్ తరాలకు తీవ్ర ఇబ్బంది కరంగా మారనుందన్నారు. గాలిలో కార్బన్‌డయాక్సైడ్ శాతం ఉండాల్సిన పరిమాణం కంటే ఎక్కువగా నమోదవుతోందని, విపరీతంగా పెరుగుతోన్న జనాభా కూడా దీనికి కారణంగా నిలుస్తుందన్నారు. కాలుష్య కారకాలను తగ్గించక పోతే భవిష్యత్‌లో మానవ మనుగడకే పెద్ద ముప్పుగా నిలుస్తుందన్నారు. కాలుష్యాన్ని తగ్గించడానికి ఐఐసీటీ పరిశోధనలు చేస్తుందని, అనేక పరిశ్రమలు తమ ఉత్పత్తి కేంద్రాల నుంచి వ్యర్థాలను నేరుగా అటు భూమిలోకి ఇటు వాతావరణంలోకి వదలడం ద్వారా కాలుష్యం విపరీతంగా పెరిగిపోతోందన్నారు. అంబేడ్కర్ వర్సిటీ ఉపకులపతి ప్రొ.కె.సీతారామరావు, అకాడమిక్ డైరెక్టర్, సైన్స్ విభాగ డీన్ ప్రొ.పుష్ప చక్రపాణి మాట్లాడుతూ ప్రఖ్యాత భారతీయ పరిశోధకులు సర్ సి.వి.రామన్ గుర్తుంచుకునేలా ఆయన పేరున జాతీయ సైన్స్ దినోత్సవాన్ని జరపడం శుభసూచికమన్నారు.

రాష్ట్రపతి నిలయంలో సైన్స్ డే

తిరుమలగిరి ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో మూడు రోజులపాటు జరిగిన సైన్స్ డే వేడుకలు బుధవారం ముగిశాయి. ప్రభుత్వ పాఠశాలలు, ఇంజినీరింగ్, డిగ్రీ కళాశాలలకు చెందిన వెయ్యి మంది విద్యార్థులు వేడుకల్లో పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎన్ఆర్ఎస్‌సీ రిటైర్డ్ శాస్త్రవేత్త చంద్రశేఖర్.. చంద్రయాన్ ద్వారా కనుగొన్న చంద్రగ్రహ రహస్యాలను, ఎన్ఆర్ఎస్‌సీ పరిశోధనల గురించి విద్యార్థులకు వివరించారు. సీసీఎంబీ ప్రిన్సిపల్ శాస్త్రవేత్త బిశ్వజీత్ భూత, భవిష్యత్, వర్తమాన వ్యవహారాల ఆవిష్కరణ గురించి వివరించారు. కార్యక్రమంలో జియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యతోపాటు నైతిక విలువలు నేర్పించాలి

'వింగ్స్ ఆఫ్ వండర్' స్కూల్‌ను ప్రారంభించిన డిప్యూటీ సీఎం భట్టి


వింగ్స్ ఆఫ్ వండర్ ది ఫౌండేషన్ స్కూల్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

నార్సింగ్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మణికొండలో వింగ్స్ ఆఫ్ వండర్ ది ఫౌండేషన్ స్కూల్‌ను తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బుధవారం ప్రారంభించారు. సరస్వతీమాత విగ్రహం ముందు జ్యోతి ప్రజ్వలన చేసి తరగతి గదులను, ఒకటో తరగతి నుంచి ఏడో తరగతి వరకు ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని భట్టి విక్రమార్క ప్రారంభించారు.

ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ విశాలవంతమైన ఏసీ తరగతి గదులు, అధునాతనమైన ల్యాబ్‌లు, లైబ్రరీ అన్ని సదుపాయాలతో కూడిన స్కూల్‌ను ప్రారంభించడం బాగుందన్నారు. నేటి బాలలు రాష్ట్రానికి, దేశానికి భవిష్యత్తు అన్న భట్టి, విద్య అందరికీ అందాలని, చదువు విలువ గురించి అందరికీ అవగాహన కల్పించడానికి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. బోధన సులభమైన శైలిలో విద్యార్థులకు అందించినప్పుడే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన వివరించారు. విద్యార్థులకు విద్యతోపాటు నైతిక విలువలు, సాంస్కృతిక కార్యక్రమాలు నేర్పించాలన్నారు. పాఠశాలల్లో విద్యతో పాటు సంగీతం, సాహిత్యం, లలితకళలు, క్రీడలు కూడా ఉండాలన్నారు. కార్యక్రమంలో మణికొండ మున్సిపల్ చైర్మన్ కస్తూరి నరేందర్, పీసీసీ రాష్ట్ర నాయకులు రవిశంకర్, పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్లు ప్రియా పోలిన, స్వాతి అట్లూరి పాల్గొన్నారు.


మొదటి స్థానంలో నిలచిన రాజేంద్రనగర్ జోన్ మహిళలు

ముగిసిన వ్యవసాయ వర్సిటీ పోటీలు

● పురుషుల విభాగంలో ఉత్తర తెలంగాణ జోన్, మహిళల విభాగంలో రాజేంద్రనగర్ జోన్‌కు ప్రథమ స్థానం

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ వర్సిటీలో నిర్వహిస్తున్న పోటీలు బుధవారం ముగిశాయి. నిత్యం పనులతో అలసిపోతున్న బోధన సిబ్బందికి మానసిక ప్రశాంతత కోసం క్రీడలు, సాహిత్యం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్రంలోని నాలుగు జోన్ల నుంచి 110 వ్యవసాయ కేంద్రాల్లో పనిచేస్తున్న సిబ్బంది పాల్గొన్నారు. క్రీడల పురుషుల విభాగంలో ఉత్తర తెలంగాణ జోన్, మహిళల విభాగంలో రాజేంద్రనగర్ జోన్ క్రీడాకారిణీలు ప్రథమ స్థానంలో నిలిచారు. సాంస్కృతిక, సాహిత్య విభాగంలో రాజేంద్రనగర్ జోన్ క్రీడాకారులు ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారు. గెలుపొందిన వారికి వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.వెంకటరమణ, పాలకమండలి సభ్యులు, రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సి.నరేందర్‌రెడ్డి బహుమతులు అందజేశారు.

బెంగాలీ నామశూద్రులకు ఎస్సీ హోదా ఇవ్వండి: ఆర్ఎస్పీ

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): బెంగాలీ నుంచి వలస వచ్చి రాష్ట్రంలో స్థిరపడిన నామశూద్రులను ఎస్సీ జాబితాలో చేర్చి రిజర్వేషన్ వర్తించేలా చర్యలు తీసుకోవాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్(ఆర్ఎస్పీ) అన్నారు. బుధవారం పలువురు బెంగాలీ నామశూద్రులతో కలిసి నగరంలోని జాతీయ ఎస్సీ కమిషన్ ప్రాంతీయ కార్యాలయానికి వెళ్లి డైరెక్టర్‌ను కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1971లో బంగ్లాదేశ్ నుంచి వేలాది మంది శరనార్థులుగా వచ్చి కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ నియోజకవర్గంలో స్థిరపడ్డారని తెలిపారు. దేశంలోని చాలా రాష్ట్రాల్లో నామశూద్రులను ఎస్సీలుగా గుర్తించి రిజర్వేషన్లు అమలు చేస్తున్నారని, తెలంగాణ ప్రభుత్వం కూడా వారిని ఎస్సీ జాబితాలో చేర్చాలని కోరారు.

'ఒక్క రూపాయి దుర్వినియోగమైనా ఏ శిక్షకైనా సిద్ధమే..'

బర్కత్‌పుర, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ట్రస్ట్‌బోర్డులో ఒక్క రూపాయి దుర్వినియోగమైనా ఏ శిక్షకైనా తాము సిద్ధమేనని, ఆరోపణలు రుజువు చేయకపోతే ట్రస్ట్‌బోర్డులో అడుగు పెట్టనీయమని మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ ప్రొఫెసర్ మ్యాడం వెంకట్రావ్ హెచ్చరించారు. ఇటీవల ట్రస్టీలు ఆకుల పాండురంగారావు, మందా సూర్యప్రకాష్, నిమ్మ శంకర్‌లు ప్రెస్‌మీట్‌లో ట్రస్ట్‌బోర్డుపై లేనిపోని ఆరోపణలు చేశారన్నారు. ఆరోపణలు బేషరతుగా ఉపసంహరించుకుని బహిరంగ క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. బుధవారం కాచిగూడ ట్రస్ట్‌బోర్డు కార్యాలయంలో ట్రస్టీలు తెలంగాణ మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు పిల్లి శ్రీనివాస్, యలగందుల దేవేందర్, ఆకుల నగేష్, అమరం చంద్రశేఖర్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. ట్రస్ట్ బోర్డును కబ్జా చేసి తమ ఆధీనంలోకి తీసుకోవడానికే ముగ్గురు ట్రస్టీలు కుట్రలు చేస్తూ లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. వారు చేసిన ఆరోపణలో ఏ ఒక్కటీ వాస్తవం లేదన్నారు. ట్రస్టీల అభిప్రాయాలకు అనుగుణంగానే యాక్సిక్ బ్యాంకులో ట్రస్ట్ బోర్డు కొత్త అకౌంట్ ప్రారంభించామని, అవార్డులు, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వడం ఆలస్యం కాకుండా ఉండడానికి ఈ కొత్త అకౌంట్ అని స్పష్టం చేశారు. ట్రస్టీలో అయిదుగురే ఉండాలనే నిబంధన ఏమి లేదన్నారు. ట్రస్ట్ బోర్డుపై ఆరోపణలు చేసిన ముగ్గురు ట్రస్టీలపై పరువునష్టం దావా వేస్తామని స్పష్టం చేశారు.

వాకథాన్



ఆర్థిక అక్షరాస్యత వారంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ ఆధ్వర్యంలో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 2కే వాకథాన్ నిర్వహించారు. యూనివర్సిటీకి చెందిన విద్యార్థులు, ఆర్‌బీఐ, ఇతర బ్యాంక్‌లకు దాదాపు 400 మంది అధికారులు ఎస్‌బీఐ రీజనల్ డైరెక్టర్ కె.నిఖిలా, సీజీఎం రాజేశ్ కుమార్, కె.భాస్కర్ రావు, ఎస్‌బీఐ జనరల్ మేనేజర్ దేబాశీష్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.
హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి)

వ్యక్తి దారుణ హత్య

జీడిమెట్ల, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): హెచ్ఎంటీకాలనీలోని నిర్మానుష్య ప్రాంతంలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసులు, మృతుని బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రం, ఔరంగాబాద్, తానా, అజాద్ బింగా గ్రామానికి చెందిన రమేష్‌రామ్(45) కుటుంబసభ్యులతో కలిసి నగరానికి వచ్చి జీడిమెట్ల రామిరెడ్డినగర్‌లో నివాసముంటున్నాడు. స్థానికంగా ఉన్న వినాయక కెమికల్స్‌లో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. రమేష్‌రామ్ మంగళవారం రాత్రి 9 గంటల సమయంలో స్నేహితులతో కలిసి పైప్ లైన్ రోడ్డులోని ఓవైన్‌షాప్ వద్ద మద్యం తాగారు. రాత్రి ఇంటికి వెళ్లలేదు. బుధవారం తెల్లవారుజామున హెచ్ఎంటీ కాలనీలోని నిర్మానుష్య ప్రాంతంలో హత్యకు గురై కనిపించాడు. రమేష్‌రామ్‌ను వాకింగ్ చేస్తున్న వ్యక్తులు గుర్తించి జీడిమెట్ల పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా మృతుడి ఒంటిపై దుస్తులు ఊడదీసి ఉన్నాయి. బీరుబాటిళ్లతో తలపై కొట్టిన ఆనవాళ్లున్నాయి. మృతుడి వద్ద లభించిన ఆధార్‌కార్డు ఆధారంగా వివరాలు సేకరించారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు ప్రారంభించారు. రామిరెడ్డినగర్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. దారుణానికి పాల్పడింది హిజ్రాలు అయి ఉంటారేమోనన్న కోణంలోనూ పోలీసులు విచారిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

నకిలీ అల్లం వెల్లుల్లి పేస్ట్ విక్రయిస్తున్న ముఠా అరెస్ట్

● రూ. 5 లక్షల విలువైన సొత్తు స్వాధీనం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): నకిలీ అల్లం వెల్లుల్లి పేస్టు తయారు చేసి, మార్కెట్లో విక్రయిస్తున్న ముఠాను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. అతని నుంచి హానికారకమైన 700 కేజీల అల్లం వెల్లుల్లి పేస్టు, 625 కేజీల వెల్లుల్లి, 100 కేజీల నాసిరకం అల్లం, 150 కేజీల క్రిస్టల్ సాల్ట్, 20 కేజీల కుళ్లిపోయిన అల్లం వెల్లుల్లి, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ. 5 లక్షలు ఉంటుదని పోలీసులు తెలిపారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ తెలిపిన వివరాల ప్రకారం.. గుజరాత్‌కు చెందిన రహీం చరణీయ కొన్నేళ్ల క్రితం బతుకుదెరువుకోసం హైదరాబాద్‌కు వచ్చాడు. బేగంపేటలో స్థిరపడ్డాడు. రాజేంద్రనగర్ ఉప్పర్‌పల్లిలో డెక్కన్ ట్రేడర్స్ పేరుతో అల్లం వెల్లుల్లి తయారు చేసే కంపెనీ స్థాపించాడు. నకిలీ అల్లం, వెల్లుల్లితో పలు రకాల రసాయనాలను కలిపి నాసిరకం పేస్టు తయారు చేస్తున్నాడు. దాన్ని పాండురంగారావు, అజయ్‌కుమార్, ప్రదీప్ సహకారంతో మార్కెట్లో విక్రయిస్తూ అక్రమ పద్ధతిలో సొమ్ము చేసుకుంటున్నారు. సమాచారం అందుకున్న సెంట్రల్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం బేగం బజార్‌లోని రెండు దుకాణాలపై దాడిచేసి నలుగురిని అరెస్ట్ చేశారు.


బియ్యం గోదాముల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల తనిఖీలు

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): బియ్యం గోదాముల్లో సివిల్ సప్లై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు చేశారు. ఆ గోదాముల్లో పెద్ద ఎత్తున బియ్యం నిల్వలు ఉన్నట్టు గుర్తించారు. బుధవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి రఘునందన్ తన సిబ్బందితో కలిసి మైలార్‌దేవుపల్లి డివిజన్ టాటానగర్‌లో ఉన్న గోదాములో దాడి చేశారు. గోదాం నిర్వాహకుడు వీరేందర్ వివిధ రకాల బ్రాండ్ల బియ్యాన్ని గోదాంలో నిల్వ చేసినట్టు గుర్తించారు. కాగా, పంజాబ్ ఇతర రాష్ట్రాలకు నుంచి బియ్యం తీసుకొచ్చినాని, అందుకు సంబంధించిన రసీదులను వీరేందర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు చూపించాడు. బియ్యం నిల్వలపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి, అవి పీడీఎస్ బియ్యం అని తేలితే నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

కుత్బుల్లాపూర్‌లో అగ్ని ప్రమాదం

● మంగళవారం అర్ధరాత్రి ఘటన

● కాలి బూడిదైన దుకాణాలు


కాలి బూడిదైన దుకాణాలు

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు మంటలు అంటుకొని పలు దుకాణాలు దగ్ధమైన సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. సుచిత్ర- కుత్బుల్లాపూర్ రహదారిలో ఉన్న స్టేట్ బ్యాంకు ఎదురుగా రోడ్డు పక్కన కొందరు వీధి వ్యాపారులు వివిధ రకాల దుకాణాలు నిర్వహిస్తున్నారు. మంగళవారం అర్ధరాత్రి సుమారు 11.15 గంటల సమయంలో దుకాణాల నుంచి మంటలు వస్తున్నట్లు గమనించిన స్థానికులు జీడిమెట్ల ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలికి ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రమాదం జరిగిన ప్రాంతంలో ప్రధానంగా పండ్లు, మాంసం, స్క్రాపు దుకాణాలు, జూస్ పాయింట్‌తోపాటు పలు రకాల దుకాణాలను నిర్వహిస్తున్నారు. పండ్ల దుకాణంలో ఉన్న 4 రిఫ్రిజిరేటర్లతో పాటు పండ్లు, తోపుడు బండ్లు ఇతరత్ర సామగ్రి కాలి బూడిదయ్యాయి. మంటలు సుమారు మూడు అంతస్తుల ఎత్తుకు ఎగసి పడడంతో ఆ వేడికి పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్ కిటికీల అద్దాలు పగిలిపోయాయి. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. సుమారు రూ.5 లక్షల నుంచి రూ 10లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేశారు. షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగిందా లేక గ్యాస్ సిలిండర్ పేలడం వల్ల జరిగిందా అనే కోణంలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దుకాణం మూసి ఇంటికి వెళ్లేలోపు..



మంగళవారం రాత్రి సుమారు 11 గంట ల సమయంలో పండ్ల దుకాణం మూసివేసి ఇంటికి బయలుదేరాము. మేము ఇంటికి చేరుకునేలోపే దుకాణంలో మంటలు చెలరేగాయని ఫోన్‌చేసి చెప్పారు. తిరిగి వచ్చి చూసేసరికి అప్పటికే మంటలు ఎగిసిపడుతున్నాయి. శివరాత్రి పండుగ దృష్ట్యా మంగళవారం ఉదయమే సుమారు రూ.4లక్షల విలువ గల పండ్లను తెచ్చి పెట్టాం. మొత్తం సుమారు రూ. 12 లక్షల విలువ గల ఆస్తి నష్టం జరిగింది.

\- సురేందర్ మహర్యు, వ్యాపారి

జర్నలిస్టుల స్వేచ్ఛను దెబ్బతీసే యత్నం

- అందుకే తప్పుడు ఆరోపణలు, దాడులు
- ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్

యూసుఫ్‌గూడ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): స్వేచ్ఛగా అభిప్రాయాలు ప్రకటించే వెసులుబాటు ఉన్న ఏకైక వృత్తి జర్నలిజం అని, గత పది సంవత్సరాలలో ఆ స్థానాన్ని పోగొట్టుకుందని ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్ అన్నారు. ఫిబ్రవరి 8న వీక్షణం సంపాదకుడు ఎన్.వేణుగోపాల్ ఇంటిపై ఎన్ఐఏ దాడి చేసి ఆయన సెల్‌ఫోన్ తీసుకుపోయిన నేపథ్యంలో 'జర్నలిస్టులపై ఎన్ఐఏ దాడులను ఖండించండి' అంటూ వీక్షణం కలెక్టివ్ ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఏ.నరసింహారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఒకప్పుడు జర్నలిస్టులకు స్వేచ్ఛ ఉందని, అప్పట్లో దాడులు జరిగినా అవి వేరే పద్ధతిలో ఉన్నాయని, గత పదేళ్లుగా జర్నలిస్టుల స్వేచ్ఛను, విశ్వసనీయతను దెబ్బతీసే విధంగా పాలకులు వ్యవహరిస్తున్నారన్నారు. వీక్షణం సంపాదకుడు వేణుగోపాల్‌పై ఎన్ఐఏ దాడులను ఖండిస్తున్నామన్నారు. ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడే వారిపై దాడులు చేస్తున్నారని, జర్నలిస్టులు ఉద్యమించి ఎదుర్కోవాలన్నారు. తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. సీనియర్ సంపాదకులు కె.రామచంద్రమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర పరిధిలో ఉన్న శాంతిభద్రతలలోకి కేంద్ర ప్రభుత్వం చొరబడడం అనుచితమని, రాష్ట్ర ప్రభుత్వం నిజంగా సమాఖ్య స్ఫూర్తిని గౌరవిస్తే ఈ జోక్యాన్ని అడ్డుకునే చర్యలు చేపట్టాలన్నారు. పౌరహక్కుల నాయకులు జి.హరిగోపాల్ మాట్లాడుతూ దేశంలోని అన్ని ప్రజాసంస్థలను, వ్యవస్థలను ధ్వంసం చేసిన పాలకులు జర్నలిస్టుల భావ ప్రకటనా స్వేచ్ఛ మీద దాడి చేస్తున్నారన్నారు. వీక్షణం సంపాదకుడితో పాటు గత ప్రభుత్వం అనేక మందిపై పెట్టిన తప్పుడు కేసులు ఎత్తివేయాలని, ఉపా వంటి అక్రమ చట్టాలను ఉపయోగించొద్దని అన్నారు. సీనియర్ జర్నలిస్ట్ కల్లూరి భాస్కరం, తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ అధ్యక్షుడు విరాహత్ అలీ, ఎం.రహమాన్, తెలంగాణ మీడియా అకాడమీ పూర్వ చైర్మన్ అల్లం నారాయణ, మారుతిసాగర్ మాట్లాడారు.


రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్, అల్లం నారాయణ తదితరులు

ఆలోచనలు పంచుకున్నారు.. స్ఫూర్తి నింపారు

టెడెక్స్ వేదికపై అబ్బురపరిచిన శ్రీ చైతన్య ఫ్యూచర్ పాత్ వేస్ విద్యార్థులు

హైదరాబాద్‌సిటీ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కాలుష్య భూతం మరీ ముఖ్యంగా ప్లాస్టిక్ రాకాసిని అంతం చేయడానికి పరిష్కారాలను చూపడమే కాదు, కృత్రిమ మేధ, స్మార్ట్ సిటీస్ కాలంలో సాంకేతికతతో ఎలాంటి ఆవిష్కరణలను చేయవచ్చో వెల్లడించి అబ్బురపరిచారు శ్రీ చైతన్య ఫ్యూచర్ పాత్‌వేస్ మియాపూర్ క్యాంపస్ విద్యార్థులు. మొట్టమొదటిసారిగా టెడెక్స్ టాక్స్‌ను స్కూల్ ప్రాంగణంలో బుధవారం నిర్వహించారు. ఆరు నుంచి ఎనిమిదో తరగతికి చెందిన 12 మంది విద్యార్థులు సూటిగా, విస్పష్టంగా తమ అభిప్రాయాలను, ఆలోచనలను, ఆవిష్కరణలను వెల్లడించారు. ఈ సందర్భంగా విద్యార్థిని సాయి సుచిత్రరెడ్డి మాట్లాడుతూ స్టడీ కెప్టెన్ అంటూ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌ను విద్యారంగంలో ఏ విధంగా ఉపయోగించుకోవచ్చో చెప్పారు. తాను తీసుకురాబోయే యాప్‌తో విద్యార్థులు సోషల్‌మీడియాలో ఎంతసేపు గడుపుతున్నారు లాంటి అంశాలను కూడా తెలిపే అవకాశం ఉంటుందన్నారు. ప్లానింగ్ చేయడం, మోటివేషన్ ఇవ్వడం, ప్రతి విద్యార్థి బలాబలాలను విశ్లేషించడం కూడా ఇది చేస్తుందని చెప్పారు. రాహినీ సిరియాల మాట్లాడుతూ జర్మనీలో దాదాపు 65% రీసైక్లింగ్ చేయగలుగుతుంటే, మన దగ్గర 25%కు పరిమితం కావడంపై ఆందోళన వ్యక్తం చేయడంతోపాటూ పలు పరిష్కారాలనూ చూపారు. ఢిల్లీ సహా పలు నగరాలలో పెరుగుతున్న వాహన కాలుష్యానికి కార్ మాస్క్‌లు వాడాల్సిందేనని ధరణి పేర్కొన్నారు. సముద్రాలలో ప్లాస్టిక్ సహా ప్లాస్టిక్ రక్కసిని తుదముట్టించడానికి సహస్ర సూచనలు చేశారు. ఇక ట్రాష్ టు ట్రెజర్ అంటూ చెత్తనే సంపదగా మార్చుకోవచ్చని ఆదిత్య కార్తికేయ ఆసక్తికర అంశాలనూ వెల్లడించాడు. స్మార్ట్ సిటీస్ ఆలోచనలను శ్రీకర్ పంచుకుంటే, స్మార్ట్‌ఫార్మర్స్ ఆవశ్యకతను అద్రిజ తెలిపారు.

ఈ సందర్భంగా క్యాంపస్ ప్రిన్సిపాల్ భావన పాఠక్ మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో తమ విద్యార్థులను సన్నద్ధం చేసేలా శ్రీ చైతన్య విద్యా ప్రణాళిక ఉంటుందని తెలిపారు. చీఫ్ అకాడమిక్ ఆఫీసర్ పుష్పవల్లి మాట్లాడుతూ క్వాలిటీ ఎడ్యుకేషన్ సామాన్యులకు అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో అకడమిక్ డైరెక్టర్ సీమ బొప్పన ఈ ఫ్యూచర్ పాత్‌వేస్‌ను తీసుకువచ్చారన్నారు. ఈ టెడెక్స్ టాక్స్ కోసం ఆరో తరగతి నుంచి 8వ తరగతి విద్యార్థులలో 500 మంది నుంచి ఈ 12 మంది విద్యార్థులను ఎంపిక చేశామన్నారు.


టెడెక్స్ టాక్స్‌లో ప్రిన్సిపాల్ భావన, చీఫ్ అకాడమిక్ ఆఫీసర్ పుష్పవల్లి, విద్యార్థులు

గమ్మత్తు చిత్రం..!

(5వ పేజీ తరువాయి)

ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఫోన్ నంబర్‌తో సంబంధం లేకుండా, ఎక్కడా ఐడెంటిటీని గుర్తించకుండా రామ్స్, టైగర్, లయన్ వంటి మారుపేర్లతో స్నాప్‌చాట్‌లో డ్రగ్స్ ఆర్డర్ చేయడం, పార్టీలకు ఆహ్వానించడం చేసినట్లు తేలింది. ఈ క్రమంలో దర్యాప్తు చేసిన పోలీసులు టాలీవుడ్ యువనటుడు సహా 38 మందిని గుర్తించారు. వారిలో స్మగ్లర్ బాలాజీ, మురళి, ముగ్గురు నైజీరియన్స్, వ్యాపారులు కొల్లి రామ్‌చంద్, ప్రణీత్, సినీ దర్శకుడు సుశాంత్ రెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ సందీప్ కూరపాటి, మాజీ ఎంపీ సురేష్ ఉన్నట్లు గుర్తించారు. పరిశ్రమకు చెందిన నిర్మాతలు, దర్శకులు, నటులు వరుసగా పట్టుబడటం, రూ. లక్షల విలువైన డ్రగ్స్ దొరకడం టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారింది.

ఆటకట్టిస్తున్నా ఆగని దందా

పోలీసులు దాడులు చేస్తున్నా.. ఎంతమంది స్మగ్లర్స్‌ను పట్టుకొని కటకటాల్లోకి నెడుతున్నా మాదక ద్రవ్యాల స్మగ్లింగ్‌ను కట్టడి చేయలేకపోతున్నారు. గంజాయి, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాలు నగరంలో రోజూ ఏదో ఒకచోట పట్టుబడుతూనే ఉన్నాయి. తెలంగాణ నార్కోటిక్ బ్యూరో (టీ న్యాబ్) డ్రగ్స్ సరఫరాపై ఉక్కుపాదం మోపుతోంది. డ్రగ్స్ స్మగ్లర్స్ చిక్కిన వెంటనే వారి వద్ద కస్టమర్స్ డేటా తీసుకుంటున్నారు. వారికి డ్రగ్స్ ఎక్కడి నుంచి వస్తున్నాయి..? వారి వెనుక ప్రధాన సూత్రధారులు ఎవరు..? ఇలా అన్ని కోణాల్లో వివరాలు సేకరిస్తున్నారు. ఇంత జరుగుతున్నా కొందరు కేటుగాళ్లు అక్రమమార్గంలో డ్రగ్స్‌ను వినియోగిస్తూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు.

గతేడాది పట్టుబడ్డ మాదక ద్రవ్యాలు

2023లో సిటీ కమిషనరేట్ పరిధిలో హెచ్ న్యూ, నార్కోటిక్ బ్యూరో పోలీసులు 83 కేసులు నమోదు చేసి, 139 మంది స్మగ్లర్స్ 50 మంది సరఫరాదారులు, 54 మంది వినియోగదారులను పట్టుకున్నారు. వారి వద్ద 1761.5 కిలోల గంజాయి, 3.1 లీటర్ల హాష్ ఆయిల్, 121.8 గ్రాముల కొకైన్, 337 ఎస్కటసీ పిల్స్, 1770 గ్రాముల మెథామెటమైన్, 1,52,400 ఆల్ప్రోజోలం ట్యాబ్లెట్స్, 1500 నైట్రావెట్ ట్యాబ్లెట్స్ 110 బంగ్ చాక్లెట్స్, రూ. 4 లక్షల విలువైన ఫెంటానెల్ సిట్రేట్ ఇంజక్షన్స్, 629 గ్రాముల ఎండీఎంఏ, 1050 గ్రాముల చరాస్ స్వాధీనం చేసుకున్నారు.

ఢిల్లీలో కార్లు చోరీ.. హైదరాబాద్‌లో విక్రయం

- 12 కార్లు స్వాధీనం
- ఏడుగురి అరెస్టు.. పరారీలో ముగ్గురు


స్వాధీనం చేసుకున్న కార్లతో సీసీఎస్, స్పెషల్ జోన్ క్రైమ్ పోలీస్ టీమ్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో దొంగిలించిన కార్లను తక్కువ ధరకు కొనుగోలు చేసి.. హైదరాబాద్‌లో ఎక్కువ ధరకు అమ్ముతున్న దొంగల ముఠా ఆటకట్టించారు సీసీఎస్, సెంట్రల్ క్రైమ్ టీమ్ పోలీసులు. ఏడుగురు నిందితులను అరెస్టు చేసి కటకటాల్లోకి నెట్టారు. వారి వద్ద నుంచి రూ. 3.5కోట్ల విలువైన 12 కారన్లు స్వాధీనం చేసుకున్నారు. సీసీఎస్ డీసీపీ శ్వేత తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం ఉదయం బహదూర్‌పురా ఎక్స్‌రోడ్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు నంబర్ ప్లేట్‌లేని ఐ-20 కారును ఆపేందుకు ప్రయత్నించారు. కానీ, ఓ డ్రైవర్ కారును వేగంగా పోనిచ్చాడు. పోలీసులు వెంటాడి కారును, డ్రైవర్ లవకుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతన్ని విచారించిన క్రమంలో ఢిల్లీలో చోరీ చేసిన కార్లను హైదరాబాద్‌లో విక్రయిస్తున్న ముఠా బాగోతం వెలుగులోకి వచ్చింది. లవకుమార్‌తో పాటు ముఠాలో ప్రధాన నిందితుడు కార్తీక్, షేక్ అబ్దుల్లా, మహ్మద్ ఫిరోజ్, షేక్ షాహిద్ అలీ, గంధీ శివకుమార్, మహ్మద్ తౌసిఫ్ ఒక ముఠాగా ఏర్పడ్డారు. చోరీ చేసిన కార్లు తక్కువ ధరకు కొనుగోలు చేసి, బయట మార్కెట్లో ఎక్కువ ధరకు విక్రయించి సొమ్ము చేసుకోవాలని పథకం వేశారు. అదే క్రమంలో ఓఎల్ఎక్స్‌లో వారికి మదనపల్లెకు చెందిన సోను, ఆసిఫ్ ఆలీఖాన్, బెంగళూరుకు చెందిన సయ్యాద్ పరిచయమయ్యారు. ఆ ముగ్గురు ఢిల్లీతోపాటు.. పరిసర ప్రాంతాల్లో ఖరీదైన కార్లు చోరీ చేసేవారు. వాటిని తక్కువ ధరకు హైదరాబాద్‌కు చెందిన కార్తీక్ ముఠాకు అమ్మేసేవారు. కార్తీక్ ముఠా వాటిని హైదరాబాద్‌లో ఎక్కువ ధరకు విక్రయించేవారని పోలీసుల విచారణలో తేలింది. కార్తీక్ ముఠాను పోలీసులు అరెస్టు చేసి జైలుకు తరలించారు. కాగా.. మదనపల్లె, బెంగళూరుకు చెందిన ముగ్గురు దొంగలు పరారీలో ఉన్నారు. త్వరలోనే వారిని పట్టుకుంటామని డీసీపీ తెలిపారు. స్వాధీనం చేసుకున్న వాహనాల్లో హుండాయ్ అల్కజార్-2, ఫార్చునర్-2, క్రెటా-3, టాటా హారియర్-1, ఐ-20-2, క్రిస్టా-1, బలెనో-1 ఉన్నాయి.

డబ్బు కోసం వేధించిన కొడుకును చంపిన తండ్రి

హయత్‌నగర్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో డబ్బు కోసం వేధించిన కొడుకును తండ్రి హత్య చేసిన ఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలోని మల్కాపురం గ్రామానికి చెందిన కలగోని శ్రీనివాస్‌గౌడ్ కొంతకాలంగా మునగనూర్ రామానుజనగర్ కాలనీలో రెండో భార్య ఆమె కూతురు(21)తో కలిసి ఉంటున్నాడు. మొదటి భార్య చాలా కాలం క్రితం చనిపోయింది. వనస్థలిపురం శారదానగర్‌లో అద్దె ఇంట్లో మొదటి భార్య కుమారుడు వినయ్‌కుమార్‌గౌడ్, భార్య, కూతురు(3)తో కలిసి ఉంటున్నాడు. మద్యానికి బానిసైన వినయ్‌కుమార్‌గౌడ్ నాలుగు నెలలుగా పని మానేసి రోజూ మద్యం తాగి డబ్బులు ఇవ్వాలని తండ్రిని వేధించేవాడు. ఇరుగుపొరుగు వారితో గొడవ పడడంతో వారు హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం అర్ధరాత్రి 12.30 గంటలకు పూటుగా మద్యం తాగి చేతిలో బీరు పట్టుకుని తండ్రి వద్దకు వచ్చాడు. తనకు రూ.20 లక్షలు కావాలని అడిగాడు. ఫర్నిచర్ షాపు పెట్టుకుంటానని, ఇల్లు కట్టుకుంటానని చెప్పాడు. తండ్రిని కూడా బీరు తాగాలని డిమాండ్ చేశాడు. తాగకుంటే నిద్రపోయిన తర్వాత 'నిన్ను చంపేస్తా' అని బెదిరించాడు. ఉదయం మాట్లాడి డబ్బులు ఇస్తానని తండ్రి సర్దిచెప్పినా వినకుండా దాడికి యత్నించాడు. దీంతో కోపోద్రిక్తుడైన శ్రీనివాస్‌గౌడ్ పక్కనే ఉన్న పార తీసుకుని కొడుకు తలపై కొట్టాడు. పార తలలోకి దిగడంతో రక్తం మడుగులో పడి వినయ్‌కుమార్ గౌడ్ అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. హయత్‌నగర్ పోలీసులకు కుటుంబ సభ్యులు సమాచారం ఇవ్వడంతో పోలీసులు వచ్చి మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. శ్రీనివాస్‌గౌడ్‌ను అరెస్టు చేసి, దాడికి ఉపయోగించిన పారను స్వాధీనం చేసుకున్నారు. హయత్‌నగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


మృతుడు వినయ్‌కుమార్‌గౌడ్ (ఫైల్)

ఒకే రోజు తల్లీకొడుకు మృతి

- ఉరేసుకుని కొడుకు..
- అనుమానాస్పద స్థితిలో తల్లి

మల్కాజిగిరి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కోర్టు తీర్పు తనకు వ్యతిరేకంగా వస్తుందేమోనన్న అనుమానంతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి కూడా అదే బెడ్‌రూంలో అనుమానాస్పదంగా మృతిచెందింది. ఈ సంఘటన బుధవారం మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మౌలాలి ఈస్ట్ ప్రగతినగర్‌లో జరిగింది. ఈస్ట్ ప్రగతినగర్‌కు చెందిన మెరుగు శ్రీధర్‌గౌడ్(48) జవహర్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని బాలాజీనగర్‌లో వాటర్ ప్లాంటును నిర్వహిస్తున్నాడు. ఆయనకు భార్య శైలజ, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కాగా, భార్యాభర్తల మధ్య మనస్పర్థల కారణంగా ఇద్దరూ వేర్వేరుగా ఉంటున్నారు. శైలజ తన చిన్న కుమారుడు(10) తో కలిసి కాప్రాలోని తన తల్లిగారి ఇంటి వద్ద ఉంటున్నది. మరో కుమారుడు, కూతురు తండ్రి వద్ద ఉంటున్నారు. శైలజ కొంతకాలం క్రితం భర్త శ్రీధర్‌గౌడ్‌పై వరకట్న వేధింపుల కేసు పెట్టింది. దీంతో మనస్తాపానికి గురైన శ్రీధర్‌గౌడ్ విడాకులు కావాలంటూ మరో కేసు వేశాడు. శైలజ భర్తతోనే ఉంటానంటూ మరోకేసు వేసింది. ఈ కేసుకు సంబంధించి మార్చి 13న తీర్పు వెలువడనుంది. తనకు వ్యతిరేకంగా తీర్పు వస్తుందన్న అనుమానంతో శ్రీధర్‌గౌడ్ బుధవారం ఉదయం తన బెడ్‌రూంలోని సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుమారుడు సీలింగ్ ఫ్యాన్‌కు వేలాడుతుండగా ఆయన తల్లి విజయ(75) ఫ్లోర్‌పై కిందపడి గాయాలతో మరణించి ఉంది. దీంతో మౌలాలిలో విషాదచాయలు అలుముకున్నాయి. విజయ కుమారుని ఆత్మహత్యను అడ్డుకునేందుకు ప్రయత్నించి తోపులాటలో కిందపడి చనిపోయిందా, లేక శ్రీధర్ గౌడ్ తల్లిని హత్యచేసి తాను ఆత్మహత్య చేసుకున్నాడా లేక కుమారుని మరణాన్ని తట్టుకోలేక షాక్‌కు గురై మరణించిందా అన్న కోణాల్లో పోలీసులు కేసు దర్యాప్తుచేస్తున్నారు. మృతుడి భార్య శైలజ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐటీసీ కంపెనీ ఫ్రాంచైజీ పేరిట మోసం

- నకిలీ వెబ్‌సైట్‌తో దగా చేసిన బిహార్ గ్యాంగ్
- ముగ్గురిని అరెస్టు చేసినపోలీసులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ బహుళ జాతి కంపెనీ ఐటీసీ (ఇండియన్ టొబాకో కంపెనీ)కి సంబంధించి 'ఐటీసీ డిస్ట్రిబ్యూటర్ డాట్‌కామ్' అనే నకిలీ వెబ్‌సైట్ సృష్టించిన మోసగాళ్లు ఫ్రాంచైజీ నియామకం పేరిట అమాయకులను బురిడీ కొట్టించారు. రిజిస్ట్రేషన్ ఫీజు, ప్రాసెసింగ్ ఫీజు పేరిట వారు భారీగా వసూలు చేశారు. బిహార్, పాట్నాకు చెందిన సైబర్ క్రిమినల్స్ ముఠా దగాలో నగరంలోని కేపీహెచ్‌బీకి చెందిన బాధితుడు మోసపోయి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన సైబర్ క్రైం పోలీసులు బిహార్ సైబర్ గ్యాంగ్‌కు చెందిన ముగ్గురిని అదుపులోకి తీసుకుని నగరానికి తరలించారు. ఈ దందాలో ఉన్న మరో 10మంది కోసం గాలిస్తున్నారు.

కేపీహెచ్‌బీకి చెందిన ఓ బాధితుడు గూగుల్ ద్వారా ఐటీసీ కంపెనీ ప్రకటన చూసి.. అందులో చూపినట్లు 'ఐటీసీ డిస్ట్రిబ్యూటర్ డాట్‌కామ్' వెబ్‌సైట్‌లో 2023 నవంబర్‌లో వివరాలు నమోదు చేసి డీలర్‌షిప్ కావాలంటూ రిజిస్టర్ చేసుకున్నాడు. ఆతర్వాత వరుసగా ఒకరి తర్వాత ఒకరు ఐటీసీ కంపెనీ ప్రతినిధులమంటూ కాల్స్ చేసి.. బురిడీ కొట్టించారు. వారు చెప్పినట్లే మొత్తం రూ.75వేలు సమర్పించుకున్నాడు. ఆ తర్వాత వాళ్లు స్పందించకపోవడంతో మోసపోయానని గ్రహించి పోలీసులను ఆశ్రయించాడు. ఆధారాలతో నిందితులను గుర్తించి ప్రధాన నిందితుడైన ధీరజ్‌కుమార్, అతని అనుచరుడు అంకిత్‌కుమార్, గౌరవ్ కుమార్‌ను పోలీసులు అరెస్టు చేశారు. నిందితులను విచారించి.. బాధితులెంత మంది ఉన్నారో.. ఎలా ముంచారో పోలీసులు తేల్చనున్నారు.

ముందు జాగ్రత్తతోనే కేన్సర్ నివారణ

- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి


కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ముందు జాగ్రత్తతోనే కేన్సర్‌ను నివారించవచ్చని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం, ప్రపంచ కేన్సర్‌డేను పురస్కరించుకుని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, ఎంఎన్‌జే కేన్సర్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్‌లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేన్సర్‌కు నిర్దిష్టమైన మందు లేదని, అప్రమత్తంగా ఉండడమే ప్రధానమన్నారు. గర్భాశయ, రొమ్ము కేన్సర్‌పై మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నిర్మలా ప్రభావతి, ఎంఎన్‌జే కేన్సర్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ జయలత, గైనిక్ డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ లీల, డాక్టర్లు శాలిని, స్వప్న, పారామెడికల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేడు అందెశ్రీ అభినందన సభ

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర గీత రచయిత, లోకకవి అందెశ్రీ అభినందన సభ గురువారం ఉదయం 10.30గంటలకు నాంపల్లిలోని తెలుగు వర్సిటీ ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు వల్లభనేని అశ్వినీకుమార్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్ కె.శ్రీనివాస్, సభాధ్యక్షుడిగా పద్మశ్రీ పురస్కార గ్రహీత ఆచార్య కొలకలూరి ఇనాక్, ప్రముఖ కవి నగ్నముని తదితరులు పాల్గొననున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వంగపల్లి శ్రీనివాస్

మార్చి 1న మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవం : వంగపల్లి శ్రీనివాస్

రాంనగర్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మాదిగల హక్కులు ఆత్మగౌరవం కోసం అలుపెరుగని పోరాటం చేసి అసువులుబాసిన అమరవీరుల సంస్మరణ దినాన్ని మార్చి 1న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా, మండల కేంద్రాల్లో, గ్రామ స్థాయిలో ఘనంగా నిర్వహించాలని టీఎస్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. బుధవారం విద్యానగర్‌లోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 27 ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం చేసి అమరత్వం పొందిన మాదిగ అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి, వారి త్యాగాలను గుర్తు చేసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు చిలకమర్తి గణేష్, డాక్టర్ మల్లేష్, యాదగిరి, చాపకృష్ణ, రాజేష్‌ఖన్నా, కొల్లూరు వెంకట్, వెంకటన్న, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ విద్యాసాగర్

కమ్మ సామాజికవర్గానికి రెండు ఎంపీ సీట్లు కేటాయించాలి

పంజాగుట్ట, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో కమ్మ సామాజికవర్గానికి రెండు ఎంపీ సీట్లు కేటాయించాలని తెలంగాణ కమ్మ రాజకీయ ఐక్య వేదిక డిమాండ్ చేసింది. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వేదిక అధ్యక్షుడు డాక్టర్ గోపాలం విద్యాసాగర్, ఉపాధ్యక్షుడు అన్నె సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ఎం.భానుప్రసాద్, కోశాధికారి బి.శ్రీనివాసరావు మాట్లాడారు. తమ సామాజికవర్గం ఎక్కువగా ఉన్న ఖమ్మం, మల్కాజిగిరి పార్లమెంటు స్థానాలను కాంగ్రెస్ పార్టీ తమకు కేటాయించాలని కోరారు. ఖమ్మం స్థానం నుంచి టీపీసీసీ మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ జెట్టి కుసుమకుమార్‌కు టికెట్ ఇస్తే అత్యధిక మెజారిటీతో గెలిపించుకుని అధిష్ఠానానికి బహుమతిగా ఇస్తామన్నారు. సమావేశంలో వేదిక నాయకులు కె.శ్రీనివాసరావు, పాలేటి ఉపేంద్ర, సూర్యదేవర లత, నాగ సురేష్, పి.శౌరి రాజు, శ్రీనివాస్, రాజ్ కుమార్, ఎం.శ్రీనివాసరావు, సుమన్ కుమార్, సత్య కుమార్, మౌళి, తదితరులు పాల్గొన్నారు.

తెలుగు రాష్ట్రాల్లో బీజేపీని ఒక్క ఎంపీ సీటు గెలవనివ్వం : చెన్నయ్య


సమావేశంలో మాట్లాడుతున్న చెన్నయ్య

పంజాగుట్ట, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో బీజేపీ ఒక్క ఎంపీ సీటు కూడా గెలవకుండా చేస్తామని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య అన్నారు. బుధవారం బంజారా హిల్స్ రోడ్ నంబర్1 లోని మాల మహానాడు జాతీయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాల సామాజికవర్గాన్ని అవమానించేలా మాట్లాడుతున్నారని అన్నారు. రానున్న ఎన్నికల్లో సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో ప్రత్యేక కార్యాచరణతో పనిచేసి కిషన్‌రెడ్డికి తమ సత్తా ఏమిటో చూపెడుతామని ఆయన హెచ్చరించారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానాలను మాల సామాజికవర్గానికి కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో మాల ప్రజాసంఘాల జేఏసీ వర్కింగ్ చైర్మన్ లీజ్ బూరుగుల వెంకటేశ్వర్లు, గోపోజు రమేష్, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు మన్నె శ్రీధర్ రావు, నాయకులు జి.కళ్యాణ్,శంకర్, జి.రమేష్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎప్‌సెట్‌కు 15వేలకు పైగా దరఖాస్తులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఎప్‌సెట్)- 2024కు మూడు రోజుల్లో మొత్తం 15,355 మంది అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ఇంజనీరింగ్ పరీక్షకు 9,714 దరఖాస్తులు రాగా, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ పరీక్ష కోసం 5,631 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. కాగా, రెండు పరీక్షలు రాయాలనుకున్న మరో 10మంది అభ్యర్థులు కూడా దరఖాస్తులు సమర్పించారు.

పలువురు ఏసీఎల్‌ల బదిలీ

చిక్కడపల్లి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): రాబోయే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో గత మూడు సంవత్సరాలుగా ఒకే ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న పలువురు అసిస్టెంట్‌లేబర్ కమిషనర్(ఏసీఎల్)లను బదిలీ చేస్తూ రాష్ట్ర కార్మికశాఖ సంచాలకులు కృష్ణ ఆదిత్య ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 13మంది ఏసీఎల్‌లను బదిలీ చేయగా జలమండలి వెల్ఫేర్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఉద్యోగిని హైదరాబాద్ ఏసీఎల్-2గా నియమించారు.



పోశ్చర్ టిప్స్

ఎదుటి వారు మనతో ప్రవర్తించే విధానం మన బాడీ లాంగ్వేజ్ మీద ఆధారపడి ఉంటుంది. నిలబడే తీరు, ముఖంలో ఒలికే కవళికలు మనల్ని ఆకర్షణీయంగా కనిపించేలా చేస్తాయి. అలాంటి కొన్ని ట్రిక్స్ మీకోసం!

బాడీ లాంగ్వేజ్ ట్రిక్స్..!

పోశ్చర్

నడిచేటప్పుడు భుజాలు వెనక్కి, చుబుకం పైకి ఉండాలి. నిటారుగా ఉండాలి. శరీరం గురించిన కాన్షియస్ కలిగి ఉండాలి.

ముఖకవళికలు

ముఖం మీద చిరునవ్వు ఎప్పుడూ మెరుస్తూ ఉండాలి. ఇతరులు మీతో మాట్లాడడానికి ఆసక్తి చూపుతారు. చిరునవ్వు మీ గురించి ఎదుటివాళ్లలో సద్భావన కలుగుతుంది.

స్వరం

అనవసరంగా గొంతు పెంచి మాట్లాడకూడదు. సందర్భాన్నిబట్టి స్వరం మారుస్తూ ఉండాలి. మార్దవం, గంభీరం, సున్నితత్వం స్వరంలో సందర్భానుసారంగా తొణికిసలాడాలి.

చేతుల కదలికలు

అవసరాన్నిబట్టి భావ వ్యక్తీకరణకు తోడ్పడేలా చేతులు కదిలించాలి. మీరు వ్యక్తం చేయదలచుకున్న విషయాన్ని చేతుల కదలికలు స్పష్టం చేసేలా ఉండాలి.

కళ్లు

పరిచయం చేసుకునేటప్పుడు సూటిగా కళ్లలోకి చూడాలి. ఎదుటి వ్యక్తి మాట్లాడేటప్పుడూ కళ్లలోకి చూస్తూ వినాలి.

నడక

ఎంత హడాహుడిలో ఉన్నా ఆ తొందర నడకలో ప్రతిబింబించకూడదు. నడకలో ఆత్మవిశ్వాసం తొణికిసలాడాలి.

కూల్

క్రమశిక్షణతో మెలగాలి. ఎంత చిరాకు వచ్చినా స్థిరత్వం కోల్పోకూడదు.

స్ఫూర్తి



నలుగురిలో నారాయణలా బతకడంలో ఆనందం ఏముంటుంది? సవాళ్లతో కూడుకున్న భిన్నమైన వృత్తిలోనే అసలైన మజా అంటుంది. కాబట్టే పురుషులకే పరిమితమైన వృత్తిలో ఫోర్క్‌లిఫ్ట్ ఆపరేటర్‌గా రాణిస్తున్నాను అంటోంది శ్రీరామోజు రాధిక. తెలంగాణలోని జీఎమ్మార్ హైదరాబాద్ ఎయిర్ కార్గో తొలి మహిళా ఫోర్క్ లిఫ్ట్ ఆపరేటర్‌గా గుర్తింపు సాధించిన రాధిక 'నవ్య'తో పంచుకున్న కబుర్లివి.

ఫోర్క్‌లిఫ్ట్ ఆపరేటర్

మావారి ద్వారా జీఎమ్మార్ వరలక్ష్మీ ఫౌండేషన్ గురించి తెలుసుకుని, దాన్లో కుట్టుపని నేర్చుకుందామని నిర్ణయించుకున్నాను. నిజానికి నాకు వాహనాలు నడపడమంటే ఇష్టం. కానీ వాటిని నేర్చుకునే అవకాశం, అవసరం అప్పటి వరకూ రాలేదు. దాంతో ముందు నుంచీ తెలిసిన కుట్టుపనినే ఉపాధిగా మలుచుకుందామనే ఆలోచనతో ఫౌండేషన్‌కి వెళ్లాను. కానీ ఫౌండేషన్ కౌన్సెలర్, జ్ఞానేశ్వర్... 'కుట్టుపనినే ఎందుకు ఎంచుకుంటున్నావు, ఎక్స్‌కవేటర్ శిక్షణ కూడా మహిళలకు అందుబాటులో ఉంది, ఇప్పటివరకూ ఎవరూ ఈ శిక్షణ తీసుకోలేదు' అని అనడంతో నాకు ప్రాణాలు లేచొచ్చాయి. వాహనాలు నడపడం ఇష్టం కాబట్టి మరో ఆలోచన లేకుండా వెంటనే ఒప్పేసుకున్నాను. అలా ఆయన ప్రోత్సాహంతో 2023 నవంబరులో ఎక్స్‌కవేటర్ నడపడంలో శిక్షణ తీసుకుని, మూడు నెలల పాటు ఆ పనిలో కొనసాగాను. అలా వాహనాలు నడపాలనే కోరిక తీరడంతో పాటు, పురుషులకే పరిమితమైన ఎక్స్‌కవేటర్‌ను సైతం నడపగలిగే ధైర్యాన్ని కూడా పొందగలిగాను. ఆ ఆత్మవిశ్వాసంతో నేను ఏ పనినైనా చేయగలుగుతాననే నమ్మకం కూడా నాలో పెరిగింది. సరిగ్గా అదే సమయంలో ఫోర్క్‌లిఫ్ట్ ఆపరేటర్ నడపడంలో కూడా మహిళలకు శిక్షణ ఇవ్వబోతున్నట్టు తెలిసింది. దాంతో మరో ఆలోచన లేకుండా ఆ శిక్షణ తీసుకోవాలని నిర్ణయించుకున్నాను.

మహిళలకూ సాధ్యమే!

ఫోర్క్ లిఫ్ట్ ఆపరేటర్ శిక్షణకు ముందు సిమ్యులేటర్ ట్రైనింగ్ కోసం బెంగుళూరు వెళ్లాను. అక్కడ వారం రోజుల పాటు శిక్షణ పొందిన తర్వాత, జీఎమ్మార్‌లో మరో 10 రోజుల పాటు ఫోర్క్‌లిఫ్ట్ వాహనం నడపడంలో ప్రత్యక్ష శిక్షణ తీసుకున్నాను. వాహనంలో వెనక్కీ ముందుకూ కదిలే గేర్లతో పాటు, సరుకును పైకీ, కిందకూ ఎత్తి దింపడానికి సంబంధించిన లీవర్లు ఉంటాయి. వీటన్నిటి మీదా పట్టు పెంచుకున్నాను. అలా ఫిబ్రవరి 1న తొలి మహిళా ఫోర్క్ లిఫ్ట్ ఆపరేటర్‌గా నా వృత్తిని మొదలుపెట్టాను. రకరకాల సరుకు విమానాశ్రయానికి వస్తూ, పోతూ ఉంటుంది. ఆ సరుకంతా విమానాశ్రయంలోని కార్గోకు ట్రక్కుల్లో చేరుకుంటూ ఉంటుంది. ఫోర్క్‌లిఫ్ట్ సహాయంతో ఆ ట్రక్కుల్లోని సరుకును దింపి, కార్గో లోపలికి తీసుకువెళ్లి, వాటిని వర్గీకరించి, వాటి వాటి స్థానాల్లో అమర్చడం, కార్గోకు చేరుకున్న సరుకును తిరిగి ట్రక్కుల్లో నింపడం నా పని. సాధారణంగా ఫోర్క్ లిఫ్ట్ ఆపరేటర్ అనగానే అది శ్రమతో కూడుకున్న ప్రమాదకరమైన వృత్తి అనుకుంటారు. కానీ అది నిజంకాదు. మహిళలు సైతం ఈ పనిని సులువుగా చేయగలుగుతారు అనడానికి నేనే ప్రత్యక్ష సాక్ష్యం.



మాది వరంగల్‌లోని వెంకటాపూర్. నేను పదో తరగతి వరకే చదువుకున్నాను. 2010లో పెళ్లితో చదువుకు బ్రేక్ పడింది. నాకిద్దరు పిల్లలు. పెద్ద బాబు విఘ్నేష్ నాలుగో తరగతి, చిన్న బాబు వేదాంశ్ రెండో తరగతి చదువుతున్నారు. మా వారు శ్రీరామోజు నాగరాజు, ఎయిర్‌పోర్టులోని లక్ష్య మీడియాలో ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తారు.

ఏమిటీ ఫోర్క్‌లిఫ్ట్..?

కార్గోలోని బరువైన కంటైనర్లను ఒక చోట నుంచి వేరే చోట పెట్టేందుకు ఫోర్క్‌లిఫ్ట్‌ను ఉపయోగిస్తారు. ఇది ఆటో కంటే కాస్త పెద్ద పరిమాణంలో ఉండే ఎలక్ట్రికల్ వెహికిల్. ఉదాహరణకు ఎగుమతి కోసం కూరగాయలు వచ్చాయనుకొందాం... అవి పెద్ద పెద్ద బాక్స్‌ల్లో లోడ్ చేసి ఉంటాయి. ఒక్కో బాక్స్ అర టన్ను, టన్ను బరువు ఉంటుంది. ఈ బాక్స్‌లను ఎత్తి, లోడింగ్ ప్రాంతంలో పెట్టే పనిని ఫోర్క్ లిఫ్ట్ చేస్తుంది.

భయం, బెరకు, విమర్శలే అవరోధాలు

ఈ వృత్తిలోకి అడుగు పెట్టినప్పుడు, 'నీకీ పని అవసరమా?' అని నన్ను వెనక్కి లాగే ప్రయత్నం చేసిన వాళ్లున్నారు. కానీ ఇది నాకు నచ్చిన పని. సమర్థంగా చేయగలుగుతాననే నమ్మకం నాకుంది.

కాబట్టి వాళ్ల మాటలను పట్టించుకోలేదు. భవిష్యత్తులో ఈ వృత్తిలోనే కొనసాగుతాను. నిజానికి నేనీ పని సమర్థంగా చేయడాన్ని చూసిన సాటి మహిళలు, 'నాక్కూడా నీలా ఫోర్క్‌లిఫ్ట్ ఆపరేటర్ కావాలని ఉంది' అనడం మొదలుపెట్టారు. భయం, బెరుకు, విమర్శలను పక్కన పెట్టగలిగితే మహిళలు సాధించలేనిదంటూ ఏదీ ఉండదు. మిగతా మహిళల్లా వెనకంజ వేసి ఉంటే, నేను కూడా కుట్టుపనికే పరిమితమైపోయి ఉండేదాన్ని. ధైర్యంగా ముందడుగు వేయగలిగాను కాబట్టే ఈ రోజు తొలి ఫోర్క్ లిఫ్ట్ ఆపరేటర్‌గా గుర్తింపు సాధించగలిగాను.

● గోగుమళ్ల కవిత

మనిషిని మనిషిగా చూడని ఈ సమాజాన్ని ఆమె పక్కన పెట్టారు. రూపం చూసి తోటి విద్యార్థులు అవహేళన చేస్తే... తనలోని మేధాశక్తితో సమాధానమిచ్చారు. ఒక స్వీపర్ కూతురుగా... అట్టడుగు వర్గం నుంచి వచ్చిన మహిళగా... విజయానికి అంగవైకల్యం అడ్డు కాదని నిరూపించారు. పీహెచ్‌డీ పూర్తి చేసి... తెలంగాణ గవర్నర్ తమిళసై నుంచి 'డాక్టరేట్' అందుకున్న డాక్టర్ కత్తి వెంకటమ్మ సంకల్ప దీక్ష ఇది...

ఆత్మవిశ్వాసంతో ఆకాశమంత ఎత్తులో..!

సంకల్పం



"ఒకరిపై ఆధారపడకుండా నీ కాళ్లపై నువ్వు నిలబడాలి'... ఇది నాకు మా నాన్న రాజయ్య చెప్పిన మాట. దాని కోసం ఆయన ఎన్నో త్యాగాలు చేశారు. ఆర్థిక స్థోమత లేకపోయినా... నన్ను ఉన్నత చదువులు చదివించాలని ఆరాటపడ్డారు. ఎందుకంటే ఏడుగురు సంతానంలో నేను వికలాంగురాలిని. తను లేకపోతే నా బాగోగులు ఎవరు పట్టించుకొంటారన్నది నాన్న బాధ. ఆయన ఆకాంక్షలకు అనుగుణంగా, నా భవిష్యత్తుకు నేనే భరోసా అవ్వాలన్న లక్ష్యంగా చదువు కొనసాగించాను. కర్నూలు జిల్లా శ్రీశైలంలో ఓ నిరుపేద కుటుంబం మాది. అణగారిన వర్గం. నాన్న మున్సిపాలిటీలో స్వీపర్‌గా పని చేసేవారు. ఇద్దరు అన్నల తరువాత నేను మూడో సంతానాన్ని. నాన్న సంపాదనతో ఇల్లు గడవడమే కష్టంగా ఉండేది. ఇంత పెద్ద కుటుంబాన్ని పోషించడమంటే తలకు మించిన భారమే. దాంతో మా అమ్మ దిబ్బులమ్మ కూడా పని మొదలుపెట్టింది. ఈ పరిస్థితుల నుంచి మమ్మల్ని బయటపడేయగలిగేది, మా భవిష్యత్తుకు భరోసా కల్పించేది చదువు మాత్రమేనని చిన్న వయసులోనే నాకు అర్థమైంది. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా విద్యాభ్యాసం ఆపకూడదని అప్పుడే నిర్ణయించుకున్నాను.

ఎగతాళి చేసినా...

పొట్టిగా, కాస్త భిన్నంగా ఉన్న నా రూపాన్ని చూసి స్కూల్లో తోటి విద్యార్థులు ఆట పట్టించేవారు. తెలిసీ తెలియని వయసు కదా... ఎందుకు నా పట్ల అలా ప్రవర్తిస్తున్నారో అర్థమయ్యేది కాదు. కానీ ఇంటర్‌లోకి వచ్చాక కూడా అదే పరిస్థితి. పొట్టిగా ఉన్నావంటూ ఎగతాళి చేసేవారు. హేళనగా మాట్లాడేవారు. నన్ను చూడగానే నవ్వుకొనేవారు. అవి నా మనసును తీవ్రంగా గాయపరిచాయి. వాటిని తట్టుకోలేకపోయాను. ఇంటికి వచ్చి ఏడ్చేదాన్ని. కొన్ని వారాలు కాలేజీకి వెళ్లలేకపోయాను. చాలాసార్లు చనిపోవాలని అనిపించింది. 'ఇక నాకు ఈ చదువు వద్దు. కాలేజీ వద్దు' అని అంటే... నాన్న కోప్పడ్డారు. 'రేపు నేను పోయిన తరువాత నీ గురించి ఎవరూ పట్టించుకోరు. అందుకే నువ్వు చదువుకోవాలి. ఒకరిపై ఆధారపడకుండా జీవించాలి' అని ప్రేరణనిచ్చారు. మొదట మొండికేసినా... తరువాత ఆలోచించాను. 'ఎవరేమనుకుంటే నాకేంటి' అనుకుని మళ్లీ కాలేజీకి వెళ్లాను. నా మనసుకు సర్దిచెప్పుకున్నాను. కానీ నా చుట్టూ ఉన్నవారిలో మార్పు కనిపించలేదు. అదే తీరు... ఎగతాళి చేయడం. అలాంటివన్నీ పట్టించుకోవడం మానేసి... 'నా చదువు నేను చదువుకోవాల'ని బలంగా నిశ్చయించుకున్నాను. నాన్న ఇచ్చిన ధైర్యం, తోడబుట్టినవారి ప్రోత్సాహంతో చదువు కొనసాగించగలిగాను. మా కుటుంబంలో ఉన్నత చదువులు చదివింది కూడా నేనే.

టీచర్ పోస్టు కోసం...

మొదటి నుంచి నా లక్ష్యం ఏమిటంటే... బాగా చదువుకొని, మంచి ఉద్యోగం తెచ్చుకోవాలని. అప్పుడే కదా నాకు ఒక ఆధారం దొరుకుతుంది. దాని కోసం 2010లో బీఏ అవ్వగానే బీఈడీ చేశాను. టీచర్ అవుదామని. 'టెట్'కు అర్హత సాధించాను. డీఎస్సీ కోచింగ్ కోసం అవనిగడ్డ వెళ్లాను. ఆ సమయంలోనే బాత్‌రూమ్‌లో కాలు జారి పడడంతో కాలికి తీవ్ర గాయమైంది. డీఎస్సీ రాయలేకపోయాను. గాయంతో ఏడాది మంచం మీదే గడిచిపోయింది. టీచర్ కావాలన్న లక్ష్యం పక్కకు వెళ్లిపోయింది. కానీ బాధపడలేదు. జీవితం అన్నాక ఒడుదొడుకులు సహజమే.

పీజీ టు పీహెచ్‌డీ...

మళ్లీ ఉద్యోగ ప్రయత్నాలు చేసేముందు విద్యార్హతలు పెంచుకోవాలని అనుకున్నాను. శ్రీశైలం క్యాంపస్‌లో హిస్టరీ అండ్ ఆర్కియాలజీలో పీజీ చేశాను. 2015లో పీజీ అవ్వగానే ఎందుకో మనసు పీహెచ్‌డీ వైపు మళ్లింది. టీచర్‌గా స్థిరపడాలనుకున్నాను... అవ్వలేదు. పీహెచ్‌డీ అయినా చేస్తే సమాజంలో మంచి గుర్తింపు కూడా దక్కుతుంది కదా. ఉద్యోగ అవకాశాలు కూడా మెరుగవుతాయనే ఉద్దేశంతో పీజీ అయిన మరుసటి ఏడాదే పీహెచ్‌డీకి దరఖాస్తు చేసుకున్నాను. ఫిజికల్ హ్యాండీక్యాప్డ్ కేటగిరీలో కూడా చాలా మంది పోటీపడ్డారు. వాళ్లందరినీ దాటి, శ్రీశైలం 'పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం'లో పీహెచ్‌డీ మొదలుపెట్టగలిగాను. యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ అందించే నేషనల్ ఫెలోషిప్‌కు ఎంపికయ్యాను.

వ్యయప్రయాసలెన్నో...

పీహెచ్‌డీ అంటే సామాన్యమైన విషయం కాదు. ముఖ్యంగా నాలాంటివారికి. ఎంతో అధ్యయనం చేయాలి. పరిశోధించాలి. అయితే యూనివర్సిటీలో మా గైడ్, అధ్యాపకులు నాకు అండగా నిలిచారు. 'నువ్వు ఇక్కడివరకు రావడం ఎంతో గొప్పగా ఉంది' అంటూ అందరూ నన్ను అభినందించేవారు. ఎప్పుడు ఏ సందేహం వచ్చినా తీర్చడానికి అందుబాటులో ఉండేవారు. వారందరి సహకారంతో పాటు, విశ్రాంత ఆచార్యులు రామిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి గారి పర్యవేక్షణలో 'కర్నూలు జిల్లాలోని ప్రసిద్ధ శైవ క్షేత్రాలు' మీద పరిశోధన పత్రాలు సమర్పించాను. గత ఏడాది ఫిబ్రవరిలో పీహెచ్‌డీ పూర్తయింది. డాక్టరేట్‌ను పొందాను. బుధవారం హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ తమిళసై చేతుల మీదుగా డాక్టరేట్‌ను అందుకోవడం నా జీవితంలోనే మధుర ఘట్టం."

స్ఫూర్తిమంత్రం కావాలి...

నా ఈ ప్రయాణంలో ఎన్నో ఆటుపోట్లు, సవాళ్లు. ఆర్థికంగా ఇబ్బంది పడ్డాను. చదువుకొనేచోట, ప్రయాణించే బస్సుల్లో అవమానాలు భరించాను. అన్నిటినీ తట్టుకొని నిలబడగలిగాను కనుకనే ఇవాళ డాక్టరేట్ సాధించాను. వీటన్నిటి వెనకా చదువుకోవాలన్న నా బలమైన ఆకాంక్ష, ఆత్మవిశ్వాసం ఉన్నాయి. మా నాన్న చనిపోయాక ఇంటి బాధ్యత అమ్మ మీద పడింది. ఆమె కష్టపడుతూ నన్ను చదివించింది. నేను చదివింది పూర్తిగా ప్రభుత్వ విద్యాలయాల్లోనే. నాకు మూడు వేల రూపాయల వికలాంగుల పెన్షన్ వస్తుంది. అదే నాకు ఆధారం. ప్రస్తుతం నా లక్ష్యం... ప్రభుత్వ ఉద్యోగం సంపాదించడం. తరువాత నాలాంటివారికి చేతనైన సాయం చేయడం. నేను ఒక్కటి చెప్పదలుచుకున్నాను... చాలామంది తమలోని లోపాలను చూసుకొని వెనకడుగు వేస్తుంటారు. ముఖ్యంగా నాలాంటి వికలాంగులైతే ఎవరో ఏదో అనుకొంటారని బయటకు రావడానికి కూడా జంకుతుంటారు. కానీ మనం భయపడి ఇంట్లో కూర్చున్నంతకాలం ఈ పరిస్థితుల్లో మార్పు రాదు. అడుగు బయట పెట్టాలి. బాగా చదువుకొని ఉన్నత స్థానాల్లో స్థిరపడాలి. భావితరాలకు మన కథ ఒక స్ఫూర్తిమంత్రం కావాలి.



● హనుమా
ఫొటోలు: అశోకుడు

ఒత్తిడి తగ్గించే కాఫీ

కాఫీ తాగటం వల్ల ఎన్నో ప్రయోజనాలున్నాయి. అవేంటంటే...

- కాఫీ తాగటం వల్ల మెరిసే ముఖం మీ సొంతం అవుతుంది. మృదుత్వం వస్తుంది. చర్మంలోని కణజాలాలను మెరుగు పరిచే లక్షణాలు కాఫీలోని కెఫీన్‌కు ఉంది. చర్మాన్ని హైడ్రేట్ చేస్తుంది. చర్మంలో ఫ్లెక్సిబిలిటీని తీసుకొస్తుంది.
- కాఫీ అనేది డైయూరిటిక్ పానియం. ఇది తాగితే శరీరంలోని విష పదార్థాలన్నీ తొలగిపోతాయి. పొట్ట శుభ్రంగా ఉంటుంది.
- ఊబకాయం తగ్గించే అవకాశం ఎక్కువ. ముఖ్యంగా బ్లాక్ కాఫీ తాగటం వల్ల శరీరంలోని కొవ్వు పదార్థాలు తొలగిపోతాయి. ఈ విధంగా బరువును తగ్గించే గుణం కాఫీకి ఉందనమాట!
- అలసట ఉండటం.. విశ్రాంతి లేకుండా ఉండేవారు కాఫీ తాగితే అలసట కనపడదు. కాస్త చురుగ్గా అనిపిస్తుంది.



- కాఫీ గింజల్లో ఫ్రీ రాడికల్స్ ఉంటాయి. దీనివల్ల చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. ఇందులోని యాంటీ యాక్సిడెంట్స్ వల్ల చర్మంలో ముడతలు, వలయాలు రావు.
- కాఫీ తాగటం అంటే ఒత్తిడిని తగ్గించుకోవటమే. కాస్త కాఫీ తాగగానే వెంటనే ఒంట్లో చురుకు వస్తుంది. కాఫీలో ఉత్తేజపరిచే లక్షణం ఉంది.
- కాస్త తలనొప్పిగా ఉండే కాఫీ తాగితే సరిపోతుంది అంటారు. ఇది నిజమే. కాఫీ వల్ల రక్తప్రసరణ సాఫీగా సాగుతుంది. ముఖ్యంగా మెదడు చురగ్గా పని చేస్తుంది. జ్ఞాపకశక్తి అలవడుతుంది.

శనగపిండితో అందం

శనగపిండి వంటకే కాదు జుట్టు, చర్మ ఆరోగ్యానికి మేలేంతో చేస్తుంది. వంటింట్లో ఉండే ఈ సహజమైన పిండితో చర్మ సౌందర్యాన్ని ఎలా మెరుగు పర్చుకోవాలో తెలుసుకుందాం..

- బౌల్‌లో రెండు టేబుల్ స్పూన్ల శనగపిండి వేసి అందులోకి ఒకటి లేదా రెండు టేబుల్ స్పూన్లు పెరుగు వేయాలి. మరీ నీళ్లలా కాకుండా సరిపడేంతగా చూసుకుని పెరుగు కలపాలి. ఈ మిశ్రమాన్ని బాగా కలిపిన తర్వాత ముఖానికి పట్టించుకోవాలి. ఆరిన తర్వాత కడిగేయాలి. ఇలా చేస్తుంటే ముఖం మీద నొప్పులు తొలగిపోతాయి.
- రెండు టేబుల్ స్పూన్ల శనగపిండిలో, రెండు టేబుల్ స్పూన్ల పాలు కలిపి మెత్తగా చూర్ణం చేయాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి అరగంట తర్వాత శుభ్రం చేసుకోవాలి. దీనివల్ల ముఖం మీద ఉండే మట్టి తొలగిపోతుంది.
- బౌల్‌లో రెండు టేబుల్ స్పూన్ల శనగపిండి వేసి అందులో అంతే పరిమాణంలో పసుపు తీసుకుని కలపాలి. ఈ మిశ్రమం మెత్తగా కావటానికి తగినంత నిమ్మరసం కలిపి చూర్ణం చేసుకోవాలి. ఈ చూర్ణాన్ని ముఖానికి పట్టించి ఇరవై నిముషాల తర్వాత మంచి నీళ్లతో కడిగేసి మెత్తటి టవల్‌తో శుభ్రపరచాలి. ఇలా తరచుగా చేస్తుంటే ముఖం మీద నొప్పులు, బ్యాక్టీరియా వల్ల వచ్చే సమస్యలు, ముఖ్యంగా మొటిమలు లాంటివి తగ్గిపోతాయి.
- టేబుల్ స్పూన్ శనగపిండిని కప్పులో తీసుకోవాలి. ఇందులోకి అంతే పరిమాణంలో అలోవెరా జెల్‌ను కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి ఆరిన తర్వాత కడిగేయాలి. ఇలా చేస్తుంటే ముఖం మీద ఉండే నల్లటి మచ్చలు పోతాయి.
- బౌల్‌లో టేబుల్ స్పూన్ శనగపిండి తీసుకోవాలి. తొక్కతీసేసిన టమోటాను గుజ్జుగా చేసి ఈ పిండిలో కలపాలి. ఈ



చూర్ణాన్ని ముఖానికి పట్టించి అరగంట తర్వాత మైల్డ్ సోప్‌తో కడిగేయాలి. దీనివల్ల ముఖంలో గ్లో వస్తుంది. చర్మం స్మూత్‌గా తయారవుతుంది.
- ఇంట్లో కేవలం శనగపిండి మాత్రమే ఉంటే రెండు టేబుల్ స్పూన్ల పిండిని తీసుకుని మూడు టేబుల్ స్పూన్ల రోజ్ వాటర్‌ను కలపాలి. రోజ్‌వాటర్ లేకపోతే మంచినీళ్లను కలపాలి. కేవలం శనగపిండిని పట్టించుకున్నా సరే చర్మం అందంగా తయారవుతుంది.

కౌన్సెలింగ్

పాదంలోని ఆనెలు పోయేదెలా?

Q A

డాక్టర్! నా పాదాల్లో ఆనెలున్నాయి. వాటితో నడవడం ఇబ్బందిగా ఉంది. వీటిని శాశ్వతంగా వదిలించుకోవాలంటే ఏం చేయాలి?

- ఓ సోదరి, హైదరాబాద్.

అధిక బరువు, గట్టిగా ఉండే చెప్పులు వేసుకోవడం, పాదాలకు చెప్పుల్లేకుండా నడవడం.. ఈ కారణాల వల్ల పాదాల్లో ఆనెలు ఏర్పడతాయి. ఆనెలు అనగానే అదేదో పెద్ద సమస్య అని భయపడవలసిన అవసరం లేదు. మొద్దుబారిన చర్మాన్ని నిర్లక్ష్యం చేయడం వల్ల, పాదంలో లోతుకు ఆనెలు ఏర్పడతాయి. ప్రారంభంలో ఆనెలు పైచర్మానికే పరిమితమైతే, వీటిని వైద్యుల సహాయంతో సునాయాసంగా తొలగించుకోవచ్చు. పైచర్మాన్ని తొలగించి, ప్యాచ్ వేస్తే, అడుగున లోతుగా కోన్ ఆకారంలో పెరిగిన ఆనె మెత్తబడి, స్పర్శ కోల్పోతుంది. అప్పుడు దాన్ని తేలికగా తొలగించవచ్చు అయితే ప్యాచ్ వేసిన తర్వాత ఎక్కువగా నడవకూడదు. అలా నడిస్తే, ప్యాచ్ స్థానం తప్పి, పక్కన ఉన్న చర్మం మెత్తమడి సమస్య పెద్దది కావచ్చు.



కాబట్టి ప్యాచ్ వేసుకున్న తర్వాత జాగ్రత్తగా ఉండాలి. అంతా సక్రమంగా ఉంటే, ప్యాచ్‌ను తొలగించి లోపలి వరకూ ఉన్న ఆనెను తొలగించి, కొన్ని మందులు వాడుకుంటే ఆనె పూర్తిగా తగ్గిపోతుంది. ఇలా ఆనెలను తొలగించుకున్న తర్వాత, బరువును అదుపులో ఉంచుకోవాలి. అలాగే గట్టిగా ఉండే చెప్పులకు బదులుగా మెత్తగా ఉండే చెప్పులు వాడుకోవాలి. ఇంట్లో చెప్పులు లేకుండా నడిచే అలవాటు మానుకోవాలి. ఈ జాగ్రత్తలు పాటిస్తే పాదం ఆనెలు తిరగబెట్టకుండా ఉంటాయి.



డాక్టర్ స్వప్నప్రియ,
డెర్మటాలజిస్ట్,
కాస్మోస్యూర్ క్లినిక్, హైటెక్ సిటీ,
హైదరాబాద్.

ఆంధ్రజ్యోతి
నవ్య చిత్రజ్యోతి
గురువారం • 29 ఫిబ్రవరి 2024
cinema@andhrajyothy.com

ప్రేక్షకులు గర్వపడేలా ఆపరేషన్ వాలెంటైన్

వరుణ్‌తేజ్, మానుషి చిల్లర్ జంటగా నటించిన 'ఆపరేషన్ వాలెంటైన్' మార్చి ఒకటిన విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాతలు సిద్దు ముద్దా, నందకుమార్ అబ్బినేని బుధవారం మీడియాతో మాట్లాడుతూ చిత్ర విశేషాలు వెల్లడించారు.


నిర్మాతలు

● దర్శకుడు శక్తి ప్రతాప్‌సింగ్ రూపొందించిన షార్ట్ ఫిల్మ్ మాకు, వరుణ్‌కి బాగా నచ్చింది. దాన్నే ఫుల్ లెంగ్త్ ఫీచర్ ఫిల్మ్‌గా చేయాలనే ప్రయత్నాల్లో దర్శకుడు ఉన్నప్పుడు ఆ కథ విన్నాం. బాగా నచ్చడంతో సినిమా తీయాలని నిర్ణయించుకున్నాం. సోనీ పిక్చర్స్ నిర్మాణ భాగస్వామిగా రావడంతో తెలుగు, హిందీ భాషల్లో గ్రాండ్‌గా తీశాం.

● కొత్త వాడైనా ప్రతాప్ సింగ్‌కు మంచి క్లారిటీ ఉంది. సినిమాకు ఏం కావాలో ఆయనకు స్పష్టంగా తెలుసు. అలాగే తను అదే నేపథ్యం నుంచి వచ్చారు కనుక వీఎఫ్ఎక్స్ మీద మంచి కమాండ్ ఉంది. 'ఫైటర్' తర్వాత ఇలాంటి భారీ ఎయిర్ సీక్వెన్స్‌తో ఇండియాలో వచ్చిన మా చిత్రాన్ని ఆయన చాలా అద్భుతంగా తీశారు. గ్వాలియర్ ఎయిర్ బేస్‌లో సినిమాను షూట్ చేశాం. రియల్ ఎయిర్ బేస్‌లో షూటింగ్ చేయడం ఒక కొత్త అనుభూతి. వాయు సేన సైనికుల త్యాగాలను, ధైర్యాలను స్మరించుకుంటూ వాళ్ల కథని ప్రేక్షకులకు చెప్పాలనే ఆలోచనతో ఈ సినిమా నిర్మించాం.

● ఎయిర్‌ఫోర్స్ అధికారులు సినిమా చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఏం చెప్పారో అదే తీశారని ప్రశంసించారు. ఈ చిత్ర నిర్మాణ సమయంలోనే ఇలాంటి రియల్ హీరోస్ సినిమాలు మరిన్ని చేయాలనే స్ఫూర్తి కలిగింది.

● అందరి హీరోలతో సినిమాలు తీయాలని ఉంది. నితిన్‌తో ఓ సినిమా అనుకుంటున్నాం. 'ఆపరేషన్ వాలెంటైన్' విడుదల తర్వాత చిన్న బ్రేక్ తీసుకుని ఆగస్టు నుంచి కొత్త ప్రాజెక్ట్‌పై వర్క్ చేస్తాం. ఈసారి ఓ డిఫరెంట్ లవ్‌స్టోరీ తీయాలని మా ఆలోచన.

దర్శకుడు ఎన్.శంకర్ మూడు హిస్టారికల్ వెబ్ సిరీస్‌లు



సినిమాల్లో వాణిజ్య అంశాలతో పాటు సామాజిక ప్రయోజనం కూడా ఉండాలని నమ్మే దర్శకుల్లో ఎన్.శంకర్ ఒకరు. పలు విభిన్న చిత్రాలు రూపొందించిన ఆయన తాజాగా చారిత్రక నేపథ్యంలో మూడు వెబ్ సిరీస్‌లు తీయడానికి సంకల్పించారు. బుధవారం వాటి విశేషాలు వెల్లడిస్తూ ' తెలంగాణ సాయుధ పోరాటం, తెలంగాణ ప్రాంతం ఇండియన్ యూనియన్‌లో కలవడం, ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడడం, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం జరిగిన పోరాట నేపథ్యం, తెలంగాణ రాష్ట్రం ఏర్పడేంతవరకూ ఉద్యమాల్లో జరిగిన ఆటుపోట్లు, కవులు, కళాకారులు, మేధావులు పంచిన చైతన్యం, విద్యార్థులు, యువకుల త్యాగాలు.. తదితర అంశాలను ప్రజల కోణంలో చూపించాలని మా ప్రయత్నం. అక్టోబర్ నుంచి షూటింగ్‌కు శ్రీకారం చుడతాం' అని చెప్పారు. అలాగే జ్యోతీరావు ఫూలే అనుభవాలు, ఆయన జీవితంలో జరిగిన సంఘటనలు, సంఘర్షణలు, ఆయన ఎదుర్కొన్న సమస్యలు, అవమానాలు కథాంశంగా మరో వెబ్ సిరీస్‌ను నిర్మించనున్నట్లు శంకర్ వెల్లడించారు. అదే విధంగా బాబా సాహెబ్ అంబేద్కర్ వ్యక్తి నుంచి వ్యవస్థగా మారడానికి మధ్య జరిగిన సంఘర్షణలు, అణగారిన వర్గాలకు ఆయన ఇచ్చిన రాజ్యాంగ స్ఫూర్తి ఇతివృతంగా ఇంకో వెబ్ సిరీస్ నిర్మిస్తామని ఆయన చెప్పారు. జ్యోతిరావు ఫూలే, అంబేద్కర్ వెబ్ సిరీస్‌లు వారి బయోగ్రఫీలు కాదని శంకర్ స్పష్టం చేశారు. తెలుగు, హిందీ భాషల్లో ఈ మూడు వెబ్ సిరీస్‌లు నిర్మిస్తామనీ, మూడేళ్ల నుంచి తన టీమ్‌తో కలసి కథలపై వర్క్ చేస్తున్నామని తెలిపారు.

'హాఫ్ లయన్'గా పీవీ నరసింహారావు బయోపిక్



ఆహా స్టూడియో, అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా భారతరత్న పురస్కార గ్రహీత, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జీవిత ప్రస్థానాన్ని బయోపిక్ రూపంలో తెరమీదకు తీసుకురావడానికి సిద్ధమయ్యాయి. ఈ ప్రతిష్ఠాత్మక బయోపిక్‌ను 'హాఫ్ లయన్' పేరిట వెబ్ సిరీస్‌గా రూపొందిస్తున్నారు. ప్రముఖ రచయిత వినయ్ సీతాపతి రచించిన 'హాఫ్ లయన్' పుస్తకం ఆధారంగా జాతీయ అవార్డు గ్రహీత, నటుడు ప్రకాష్ ఝా ఈ సిరీస్‌ను నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ పాన్ ఇండియన్ సిరీస్ ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. హిందీ, తెలుగు, తమిళ భాషల్లో ఈ సిరీస్‌ను విడుదల చేయబోతున్నారు. పీవీ నరసింహారావు జీవితంలోని కీలక మైలురాళ్లను ఈ సిరీస్ హైలైట్ చేయనుంది. 1991 నుంచి 1996 వరకు ప్రధానిగా బాధ్యతలు నిర్వహించిన ఆయన భారతదేశ ఆర్థిక వ్యవస్థను సమూలంగా మార్చి కొత్తపుంతలు తొక్కించటంలో ఎలా సఫలీకృతుడయ్యాడో ఇందులో చూపించనున్నారు. తెలుగు జాతి ఆత్మగౌరవమైన పీవీ నరసింహారావుకు 'భారతరత్న' అవార్డును ప్రకటించిన శుభ తరుణంలో ఈ వెబ్ సిరీస్ ప్రకటన అందరిలోనూ ఆసక్తిని పెంచింది.

మరోసారి న్యూజిలాండ్‌కు కన్నప్ప



మంచు విష్ణు నటిస్తున్న డ్రీమ్ ప్రాజెక్ట్ 'కన్నప్ప' రెండో షెడ్యూల్ న్యూజిలాండ్‌లో మొదలైంది. విష్ణు టైటిల్ రోల్ పోషిస్తున్న ఈ చిత్రంలో మోహన్‌బాబు, మోహన్‌లాల్, ప్రభాస్ తదితరులు నటిస్తున్నారు. 'మహాభారతం' సీరియల్‌ను రూపొందించిన ముఖేశ్‌కుమార్ సింగ్ ఈ చిత్రానికి దర్శకుడు. 'కన్నప్ప' చిత్రం తొలి షెడ్యూల్ 90 రోజుల పాటు న్యూజిలాండ్‌లోనే జరిగింది. రెండో షెడ్యూల్‌లో కీలకమైన సన్నివేశాలు చిత్రీకరించనున్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అంచనాలు కలిగిన ఈ చిత్రాన్ని ఓ దృశ్య కావ్యంగా తెరకెక్కిస్తున్నారు నిర్మాత డాక్టర్ మోహన్‌బాబు.

దర్శకుణ్ణి తప్పు పట్టలేం

ఖుష్బూ



మితిమీరిన హింసతో పాటు మహిళలను కించపరిచే సన్నివేశాలు ఉన్నాయంటూ పలువురు సినీ ప్రముఖుల విమర్శలు ఎదుర్కొంది 'యానిమల్' చిత్ర బృందం. తాజాగా విమర్శకుల జాబితాలో నటి ఖుష్బూ చేరారు. "యానిమల్' సినిమాలో కుటుంబ విలువలను, మహిళలను కించపరిచిన తీరుకు బాధపడతావు, ఆ సినిమా చూడొద్దు' అని మా పిల్లలు నన్ను హెచ్చరించారు' అని ఖుష్బూ చెప్పారు. ఓ ప్రైవేట్ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ 'ఇందులో దర్శకుణ్ణి తప్పు పట్టాల్సిన పని లేదు. 'యానిమల్' లాంటి సినిమాలు రికార్డు స్థాయి వసూళ్లు సాధిస్తున్నాయంటే ముందు జనాల ధోరణి ఎలా ఉందో అర్థం చేసుకోవాలి. బాగా చదువుకున్నవాళ్లు కూడా ఇలాంటి సినిమాలను ఆదరించడం బాధాకరం. ఈ సినిమా బాగా నచ్చిందని చెప్పేవాళ్లను చూస్తున్నప్పుడు వాళ్లు కూడా అలాంటి వాళ్లేనేమో అనిపిస్తుంది' అని ఆవేదన వ్యక్తం చేశారు. సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో వచ్చిన 'యానిమల్' చిత్రంలో రణ్‌బీర్‌కపూర్ హీరోగా నటించారు. రష్మిక మందన్న కథానాయిక.



హృదయాలను గెలుచుకునే చిత్రం

మలయాళ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ నటిస్తున్న సర్వైవల్ థ్రిల్లర్ 'గోట్ లైఫ్' (మలయాళంలో 'ఆడు జీవితం). హాలీవుడ్ నటుడు జిమ్మీ జీన్ లూయిస్, అమలాపాల్, కే ఆర్ గోకుల్ ప్రధాన తారాగణం. బెన్యామిన్ రాసిన 'గోట్ డేస్' నవల ఆధారంగా దర్శకుడు బ్లెస్సీ తెరకెక్కించారు. విజువల్ రొమాన్స్ బేనర్ ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కిస్తోంది. ఈ సినిమా కోసం ప్రత్యేకంగా రూపొందించిన వెబ్‌సైట్‌ను చిత్రబృందం బుధవారం ఆవిష్కరించింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సంగీత దర్శకుడు ఏ ఆర్ రెహమాన్ మాట్లాడుతూ "'గోట్‌లైఫ్' చిత్రం ప్రేక్షక హృదయాల్లో చెరగని ముద్ర వేస్తుంది. ఈ చిత్రం వరల్డ్ క్లాసిక్ మూవీ 'లారెన్స్ ఆఫ్ అరేబియా' స్థాయిలో ఉండబోతోంది. ఇది ప్రతి ఒక్కరి హృదయాలను గెలుచుకుంటుందనే నమ్మకం ఉంది' అన్నారు. పూర్తిగా ఎడారి నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రం మార్చి 10న మలయాళం, తెలుగుతో పాటు పలు భారతీయ భాషల్లో విడుదలవుతోంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సునీల్ కేఎస్

నాయర్ నా భర్తే మలయాళ నటి హర్షం

'గగన్‌యాన్'కు సంబంధించి ఎంపికైన నలుగురు వ్యోమగాముల్లో ప్రశాంత్ నాయర్ ఒకరు. వ్యోమగామిగా ఈయనను ఎంపిక చేస్తూ ప్రధాని మోదీ ప్రకటించిన తర్వాత మలయాళ సినీ నటి, స్నేహం సినిమాలో



నటించిన లీనా సంతోషంతో ఉక్కిరిబిక్కిరికి గురయ్యారు. "నాయర్ నా భర్తే, మాకు గత నెల 17న వివాహం జరిగింది. మాది పెద్దలు కుదిర్చిన వివాహం. నాయర్‌ను వ్యోమగామిగా ప్రకటించిన సందర్భం నా జీవితంలో మరువలేనిది. ఇదొక చరిత్రాత్మక ఘట్టం. ఈ దేశానికి, మా రాష్ట్రానికి(కేరళ), వ్యక్తిగతంగా నాకు ఎంతో గర్వకారణం" అని ఆమె పేర్కొన్నారు.

రాజుగారి అమ్మాయితో నాయుడుగారి అబ్బాయి

రవితేజ నున్నా, నేహా జురెల్ జంటగా నటించిన 'రాజుగారి అమ్మాయి- నాయుడుగారి అబ్బాయి' చిత్రం ట్రైలర్‌ను బుధవారం ప్రసాద్ ప్రీవ్యూ థియేటర్‌లో జరిగిన కార్యక్రమంలో దర్శకుల సంఘం అధ్యక్షుడు వీరశంకర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'అందరికీ కనెక్ట్ అయ్యే టైటిల్‌తో విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందిన చిత్రం ఇది. సినిమా విజయం సాధించాలి' అని కోరారు. నిర్మాతల్లో ఒకరైన ముత్యాల రామదాసు మాట్లాడుతూ 'ఈ మధ్యకాలంలో చిన్న సినిమాలు కూడా పెద్ద విజయం సాధిస్తున్నాయి. అలాగే ప్రేక్షకులను ఆకట్టుకొనే అంశాలతో 'రాజుగారి అమ్మాయి



నాయుడుగారి అబ్బాయి' చిత్రం రూపుదిద్దుకుంది. దర్శకుడు సత్యరాజ్‌కు మంచి విజన్ ఉంది. ఆయన పెద్ద దర్శకుడు కావాలని కోరుకుంటున్నాను. ఎన్నో సమస్యలు ఎదురైనా ఎక్కడా రాజీపడకుండా తీసిన సినిమా ఇది. మార్చి 9న విడుదల చేస్తున్నాం. సినిమాలో హీరోగా నటించిన కొత్త నటుడు రవితేజ పెద్ద హీరోగా ఎదగాలి' అన్నారు. 'ముత్యాల రామదాసుగారు మా వెనుక ఉండి ఈ సినిమాను విజయవంతంగా పూర్తి చేయించారు. మా అమ్మ నున్నా కుమారిగారు లేకపోతే ఈ ప్రాజెక్ట్ కంప్లీట్ అవదు. ఈ సినిమా కోసం ఎంతో కష్టపడ్డాం. అందరినీ ఆకట్టుకొనే చిత్రం అవుతుంది' అన్నారు రవితేజ. ఈ చిత్రనిర్మాణంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ దర్శకుడు సత్యరాజ్ కృతజ్ఞతలు తెలిపారు.

అందరినీ మెప్పిస్తుందనే నమ్మకం ఉంది



శివ కందుకూరి హీరోగా రూపొందిన క్రైమ్‌థ్రిల్లర్ 'భూతద్ధం భాస్కర్ నారాయణ'. పురుషోత్తం రాజ్ దర్శకత్వంలో స్నేహాల్, శశిధర్, కార్తీక్ నిర్మించారు. రాశి సింగ్ కథానాయిక. మార్చి 1న ఈచిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా ప్రీ రిలీజ్ ట్రైలర్ ఈవెంట్‌ను చిత్రబృందం నిర్వహించింది. శివ కందుకూరి మాట్లాడుతూ "భూతద్ధం...'ప్రచార చిత్రాలకు ప్రేక్షకుల నుంచి అద్భుత స్పందన వచ్చింది. సినిమా అందరికీ నచ్చుతుందనే నమ్మకం ఉంది. గీతా డిస్ట్రిబ్యూషన్ విడుదల వల్ల సినిమా మరింత మంది ప్రేక్షకులకు చేరువవుతుంది' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'ఈ సినిమాతో దర్శకుడిగా నా కల నెరవేరింది. శ్రీ చరణ్ అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు. శివ లాంటి హీరో దొరికినందుకు ఆనందంగా ఉంది. సినిమా చాలా బాగా వచ్చింది. ఆదరించండి' అని ప్రేక్షకులను కోరారు. రాశి సింగ్ మాట్లాడుతూ 'ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డాం. కథ వినూత్నంగా ఉంటుంది. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే అంశాలు ఈ చిత్రంలో ఉన్నాయి' అన్నారు. ప్రచార చిత్రాలు సినిమాపై ఆసక్తిని పెంచాయి, బిజినెస్ అద్భుతంగా జరిగింది అని నిర్మాతలు చెప్పారు.

కవిత పిటిషన్‌పై విచారణ 13కు వాయిదా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం విధానం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నోటీసులను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ మరోసారి వాయిదా పడింది. ఢిల్లీ లిక్కర్ కేసులో కవితను ఈడీ పలుమార్లు విచారించింది. ఈ నేపథ్యంలో గతేడాది మార్చి 14న కవిత సుప్రీంకోర్టును ఆశ్రయించారు. లిక్కర్ కేసులో ఈడీ తనకు జారీ చేసిన సమన్లు రద్దు చేయాలని కోరుతూ పిటిషన్ వేశారు. దీనిని జస్టిస్ బేలా ఎం.త్రివేది, జస్టిస్ పంకజ్ మిత్తల్‌తో కూడిన సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం బుధవారం విచారించాల్సి ఉంది. అయితే సమయం లేకపోవడంతో కేసు విచారణను మార్చి 13వ తేదీకి వాయిదా వేస్తున్నట్టు ధర్మాసనం పేర్కొంది. ఈలోపు ఇరుపక్షాలు తుది వాదనలకు సిద్ధం కావాలని ధర్మాసనం తెలిపింది.

అక్షయపాత్రకు ప్రభుత్వాలు సహకరించాలి

- ఫౌండేషన్ ద్వారా రోజూ 23 లక్షల మంది ఆకలి తీరుతోంది
- సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ

కంది, ఫిబ్రవరి 28: ప్రతిరోజూ లక్షలాది మంది ఆకలి తీరుస్తున్న అక్షయపాత్ర ఫౌండేషన్ సేవలు అభినందనీయమని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. అక్షయపాత్ర 15వ వార్షికోత్సవంలో భాగంగా సంగారెడ్డి జిల్లా కందిలో ఉన్న అక్షయపాత్రలో బుధవారం నిర్వహించిన 'పోషకాహారం- పిల్లలో మార్పు' కార్యక్రమానికి జస్టిస్ రమణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అక్షయపాత్ర ఫౌండేషన్ వంటశాలలో భోజనతయారీలో నాణ్యతను పెంచే రెండు ఆటోమేటెడ్ యంత్రాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు పోషకాహారం, వారిని చదువులో ప్రోత్సహించేందుకు అక్షయపాత్ర ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టడం గర్వకారణమన్నారు. 2008లో ప్రారంభమైన అక్షయపాత్ర ఫౌండేషన్ ప్రస్తుతం దేశవ్యాప్తంగా ప్రతీరోజు 23 లక్షల మంది ఆకలి తీరుస్తోందన్నారు. ఇలాంటి గొప్ప సేవా సంస్థలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకారం అందించాలని జస్టిస్ రమణ కోరారు.

మేమూ వస్తాం మేడిగడ్డకు..

- బీఆర్ఎస్ తప్పులను వివరిస్తాం
- మల్లన్నసాగర్, కొండపోచమ్మ భూనిర్వాసితులు

గజ్వేల్, ఫిబ్రవరి 28: మేడిగడ్డకు తాము కూడా వస్తామని, బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పులను వివరిస్తామని మల్లన్నసాగర్, కొండపోచమ్మ భూనిర్వాసితులు పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించిన బీఆర్ఎస్‌తో పాటు ప్రాజెక్టుకు అనుమతిచ్చిన బీజేపీ నాయకులు ప్రాజెక్టు సందర్శనకు రావాలన్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో మల్లన్నసాగర్, కొండపోచమ్మ భూనిర్వాసితులు హయతొద్దీన్, శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతి, కరుణాకర్, పోచయ్యలు మీడియాతో మాట్లాడారు. కాళేశ్వరం ద్వారా ఏ ఒక్క ఎకరానికీ అదనంగా నీళ్లివ్వలేదన్నారు. బీఆర్ఎస్ నాయకులు రియల్ ఎస్టేట్ వ్యాపారుల్లా భూములను కొనుగోలు చేశారని ఆరోపించారు. అదనపు టీఎంసీ పనులకు అనుమతిలేకున్నా పనులు చేపడుతున్నారన్నారు. కన్నెపల్లి పంప్‌హౌజ్ నుంచి గోలివాడ పంప్‌హౌజ్ వరకు జరిగిన అన్యాయాలను ప్రజలకు వివరించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కేటీఆర్ నాయకత్వంలోనే నిర్వాసితులుగా తాము వస్తామని తెలిపారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం వెళ్దామని, అక్కడి ప్రజలను అడిగి బీఆర్ఎస్ మోసాలను తెలుసుకుందామన్నారు. ఎక్కడ ఎంత అవినీతి జరిగిందో ఆధారాలతో సహా బయట పెడతామని చెప్పారు.

సీఎంతో మీడియా అకాడెమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి భేటీ



హైదరాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మీడియా అకాడెమీ చైర్మన్‌గా నియమితులైన కె.శ్రీనివాస్ రెడ్డి.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో భేటీ అయ్యారు. బుధవారం సచివాలయంలో ముఖ్యమంత్రిని మర్యాద పూర్వకంగా కలిసి తనను రాష్ట్ర మీడియా అకాడెమీ చైర్మన్‌గా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి.. శ్రీనివాస్‌రెడ్డిని శాలువాతో సన్మానించి, అభినందించారు.

నారాయణఖేడ్, సుల్తానాబాద్ మున్సిపాలిటీలు 'హస్త'గతం

- జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్‌గా బీఆర్ఎస్ రెబల్
- బీఆర్ఎస్ అభ్యర్థిగా గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఖానాపూర్ వైస్‌చైర్మన్

ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్, ఫిబ్రవరి 28: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్, పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మున్సిపాలిటీలు బుధవారం కాంగ్రెస్ సొంతమయ్యాయి. నారాయణఖేడ్ మున్సిపల్ చైర్మన్‌గా ఆనంద్ స్వరూప్ ఎషెట్కార్, వైస్ చైర్మన్‌గా దారం శంకర్‌గుప్తా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మున్సిపాలిటీలోని 15 వార్డులకు నాలుగేళ్ల క్రితం జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ 8, బీఆర్ఎస్ ఏడు స్థానాల్లో గెలిచాయి. ఎక్స్‌అఫీషియో ఓట్ల సాయంతో బీఆర్ఎస్‌కు చెందిన రుబీనా బేగం నజీబ్ చైర్‌పర్సన్‌గా, అహీర్ పరశురాం వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత బీఆర్ఎస్‌కు చెందిన ఇద్దరు కౌన్సిలర్లు, గతంలో కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి వెళ్లిన ఓ కౌన్సిలర్ హస్తం గూటికి చేరారు. దీంతో కాంగ్రెస్ బలం పెరగ్గా పెట్టిన అవిశ్వాస నెగ్గింది. ఎన్నికలు నిర్వహించగా చైర్మన్, వైస్‌చైర్మన్ల ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. ఇక, సుల్తానాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్, బీఆర్ఎస్‌కు చెందిన ముత్యం సునీతపై కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాసం నెగ్గడంతో బుధవారం నిర్వహించిన ఎన్నికలో గాజుల లక్ష్మి చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. ఇక, జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్‌గా బీఆర్ఎస్ రెబల్ అభ్యర్థి అడువాల జ్యోతి ఎన్నికయ్యారు. అడువాల జ్యోతి ఒక్క ఓటు మెజార్టీతో చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. మరోపక్క, నిర్మల్ జిల్లా ఖానాపూర్ మున్సిపాలిటీలో అత్యంత నాటకీయంగా జరిగిన ఎన్నికలో కాంగ్రెస్‌కు చెందిన రాజుర సత్యం అలియాస్ చిన్నం సత్యనారాయణ చైర్మన్‌గా, బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ కావలి సంతోష్ వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. చైర్మన్ ఎన్నికపై కౌన్సిలర్లంతా ఏకాభిప్రాయంతో నిర్ణయం తీసుకున్నారు. అయితే, మైనారిటీ వర్గానికి చెందిన వ్యక్తికి వైస్ చైర్మన్ పదవి ఇవ్వాలని కాంగ్రెస్ సభ్యులు పట్టుబట్టగా బీఆర్ఎస్ సభ్యులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. చైర్మన్ రాజుర సత్యం ఇరువర్గాలను సముదాయించగా బీఆర్ఎస్ కౌన్సిలర్ కావలి సంతోష్‌ను వైస్ చైర్మన్‌గా ఎన్నుకున్నారు. అయితే, వైస్ చైర్మన్ కావలి సంతోష్, బీఆర్ఎస్‌కు చెందిన మరో ఇద్దరు కౌన్సిలర్లు, ఓ ఇండిపెండెంట్ కౌన్సిలర్ బుధవారం మధ్యాహ్నం కాంగ్రెస్‌లో చేరారు.

భువనగిరిలో కాంగ్రెస్, బీజేపీ దోస్తీ ?

యాదాద్రి: యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మున్సిపాలిటీ చైర్మన్‌గా కాంగ్రెస్‌కు చెందిన పోతంశెట్టి వెంకటేశ్వర్లు, వైస్‌చైర్మన్‌గా బీజేపీకి చెందిన మాయ దశరథ ఎన్నికయ్యారు. చైర్మన్, వైస్ చైర్మన్‌పై జనవరి 23న పెట్టిన అవిశ్వాసం నెగ్గడంతో బుధవారం కౌన్సిల్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎక్స్‌అఫీషియో సభ్యునిగా భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, 35 మందికి గాను 29 మంది కౌన్సిలర్లు హాజరయ్యారు. చైర్మన్ పదవికి కాంగ్రెస్ అభ్యర్థిగా 29వ వార్డు కౌన్సిలర్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, బీజేపీ తరఫున 22వ వార్డు కౌన్సిలర్ బొర్ర రాకేష్ పోటీ పడ్డారు. బీఆర్ఎస్ చైర్మన్ స్థానానికి పోటీపడలేదు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి అత్యధికంగా 18మంది మద్దతు పలికారు. ఇక, వైస్ చైర్మన్ స్థానానికి 25వ వార్డు కౌన్సిలర్ మాయ దశరథను బీజేపీ ప్రతిపాదించగా కాంగ్రెస్ ఎవరిని పోటీలో పెట్టలేదు. దీంతో మాయ దశరథ ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది.

కాంగ్రెస్ ఎంపీపీ అభ్యర్థికి బీఆర్ఎస్ ఎంపీటీసీల మద్దతు

రాయికోడ్, ఫిబ్రవరి 28: సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండల పరిషత్ అధ్యక్షుడిగా కాంగ్రెస్ పార్టీకి చెందిన మొగులప్ప బీఆర్ఎస్ ఎంపీటీసీల మద్దతుతో ఎన్నికయ్యారు. ఇక్కడ కాంగ్రెస్‌కు మెజారిటీ ఉన్నప్పటికీ ఆ పార్టీకి చెందిన ఇద్దరు నేతలు ఎంపీపీ స్థానం కోసం పోటీ పడ్డారు. దీంతో బీఆర్ఎస్ ఎంపీటీసీల మద్దతు పలికిన మొగులప్ప గెలిచారు. కాంగ్రెస్ నుంచి మమత అశోక్‌తోపాటు ఎంపీటీసీ మొగులప్ప నామినేషన్లు వేశారు. కాంగ్రెస్‌కు ఆరుగురు, బీఆర్ఎస్‌కు ఐదుగురు ఎంపీటీసీలు ఉన్నారు. అయితే, బీఆర్ఎస్ ఎంపీటీసీలు ఓటింగ్‌లో మొగులప్పకు మద్దతు పలికారు. కాంగ్రెస్‌ను వీడేది లేదని, దామోదర్ రాజనర్సింహ సహకారంతో మండలాన్ని అభివృద్ధి చేస్తానని మొగులప్ప పేర్కొన్నారు.

ఇంట్లో గ్యాస్ కనెక్షన్ ఎవరిపేరుమీద ఉన్నా సబ్సిడీ!

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మహాలక్ష్మి పథకంలో రూ.500కే వంటగ్యాస్ సిలిండర్ పంపిణీ పథకం ఉన్న పలు సందేహాలకు పౌర సరఫరాలశాఖ స్పష్టతనిచ్చింది. మహిళల పేరు మీదే కాకుండా, కుటుంబ సభ్యుల్లో ఎవరిపేరుమీద గ్యాస్ కనెక్షన్ ఉన్నా కూడా వారిని లబ్ధిదారుల జాబితాలో చేర్చుతారు. అయితే గ్యాస్ కనెక్షన్ ఎవరి పేరు మీద ఉందో, సదరు వ్యక్తిపేరు రేషన్‌కార్డులో తప్పనిసరిగా నమోదై ఉండాలని పేర్కొంది. రేషన్ కార్డునే ప్రామాణికంగా తీసుకొని రాష్ట్ర ప్రభుత్వం 'మహాలక్ష్మి' పథకాన్ని అమలుచేస్తున్న నేపథ్యంలో ఆ కార్డులో పేరున్న ఏవ్యక్తి పేరుమీద గ్యాస్ కనెక్షన్ ఉన్నా... వారికి వంట గ్యాస్ సబ్సిడీ పథకం వర్తింపజేయాలని నిర్ణయించింది. పథకానికి అర్హతలు ఉండికూడా లబ్ధిదారుల జాబితాలో పేరు లేనివారికోసం మరో అవకాశం కల్పించేందుకు సీఎం రేవంత్ నిర్ణయించారు. ఆయన ఆదేశాలమేరకు పౌరసరఫరాల శాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఈ మేరకు నేడో, రేపో మార్గదర్శకాలు జారీకానున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 90 లక్షల రేషన్ కార్డులుంటే, అందులో 64 లక్షల మందికే గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. వీరిలో 58 లక్షల మంది ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకున్నారు.దరఖాస్తు చేసుకున్న 58 లక్షల మందిలో సుమారు 40 లక్షల మందిని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే లబ్ధిదారులుగా ఎంపికచేసింది. ఎంపికైనవారిలో మహిళలతోపాటు గ్యాస్ కనెక్షన్ ఉన్న పురుషులు కూడా ఉన్నట్లు పౌరసరఫరాలశాఖ స్పష్టంచేసింది. లబ్ధిదారుల ఎంపిక రేషన్‌కార్డు, ప్రజాపాలన దరఖాస్తు, యాక్టివ్ గ్యాస్ కనెక్షన్ ప్రాతిపదికగానే జరిగింది. ఇదిలాఉండగా గ్యాస్ కనెక్షన్ ఉండి, ప్రజాపాలనలో దరఖాస్తుచేసుకున్నవారు కొందరిని లబ్ధిదారులుగా ఎంపిక చేయలేదు. తిరస్కరణకు గురైన కారణాలపై పౌరసరఫరాలశాఖ అధ్యయనం చేసింది. రేషన్‌కార్డులు లేనివారు, చనిపోయిన వారిపేరుతో ఉన్న గ్యాస్ కనెక్షన్ వాడుతున్న వారు, ఇతరుల దగ్గర గ్యాస్ కనెక్షన్ కొని వినియోగిస్తున్నవారు, ఎల్‌పీజీ కనెక్షన్ ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నవాళ్లు ఉన్నట్లు గుర్తించారు. ప్రజాపాలన దరఖాస్తులో రాసిన కస్టమర్ ఐడీ, వినియోగదారుల ఐడీతో గ్యాస్ కంపెనీల వద్ద ఉన్న వివరాలు ట్యాలీ కాకపోవటం, నెంబర్ మ్యాచింగ్ జరగకపోవటంతో తిరస్కరణకు గురైనట్లు గుర్తించారు. ఇలాంటి వారికి మరో అవకాశం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రజాపాలనలో దరఖాస్తు చేసి ఉన్నందున.. గ్యాస్ కనెక్షన్ వివరాలు, ఆధార్, రేషన్‌కార్డులు మరోసారి మండల రెవెన్యూ/పరిషత్ కార్యాలయంలో తీసుకునే ఏర్పాట్లు చేస్తోంది. ఈ ప్రక్రియ నిర్వహించటానికి కూడా కొన్ని మార్గదర్శకాలు రూపొందించాలని ప్రభుత్వం ఆదేశించటంతో... పౌరసరఫరాల భవన్‌లో అందుకు సంబంధించిన కసరత్తు జరుగుతోంది. నేడో, రేపో మార్గదర్శకాలు కూడా జారీచేసే అవకాశాలున్నాయి. అనంతరం మండల కార్యాలయాల్లో దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం ప్రారంభం అవుతుంది.

200 యూనిట్లు దాటితే.. మొత్తం బిల్లు కట్టాల్సిందే..!

(మొదటిపేజీ తరువాయి)

తీసుకున్నా.. వచ్చేనెల ఎక్కువ కరెంటు వాడితే.. బిల్లు చెల్లించాల్సిందే. ఆ పైనెల మళ్లీ 200లోపు యూనిట్ల వినియోగం నమోదైతే.. జీరో బిల్లు జారీ అవుతుంది. ఉత్తర డిస్కమ్(టీఎస్ఎన్‌పీడీసీఎల్) కీలక అధికారి ఒకరు ఈ విషయాన్ని ధ్రువీకరించారు. ఈ పథకం అమలుకు సంబంధించి సమగ్ర మార్గదర్శకాలను జారీ చేయాలని ప్రభుత్వాన్ని డిస్కమ్‌లు కోరుతున్నట్లు వివరించారు. బిల్లుల జారీకి ఒక్క రోజే మిగిలి ఉండడంతో.. మార్గదర్శకాలపై అధికారుల్లోనూ ఉత్కంఠ నెలకొంటోంది. ఈ నేపథ్యంలో బిల్లుల జారీలో కాస్త ఆలస్యం జరిగే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.



ఎస్సీ, ఎస్టీ పథకం మాదిరిగా..

రాష్ట్రంలో ఇప్పటికే ఎస్సీ, ఎస్టీలకు 101 యూనిట్ల దాకా ఉచిత విద్యుత్తు అమల్లో ఉంది. ఈ పథకంలో వినియోగదారులు ఒక్క యూనిట్ దాటి-- 102 యూనిట్లను వాడినా.. మొత్తం బిల్లు కట్టాలి. ఇదే పథకం మాదిరిగానే గృహజ్యోతిని కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎస్సీ, ఎస్టీ పథకంలో ఉన్న వారు కూడా ఇకపై గృహజ్యోతిలో భాగంగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్తును వాడుకోవచ్చు. అయితే.. రజకులకు ఇస్త్రీ/లాండ్రీ షాపులు లేదా దోభీఘాట్‌లకు, క్షురకులకు హెయిర్ సెలూన్లకు 250 యూనిట్ల దాకా ఉచిత విద్యుత్తు పథకం అమల్లో ఉంది. వీరు ఒకవేళ 400 యూనిట్లను వాడితే.. మొత్తానికి బిల్లు అనే నిబంధన ఉండదు. 250 యూనిట్లను ఉచితంగా ఇవ్వగా.. మిగతా 150 యూనిట్లకు మాత్రమే బిల్లు చెల్లించాలి. అయితే.. గృహజ్యోతి ఈ కోవలోకి రాదని అధికారులు చెబుతున్నారు.

బకాయిలు ఉన్నా.. గృహజ్యోతి

బకాయిలకు, గృహజ్యోతికి ముడిపెట్టడం లేదని అధికారులు చెబుతున్నారు. అయితే.. తొలుత బకాయిలను చెల్లించాలని వినియోగదారులను కోరనున్నట్లు వివరించారు. తొలుత బకాయిలు చెల్లిస్తేనే ఉచిత విద్యుత్తు అందించాలనే ప్రతిపాదనను డిస్కమ్‌లు పెట్టినా.. ప్రతికూల స్పందనలు రావడంతో వెనక్కి తగ్గాయి.

కేటగిరీ	వినియోగం (యూనిట్లలో)	చార్జీలు (యూనిట్‌కు రూ.లలో)
ఎల్‌టీ-1 డొమెస్టిక్	0-50	1.95
	51-100	3.10
ఎల్‌టీ-1(బీ)(1)	0-100	3.40
	101-200	4.80
ఎల్‌టీ-1(బీ)(2)	0-200	5.10
	201-300	7.70
	301-400	9.00
	401-800	9.50
	800, అంతకు మించి	10.00

ఒక్క యూనిట్ దాటినా టారిఫ్ మారుతుంది

200కు ఒక్క యూనిట్ పెరిగినా.. వినియోగదారుల టారిఫ్ మారుతుంది. అంటే.. 200 యూనిట్లలోపు యూనిట్‌కు రూ.4.80గా ఉండే టారిఫ్ ఒక్కసారిగా పెరిగిపోతుంది. వేర్వేరు కేటగిరీల టారిఫ్ ఈ కింది విధంగా ఉంది..

ఆస్తిపన్ను బకాయిల వడ్డీపై 90శాతం రాయితీ!

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): 2022-23 ఆర్థిక సంవత్సరం వరకు ఆస్తిపన్ను బకాయిల్లోని ప్రధాన మొత్తాన్ని చెల్లిస్తే ఆస్తిపన్నుపై పేరుకుపోయిన బకాయి వడ్డీ 90 శాతం మాఫీ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. వన్‌టైం స్కీం కింద జీహెచ్ఎంసీతోపాటు రాష్ట్రంలోని అన్ని పట్టణ స్థానిక సంస్థల పరిధిలో ఈ పథకం వర్తిస్తుంది. ఇప్పటివరకు ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు సంబంధించి 10శాతం వడ్డీతో పన్ను బకాయిలు చెల్లించినవారికి కూడా ఈ పథకం వర్తిస్తుంది. భవిష్యత్తులో కట్టబోయే పన్నులో వీరికి మినహాయింపు ఇవ్వనున్నారు. జీహెచ్ఎంసీ కమిషనర్, రాష్ట్ర పురపాలక శాఖ సంచాలకులు తగిన చర్యలు తీసుకోవాలని ఈ మేరకు పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు.



తెలుగులో మాట్లాడడం నాకెంతో సంతోషం

- తెలుగు వర్సిటీ 16వ స్నాతకోత్సవంలో గవర్నర్ తమిళిసై సౌందర రాజన్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): "తెలుగులో మాట్లాడుతుంటే ఆనందం కలుగుతుంది. తెలుగు మాటలు వినడానికి చాలా ఆసక్తిగా ఉంటాయి" అని తెలంగాణ గవర్నర్ తమిళిసై అన్నారు. బుధవారం రవీంద్రభారతిలో జరిగిన పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 16వ స్నాతకోత్సవ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె.. "నా మాతృభాష తమిళం అంటే నాకు అమితమైన ప్రేమ. అయినప్పటికీ నా అన్న(సోదర) భాష తెలుగులో మాట్లాడటం సంతోషంగా ఉంది" అంటూ తెలుగులోనే ఉపన్యసించి సభికుల మన్ననలు పొందారు. తెలుగేతరులు సైతం తెలుగు నేర్చుకోడానికి ఉపకరించే పుస్తకాలను పెద్ద సంఖ్యలో తీసుకురావాలి అని తెలుగు వర్సిటీ బాధ్యులకు ఆమె సూచించారు. విజయానికి షార్ట్‌కట్‌లు ఉండవని, శ్రమే ప్రగతికి మూల ధనమని విద్యార్థులను ఉద్దేశించి తమిళిసై అన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ కూచిపూడి నాట్యాచార్యుడు కళా కృష్ణకు గౌరవ డాక్టరేట్(డి.లిట్) పురస్కారాన్ని ప్రదానం చేశారు. 30 మంది పీహెచ్‌డీ, ఎంఫిల్ విద్యార్థులకు బంగారు పతకాలు, 78 మందికి ఎంఫిల్, పీహెచ్‌డీ పట్టాలను ఆమె ప్రదానం చేశారు.



జయం మనదే!

మాది విన్నింగ్ టీమ్... వైసీపీది చీటింగ్ టీమ్.. టీడీపీ-జనసేన పొత్తు గెలవాలి... రాష్ట్రం వెలగాలి

'తెలుగు-జన విజయకేతనం' సభలో చంద్రబాబు

అమరావతి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): "టీడీపీ-జనసేన పొత్తు గెలవాలి. రాష్ట్రం వెలగాలి. పేదల జీవితాలు పండాలి. తెలుగుదేశం, జనసేన పార్టీల ఐక్యత విజయ శిఖరంలా నిలబడాలి" అని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. తొలి విడత అభ్యర్థుల జాబితా ప్రకటన అనంతరం... బుధవారం పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో నిర్వహించిన 'తెలుగు జన విజయకేతనం - జెండా' సభలో ఆయన ప్రసంగించారు. ముఖ్యాంశాలు చంద్రబాబు మాటల్లోనే..

'రెండు పార్టీలు కలిసిన తర్వాత జరుగుతున్న ఈ మొదటి సభ రాష్ట్రం దశ, దిశ మార్చబోతోంది. తాడేపల్లిగూడెం సభ తాడేపల్లి ప్యాలెస్‌ను కంపింపచేస్తోంది. ఈ సభ ఒక శుభ సూచకం. రాష్ట్రానికి నవోదయం. రెండు పార్టీలు కలిసింది మా కోసం... మా అధికారం కోసం కాదు. ఈ రాష్ట్రంలోని ఐదు కోట్ల మంది ప్రజల భవిష్యత్తును బాగు చేయడం కోసం! ఒక సైకో చేతిలో నాశనమైన రాష్ట్రాన్ని నిలబెట్టడానికి... యువతకు మంచి భవిష్యత్తు ఇవ్వడానికి... రైతాంగానికి అండగా నిలవడానికి... పేదల జీవితాల్లో వెలుగులు నింపడానికే ఈ పొత్తు. ఒక వ్యక్తి తన అహంతోనో... తన జేబులు నింపుకోవడానికో ఈ రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తుంటే నేనూ పవన్ కల్యాణ్ చూస్తూ ఊరుకోలేం. మాది ప్రజలు కోరుకొన్న పొత్తు. ప్రజలు కుదిర్చిన పొత్తు. రాష్ట్రానికి వెలుగు నింపే పొత్తు. మా ఇద్దరికీ ఏ భేషజాలు లేవు. ఈ రాష్ట్రాన్ని విధ్వంస పాలన నుంచి కాపాడటానికి మేం ఏ త్యాగాలకైనా సిద్ధం. ఈ పొత్తు సూపర్ హిట్ అని ఈ సభతోనే తేలిపోయింది. ప్రజల ఆశీర్వాదం కోసమే ఈ సభ!

కుట్రలు తిప్పి కొట్టండి...

టీడీపీ, జనసేన పార్టీల పొత్తును చూడలేని శక్తులు ఈ ఐక్యతను భగ్నం చేయడానికి అనేక కుట్రలు చేస్తాయి. వాటిలో పడవద్దు. రెండు పార్టీల్లో బాగా పనిచేసిన వారు అనేక మంది ఉన్నారు. అందరికీ ఎన్నికల్లో సీట్లు ఇవ్వలేం. కానీ.. బాగా పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు న్యాయం చేసే బాధ్యతను మేం ఇద్దరం తీసుకుంటాం. రెండు పార్టీల్లో ఎవరూ అహానికి పోవద్దు. ఇద్దరిలో ఎవరూ ఎక్కువ కాదు.. ఎవరూ తక్కువ కాదు. రెండు పార్టీలు కలిసి అడుగు వేయాలి. పొత్తు ధర్మాన్ని అందరూ అర్థం చేసుకోవాలి. ప్రజల జీవితాలను ఛిద్రం చేసిన వారిని రాష్ట్రం నుంచి తరిమి కొట్టడానికి సమష్టిగా పనిచేయాలి!

'సైకో' అంటున్నది ఇందుకే...

దేశం మొత్తం మీద ఏ రాష్ట్ర ముఖ్యమంత్రినైనా సైకో అని పిలుస్తున్నారా? ఐదు రూపాయలకు అన్నం పెట్టే అన్న క్యాంటీన్లను భరించలేక మూసి వేయించాడు. ప్రజా వేదిక కూల్చివేతతో తన పాలన మొదలు పెట్టాడు. మాస్క్ అడిగిన డాక్టర్ సుధాకర్ చావు కళ్లచూశారు. తూర్పు గోదావరి జిల్లాలో ఒక దళితుడిని చంపి శవాన్ని ఇంటికి డోర్ డెలివరీ చేశారు. రాజధాని అమరావతిలో ఎస్ఆర్ఎం, విట్ యూనివర్సిటీలు పెడితే వాటిపై కక్షగట్టి రోడ్లు వేయకుండా, నీళ్లు ఇవ్వకుండా నానా ఇబ్బందులు పెడుతున్నాడు. వేసిన రోడ్లను కూడా తవ్వి నాశనం చేస్తుంటే నవ్వుతూ కూర్చున్నాడు. రాష్ట్ర క్రికెట్ టీం కెప్టెన్ హనుమ విహారి వైసీపీ టెర్రరిస్టుల వేధింపులు భరించలేక రాష్ట్రం వదిలి పారిపోయాడు. సొంత చెల్లిని, తల్లిని కూడా సామాజిక మాధ్యమాల్లో చండాలంగా తిట్టిస్తున్నాడు. ఇప్పటం గ్రామంలో జనసేన సభకు భూమి ఇచ్చారని వాళ్ల ఇళ్లను రోడ్డు విస్తరణ పేరుతో కూలగొట్టించాడు. సినిమా టికెట్ల వివాదం తీసుకువచ్చి మహానటుడు చిరంజీవి, మహా దర్శకుడు రాజమౌళి వంటి వారిని కూడా అవమానించాడు. ఆయన చర్యలను తప్పుబట్టిన పవన్ ఈ రాష్ట్రానికి విమానంలో రావడానికి వీల్లేదని అడ్డుపడ్డాడు. విశాఖలో రోడ్ల మీదకు వెళ్లడానికి వీల్లేదని హోటల్ రూంలో బంధీగా ఉంచాడు. ఎన్నికల ముందు ముద్దులు పెట్టి తర్వాత పిడి గుద్దులు గుద్దడం జగన్ నైజం. ఇటువంటి సైకోను భరించడం రాష్ట్రానికి అవసరమా?

వై నాట్ పులివెందుల?

'వై నాట్ 175' అని జగన్ అంటుంటే 'వై నాట్ పులివెందుల' అని మేం ప్రశ్నిస్తున్నాం. ఏం పీకావని 175 సీట్లు నీకు ఇవ్వాలి? వై నాట్ జాబ్ క్యాలెండర్? వై నాట్ డీఎస్సీ? వై నాట్ ఉచిత ఇసుక? వీటి గురించి ఎందుకు మాట్లాడవు? ఈసారి పులివెందులలో కూడా ఓడిస్తాం. తాడేపల్లిగూడెం సభలో ప్రజా గర్జన పులివెందులలో కూడా ప్రతి ధ్వనిస్తోంది. హూ కిల్డ్ బాబాయి? దమ్ముంటే సమాధానం చెప్పు జగన్!

నాడు పడిన కష్టాన్ని...

అశాస్త్రీయ విభజనతో నష్టపోయిన రాష్ట్రాన్ని నిలబెట్టడానికి గత ప్రభుత్వ హయాంలో అహర్నిశలూ శ్రమించాం. హైదరాబాద్‌ను విజించిన రాజధానిని నిర్మించాలని అమరావతి తలపెట్టాం. రాష్ట్రంలో ప్రతి చేనుకూ నీరివ్వాలని పోలవరం పరుగులు పెట్టించాం. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ఐఐటీ, ఐఐఎం సహా పదకొండు కేంద్ర విద్యా సంస్థలు తెచ్చాం. పదహారు లక్షల కోట్లు పెట్టుబడులు, పది లక్షల ఉద్యోగాలు తెచ్చాం. ఎదుగుతున్న చెట్టును ఒక గొడ్డలి వేటుతో నరికినట్లు జగన్ నరికేశాడు. ఈ రాష్ట్రాన్ని బాగు చేసుకోవాలన్న తపన, పట్టుదల మాకున్నాయి. మేం వస్తే ఏం చేయాలో ఒక బ్లూ ప్రింట్‌తో సిద్ధంగా ఉన్నాం. కొద్ది రోజుల్లో ఉమ్మడి మేనిఫెస్టో కూడా ప్రజల ముందు ఉంచుతాం. మన అభ్యర్థులను ఎంపిక చేసే ముందు రాష్ట్రవ్యాప్తంగా కోటీ ముప్పై లక్షల మంది అభిప్రాయాలు సేకరించాం. ప్రజల అభిప్రాయాలు తెలుసుకొని అభ్యర్థులను ఎంపిక చేస్తున్నాం. మన అభ్యర్థులను చూసి జగన్ భయపడుతున్నాడు. మన అభ్యర్థులు విద్యావంతులు, మంచి పేరున్నవారు. వైసీపీ అభ్యర్థులు స్మగ్లర్లు, రౌడీలు! ఇది మనకు పరీక్షా సమయం. విజయ సాధనకు కసితో పనిచేయాలి!



కాచుకో జగన్

సిద్ధం సిద్ధం అంటున్న నీకు యుద్ధం చూపిస్తా

నిన్ను పాతాళానికి తొక్కకపోతే పవన్‌నే కాదు: పవన్

అమరావతి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ సిద్ధం అంటున్నారని.. ఆయనకు యుద్ధం చూపిస్తామని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ప్రకటించారు. తాడేపల్లి కోటను బద్దలు కొడతామని హెచ్చరించారు. చంద్రబాబు అనుభవం రాష్ట్రానికి అవసరమని.. అందుకే టీడీపీతో పొత్తుపెట్టుకున్నామని స్పష్టం చేశారు. తాడేపల్లిగూడెంలో నిర్వహించిన 'జెండా' సభలో ఆయన సుదీర్ఘంగా ప్రసంగించారు. '2024లో టీడీపీ-జనసేన సహకరించుకోవలసిన అవసరం ఉంది. సహకరించుకుంటే ఐదు కోట్ల మంది ప్రజల భవిష్యత్ బంగారంలా ఉంటుంది. మనంలో మనం కలహాలాడుకుంటే మళ్లీ దుర్మార్గుడు, దాష్టీకుడు వచ్చి ప్రజాకంటకుడిగా మారతాడు' అని జనసేన అధినేత పవన్ కల్యాణ్ హెచ్చరించారు. ఈ సందర్భంగా అనేక అంశాలపై స్పష్టత ఇవ్వడంతో పాటు జగన్‌పై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. 'జగన్ మాట్లాడితే ఒక్కడిని.. ఒక్కడిని అంటాడు. మాకున్న ఒక్క ఎమ్మెల్యేను తీసుకెళ్లిన నువ్వు ఒక్కడివా' అని నిలదీశారు. ఏపీలో ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి నిరంతరం పహారా ఉండాలి. నేను తీసుకున్న కొన్ని నిర్ణయాలు పార్టీపరంగా, వ్యక్తిపరంగా ఉండవు. రాష్ట్ర, దేశ ప్రయోజనాల కోసం ఉంటాయి, వ్యక్తిగత ప్రయోజనాలు ఆశించి రాజకీయాలు చేయలేదు. ప్రజాస్వామ్యాన్ని కాపాడానికి రాజకీయాలు చేశాను. జగన్ బతుకు జూబ్లీహిల్స్ సొసైటీ ఫామ్‌హౌస్ కట్టినప్పటి నుంచి నాకు తెలుసు. అదే చెక్‌పోస్టులో ఏం చేసేవాడో నాకు తెలుసు. బంజారాహిల్స్ రెస్టారెంట్‌లో ఏం చేశాడో నాకు తెలుసు. మాట్లాడితే నా వ్యక్తిగత జీవితంగా గురించి మాట్లాడతాడు. నీ వ్యక్తిగత జీవితం గురించి మాట్లాడాలంటే నా దగ్గర టన్నుల కొద్దీ ఉంది. ఇప్పటి వరకూ పవన్ కల్యాణ్ శాంతి, మంచిని మాత్రమే చూశావు. జగన్ నీకు యుద్ధాన్ని ఇస్తాను.. మరచిపోకు' అని హెచ్చరించారు. నాలుగు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉన్న అనుభవం కలిగిన రాజకీయ ఉద్ధండుడు చంద్రబాబును 53 రోజులు జైలులో పెడితే తనకు బాధేసిందని, ఆయన సతీమణిని అనకూడనని మాటలుంటే బాధ కలిగిందని అన్నారు. చంద్రబాబు దగ్గర నుంచి సుగాలిప్రీతి వరకూ.. కౌలురైతుల దగ్గర నుంచి పారిశ్రామికవేత్తల వరకూ, ఎస్సీ, ఎస్టీలు, మైనారిటీలందరిని మోసం చేసిన వ్యక్తి జగన్ అని అన్నారు. మిగతా పార్టీల కోసం నిలబడకపోతే జనసైనికులకు కష్టమొస్తే ఎవరూ నిలబడరు. అందుకే పొత్తులను నేను ప్రతిపాదించాను.' అని హితవు పలికారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

నేను ఎందుకు చంద్రబాబు, టీడీపీతో పొత్తు పెట్టుకున్నానంటే.. ఆయన నవ నగరాన్ని నిర్మించిన వ్యక్తి. ఉపాధి కల్పించిన వ్యక్తి.. పారిశ్రామికవేత్తలను రప్పించిన వ్యక్తి.. ఆయన స్వయంశక్తితో స్వచ్ఛందంగా వచ్చిన వ్యక్తి. ఆయన అనుభవం రాష్ట్రానికి కావాలి. అందుకే పొత్తు పెట్టుకున్నాం. మీ భవిష్యత్ కోసం నేను రోడ్డు మీదకు వచ్చాను. మన వాళ్లే అని తపన పడితే రెండు చోట్లా ఓడిపోయాను. ఓడిన ఆ బాధ ఎలా ఉంటుందో మీకు తెలుసా? నా నిర్ణయాలు నాకు సంబంధించినవి కావు. ప్రజలకు సంబంధించినవి. పొత్తులో భాగంగా 24 స్థానాలు తీసుకున్నాను. 24 స్థానాలేనా.. ఇంతేనా అని మనోళ్లు కాకుండా అవతలివాళ్లు అంటున్నారు. వాళ్లకు తెలియడం లేదు. బలిచక్రవర్తి ఇంతేనా అన్నాడు. నెత్తిమీద కాళ్లు పెట్టి బలిచక్రవర్తిని తొక్కుతుంటే అప్పుడు అర్థమైంది. జగన్ గుర్తుపెట్టుకో.. జనసేన వామనావతారాన్ని చూపిస్తుంది. పాతాళానికి తొక్కకపోతే నా పేరు పవన్ కల్యాణ్ కాదు.. నా పార్టీ జనసేన కాదు. . నిజంగా నా మద్దతుదారులైతే నన్ను ప్రశ్నించకండి.. నా వెంట నడవండి. . .క్లాస్‌వార్ క్లాస్‌వార్ అనే జగన్.. ఐదు కోట్ల మంది ఉన్న రాష్ట్రాన్ని కేవలం ఐదుగురికి తాకట్టు పెట్టారు.. వైఎస్ జగన్, పెద్దిరెడ్డి, సజ్జల, మిథున్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డికి ఇచ్చేశారు.

అదరగొట్టిన అడైర్
కుప్పకూలిన అఫ్ఘానిస్తాన్

అబుధాబి: ఐర్లాండ్ పేసర్ మార్క్ అడైర్ (5/39) ఐదు వికెట్లతో అదరగొట్టడంతో బుధవారం మొదలైన ఏకైక టెస్టులో అఫ్ఘానిస్థాన్ 155 పరుగులకే కుప్పకూలింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్‌కు దిగిన అఫ్ఘాన్ జట్టులో ఇబ్రహీమ్ జద్రాన్ 53, కరీమ్ జనత్ 41 పరుగులు చేశారు. యంగ్ కాంఫెర్ రెండేసి వికెట్లు సాధించారు. అనంతరం ఐర్లాండ్ జట్టు తొలిరోజు ఆట చివరికి 31 ఓవర్లలో 4 వికెట్లకు 100 పరుగులు చేసింది. కాంఫెర్ 49 రన్స్ సాధించాడు.

నాగ్‌పూర్, ముంబైల్లో రంజీ సెమీస్

న్యూఢిల్లీ: ముంబైలోని బాంద్రా కుర్లా కాంప్లెక్స్, నాగ్‌పూర్‌లోని విదర్భ క్రికెట్ అసోసియేషన్ స్టేడియం ఈ సీజన్ రంజీ ట్రోఫీ సెమీఫైనల్స్‌కు వేదికలు కానున్నాయి. మార్చి రెండు నుంచి జరిగే రంజీ సెమీస్‌లో విదర్భ-మధ్య ప్రదేశ్ (నాగ్‌పూర్‌లో), తమిళనాడు-ముంబై (ముంబైలో) జట్లు తలపడనున్నాయి.

జైస్వాల్‌కు 12, జురెల్‌కు 69

దుబాయ్: ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌లో అద్భుత ప్రదర్శన కనబరుస్తున్న యశస్వీ జైస్వాల్ ర్యాంకుల్లోనూ ముందుకెళ్లాడు. బుధవారం ఐసీసీ ప్రకటించిన టెస్టు ర్యాంకింగ్స్ బ్యాటర్ల జాబితాలో యశస్వీ మూడు స్థానాలు ఎగబాకి 12వ స్థానానికి చేరుకున్నాడు. రాంచీ టెస్టులో సూపర్ షోతో అలరించిన ధ్రువ్ జురెల్ 31 స్థానాలు మెరుగుపరచుకొని 69వ ర్యాంకులో నిలిచాడు. కేన్ విలియమ్సన్ నెంబర్ వన్ బ్యాటర్‌గా కొనసాగుతున్నాడు. బౌలర్లలో బుమ్రా టాప్‌లో, అశ్విన్‌లో రెండో స్థానంలో ఉన్నారు.



సాఫ్ట్‌బాల్ జట్టుకు సీఎం అభినందన

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): జాతీయ జూనియర్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచిన తెలంగాణ జట్టును సీఎం రేవంత్ రెడ్డి బుధవారం సచివాలయంలో అభినందించారు. ఈ నెల 21 నుంచి 25 వరకు పాట్నాలో ఈ పోటీలు నిర్వహించారు. క్రీడాకారిణులు, ఇతర సహాయక సిబ్బంది సీఎంను కలిశారు.

బోర్డును ధిక్కరించిన
ఇషాన్, అయ్యర్‌పై వేటు

- సెంట్రల్ కాంట్రాక్టుల్లో మొండిచేయి
- గ్రేడ్-ఎకు సిరాజ్ ప్రమోట్
- తిలక్ వర్మకు చోటు
- ఎ+ గ్రేడ్‌కు రూ. 7 కోట్లు





తిలక్ వర్మ

న్యూఢిల్లీ: రంజీ మ్యాచ్‌లు ఆడాలంటూ చేసిన సూచనలను బేఖాతరు చేసిన ఇషాన్ కిషన్, శ్రేయాస్ అయ్యర్‌కు బీసీసీఐ గట్టిషాక్ ఇచ్చింది. 30 మంది ఆటగాళ్లతో బుధవారం విడుదల చేసిన సెంట్రల్ కాంట్రాక్ట్‌ల జాబితా నుంచి వీరిద్దరినీ తప్పించారు. 2023లో 26 మంది ఉండగా.. ఈసారి అదనంగా మరో నలుగురికి కాంట్రాక్ట్‌లు దక్కడం గమనార్హం. మానసిక సమస్యలతో దక్షిణాఫ్రికా టూర్ మధ్యలో జట్టునుంచి బయటకు వచ్చిన కిషన్.. జార్ఖండ్ తరపున రంజీలు ఆడకుండా ఐపీఎల్ కోసం సన్నద్ధం అవుతుండడం బోర్డు పెద్దలకు ఆగ్రహం తెప్పించింది. అలాగే శ్రేయాస్ అయ్యర్ కూడా బోర్డు ఆదేశాల్ని పట్టించుకోలేదు. చేతులు కాలాక అన్నట్టు..ఇప్పుడు ముంబై తరపున సెమీస్ ఆడడానికి సిద్ధమయ్యాడు. గతేడాది అయ్యర్ 'బి'లో, ఇషాన్ 'సి' గ్రేడ్ కాంట్రాక్టుల్లో ఉన్నారు. ఇక రోహిత్ శర్మ, కోహ్లీ, బుమ్రా, జడేజాలు ఉన్న ఎ+ గ్రేడ్‌లో ఎటువంటి మార్పులూ లేవు. అయితే, పేసర్ సిరాజ్‌తోపాటు కేఎల్ రాహుల్, శుభ్‌మన్ గిల్‌లకు 'బి' గ్రేడ్ నుంచి 'ఎ'కు ప్రమోషన్ లభించగా.. తెలుగు కుర్రాడు తిలక్ వర్మతోపాటు మొత్తం 15 మందికి 'సి గ్రేడ్' కాంట్రాక్ట్‌లు లభించాయి. తిలక్‌కు ఇదే తొలి సెంట్రల్ కాంట్రాక్ట్. గతేడాది 'సి'లో ఉన్న కేఎస్ భరత్ కాంట్రాక్ట్‌ను కొనసాగించారు. యశస్వి జైస్వాల్‌కు తొలిసారి.. అందునా నేరుగా 'బి గ్రేడ్' జాబితాలో చోటుదక్కింది. గాయం కారణంగా ఆటకు దూరమైన రిషబ్ పంత్, అక్షర్ పటేల్ స్థాయిని తగ్గించి 'బి గ్రేడ్'లో చేర్చారు. అయ్యర్, ఇషాన్‌ల పేర్లను ఈ విడత పరిగణనలోకి తీసుకోలేదని బీసీసీఐ విడుదల చేసిన ప్రకటనలో ప్రత్యేకంగా పేర్కొంది. జాతీయ జట్టుకు దూరమైన ఆటగాళ్లు.. ఆ సమయంలో జరుగుతున్న దేశవాళీ టోర్నీలకు ప్రాధాన్యతనివ్వాలని మరోసారి స్పష్టం చేసింది. నిర్దేశించిన కాల పరిమితి (అక్టోబరు 1, 2023-సెప్టెంబరు 30, 2024)లో 3 టెస్టులు లేదా 8 వన్డేలు లేదా 10 టీ20లు ఆడిన ఆటగాళ్లకు కాంట్రాక్ట్‌లు దక్కాయని బోర్డు తెలిపింది. ఇంగ్లండ్ సిరీస్‌లో రెండే టెస్టులు ఆడిన ధ్రువ్ జురెల్, సర్ఫరాజ్ ఖాన్‌లు.. ధర్మశాలలో జరిగే ఆఖరి మ్యాచ్‌లో కూడా ఆడితే 'సి గ్రేడ్' కాంట్రాక్ట్‌కు పరిగణనలోకి తీసుకొంటామని వివరించింది.

సెంట్రల్ కాంట్రాక్ట్‌లు (2023-24) వీరికే..

ఎ+ గ్రేడ్ (రూ. 7 కోట్లు): రోహిత్, కోహ్లీ, బుమ్రా, జడేజా
ఎ గ్రేడ్ (రూ.5 కోట్లు): అశ్విన్, షమి, సిరాజ్, రాహుల్, గిల్, హార్దిక్ పాండ్యా
బి గ్రేడ్ (రూ. 3 కోట్లు): సూర్యకుమార్ యాదవ్, రిషభ్ పంత్, కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్, జైస్వాల్.
సి గ్రేడ్ (రూ. కోటి): రింకూ సింగ్, తిలక్ వర్మ, కేఎస్ భరత్, రజత్ పటీదార్, రుతురాజ్ గైక్వాడ్, శార్దూల్ ఠాకూర్, శివమ్ దూబే, రవి బిష్ణోయ్, జితేశ్ శర్మ, వాషింగ్టన్ సుందర్, ముకేశ్ కుమార్, సంజూ శాంసన్, అర్ష్‌దీప్, ప్రసిద్ధ్ కృష్ణ, అవేశ్ ఖాన్.
పేస్ బౌలింగ్ కాంట్రాక్ట్‌లు: ఆకాశ్ దీప్, విజయ్ కుమార్ వైశాఖ్, ఉమ్రాన్ మాలిక్, యష్ దయాళ్, విద్వత్ కవేరప్ప.

పుజార కెరీర్ ముగిసినట్టేనా?

చటేశ్వర్ పుజార, ఉమేష్ యాదవ్, శిఖర్ ధవన్, దీపక్ హుడా, యజ్వేంద్ర చాహల్‌లకు వార్షిక కాంట్రాక్ట్‌లు దక్కలేదు. దీనిని బట్టి పుజార అంతర్జాతీయ కెరీర్ ముగిసిందన్న సంకేతాలిచ్చినట్టయింది. కానీ, చాహల్ మెరుగైన ప్రదర్శన చేస్తే మళ్లీ టీమ్‌లోకి వచ్చే అవకాశాలున్నాయి. అయితే, ఈసారి ప్రత్యేకంగా ఫాస్ట్ బౌలింగ్ కాంట్రాక్ట్ కింద ఐదుగురి పేర్లను సెలక్షన్ కమిటీ సిఫార్సు చేసింది. కాగా, వార్షిక వేతనాలను ఏమేరకైనా పెంచారా? అనే విషయాన్ని బోర్డు స్పష్టం చేయలేదు.

బాదేసిన నవ్‌గిరె

- 7 వికెట్లతో యూపీ గెలుపు
- ముంబైకి తొలి ఓటమి



కిరణ్ నవ్‌గిరె (57)

డబ్ల్యూపీఎల్‌లో నేడు
బెంగళూరు X ఢిల్లీ
రాత్రి 7.30 గం. నుంచి

బెంగళూరు: కిరణ్ నవ్‌గిరె (31 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్స్‌లతో 57) సుడిగాలి ఇన్నింగ్స్‌తో.. డబ్ల్యూపీఎల్‌లో యూపీ వారియర్స్ గెలుపు ఖాతా తెరిచింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో యూపీ 7 వికెట్ల తేడాతో డిఫెండింగ్ చాంప్ ముంబై ఇండియన్స్‌ను చిత్తు చేసింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన ముంబై నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 161 పరుగులు చేసింది. అంజలి, హారిస్, దీప్తి తలో వికెట్ పడగొట్టారు. ఫిట్‌నెస్ లేమితో హర్మన్‌ప్రీత్ ఈ మ్యాచ్‌కు దూరం కాగా.. సివర్ బ్రంట్ తాత్కాలిక కెప్టెన్‌గా వ్యవహరించింది. యాస్తిక భాటియా (26) కలిసి తొలి వికెట్‌కు 50 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పిన హేలీ మాథ్యూస్ (55).. బ్రంట్‌తో కలిసి రెండో వికెట్‌కు 42 పరుగులు జోడించింది. డెత్ ఓవర్లలో అమేలియా కెర్ (23), పూజ (18), ఇస్సీ వోంగ్ (15 నాటౌట్) వేగంగా ఆడడంతో.. టీమ్ స్కోరు 160 మార్క్ దాటింది.

పరుగుల వరద..

ఛేదనలో యూపీ 16.3 ఓవర్లలో 3 వికెట్లకు 163 పరుగులు చేసి గెలిచింది. వారియర్స్‌కు ఓపెనర్లు హేలీ (33), కిరణ్ తొలి వికెట్‌కు 56 బంతుల్లో 94 పరుగుల భాగస్వామ్యంతో ధనాధన్ ఆరంభాన్నిచ్చారు. బృంద గాయపడడంతో ముందుగా వచ్చిన కిరణ్ ఎడాపెడా షాట్లతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించింది. వోంగ్ వేసిన మూడో ఓవర్‌లో కిరణ్ 4 ఫోర్లతో బ్యాట్ ఝుళిపించగా.. హేలీ కూడా ఆ తర్వాతి ఓవర్‌లో మరో రెండు బౌండ్రీలు బాదింది. దీంతో పవర్‌ప్లే ముగిసే సరికి యూపీ 61/0తో బలమైన స్థితిలో నిలిచింది. అయితే, 10వ ఓవర్‌లో కెర్ బౌలింగ్‌లో కిరణ్ అవుట్ కావడంతో.. యూపీ బ్యాటింగ్ కుదుపులకు గురైంది. ఆ తర్వాతి ఓవర్‌లో తహిల మెక్‌గ్రాత్ (1), హేలీని వోంగ్ అవుట్ చేయడంతో.. వారియర్స్ నాలుగు పరుగుల తేడాతో 3 టాపార్డర్ వికెట్లు చేజార్చుకొంది. కానీ, గ్రేస్ హారిస్ (38 నాటౌట్), దీప్తి (27 నాటౌట్) నాలుగో వికెట్‌కు అజేయంగా 65 పరుగులు జోడించి.. జట్టును గెలిపించారు. నవ్‌గిరెకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

ఫైనల్లో పల్టన్ x స్టీలర్స్

చాంప్ జైపూర్, పట్నాకు షాక్
ప్రొ కబడ్డీ లీగ్



పట్నా రైడర్‌ను పట్టేసిన పుణెరి ఆటగాళ్లు

హైదరాబాద్: ప్రొ కబడ్డీ లీగ్‌లో ఈసారి కొత్త జట్టు విజేతగా నిలవనుంది. డిఫెండింగ్ చాంపియన్ జైపూర్ పింక్ పాంథర్స్‌కు షాకిస్తూ అనూహ్య ప్రదర్శనతో హరియాణా స్టీలర్స్ తొలిసారి ఫైనల్‌కు దూసుకెళ్లగా.. మూడుసార్లు విజేత పట్నా పైరేట్స్‌ను చిత్తు చేసిన పుణెరి పల్టన్ వరుసగా రెండోసారి టైటిల్‌ఫైట్‌లో నిలిచింది. స్టీలర్స్, పల్టన్ మధ్య శుక్రవారం ఫైనల్ జరగనుంది. ఇద్దరిలో ఎవరు గెలిచినా, వాళ్లకిదే తొలి టైటిల్ కానుంది. ఇక్కడి గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో బుధవారం జరిగిన తొలి సెమీఫైనల్లో పుణెరి జట్టు 37-21 స్కోరు తేడాతో పట్నా పైరేట్స్‌ను చిత్తుగా ఓడించింది. పల్టన్ కెప్టెన్ అస్లామ్ ఇనామ్‌దార్ రైడింగ్‌లో ఏడు పాయింట్లు సాధించి తన జట్టును టైటిల్ ఫైట్‌కు చేర్చడంలో కీలకపాత్ర పోషించాడు. అస్లామ్‌కు తోడు మోహిత్ గోయత్ రైడింగ్‌లో సత్తా చాటడంతో ప్రథమార్థం ముగిసేసరికే పల్టన్ 20-11తో ఆధిక్యంలో నిలిచింది. ద్వితీయార్ధంలోనూ పుణెరి ఆటగాళ్లు విజృంభించడంతో పైరేట్స్‌కు నిరాశ తప్పలేదు. మహ్మద్‌రెజా అద్భుతమైన ట్యాక్లింగ్‌కు పంకజ్ మోహితె, అభినేశ్, గౌరవ్ ఖత్రి సహకారం తోడవడంతో పల్టన్ దూకుడును అడ్డుకోవడంలో పట్నా విఫలమైంది. సచిన్, సుధాకర్ మాత్రమే రాణించడంతో పట్నాకు ఆ మాత్రం స్కోరైనా దక్కింది. ఆ తర్వాత జరిగిన రెండో సెమీఫైనల్లో హరియాణా స్టీలర్స్ 31-27తో లీగ్ ఫేవరెట్ జైపూర్ పింక్‌పాంథర్స్‌కు ఝలకిచ్చింది. మన్‌ప్రీత్, వినయ్, శివమ్ పథారె ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టి హరియాణాను ఫైనల్‌కు చేర్చారు.

రిలయన్స్, డిస్నీ విలీనం

రూ.70,000 కోట్ల మీడియా సంస్థ ఆవిర్భావం



న్యూఢిల్లీ : భారత మీడియా, వినోద పరిశ్రమలో భారీ విలీనం చోటు చేసుకుంది. రిలయన్స్ ఇండస్ట్రీస్, వాల్ డిస్నీ భారత్‌లోని తమ మీడియా, వినోద వ్యాపారాలను విలీనం చేయాలని నిర్ణయించాయి. దీనికి సంబంధించిన ఒప్పందంపై రెండు సంస్థలు సంతకాలు చేశాయి. దీంతో దేశంలో రూ.70,000 కోట్ల విలువైన అతి పెద్ద మీడియా సంస్థ ఆవిర్భవించనుంది. ఈ నిర్ణయం ప్రకారం రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన మీడియా సంస్థ వయాకామ్ 18 కోర్టు ఆమోదంతో వాల్‌డిస్నీకి చెందిన స్టార్ ఇండియాలో విలీనమవుతుంది. విలీన కంపెనీ ఈక్విటీలో రిలయన్స్ ఇండస్ట్రీస్, దాని అనుబంధ సంస్థలకు 63.16 శాతం, డిస్నీకి 36.84 శాతం వాటా ఉంటుంది.

రూ.11,500 కోట్ల పెట్టుబడి : విలీనం తర్వాత ఏర్పడే కొత్త మీడియా కంపెనీ తన కార్యకలాపాలను మరింత విస్తరించేందుకు రిలయన్స్ సహకరించనుంది. ఇందుకోసం రూ.11,500 కోట్లు పెట్టుబడి పెట్టనుంది. దీంతో విలీన కంపెనీ సోనీ, నెట్‌ఫ్లిక్స్‌లను సమర్థవంతంగా ఎదుర్కొంటుందని భావిస్తున్నారు. రిలయన్స్ సినిమా లైవ్ స్పోర్ట్స్ ప్రత్యేక హక్కులు పొందడంతో ఈ ఆర్థిక సంవత్సరం (2023-24) తొలి త్రైమాసికంలో వాల్ డిస్నీకి చెందిన డిస్నీ+హాట్‌స్టార్ ఖాతాదారులు 5.5 కోట్ల నుంచి 4 కోట్లకు పడిపోయారు. ఈ విలీనంతో సోనీ, జీ టీవీలను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని వాల్ డిస్నీ భావిస్తోంది.

ఎలిఫెంట్ హౌస్‌తో రిలయన్స్ జట్టు

శ్రీలంకకు చెందిన బెవరేజ్ కంపెనీ ఎలిఫెంట్ హౌస్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు రిలయన్స్ రిటైల్ ఎఫ్ఎంసీజీ అనుబంధ విభాగమైన రిలయన్స్ కన్జ్యూమర్ బుధవారం ప్రకటించింది. ఈ భాగస్వామ్యం ద్వారా భారత్‌లో ఎలిఫెంట్ హౌస్ బ్రాండ్ నేమ్‌తో పానీయాల తయారీతో పాటు విక్రయాలు జరుపనున్నట్లు సంస్థ వెల్లడించింది.



చైర్‌పర్సన్‌గా
నీతా అంబానీ

విలీనం తర్వాత రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ భార్య నీతా అంబానీ కొత్త కంపెనీకి చైర్‌పర్సన్‌గా, ఉదయ్ శంకర్ వైస్ చైర్మన్‌గా ఉంటారు. ఈ విలీన ప్రక్రియ ఈ ఏడాది చివరికి లేదా వచ్చే ఏడాది తొలి మూడు నెలల్లో పూర్తవుతుందని భావిస్తున్నారు. జీ-సోనీ మధ్య 1,000 కోట్ల డాలర్ల విలీన ఒప్పందం బెడిసి కొట్టిన నెల రోజులకే రిలయన్స్-వాల్ డిస్నీల మధ్య ఈ విలీన ఒప్పందం కుదరడం విశేషం. రెండు స్ట్రీమింగ్ యాప్‌లు, 120 టీవీ చానల్స్ కొత్త కంపెనీ చేతికి వస్తాయి.

బిజినెస్

2028 నాటికి దేశంలో 20,000 మంది కుబేరులు



గత ఏడాది 6% వృద్ధితో 13,263కు చేరిన సంఖ్య
నైట్ ఫ్రాంక్ ఇండియా నివేదిక

న్యూఢిల్లీ: గత ఏడాదిలో భారత కుబేరులు (యూహెచ్ఎన్‌డబ్ల్యూఐ) 13,263కు పెరిగారని ప్రముఖ ప్రాపర్టీ కన్సల్టింగ్ కంపెనీ నైట్ ఫ్రాంక్ ఇండియా తాజా నివేదిక వెల్లడించింది. 2022లో 12,495 మంది కుబేరులుండగా.. 2023లో వీరి సంఖ్య 6.1 శాతం పెరిగిందని తెలిపింది. ఐదేళ్లలో (2028 చివరి నాటికి) మరో 50 శాతం పెరిగి దాదాపు 20,000కు చేరుకోవచ్చని అంచనా వేసింది. కనీసం 3 కోట్ల డాలర్ల (దాదాపు రూ.250 కోట్లు) సంపద కలిగిన వారిని ఈ జాబితాలో చేర్చినట్లు సంస్థ స్పష్టం చేసింది. "సంపద సృష్టి యుగంలో ప్రపంచంలోని అభివృద్ధి చెందుతున్న సంపత్తి, అవకాశాలకు భారత్ నిదర్శనంగా నిలిచింది. వచ్చే ఐదేళ్లలో భారత కుబేరులు 50 శాతం పెరగనుండటమే ఇందుకు సంకేతం" అని నైట్ ఫ్రాంక్ ఇండియా చైర్మన్, ఎండీ శిశిర్ బైజాల్ అన్నారు.

నివేదిక ముఖ్యాంశాలు..

- భారత కుబేరుల్లో 90 శాతం మంది సంపద 2024లో మరింత వృద్ధి చెందవచ్చని అంచనా. 63 శాతం మంది సంపద విలువ 10 శాతంపైనే పెరిగే అవకాశం ఉంది.
- 2028 చివరినాటికి ప్రపంచవ్యాప్తంగా యూహెచ్ఎన్‌డబ్ల్యూఐలు మరో 28.1 శాతం పెరిగి 8,02,891కి చేరుకోవచ్చని అంచనా. గత ఏడాదిలో వీరి సంఖ్య 4.2 శాతం పెరిగి 6,01,300కు చేరుకుంది.
- గత సంవత్సరం కుబేరుల సంఖ్య పెరుగుదల పరంగా, 9.7 శాతం వృద్ధితో టర్కీ అగ్రస్థానంలో ఉంది. అమెరికాలో 7.9 శాతం, భారత్‌లో 6.1 శాతం, దక్షిణ కొరియాలో 5.6 శాతం, స్విట్జర్లాండ్‌లో 5.2 శాతం వృద్ధి నమోదైంది.

17% పెట్టుబడులు విలాస వస్తువులపైనే..

భారత కుబేరుల్లో విలాస వస్తువులపై మోజు ఎక్కువేనని నైట్‌ఫ్రాంక్ పేర్కొంది. వారు తమ పెట్టుబడి సొమ్ములో 17 శాతం అత్యంత ఖరీదైన గడియారాలు వంటి లగ్జరీ ఉత్పత్తులు, పెయింటింగ్స్, ఆభరణాలు వంటి వాటికి కేటాయిస్తున్నట్లు తెలిపింది. వారు వాటిని కలిగి ఉండటంలో లభించే సంతోషమే ఇందుకు కారణమని కంపెనీ సర్వేలో వెల్లడైంది.

సంపదలో 32 శాతం స్థిరాస్తుల కొనుగోలుకు..

భారత కుబేరులు తమ సంపదలో 32 శాతం దేశ, విదేశాల్లో స్థిరాస్తుల కొనుగోలుకు కేటాయించినట్లు ఆ నివేదికలో తెలిపారు. వీరి స్థిరాస్తుల పోర్ట్‌ఫోలియోలో 14 శాతం విదేశాల్లోనివేనని పేర్కొంది. ఈ నివేదిక ప్రకారం సగటున, ఒక భారత కుబేరుడు 2.57 ఇళ్లు కలిగి ఉన్నారు. 28 శాతం మంది తమ రెండో ఇంటిని గత ఏడాదిలో అద్దెకిచ్చారు. భారత కుబేరుల్లో 12 శాతం మంది ఈ ఏడాదిలో కొత్త గృహం కొనుగోలు ఆలోచనలో ఉన్నారు. దాదాపు ఇంతే శాతం మంది గత ఏడాదిలోనే కొత్త ఇళ్లు కొనుగోలు చేశారని నివేదిక తెలిపింది. భారత సంపన్నులకు స్థిరాస్తులు ప్రధాన పెట్టుబడి మార్గమని పేర్కొంది. లగ్జరీ ఫ్లాట్లు, గృహాల కొనుగోళ్లు, ధరల్లో వృద్ధితో నైట్ ఫ్రాంక్ ప్రైమ్ ఇంటర్నేషనల్ రెసిడెన్షియల్ ఇండెక్స్‌లో ముంబై 8వ స్థానానికి ఎగబాకింది. ఢిల్లీ 37, బెంగళూరు 59వ స్థానాల్లో నిలిచాయి.

సునీల్ మిట్టల్‌కు 'నైట్‌హుడ్'

బ్రిటన్ అత్యున్నత పౌర పురస్కారం



లండన్: భారతీ ఎంటర్‌ప్రైజెస్ వ్యవస్థాపకులు, చైర్మన్ సునీల్ భారతీ మిట్టల్‌కు అరుదైన గౌరవం దక్కింది. బ్రిటన్ ప్రభుత్వం మిట్టల్‌ను గౌరవ నైట్‌హుడ్ అవార్డుతో సత్కరించింది. కింగ్ చార్లెస్-3 చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును బుధవారం అందుకున్నారు. కింగ్ చార్లెస్-3 నుంచి ఈ ప్రతిష్ఠాత్మక, అత్యున్నత పౌర పురస్కారాన్ని అందుకున్న తొలి భారతీయుడు ఈయనే. ఉభయ వాణిజ్య సంబంధాల బలోపేతానికి కృషి చేసినందుకు ఆయనకు ఈ పురస్కారం లభించింది. "బ్రిటన్ రాజు నుంచి ఈ అవార్డు అందుకోవడం గౌరవంగా భావిస్తున్నాను' అని మిట్టల్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. గతంలో రతన్ టాటా (2009లో), రవిశంకర్ (2001), జంషెడ్ ఇరానీ (1997) కూడా బ్రిటన్ రాణి 'ఎలిజబెత్-2' నుంచి గౌరవ నైట్‌హుడ్ పురస్కారాన్ని అందుకున్నారు. సునీల్ మిట్టల్ ప్రస్తుతం ఇండియా-యూకే సీఈఓ ఫోరమ్ సభ్యులుగా ఉన్నారు. గతంలో యూనివర్సిటీ ఆఫ్ లీడ్స్, న్యూకాసిల్ యూనివర్సిటీ నుంచి హానరరీ డాక్టర్ ఆఫ్ సివిల్ లా అవార్డులను అందుకున్నారు. అంతేకాదు, కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ సలహాదారుల బృందంలో సభ్యుడిగానూ ఉన్నారు. అలాగే, లండన్ బిజినెస్ స్కూల్ (ఎల్‌బీఎస్) గవర్నింగ్ బాడీకి సేవలందించారు. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ పొలిటికల్ సైన్స్‌లో భారత సలహా బృందం సభ్యులుగానూ పనిచేశారు.

హైదరాబాద్ మైక్రోసాఫ్ట్ కేంద్రం
సందర్శించిన బిల్‌గేట్స్



హైదరాబాద్: మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ మంగళవారం హైదరాబాద్‌లోని ఇండియా డెవలప్‌మెంట్ సెంటర్‌ను (ఐడీసీ) సందర్శించారు. ఐడీసీ ఏర్పాటై 25 సంవత్సరాలు నిండిన సందర్భంగా ఈ కేంద్రాన్ని సందర్శించిన గేట్స్ కొందరు మేధోవంతులైన ఇంజనీరింగ్ సిబ్బందితో భేటీ అయ్యారు. కృత్రిమ మేధ (ఏఐ) చోదక భారతదేశానికి అవకాశాలు అపారంగా ఉన్నాయన్న ఆశాభావం ప్రకటించారని మేనేజింగ్ డైరెక్టర్ రాజీవ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. బిల్ గేట్స్ ఆకాంక్షలను అనుగుణంగా ఏఐ, క్లౌడ్, సెక్యూరిటీ, గేమింగ్ విభాగాల్లో ఐడీసీ మరింతగా కృషి చేస్తుందని చెప్పారు. 1998లో ఇన్నోవేషన్ కేంద్రంగా అభివృద్ధి చెందాలన్న ఆకాంక్షతో బిల్ గేట్స్ ఈ కేంద్రాన్ని స్థాపించారని పేర్కొన్నారు. ఈ 25 సంవత్సరాల కాలంలో అజ్యూర్, విండోస్, ఆఫీస్, బింగ్, కోపైలట్ వంటి ప్రపంచ శ్రేణి ఉత్పత్తులు, ఏఐ అప్లికేషన్ల అభివృద్ధిలో ఈ కేంద్రం కీలక పాత్ర పోషించిందని ఆ ప్రకటనలో తెలిపారు. మైక్రోసాఫ్ట్ చైర్మన్, సీఈఓ సత్య నాదెళ్ల కూడా తన ఇటీవలి పర్యటనలో ఏఐలో భారత్‌కు అపార అవకాశాలున్న విషయం ప్రస్తావించారని గుర్తు చేశారు.

రూ.6 లక్షల కోట్ల సంపద ఆవిరి

అమ్మకాల ఒత్తిడితో 800 పాయింట్లు కుంగిన సెన్సెక్స్




ముంబై: లాభాల స్వీకారంతో స్టాక్‌మార్కెట్ బుధవారం కుదేలైంది. సెన్సెక్స్ 790.34 పాయింట్ల నష్టంతో 72,304.88 వద్ద ముగియగా నిఫ్టీ 247.20 పాయింట్లు నష్టపోయి 21,951.15 వద్ద స్థిరపడింది. ఒక్క రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్ల అమ్మకాలతోనే సెన్సెక్స్ 186 పాయింట్లు నష్టపోయింది. సెన్సెక్స్ ఒక దశలో 876.93 పాయింట్లు నష్టపోయి 72,222.29 పాయింట్ల ఇంట్రా డే కనిష్ఠ స్థాయిని తాకింది. స్మాల్‌క్యాప్, మిడ్ క్యాప్ సూచీలు కూడా బుధవారం 1.82 శాతం నుంచి 1.94 శాతం వరకు నష్టపోయాయి. ఈ అమ్మకాల హోరుతో బీఎస్ఈలో లిస్టింగ్ అయిన కంపెనీల షేర్ల మార్కెట్ విలువ రూ.6.02 కోట్లు తుడిచి పెట్టుకు పోయింది.

ఎందుకంటే ?: గురువారం ఫిబ్రవరి నెల ఎఫ్ అండ్ ఓ సెటిల్‌మెంట్స్‌కు చివరి రోజు కావడం, ప్రధాన అంతర్జాయ మార్కెట్లు నష్టాల్లో ట్రేడవడం, ఎఫ్‌పీఐల అమ్మకాలు, లాభాల స్వీకరణ మార్కెట్‌ను బాగా దెబ్బతీశాయి. అమెరికా కేంద్ర బ్యాంకు వడ్డీరేట్లు ఇప్పట్లో తగ్గించకపోవచ్చన్న వార్తలు, గురువారం వెలువడే జీడీపీ గణాంకాలు అంత ఆశాజనకంగా ఉండకపోవచ్చన్న అంచనాలూ మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి.

వొడాఫోన్ ఐడియా షేర్లు ఢమాల్ : వొడాఫోన్ ఐడియా కంపెనీ షేర్లు బుధవారం మదుపరులకు చుక్కలు చూపించాయి. అమ్మకాలు హోరెత్తడంతో బీఎస్ఈలో ఈ కంపెనీ షేర్లు 13.99 శాతం నష్టంతో రూ.13.65 వద్ద ముగిశాయి. దీంతో బుధవారం ఒక్క రోజే కంపెనీ మార్కెట్ క్యాప్ రూ.10,806.71 కోట్లు తుడిచి పెట్టుకు పోయి రూ.66,447.95 కోట్లకు చేరింది.


యూకేలో టాటాల ఈవీ బ్యాటరీల ఫ్యాక్టరీ

లండన్: టాటా గ్రూప్ బ్రిటన్‌లో అతి పెద్ద విద్యుత్ వాహనాల (ఈవీ) బ్యాటరీల తయారీ ప్లాంట్ ఏర్పాటు చేస్తోంది. తన అనుబంధ సంస్థ అగ్రటాస్ ద్వారా టాటా గ్రూప్ బ్రిటన్ వాయువ్య ప్రాంతంలోని సోమర్‌సెట్‌లో ఈ ప్లాంట్ ఏర్పాటు చేయనుంది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	62,830 ▼	57,590 ▼	75,400 ▼
ముంబై	62,140 ▼	56,920 ▼	69,340 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



28వ తేదీ		విజయవాడ	460
హైదరాబాద్	460	విశాఖపట్నం	500
29వ తేదీ		వరంగల్	462
చిత్తూరు	543	దజను గుడ్లు రూ.72	
గోదావరి	460		

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. **వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**



హైదరాబాద్	135	గోదావరి	139
వరంగల్	135	విజయవాడ	139
కరీంనగర్	135	గుంటూరు	139
మహబూబ్‌నగర్	135	ఒంగోలు	139
కర్నూలు	135	చిత్తూరు	144
విశాఖపట్నం	127		

తెలుగు రాష్ట్రాల్లో యారీ రైడర్ యాప్ విస్తరణ

హైదరాబాద్: ఓపెన్ నెట్‌వర్క్ డిజిటల్ కామర్స్ (ఓఎన్‌డీసీ) ఆధారిత 'యారీ' రైడర్ యాప్ తన సేవలను మరింత విస్తరిస్తోంది. ప్రస్తుతం హైదరాబాద్‌కే పరిమితమైన ఈ యాప్ ఏప్రిల్ నెలాఖరుకల్లా తన సేవలను వరంగల్, విజయవాడ, తిరుపతి, వైజాగ్‌లకు విస్తరించనుంది. ఈ యాప్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ (సీబీఓ) పారితోష్ వర్మ ఈ విషయం వెల్లడించారు. రోజుకు రూ.25 కమిషన్‌తో ఆటో డ్రైవర్లు ఎవరైనా తమ రైడింగ్ యాప్‌లో చేరవచ్చన్నారు. క్యాబ్‌లకు సంబంధించి రోజువారీ కమిషన్‌ను ఇంకా ఖరారు చేయాల్సి ఉందన్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో 30,000 ఆటో రిక్షాలు, మూడు వేల క్యాబ్‌లు 'యారీ' యాప్ ద్వారా సేవలు అందిస్తున్నాయి. వచ్చే నెలాఖరుకల్లా ఈ సంఖ్యను 50 వేల ఆటో రిక్షాలు, 10 వేల క్యాబ్‌లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు వర్మ తెలిపారు

పసుపు క్వింటా రూ. 14,225

» నిజామాబాద్ మార్కెట్‌లో రికార్డు ధర

నిజామాబాద్, హైదరాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో పసుపు రికార్డు స్థాయిలో ధర పలికింది. వన్నెల్ గ్రామానికి చెందిన పన్నాల మహిత 16 క్వింటాళ్ల కాడి రకం పసుపును బుధవారం మార్కెట్‌కు తీసుకురాగా ఈ ధర వచ్చింది. ఈ సంవత్సరం ఇదే అత్యధిక ధర. అదే విధంగా కొంత మంది రైతులకు కూడా క్వింటాలుకు 14వేలపైనే ధర వచ్చింది. కాగా గోల రకం పసుపు రూ.12,029 ధర పలికింది. సాగు విస్తీర్ణం తగ్గడం, అదే సమయంలో పసుపునకు డిమాండ్ పెరగడం వల్ల ఎక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు.

పసుపు రైతులకు శాశ్వత మేలు చేయండి: సీఎం

నిజామాబాద్ మార్కెట్‌లో బుధవారం పసుపుకు రికార్డు ధర దక్కడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'ఎక్స్' వేదికగా సంతోషం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం త్వరగా పసుపు బోర్డు ఏర్పాటు చేస్తే రైతులకు శాశ్వత మేలు జరుగుతుందని, తక్షణం ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని డిమాండ్ చేశారు.

అహోబిలం నారసింహుడికి పట్టువస్త్రాలు

» తొలిసారిగా సమర్పించిన రేవంత్ సర్కార్

రుద్రవరం, ఫిబ్రవరి 28: నంద్యాల జిల్లాలో ప్రముఖ విష్ణు క్షేత్రమైన అహోబిలం నరసింహస్వామికి తెలంగాణ ప్రభుత్వం తొలిసారిగా పట్టువస్త్రాలను సమర్పించింది. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం మేరకు దేవదాయశాఖ కమిషనర్ అనిల్‌కుమార్, గద్వాలజిల్లా జోగులాంబ దేవస్థానం ఈవో పురందర్‌కుమార్‌లు బుధవారం సంప్రదాయబద్ధంగా పట్టువస్త్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా అహోబిల క్షేత్ర అధికారులు, అర్చకులు స్పందించారు. కాకతీయ ప్రతాప రుద్ర మహారాజు శైవ భక్తుడని, రుద్రవరంలో ఓ సూర్యోదయాన శివలింగాన్ని పూజిస్తుండగా శివలింగంలోనే నరసింహస్వామి రూపం కనిపించిందని తెలిపారు. కాకతీయ కాలం నుంచే స్వామికి కైంకర్యం చేసేవారని, తెలంగాణ నుంచే పూర్వం దేవస్థానానికి కైంకర్యాలు అందేవని పేర్కొన్నారు. ఆ సంప్రదాయాన్ని తిరిగి తొలిసారిగా తెలంగాణ ప్రభుత్వం లక్ష్మీనరసింహస్వామికి పట్టువస్త్రాల సమర్పణతో ప్రారంభించినట్లు అధికారులు వెల్లడించారు.

ఎంత కష్టమైనా హామీలు అమలు: పొంగులేటి



ఖమ్మం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం నడుస్తోందని, ఈ రాజ్యంలో ప్రజలకు ఇచ్చిన హామీలు ఎంత కష్టమైనా ప్రభుత్వం నెరవేర్చి తీరుతుందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఇచ్చినమాట ప్రకారం ఆరు గ్యారంటీలలో నాలుగు గ్యారంటీలు అమలు చేసి చూపించామని, మరో రెండు గ్యారంటీలు కూడా త్వరలోనే అమలు చేస్తామని తెలిపారు. ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గంలో బుధవారం మంత్రి విస్తృతంగా పర్యటించారు. ఖమ్మంరూరల్ మండలం వెంకటగిరిలో రూ.2.65కోట్లతో మినీ క్రీడా మైదానానికి శంకుస్థాపన చేసిన తర్వాత కూసుమంచి మండలంలో కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం తిరుమలాయపాలెం మండలం మహ్మదాపురంలో రూ.5 కోట్లతో గిరిజన రెసిడెన్షియల్ పాఠశాలకు శంకుస్థాపన చేశారు.

కమలం గూటికి బీఆర్ఎస్ ఎంపీ రాములు



నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్‌కు వరుసగా ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. నాగర్‌కర్నూల్ బీఆర్ఎస్ సిటింగ్ ఎంపీ పోతుగంటి రాములు గురువారం ఢిల్లీలో బీజేపీలో చేరనున్నారు. ఆ పార్టీ అధ్యక్షులు జేపీ నడ్డా సమక్షంలో ఆయన చేరికకు లాంఛనాలు పూర్తయ్యాయి. బీఆర్ఎస్ నుంచి గెలిచినప్పటికీ పార్టీ పరంగా ఎంపీ రాములు అనేక అవమానాలను ఎదుర్కొన్నారు. ఆయన కుమారుడు కల్వకుర్తి జడ్పీటీసీ సభ్యుడు భరత్‌ప్రసాద్‌కు నాగర్‌కర్నూల్ జడ్పీ చైర్మన్ పీఠం దక్కే అవకాశాలున్నప్పటికీ అప్పట్లో బీఆర్ఎస్ సిటింగ్ ఎమ్మెల్యేలు వ్యతిరేకించడంతో అధిష్ఠానం తిరస్కరించింది. పార్టీ వ్యవహారాల్లో కూడా అంటీముట్టనట్లుగా చూడటంతో అనేక సందర్భాల్లో ఆయన తీవ్ర మనోవేదనకు లోనయ్యారు. ఈ నేపథ్యంలో ఎంపీ రాములు పార్టీ మారాలని నిర్ణయించుకున్నారు. ఆయనతో పాటు మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డికి కుడిభుజంగా ఉన్న జక్కా రఘునందన్‌రెడ్డి కూడా కమలం కండువా కప్పుకోనున్నారు.

బీజేపీలోకి పీవీ తనయుడు?

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని పీవీ నరసింహారావు తనయుడు పీవీ ప్రభాకర్‌రావు బీజేపీలో చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి. పార్టీ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్‌తో పార్టీ నేతలు కొందరు మంగళవారం ఈ విషయంపై చర్చించినట్లు సమాచారం. బీఎల్ సంతోష్ కూడా ప్రభాకర్‌రావుతో ఫోన్‌లో మాట్లాడినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఇటీవల కేంద్ర ప్రభుత్వం పీవీ నరసింహారావుకు భారతరత్న పురస్కారాన్ని ప్రకటించిన తర్వాత ఆయన కుటుంబసభ్యులు హర్షాతిరేకం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో.. ప్రభాకర్‌రావును పార్టీలో చేర్చుకుంటే ప్రయోజనం చేకూరుతుందని పార్టీ భావిస్తోంది. కాగా, ప్రభాకర్‌రావును ఎక్కడనుంచి పోటీ చేయించాలో నిర్ణయించాల్సి ఉందని, సికింద్రాబాద్, మల్కాజిగిరి నియోజకవర్గాల్లో పోటీ చేస్తే ఆయన సులభంగా గెలుస్తారని కొందరు అభిప్రాయపడుతున్నారు. అయితే ఈ సీట్లలో ఈటల రాజేందర్‌తో పాటు పలువురు కీలక నేతల పేర్లు పరిశీలనలో ఉన్నందున అధిష్ఠానం పునరాలోచనలో పడిందని తెలుస్తోంది.

దుబ్బాక అభివృద్ధి నిధులు కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌కా?

» హైకోర్టులో దావా.. వివరణివ్వాలని ప్రభుత్వానికి నోటీసులు

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): దుబ్బాక నియోజకవర్గ ప్రత్యేక అభివృద్ధి నిధులను కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జికి కేటాయించడంపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ వ్యవహారంలో కౌంటర్ దాఖలు చేయాలని ప్రణాళికా, ఆర్థిక, పంచాయతీ రాజ్ శాఖల ముఖ్య కార్యదర్శులతో పాటు సిద్దిపేట కలెక్టర్‌కు నోటీసులు జారీ చేసింది. నియోజకవర్గ ప్రత్యేక అభివృద్ధి నిధులను కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌లకు కేటాయించడాన్ని సవాల్ చేస్తూ దుబ్బాక మండలం తిమ్మాపూర్ ఎంపీటీసీ సభ్యురాలు మాధవి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె. శరత్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. రూ.3.5 కోట్ల నిధులను ఎమ్మెల్యేకు కాకుండా అధికార పార్టీ నేతకు కేటాయిస్తూ జిల్లా కలెక్టర్ ప్రొసీడింగ్స్ ఇవ్వడం చెల్లదని పేర్కొన్నారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. వివరణ ఇవ్వాలని ఆదేశిస్తూ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ నాలుగు వారాలకు వాయిదా వేసింది.

గురుకుల డిగ్రీ లెక్చరర్ పోస్టుల తుది ఫలితాలు

హైదరాబాద్, ఫిబ్రవరి28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సంక్షేమ గురుకులాల్లోని డిగ్రీ లెక్చరర్ పోస్టులకు సంబంధించిన తుది ఫలితాలను ట్రిబ్ బుధవారం వెల్లడించింది. ఫలితాల జాబితాను వెబ్‌సైట్‌లో గురుకుల బోర్డు అందుబాటులో ఉంచింది. మొత్తం 793 పోస్టులకు 1:2 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేసి సర్టిఫికెట్ వెరిఫికేషన్, డెమోను బోర్డు నిర్వహించింది. 793 పోస్టులకుగాను ప్రస్తుతం 643పోస్టులకే తుది జాబితా ఇచ్చారు.

ఐదుగురు ఐఏఎస్ అధికారుల బదిలీ

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పలువురు అధికారులను బదిలీ చేసింది. ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌ను బదిలీ చేసి మెదక్ కలెక్టర్‌గా నియమించింది. మెదక్ కలెక్టర్ రాజర్షి షాను బదిలీ చేసి ఆదిలాబాద్ కలెక్టర్‌గా నియమించింది. కుమ్రం భీం-ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ బోర్కడె హేమంత్ సహదేవ్‌రావ్‌ను బదిలీ చేసి గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(జీహెచ్ఎంసీ) అదనపు కమిషనర్‌గా నియమించింది. ఇక్కడ ఉన్న అదనపు కమిషనర్ స్నేహ శబరీష్‌ను బదిలీ చేసి కుమ్రం భీం-ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్‌గా నియమించింది. నల్లగొండ అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) హేమంత్ కేశవ్ పాటిల్‌ను బదిలీ చేసి హైదరాబాద్ అదనపు కలెక్టర్(రెవెన్యూ)గా నియమించింది. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం 41 మంది స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు, డిప్యూటీ కలెక్టర్లనూ ప్రభుత్వం బదిలీ చేసింది. ఐదు జిల్లాలకు అదనపు(రెవెన్యూ) కలెక్టర్లను నియమించారు.

క్రైస్తవులకు అండగా ఉంటాం

ప్రజా ప్రభుత్వంలో మతపరమైన స్వేచ్ఛ.. క్రైస్తవ సంఘాల ప్రతినిధులతో భేటీలో రేవంత్

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): సమాజంలో శాంతి, ప్రేమ సందేశాలను పంచే క్రైస్తవులకు అండగా నిలుస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. చర్చిల ఆస్తులకు రక్షణ కల్పించడంతోపాటు, కొత్త చర్చిల నిర్మాణానికి అవసరమైన అనుమతులను సులభతరం చేస్తామని చెప్పారు. క్రైస్తవుల శ్మశాన వాటికలకు అవసరమైన స్థలం కేటాయిస్తామన్నారు. బుధవారం సచివాలయంలో మెదక్ డయాసిస్ బిషప్ పద్మారావు, రెవరెండ్ జాన్ జార్జ్, డాక్టర్ ఎంఎంజే కుమార్, శ్యామ్ అబ్రహం సహా వివిధ చర్చిలకు చెందిన క్రైస్తవ సంఘాల ప్రతినిధులు, ఇండిపెండెంట్ చర్చిల ప్రతినిధులు సీఎం రేవంత్‌ను కలిశారు. చర్చిల ఆస్తుల ఆక్రమణ సహా వారు ఎదుర్కొంటున్న పలు సమస్యలను సీఎంకు వివరించారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. అందరి సహకారంతో రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని, తమ ప్రభుత్వంలో మతపరమైన స్వేచ్ఛ ఉంటుందని చెప్పారు. మెదక్ చర్చిని సందర్శించాలన్న క్రైస్తవ ప్రతినిధుల వినతి పట్ల సీఎం సుముఖత వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు పీసీసీ అధ్యక్షుడి హోదాలో మెదక్ చర్చిని సందర్శించానని, తప్పకుండా మరోసారి సందర్శిస్తానని చెప్పారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 75 ఏళ్ల తరువాత రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ద్వితీయ శ్రేణి పౌరులుగా బతికే పరిస్థితులు నెలకొన్నాయని రేవంత్ ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో అల్లర్లు, ఘర్షణలు జరిగితే పాలకులు వాటిని అణిచివేసేవారని, కానీ.. పాలకులుగా ఉన్నవారే ఘర్షణలకు కారణమవుతున్నారంటూ మణిపూర్, గుజరాత్ ఘటనలను ఉదహరించారు. ఇది దేశ శ్రేయస్సుకు ఏమాత్రం మంచిదికాదని, అందరూ పరమత సహనం పాటించాలని సూచించారు. 2014లో కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వాలు ఏర్పడిన తరువాత భయానక పరిస్థితులు నెలకొన్నాయని సీఎం రేవంత్ అన్నారు. మోదీ ప్రభుత్వం తెచ్చిన ఆర్టికల్ 370 రద్దు, జీఎస్టీ, నోట్ల రద్దు, రైతు వ్యతిరేక బిల్లులకు కేసీఆర్ మద్దతు ఇచ్చారని తెలిపారు. రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి కావాలనుకుంటే యూపీఏ హయాంలోనే అయ్యేవారని, కానీ.. ఆయన ఏనాడూ పదవిని ప్రేమించలేదని, ప్రజలను మాత్రమే ప్రేమించారని తెలిపారు. తెలంగాణలో ఏర్పడ్డట్లుగానే కేంద్రంలోనూ లౌకిక ప్రభుత్వం ఏర్పాటుకు సహకరించాలని, రాహుల్‌గాంధీని ప్రధానమంత్రి చేసేందుకు మద్దతు తెలపాలని రేవంత్ కోరారు.

ఓఆర్ఆర్ టెండర్లపై విచారణ

(మొదటిపేజీ తరువాయి)

అన్ని కోణాల్లో తొలుత హెచ్ఎండీఏ పరిధిలో విచారణ జరపాలని ఆదేశించారు. టెండర్లలో అవకతవకలు, అనుసరించిన విధానాలు, ఫైళ్ల కదిలిన తీరుపై పూర్తి వివరాలతో ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని హెచ్ఎండీఏ జాయింట్ కమిషనర్ ఆమ్రపాలిని ఆదేశించారు. ఈ వ్యవహారానికి సంబంధించి ఏవైనా ఫైళ్లు మిస్సయినట్లు గుర్తిస్తే సంబంధిత అధికారులు, బాధ్యులైన ఉద్యోగులపై కేసులు నమోదు చేయాలన్నారు. హెచ్ఎండీఏ నుంచి పూర్తి నివేదిక అందిన తరువాత క్యాబినెట్‌లో చర్చించి సీబీఐ లేదా అదే స్థాయి దర్యాప్తు సంస్థకు అప్పగిస్తామని చెప్పారు. అంతకుముందు సీఎం అడిగిన పలు ప్రశ్నలకు అధికారులు సమాధానమిస్తూ.. టెండర్లకు ముందు ఓఆర్ఆర్‌పై టోల్ వసూళ్ల ద్వారా ఏడాదికి రూ.600 కోట్ల ఆదాయం వచ్చేదని తెలిపారు. దీంతో 30 ఏళ్లకు రూ.18 వేల కోట్ల ఆదాయం వచ్చేదని, అలాంటిది రూ.7380 కోట్లకే ఎలా అప్పగించారని అధికారులను సీఎం రేవంత్ ప్రశ్నించారు. హెచ్ఎండీఏ అనుసరించిన టెండరు విధానంతోనే ప్రభుత్వం రూ.15 వేల కోట్లకు పైగా నష్టపోయిందని సమావేశంలో ప్రాథమిక అంచనాకు వచ్చారు. హెచ్ఎండీఏ రెండు కంపెనీలతో డీపీఆర్ తయారు చేయించడం, ప్రభుత్వ ఆదాయానికి నష్టం తెచ్చే డీపీఆర్‌ను ఎంచుకోవాల్సిన అవసరం ఎందుకొచ్చిందనే దానిపైనా చర్చ జరిగింది. ఈ వ్యవహారంపై పలు అనుమానాలు ఉన్నందునే సమగ్రంగా విచారణ చేయిస్తే అన్ని నిజాలు బయటకు వస్తాయని సీఎం అభిప్రాయపడ్డారు. టెండరు దక్కించుకున్న సంస్థ.. ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందాన్ని చూపించి 49 శాతం వాటాను విదేశీ కంపెనీలకు అప్పగించిందని అన్నారు. విదేశీ కంపెనీలతో ఆ సంస్థ చేసుకున్న లావాదేవీలపై కూడా విచారణ జరపాల్సిన అవసరం ఉందన్నారు.



సచివాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ఓఆర్ఆర్ లోపలంతా ఒక యూనిట్..

ఔటర్ రింగ్‌రోడ్డు లోపల ఉన్న ప్రాంతాన్నంతా ఒక యూనిట్‌గా తీసుకుని హైదరాబాద్ అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. క్రమంగా రీజినల్ రింగురోడ్డు(ఆర్ఆర్ఆర్) వరకు హెచ్ఎండీఏ పరిధిని విస్తరించాలన్నారు. ఓఆర్ఆర్ నుంచి ఆర్ఆర్ఆర్‌కు అనుసంధానం ఉండేలా రేడియల్ రోడ్లు నిర్మించాలని అన్నారు. మాస్టర్ ప్లాన్- 5050కి అనుగుణంగా ప్రత్యేక కన్సల్టెన్సీతో నగర అభివృద్ధికి విజన్ డాక్యుమెంట్ తయారు చేయించాలని సూచించారు. హెచ్ఎండీఏ పరిధిలో దాదాపు 8374 ఎకరాల ల్యాండ్ పార్శిళ్లు ఉన్నాయని, వీటిలో 2031 పార్శిళ్లు వివిధ స్థాయిల్లో కోర్టు కేసుల్లో ఉన్నాయని అధికారులు చెప్పగా.. హెచ్ఎండీఏ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని, డిజిటల్, జీపీఎస్ విధానాలతో స్థలాల వివరాలను మ్యాపింగ్ చేయాలని సీఎం సూచించారు. తమ పరిధిలో ఉన్న భూముల నుంచి హెచ్ఎండీఏ ఆదాయం పెంచుకునే చర్యలు చేపట్టాలని, ప్రకటనల ద్వారా కూడా ఆదాయం సమకూర్చుకోవాలని అన్నారు. ల్యాండ్ పూలింగ్, ల్యాండ్ పార్శిల్స్, చెరువులు, కుంటలు ఆక్రమణలకు గురికాకుండా ప్రత్యేక అధికారులను నియమించి తగిన చర్యలు తీసుకోవడంపై సమావేశంలో చర్చించారు. ఇందుకు డీఐజీ స్థాయి ర్యాంకు ఐపీఎస్ అధికారి ఒకరిని నియమించాలని, ఇద్దరు ఎస్పీ ర్యాంకు అధికారులకు బాధ్యతలను అప్పగించాలని సీఎం సూచించారు.

దుబాయి తరహాలో మార్చాలి..

హైదరాబాద్ హుస్సేన్‌సాగర్ సమీపంలోని పరిసర ప్రాంతాలను ఆహ్లాదకరంగా ఉండే అందమైన పర్యాటక జోన్‌గా తీర్చిదిద్దాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఎన్టీఆర్ పార్కు, అంబేద్కర్ విగ్రహం, తెలంగాణ అమరుల జ్యోతి, నెక్లెస్ రోడ్డు నుంచి ఇందిరా పార్కు, సంజీవయ్యపార్కు వరకు ప్రపంచ స్థాయి పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేయాలని సూచించారు. హుస్సేన్‌సాగర్ చుట్టూ నిబంధనలకు విరుద్ధంగా ఉండే ఆక్రమణల్ని తొలగించి, పర్యాటకులు, నగర ప్రజలు తీరిక వేళలో ఆనందంగా గడిపేలా ఈ ప్రాంతాన్ని తీర్చిదిద్దాలని చెప్పారు. దుబాయి తరహాలో స్కైవాక్, ఫుడ్ స్టాల్స్, చిల్డ్రన్ అమ్యూజ్‌మెంట్ పార్క్, గ్రీనరీ ల్యాండ్ స్కేప్‌లు అభివృద్ధి చేయాలని ఆదేశించారు. అవసరమైతే ఆయా ప్రాంతాల్లో వాహనాల రాకపోకలను మరో మార్గంలో మళ్లించి, పర్యాటక జోన్లుగా మార్చాలన్నారు. ఇందుకు సంబంధించి వెంటనే అంతర్జాతీయ కన్సల్టెన్సీలతో ప్రాజెక్టు నమూనాలను తయారు చేయించాలన్నారు.

లేఅవుట్ ఖాళీ స్థలాల్లో ఆదర్శ పాఠశాలలు

హైదరాబాద్‌తోపాటు వరంగల్, కరీంనగర్ వంటి పట్టణాల్లో లేఅవుట్లలో కమ్యూనిటీ అవసరాలకు ఇచ్చిన స్థలాలు తమ ఆధీనంలో ఉన్నాయా? లేక ఆక్రమణలకు గురయ్యాయా? అని అధికారులను సీఎం ప్రశ్నించారు. ఖాళీ స్థలాలపై వెంటనే సర్వే చేయించాలని ఆదేశించారు. ఆ స్థలాల్లో ఆదర్శపాఠశాలలు ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. పాఠశాలల ఏర్పాటుకు ముందుకువచ్చే కార్పొరేట్ కంపెనీలు, పేరొందిన యాజమాన్యాలకు వీటిని అప్పగించాలని, ఆయా పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం ఉచిత ప్రవేశాలు ఉండేలా చూడాలని సీఎం సూచించారు.

నేడు డీఎస్సీ నోటిఫికేషన్!

(మొదటిపేజీ తరువాయి)

తెలిపింది. వీటితో కలిపి మొత్తం పోస్టుల సంఖ్య 11,062కు చేరింది. కాగా, కొత్త పోస్టులతో అనుబంధ నోటిఫికేషన్ జారీ చేస్తారన్న ప్రచారం జరిగినా.. మొత్తం పోస్టులకు కలిపి మళ్లీ నోటిఫికేషన్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు అనుగుణంగా పాత నోటిఫికేషన్‌ను రద్దు చేసింది. ఇటీవల గ్రూపు-1 పోస్టుల భర్తీలోనూ గత నోటిఫికేషన్‌ను రద్దు చేసి, కొత్త నోటిఫికేషన్‌ను జారీ చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం టీచర్ పోస్టుల విషయంలోనూ ప్రభుత్వం అదే విధానాన్ని అనుసరించింది. అయితే గతంలో దరఖాస్తు చేసిన అభ్యర్థులెవరూ మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేకుండా నిర్ణయం తీసుకుంది. కొత్త అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని పేర్కొంది.

ఉద్యోగ అర్హత వయోపరిమితి 51ఏళ్లకు పెంచాలని హైకోర్టులో పిటిషన్

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 సహా ఇతర ఉద్యోగ నోటిఫికేషన్‌లలో అభ్యర్థుల గరిష్ఠ వయోపరిమితిని 44 నుంచి 51 ఏళ్లకు పెంచాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్ దాఖలయింది. గ్రూప్-1 నోటిఫికేషన్ చాలా ఏళ్ల తర్వాత వచ్చినందున గరిష్ఠ వయోపరిమితిని పెంచాలని పేర్కొంటూ ఏ శ్రీనివాస్‌రెడ్డి, చలమళ్ల వెంకట్ నారాయణ, పీ సుధాకర్ తదితరులు ఈ పిటిషన్ వేశారు. దీనిపై జస్టిస్ పుల్ల కార్తీక్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ రాష్ట్రంలో దశాబ్దకాలం తర్వాత గ్రూప్-1 నోటిఫికేషన్ వచ్చిందని తెలిపారు. చాలామంది అభ్యర్థుల వయస్సు మీరిపోయిందని, వారందరికీ అవకాశం కల్పించేందుకు ఏకకాల లబ్ధి (వన్‌టైం మెజర్) కింద వయోపరిమితిని పెంచాలని కోరారు. తమిళనాడులో 51 ఏళ్ల వరకు సడలింపు ఇచ్చారని పేర్కొన్నారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. పిటిషనర్లు ఇచ్చిన వినతి పత్రాలపై చట్టప్రకారం నాలుగువారాల్లో నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీచేసింది. ఏ నిర్ణయం తీసుకున్నారో వారికి తెలియజేయాలని సూచించింది.

మేడిగడ్డ బ్యారేజీనా? బొందల గడ్డనా? కేసీఆర్ తేల్చాలి

» తొమ్మిదేళ్లు సంచులు నింపుకున్నారు
» మేడిగడ్డ పిల్లర్లు కుంగింది నిజం కాదా..?
» హరీశ్, కేటీఆర్‌లు సమాధానం చెప్పాలి
» సంజయ్.. పొన్నంకు క్షమాపణ చెప్పాలి
» టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మేడిగడ్డ బ్యారేజీనా.. బొందల గడ్డనా..? మాజీ సీఎం కేసీఆర్ తేల్చాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి డిమాండ్ చేశారు. నల్లగొండ సభ సందర్భంగా.. 'మేడిగడ్డనా.. బొందల గడ్డనా..? అక్కడ ఏం పీకడానికి పోయారు..?' అని కాంగ్రెస్ నేతలను ఉద్దేశించి కేసీఆర్ అన్న మాటలపై జగ్గారెడ్డి ఘాటుగా స్పందించారు. 'నీ అవినీతిని పీకడానికే మేడిగడ్డ పోయినం. అది బ్యారేజీనా.. బొందల గడ్డనా..? నువ్వే తేల్చాలి. ప్రజలకు దీనిపై స్పష్టత ఇవ్వాలి' అని అన్నారు. కేటీఆర్, హరీశ్ నీతులు చెబుతున్నారని.. రేవంత్ మాటల గురించి మాట్లాడే వీళ్లు.. కేసీఆర్ మాటలు తప్పు అని ఆయనకు ఎందుకు చెప్పడం లేదని నిలదీశారు. కేసీఆర్ ఒకటి అంటే.. తాము వంద అంటామని చెప్పారు. బుధవారం గాంధీ భవన్‌లో జగ్గారెడ్డి విలేకరులతో మాట్లాడారు. మేడిగడ్డ పిల్లర్లు కుంగింది నిజమా..? కాదా..? కేటీఆర్.. హరీశ్ సమాధానం చెప్పాలన్నారు. మీడియాలో వచ్చిన వార్తలు చూసి ఆ ప్రాజెక్టును రాహుల్ గాంధీ సందర్శించారని తెలిపారు. ప్రజాధనం దుర్వినియోగం జరగొద్దనే ఉద్దేశంతోనే.. బాధ్యులపై చర్యలు ఉంటాయని ఆయన చెప్పారని గుర్తు చేశారు. మేడిగడ్డలో ఏం జరిగిందో అసెంబ్లీలో నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చూపించారని.. ఆర్థిక పరమైన అంశాలు సీఎం రేవంత్.. డిప్యూటీ సీఎం భట్టి ప్రజలకు వివరించారని పేర్కొన్నారు. సీఎం.. మంత్రులు క్షేత్రస్థాయిలో మేడిగడ్డకు వెళ్లి బ్యారేజీ పరిస్థితిని చూసి వచ్చారని తెలిపారు. తొమ్మిదేళ్లు సంచులు నింపుకున్న బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు మేడిగడ్డ పర్యటనకు వెళతామని అంటున్నారని.. మరి రేవంత్ పిలిచినప్పుడు ఎందుకు రాలేదని ప్రశ్నించారు. దీనికి కేసీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో చర్చకు సైతం కేసీఆర్ ఎందుకు రాలేదని కేటీఆర్‌ను ప్రశ్నించారు. కేసీఆర్ లేకుండా మేడిగడ్డ పోయినా వృథా ప్రయాస అన్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ పట్ల బండి సంజయ్ మాటలు సరికాదని.. తక్షణమే సంజయ్ క్షమాపణ చెప్పాలని జగ్గారెడ్డి డిమాండ్ చేశారు. శ్రీరాముడిని ప్రధాని మోదీ, సంజయ్, కిషన్‌రెడ్డిలే మొక్కుతున్నట్టు.. దునియాలో ఎవరు మొక్కడం లేదన్నట్లు బిల్డప్ ఇస్తున్నారని విమర్శించారు. రాముడి పేరు మీద బీజేపీ నేతలు ఓట్లు అడిగి బతుకుతున్నారని మండిపడ్డారు. శ్రీరాముడు తల్లిని గౌరవించాడని.. మరి సంజయ్.. పొన్నం తల్లిని సంజయ్ ఎందుకు గౌరవించలేదని ప్రశ్నించారు. సంజయ్ క్షమాపణ చెప్పే వరకు ఆందోళనలు కొనసాగుతాయన్నారు. కడియం శ్రీహరి జీవితం గాలిపటం లాంటిదని.. ఆయనకు ఏం అర్థంకాక ఏదో మాట్లాడుతున్నారని వ్యాఖ్యానించారు. మెదక్ ఎంపీగా పోటీ చేయాలనే ఆసక్తి లేదని జగ్గారెడ్డి స్పష్టం చేశారు. టైం బాగా లేక సంగారెడ్డిలో ఓడిపోయానని అన్నారు.



గాంధీభవన్‌లో మాట్లాడుతున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

కేసీఆర్ క్షమాపణ చెప్పాలి!

కూలుతున్న మేడిగడ్డను ఆయన చూడాలి.. కావాలంటే హెలికాప్టర్‌ను సమకూరుస్తాం

» నీటిని మళ్లించటానికి బ్యారేజీలు కడతారు
» ఇక్కడ మాత్రమే నిల్వ చేసేందుకు కట్టారు
» అందువల్లే అవి దెబ్బతింటున్నాయి :ఉత్తమ్



హైదరాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): 'కాళేశ్వరం ప్రాజెక్టుకు చీఫ్ డిజైనర్, చీఫ్ ప్లానర్, చీఫ్ ఆర్కిటెక్చర్, చీఫ్ ఇంజనీర్ కేసీఆరే. ఆయనే వెళ్లి.. కూలిపోతున్న మేడిగడ్డను చూసి తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెబితే బాగుండేది. కాళేశ్వరంపై మాట్లాడాలని కేసీఆర్‌ను పలుమార్లు కోరాం. బ్యారేజీని పరిశీలించడానికి వెళ్తే హెలికాప్టర్ సమకూరుస్తామని చెప్పినా ఆయన రాలేదు' అని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. స్వతంత్ర భారతదేశంలో ఇంత అవినీతి, ఇంత మిస్ మేనేజ్‌మెంట్ ఎక్కడా జరగలేదని.. కాగ్, జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ), విజిలెన్స్ నివేదికల్లో ఇదే విషయం స్పష్టం చేశారని తెలిపారు. మార్చి 1వ తేదీన చలో మేడిగడ్డ కార్యక్రమం నిర్వహించాలని బీఆర్ఎస్ నిర్ణయించిన నేపథ్యంలో మంత్రి ఉత్తమ్ విలేకర్లతో మాట్లాడారు. మేడిగడ్డ నిర్మాణంలో కీలకంగా వ్యవహరించిన ఉన్నతాధికారులను ఇప్పటికే తొలగించామని, విజిలెన్స్ నివేదికపై న్యాయపరమైన సలహాలు తీసుకొని చట్టపరమైన చర్యలు చేపడుతామని ప్రకటించారు. సిటింగ్ జడ్జితో విచారణ జరపాలని కోరితే హైకోర్టు చీఫ్ జస్టిస్ తిరస్కరించారని, ఈ నేపథ్యంలో, మాజీ జడ్జితో కాళేశ్వరంపై విచారణ ఉంటుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా బ్యారేజీలను నీటిని మళ్లించడానికి కడతారని, వాటి సామర్థ్యం 2-4 టీఎంసీల కన్నా ఎక్కువ ఉండదని.. కాళేశ్వరంలో మాత్రం నీటిని నిల్వ చేయడానికి బ్యారేజీలను కట్టారని, అందువల్లే అవి దెబ్బతిన్నాయని ఉత్తమ్ తెలిపారు.

కేటీఆర్! సెన్స్ ఉండే మాట్లాడుతున్నావా?

ప్రాణహిత-చేవెళ్ల కింద తుమ్మిడిహెట్టి బ్యారేజీని 152 మీటర్ల ఎత్తుతో కడితే మహారాష్ట్రలో 1850 ఎకరాలు మాత్రమే ముంపునకు గురవుతుందని, మేడిగడ్డ బ్యారేజీ వద్దని మాజీ ఇంజనీర్లు నివేదిక ఇచ్చినా గత ప్రభుత్వం పట్టించుకోలేదని మంత్రి ఆక్షేపించారు. రూ.38,500 కోట్లతో పూర్తయ్యే ప్రాణహితను పక్కనపెట్టి, కాళేశ్వరం పేరుతో రూ.81 వేల కోట్లకు ప్రాజెక్టును చేర్చి... రూ.94 వేల కోట్లు ఇప్పటికే ఖర్చు చేశారని, కాళేశ్వరం పూర్తి కావాలంటే మొత్తం రూ.1.47 లక్షల కోట్లు కావాలన్నారు. రుణాలకు చెల్లింపులు, నిర్వహణ, కరెంటు బిల్లు అంతా కలిపి కాళేశ్వరం కింద ఏటా ఒక ఎకరాకు నీళ్లివ్వడానికి రూ.లక్ష కన్నా ఎక్కువే అవుతుందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును కామధేనువుగా, ఏటీఎంగా వాడుకున్నారని ఆరోపించారు. 'మీ ఉచిత సలహాల ఆధారంగా బ్యారేజీలకు మరమ్మతులు చేయం. నాశనం చేసిందే మీరు. ఎన్‌డీఎస్ఏ నివేదిక ఆధారంగానే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల మరమ్మతులు, పునరుద్ధరణ చేపడతాం' అని మంత్రి ప్రకటించారు. అన్నారం బ్యారేజీ నుంచి నీళ్లను ఎల్లంపల్లిలో ఎత్తిపోయాలని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ... సెన్స్ ఉండే మాట్లాడుతున్నావా అని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లలో నీళ్లు నిల్వ చేయరాదని ఎన్‌డీఎస్ఏ చెప్పిందన్నారు.

చిన్న కాళేశ్వరం తొలిదశను చేపట్టాలి

10 వేల ఎకరాలకు నీళ్లిచ్చే చిన్న కాళేశ్వరం (ముక్తేశ్వర్) ఎత్తిపోతల పథకం తొలిదశను వెంటనే చేపట్టాలని ఉత్తమ్ అధికారులను ఆదేశించారు. ఈ ప్రాజెక్టుకు ఇప్పటికే కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ) సాంకేతిక కమిటీ అనుమతి ఇచ్చినందున.. కేంద్రం నుంచి సత్వరసాగు నీటి వినియోగ పథకం కింద సహాయం తీసుకునేందుకు వీలుగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన భూసేకరణను చేపట్టాలని ఆదేశించారు.



4న రాష్ట్రానికి ప్రధాని మోదీ

(మొదటిపేజీ తరువాయి)

వస్తున్నారు. అక్కడ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం బహిరంగ సభలో పాల్గొంటారు. ఆ తర్వాత నాందేడ్ చేరుకొని, అక్కడి నుంచి తమిళనాడు వెళ్లి చెన్నైలో ఓ కార్యక్రమంలో పాల్గొంటారు. అదే రోజు రాత్రికి హైదరాబాద్ చేరుకొని, రాజ్‌భవన్‌లో బస చేస్తారు. మార్చి 5న ఉదయం 11 గంటలకు సంగారెడ్డి చేరుకుంటారు. అక్కడ పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని, శంకుస్థాపనలు చేస్తారు. మధ్యాహ్నం బహిరంగ సభలో పాల్గొంటారు. తర్వాత బేగంపేట విమానాశ్రయం నుంచి ఒడిసా వెళ్తారు. కాగా, 5న ప్రధాని మోదీ సభకు అనువైన ప్రాంతాన్ని బీజేపీ నాయకులు పరిశీలిస్తున్నారు. ఈ సభను సంగారెడ్డి లేదా పటాన్‌చెరు శివారులో నిర్వహించే అవకాశాలున్నాయని తెలిపారు. బహిరంగ సభా స్థలిపై గురువారం రాష్ట్ర స్థాయి నాయకత్వం సంగారెడ్డిలో సమావేశమై నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. పటాన్‌చెరు పట్టణ శివారులో ఔటర్ సర్వీస్ రోడ్డు పక్కన విశాల ప్రాంగణాన్ని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధులు రాణి రుద్రమదేవి, సంగప్ప, జిల్లా అధ్యక్షురాలు గోదావరి, తదితరులు పరిశీలించారు.


మేడారంలో గద్దెల వద్ద భక్తజనం

ఘనంగా 'తిరుగువారం'.. ముగిసిన మేడారం

మేడారం, ఫిబ్రవరి 28: మేడారం మహాజాతర ముగిసింది. అత్యంత వైభవంగా కొనసాగిన జాతర బుధవారం తిరుగువారం పండుగతో ముగిసింది. ఈ సందర్భంగా సంప్రదాయం ప్రకారం వనదేవతలకు వడ్డెలు(పూజారులు) ప్రత్యేక పూజలు నిర్వహించారు. గద్దెలు, గ్రామంలోని గుడిని శుద్ధి చేశారు. ఆడపడుచులు అలుకుపూతలతో రంగురంగుల ముగ్గులు వేసి.. అమ్మవార్ల గద్దెలను అందంగా అలంకరించారు. డోలు వాయిద్యాల నడుమ తల్లులకు ధూపదీప నైవేద్యాలు సమర్పించారు తిరుగువారం రోజున కూడా తల్లులు ఇక్కడే కొలువుదీరి ఉంటారనే నమ్మకంతో భక్తులు మేడారానికి పోటెత్తారు. సుదూర ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు వచ్చి జంపన్న వాగులో స్నానాలు ఆచరించి తల్లులకు బంగారాన్ని సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఫిబ్రవరి 7న గుడిమెలిగే పండుగతో మొదలై 14న మండమెలిగే పండుగ, 21, 22 తేదీల్లోన వన దేవతలు గద్దెలకు చేరడం, 23న భక్తుల మొక్కులు, 24న వనప్రవేశం కార్యక్రమాలు జరిగాయి.

1న జీతాలిస్తామని మాట తప్పారు: హరీశ్ రావు

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పరిధిలోని ఉద్యోగులందరికి ప్రతి నెలా ఒకటో తేదినే వేతనాలు చెల్లిస్తామని చెప్పిన కాంగ్రెస్ సర్కారు.. ఆచరణలో మాత్రం అమలుపర్చకుండా మాట తప్పిందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. గతేడాది డిసెంబర్‌కు గాను 10,632 మందికి, జనవరి, ఫిబ్రవరి నెలలకు సంబంధించి 12,660 మంది సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులకు వేతనాలు అందలేదని ఎక్స్ వేదికగా బుధవారం ఆయన ఆరోపించారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన కార్మికులకు మూడు నెలల నుంచి వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. మధ్యాహ్న భోజనానికి సంబంధించి వంటచార్జీలు, కోడిగుడ్ల బిల్లులు సైతం పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులకు వేతనాలతో పాటు పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని హరీశ్ డిమాండ్ చేశారు.

వైసీపీకి ఎంపీ మాగుంట రాజీనామా



ఒంగోలు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): అధికార వైసీపీకి మరో పెద్ద షాక్ తగిలింది. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి ఆ పార్టీకి రాజీనామా చేశారు. ఆత్మగౌరవం లేని చోట ఉండలేకనే రాజీనామా చేస్తున్నట్లు స్పష్టం చేశారు. తనకు ప్రకాశం జిల్లా ప్రజానీకంతో అవినాభావ సంబంధం ఉందని.. దానినెప్పటికీ కొనసాగిస్తానని తెలిపారు. మాగుంట కుటుంబం కేవలం గౌరవం మాత్రమే కోరుకుంటుందని, అది లేనిచోట ఉండలేక వైసీపీ నుంచి బయటకు వస్తున్నట్లు చెప్పారు. బుధవారమిక్కడ రామనగర్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 'మాగుంట కుటుంబం ఒంగోలులో గత 32 ఏళ్ల నుంచి రాజకీయాలు చేస్తోంది. మమ్మల్ని జిల్లా ప్రజానీకం అక్కున చేర్చుకుంది. రానున్న ఎన్నికలకు ఒక నిర్ణయం తీసుకున్నాం. దాని ప్రకారం నా కుమారుడు రాఘవరెడ్డిని పోటీలో ఉంచుతున్నాం' అని వివరించారు. ఏ పార్టీలో చేరేదీ త్వరలోనే వెల్లడిస్తానని తెలిపారు.

పార్టీని వీడలేక ఉంటున్నా: బాలినేని

మాగుంట రాజీనామాపై మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి స్పందించారు. సంచలన వ్యాఖ్యలు కూడా చేశారు. మాగుంటకు వైసీపీ టికెట్ ఇవ్వాలని సీఎంతో పోరాడానని.. అయినా తన ప్రయత్నం ఫలించలేదన్నారు. చివరకు ఆయన రాజీనామా చేశారని, తాను మాత్రం పార్టీని వీడలేకనే వైసీపీలోనే ఉంటున్నానని తెలిపారు.

జగన్ బీజేపీ నాయకుడే: షర్మిల


అమరావతి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఏపీ సీఎం జగన్ బీజేపీ నాయకుడేనని ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల స్పష్టం చేశారు. వైసీపీని అందరూ బీజేపీకి 'బీ' టీంగా చిత్రిస్తున్నారని.. కానీ బీజేపీలోనే వైసీపీ ఉందని ఆరోపించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తానంటూ మోదీ తిరుపతి బహిరంగ సభలో హామీ ఇచ్చిన చోటే.. శుక్రవారం ప్రత్యేక హోదా డిక్లరేషన్ పేరిట బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

వైసీపీలోకి ఐఏఎస్ ఇంతియాజ్!

ఐఏఎస్ అధికారి ఏఎండీ ఇంతియాజ్ బుధవారం స్వచ్ఛంద పదవీ విరమణ(వీఆర్ఎస్) చేశారు. బుధవారం ఉదయం ఆయన వీఆర్ఎస్‌కు దరఖాస్తు చేస్తూ ప్రభుత్వానికి లేఖ రాశారు. మధ్యాహ్నానికి ఆ లేఖను ప్రభుత్వం ఆమోదించింది. సాయంత్రానికి వీఆర్ఎస్‌ను ఆమోదిస్తున్నట్లు ప్రభుత్వ ఉత్తర్వులు(జీవో-477)ను జారీ చేసింది. వాస్తవానికి 2025, మే 31 వరకు ఇంతియాజ్‌కు సర్వీసు ఉంది. అయినా ఆకస్మికంగాగా ఆయన వీఆర్ఎస్ తీసుకున్నారు. దీనికి గల కారణాలు ఏమిటో ఆయన తన దరఖాస్తులో ప్రస్తావించలేదని తెలిసింది. ప్రభుత్వం కూడా కారణాల గురించి ఆరాతీయకుండా ఆగమేఘాల మీద ఆమోదించింది. ఇంత వేగంగా వీఆర్ఎస్ తీసుకోవడానికి, ప్రభుత్వం శరవేగంగా ఆమోదించడానికి కారణం.. ఆయన వైసీపీలోకి చేరనుండడమేనని తెలిపింది. త్వరలో జరగనున్న ఎన్నికల్లో వైసీపీ తరఫున ఆయన కర్నూలు ఎమ్మెల్యే స్థానం నుంచి పోటీచేయబోతున్నారని సమాచారం.

నా తల్లిని రాజకీయాల్లోకి లాగుతావా..?

- బతికున్న ఆమె ఆత్మఘోషిస్తుందని అంటావా
- గంగులతో కుమ్మక్కైన నీకు పోటీ చేసే అర్హత ఉందా
- బండి సంజయ్‌పై మంత్రి పొన్నం ప్రభాకర్ ఫైర్



వేములవాడ టౌన్/హుస్నాబాద్, ఫిబ్రవరి 28: 'మీ అమ్మకు పుట్టినావా..? అని నీచంగా మాట్లాడి నా తల్లిని రాజకీయాల్లోకి లాగుతావా..? బతికి ఉన్న మా అమ్మను పట్టుకొని.. ఆమె ఆత్మ ఘోషిస్తుందని మాట్లాడుతావా..?' అంటూ బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌పై.. మంత్రి పొన్నం ప్రభాకర్ విరుచుకుపడ్డారు. రాజన్న సిరిసిల్ల జిల్లా నాంపల్లి లక్ష్మీనరసింహస్వామిని బుధవారం పొన్నం దర్శించుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. "మీ అమ్మకు పుట్టినావా..? అని అమ్మ ప్రస్తావన తీసుకొచ్చింది ఎవడు..? అమ్మను రాజకీయాల్లోకి తెచ్చింది ఎవడు..? బతికి ఉన్న మా అమ్మ ఆత్మఘోషిస్తుందని ఎలా అంటావు..? నా అమ్మ జోలికి వచ్చావు.. జాగ్రత్త. భార్య మంగళ సూత్రం విలువ నీకు తెలుసా..? ఎన్నికల్లో ఓట్ల కోసం భార్య మంగళ సూత్రాన్ని అమ్ముకున్నావు. కరీంనగర్ ఎమ్మెల్యేగా మూడుసార్లు పోటీ చేసి గంగుల కమలాకర్‌తో కుమ్మక్కయి ఓడిపోయావు. ఒక జాతీయ పార్టీకి జాతీయ ప్రధాన కార్యదర్శిగా, ఎంపీగా ఉన్న నువ్వు.. కావాలని ఓడిపోయి.. నేను ఎంపీగా గెలిస్తే రాజీనామా చేస్తావా..? అని మాట్లాడుతున్నావు. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా ఓడిపోయిన నువ్వు రాజకీయ సన్యాసం చేశావా..? నా దయ, దాక్షిణ్యాల వల్ల కాంగ్రెస్ ప్యానల్‌తో అర్బన్ బ్యాంకు డైరెక్టర్ అయ్యావు. ఎన్నికల సమయంలో మత పరమైన విద్వేషాలను రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవాలని చూసే నీ రాజకీయ రంగు ప్రజలకు తెలుసు. రాముడి జన్మస్థలం ఎక్కడ..? రాముడి అక్షింతలు ఎక్కడ..? అని నేను మాట్లాడినట్లు అసత్య ప్రచారాలు చేస్తున్నావు. నిరూపిస్తే సజీవ దహనానికి కూడా నేను సిద్ధం. నేను రాముడిని ఆరాధించే వ్యక్తిని. మీరు ఓట్ల కోసం రాముడిని వాడుకునే వ్యక్తులు. నేను శాకాహార హిందువును, పెద్ద భక్తుడిని. మందు తాగను, మాంసం ముట్టను. నువ్వు పొద్దున లేస్తే మాంసం, మందు లేనిది బతకవు. అలాంటి నీవు నన్ను విమర్శించడమా..? " అని బండి సంజయ్‌పై మంత్రి పొన్నం ప్రభాకర్ ధ్వజమెత్తారు. సంజయ్ వ్యాఖ్యలకు తన తల్లి బాధపడుతోందని పొన్నం భావోద్వేగానికి లోనయ్యారు.

స్టార్టప్ ఆవిష్కరణలు భేష్

- 21 ఏళ్లలో బయో ఆసియా సదస్సులతో అనేక విజయాలు
- డాక్టర్‌గా, రాష్ట్ర ప్రథమ పౌరురాలిగా చాలా గర్వంగా ఉంది
- గ్రామీణ, పేద ప్రజలకూ టెక్నాలజీ అందాలి: గవర్నర్ తమిళిసై

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): "తమిళనాడులో రాజకీయ జీవితంలో అడుగు పెట్టనంతవరకూ వైద్యురాలిగా సేవలందించా. అల్ట్రాసౌండ్ నిపుణురాలిగా చేశాను. అనేక తీవ్రతరమైన వ్యాధులను ముందుగా గుర్తించేందుకు అల్ట్రా సౌండ్ టెక్నాలజీ ఉపయోగపడుతుంది. అయితే ఖర్చు ఎక్కువగా ఉందని అనేకమంది పేదలు దాన్ని వినియోగించుకోరు. ఫలితంగా ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఎన్నో చూశాను. అయితే తక్కువ ఖర్చుతో ఇక్కడ ఓ స్టార్టప్ అభివృద్ధి చేసిన రోబోటిక్ అల్ట్రాసౌండ్ టెక్నాలజీని చూశాక.. చాలా సంతోషంగా ఉంది" అని రాష్ట్ర గవర్నర్ తమిళిసై అన్నారు. బుధవారం హెచ్ఐసీసీలో జరిగిన బయోఆసియా ముగింపు సదస్సులో ఆమె పాల్గొని ప్రసంగించారు. వైద్యరంగం ఎదుర్కొంటున్న సమస్యలకు వినూత్న ఆవిష్కరణలతో పరిష్కారం చూపిన ఐదు స్టార్టప్‌లకు బయో ఆసియా స్టార్టప్ అవార్డులను అందజేశారు. వ్యాక్సిన్ల రవాణాలో ఉపయోగించే కోల్డ్ చైన్ టెక్నాలజీ, ఇతర ఆవిష్కరణలు తనను ఎంతగానో ఆకట్టుకున్నాయన్న గవర్నర్.. వాటిని అభివృద్ధి చేసిన స్టార్టప్‌లకు, వారిని గుర్తించి ప్రోత్సహిస్తున్న బయో ఆసియా సదస్సుకు అభినందనలు తెలిపారు. నోబెల్ విజేతలు సైతం వచ్చి ప్రసంగించడం ఈ సదస్సు విశిష్టతను తెలుపుతోందని ఆమె కొనియాడారు. కొవిడ్ సమయంలో తాను హైదరాబాద్‌లో భారత్ బయోటెక్ అభివృద్ధి చేసిన టీకానే వేసుకున్నట్టు గవర్నర్ తెలిపారు. ఒక వైద్యురాలిగా, రాష్ట్ర ప్రథమ పౌరురాలిగా.. బయో ఆసియా సాధించిన విజయాలు చూసి గర్విస్తున్నానన్నారు. స్టార్టప్‌లు అభివృద్ధి చేసిన ఆవిష్కరణలన్నీ పేద, గ్రామీణ ప్రజలకు అందినప్పుడే టెక్నాలజీ సార్థకం అవుతుందన్న ఆమె.. అలా అందేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. ముఖ్యంగా.. క్యాన్సర్లను ముందస్తుగా గుర్తించే టెక్నాలజీలు పేద, గ్రామీణ ప్రజలకు అందాలన్నారు. కాగా.. 20 ఏళ్ల క్రితం బయో ఆసియా సదస్సుకు నాంది పలికిన సీనియర్ ఐఏఎస్ అధికారి, మాజీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బీపీ.ఆచార్య మాట్లాడుతూ.. 2004లో బయో ఆసియా సదస్సును ప్రారంభించినప్పుడు ఇంతగా విజయం సాధిస్తుందని ఊహించలేదన్నారు. 2001లో జీనోమ్ వ్యాలీ ప్రారంభించినప్పుడూ.. దేశానికి బయోటెక్ హబ్‌గా మారుతుందని అనుకోలేదన్నారు. జీనోమ్ వ్యాలీ అభివృద్ధి వెనక అనేక సంవత్సరాల శ్రమ ఉందని గుర్తుచేసుకున్నారు. యానిమల్ బయో టెక్నాలజీ.. అభివృద్ధికి అవకాశమున్న కొత్త రంగమని, ఇక్కడ నేషనల్ యానిమల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ కూడా ఉండటంతో ఈ రంగంలో అనేక పరిశోధనలు చేయవచ్చని ఆచార్య పేర్కొన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. గత 20 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న బయో ఆసియా సదస్సును ఈ స్థాయికి తెచ్చిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈసారి సదస్సులో 2737 మంది అతిథులు, 200 మంది ఎగ్జిబిటర్లు, 750 మంది సందర్శకులు పాల్గొన్నట్టు ఆయన వెల్లడించారు. ఫార్చ్యూన్ 500 జాబితాలోని నాలుగు కంపెనీల సీఈవోలు హాజరయ్యారని వివరించారు. 50 మిలియన్ల డెంగీ వ్యాక్సీన్ల తయారీకి టకేడా ఒప్పందం, లైఫ్ సైన్స్ రంగంలో రూ.2000 కోట్ల పెట్టుబడులు, హెల్త్‌కేర్, లైఫ్ సైన్సెస్‌లో తొలి సీ4ఐఆర్ కేంద్రం వరల్డ్ ఎకనామిక్ ఫోరంతో కలిసి నెలకొల్పడం.. ఈసారి సదస్సు విశేషాలని తెలిపారు.





స్టార్టప్‌లకు అవార్డులు అందిస్తున్న గవర్నర్ తమిళిసై

దూరం నుంచే గుండె లయ వినొచ్చు!

- చిన్న లైట్‌తో ఈఎన్‌టీ సమస్యలూ తెలుసుకునే వీలు
- ఫిజియోథెరపీ అంచనాకు ఉపయోగపడే ఫీజీ డివైజ్
- శరీరం, మనసు సమన్వయాన్ని గుర్తించే యంత్రాలూ
- బయో ఆసియా 2024లో ఆకట్టుకున్న ఆవిష్కరణలు

హైదరాబాద్‌సిటీ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా హైదరాబాద్‌లో జరుగుతున్న బయో ఏసియా 2024 సదస్సు బుధవారం ముగిసింది. ఇందులో భాగంగా నిర్వహించిన ట్రేడ్ ఎక్స్‌పోలో పలు స్టార్టప్‌లు ప్రదర్శించిన ఉత్పత్తులు, నూతన ఆవిష్కరణలు అందరినీ ఆకట్టుకున్నాయి. వాటిలో మచ్చుకు కొన్ని..


స్టెతస్కోప్

రిమోట్ స్టెతస్కోప్

రోగి హృదయ స్పందనలు డాక్టర్ వినాలంటే.. ఇద్దరూ పక్కపక్కనే ఉండాలి. అలా కాకుండా.. అమీర్‌పేటలో ఉన్న పేషెంట్ గుండెలయను ఎక్కడో అమెరికాలో ఉన్న డాక్టర్ వినే వీలు కల్పించే స్టెతస్కోప్‌ను 'ఆబో' అనే సంస్థ తయారుచేసింది. దాని పేరు.. 'ఆబో వన్'. ఇది పేషెంట్ల గుండెలయను రికార్డ్ చేసి ఫార్వార్డ్ చేయగలదని.. రియల్‌టైమ్‌లోనూ వినిపించగలదని ఆబో ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ స్మార్ట్ స్టెత్ ధర.. 16500 రూపాయలు. చెవి, ముక్కు, గొంతుకు సంబంధించిన అనారోగ్యాలతో బాధపడే పేషెంట్ల సమస్యను డాక్టర్ ఎక్కడి నుంచైనా పర్యవేక్షించడానికి వీలు కల్పించే 'ఆబోస్కోప్'ను సైతం ఈ సంస్థ అందుబాటులోకి తెచ్చింది. దీని ధర రూ.9,900. అలాగే.. 'ఆబో ఎక్స్6' అనే పరికరంతో ఆరు రకాల వైటల్స్‌ను, ఆబో రింగ్‌తో నిద్ర, ఒత్తిడిని ట్రాక్ చేయడం సాధ్యమవుతుందని ఆబో ప్రతినిధులు చెబుతున్నారు. స్లీప్ అప్నియా తదితర సమస్యలున్న వారికి ఉపయోగపడే ఆబో రింగ్ ధర రూ.15-18 వేలు కాగా.. ఆబో ఎక్స్6 ధర రూ.18,900



ఫీజీ డివైజ్

ఫిజియోథెరపీ ఎస్సెస్‌మెంట్‌కు ఫీజీ

ఫిజియోథెరపీకి ఇటీవలి కాలంలో ప్రాముఖ్యం బాగా పెరిగింది. ఈ నేపథ్యంలో.. ఏ తరహా సమస్యకు ఏ తరహా థెరపీ అయితే సరిపోతుందో తెలిపే 'ఫీజీ' అనే డివైజ్‌ను స్టార్టప్ ల్యాబ్స్ తయారుచేసింది. ప్రపంచంలోనే మొట్టమొదటి స్మార్ట్ ఫిజియోథెరపీ టూల్‌కిట్ ఇది. మొబైల్ ఫోన్ లేదా ట్యాబ్‌తో దీన్ని కనెక్ట్ చేసుకుంటే ఎప్పటికప్పుడు నివేదికలనూ పొందవచ్చు. న్యూరోలాజికల్, వెన్నెముక సమస్యల బాధితులకు, ఆటలు ఆడుతూ గాయాలపాలైనవారికి, పెద్ద వయసులో వచ్చే సమస్యలకు ఇది బాగా తోడ్పడుతుందని దీని రూపకర్తలు చెబుతున్నారు.



ఆబో ఎక్స్6


ఆబో రింగ్

ఏకాగ్రతను కొలుస్తుంది

ఏ పని చేయడానికైనా ఏకాగ్రత ముఖ్యం. కానీ, ఆ ఏకాగ్రతను సాధించడమే కష్టం. శరీరానికి, మనసుకు మధ్య సమన్వయం లేకపోవడమే దీనికి కారణం. తాము రూపొందించిన సీసీటీఏ (కాన్సన్‌ట్రేషన్ అండ్ కో-ఆర్డినేషన్ ఎక్సర్‌సైజ్ టూల్).. శరీరానికి, మనసుకు మధ్య సమన్వయం కల్పించడంలో తోడ్పడుతుందని కోఎగ్నిస్ టెక్నాలజీస్ సంస్థ చెబుతోంది. అటెన్షన్ డెఫిషిట్ హైపర్ డిజార్డర్‌తో బాధపడేవారికి, లెర్నింగ్ డిజెబిలిటీ, ఆటిజం వంటి సమస్యలున్నవారికి ఈ పరికరం ఎంతగానో ఉపయోగపడుతుందని వారు పేర్కొన్నారు. దీంతో వ్యక్తుల్లో ఆత్మవిశ్వాసం పెరిగి ఏకాగ్రత మెరుగుపడుతుందని.. మెదడుకు, చేతికి సమన్వయం (బ్రెయిన్-హ్యాండ్) కూడా పెరుగుతుందని చెప్పారు.

హైదరాబాద్ ఫార్మా సంస్థలతో జట్టు కట్టేందుకు సిద్ధం

- క్వీన్‌లాండ్ ట్రేడ్ ప్రతినిధుల వెల్లడి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రపంచానికి కొవిడ్ వ్యాక్సిన్‌ను అందించిన హైదరాబాద్‌లోని ఫార్మా సంస్థలతో జట్టు కట్టేందుకు సిద్ధంగా ఉన్నామని క్వీన్‌లాండ్ ట్రేడ్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రతినిధులు స్పష్టం చేశారు. హెల్త్‌కేర్, వ్యాక్సినేషన్, ఔషధ పరిశోధనలు, క్లినికల్ ట్రయల్స్, టెక్నాలజీ మార్పిడి, శిక్షణ, బోధన రంగాల్లో భాగస్వామ్యం కోసం బయో ఆసియా సదస్సులో పాల్గొన్న దిగ్గజ ఫార్మా సంస్థలతో ఈమేరకు చర్చలు జరుపుతున్నామని వారు తెలిపారు. ప్రభుత్వ విధానాల కారణంగా రానున్న దశకాల్లో తెలంగాణలో క్వీన్‌లాండ్ దిగ్గజ సంస్థలు పెట్టుబడులు పెడతాయని వెల్లడించారు.

24 మందికి కన్నీళ్లు మిగిల్చిన 'ఒక్క నిమిషం'

(మొదటి పేజీ తరువాయి)

వచ్చింది. రవాణా సదుపాయం సరిగ్గా లేక కొన్ని చోట్ల.. సెంటర్లు దొరక్క మరికొన్ని చోట్ల విద్యార్థులు ఉరుకులు-పరుగులు పెట్టడం కనిపించింది. మాడ్గులపల్లికి చెందిన ఓ విద్యార్థి.. బస్సు ఆలస్యమైనా పరుగున కేంద్రానికి చేరుకున్నానని, అయినా.. తనను అనుమతించలేదని కన్నీళ్లు పెట్టుకున్నాడు. హాలియా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ముగ్గురు విద్యార్థినులు సెంటర్ వద్దే ఏడుస్తూ.. "మమ్మల్ని లోనికి పంపండి" అని పోలీసులను వేడుకోవడం కనిపించింది. నాగార్జున సాగర్ జూనియర్ కాలేజీ వద్ద కూడా ఐదుగురు విద్యార్థులకు ఈ నిబంధన అడ్డంకిగా మారింది. జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన పావని అనే విద్యార్థిని కూడా 10 నిమిషాలు ఆలస్యంగా రావడంతో.. పరీక్ష కేంద్రంలోకి అనుమతించలేదు. ఆమె దీనంగా రోదిస్తూ.. వెనుదిరగడం అక్కడి వారిని కలిచివేసింది. వికారాబాద్ జిల్లాలోనూ ఐదుగురు విద్యార్థులు ఆలస్యంగా వచ్చారంటూ.. పరీక్షలకు అనుమతించలేదు. దీంతో.. 'ఆలస్యం' నిబంధనను ఎత్తివేయాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్రంలో ఇంటర్మీడియట్ పరీక్షలు తొలిరోజు ప్రశాంతంగా జరిగాయి. ఇంటర్ ఫస్ట్ ఇయర్ సెకండ్ ల్యాంగ్వేజీ పేపర్-1 పరీక్షకు 5,07,754 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 19,641(3.86%) మంది గైర్హాజరయ్యారు. కరీంనగర్, నిజామాబాద్, జనగామ జిల్లాల్లో ఒక్కోటి చొప్పున మొత్తం 3 మాల్‌ప్రాక్టిస్ కేసులు నమోదైనట్లు అధికారులు తెలిపారు. కాగా.. ఇంటర్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు సీఎం రేవంత్ 'ఆల్ ద బెస్ట్' తెలిపారు. విద్యార్థులు ఒత్తిడికి లోనవ్వకుండా.. ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు.

నలిగిన బతుకులు!

- ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు
- ఐదుగురి దుర్మరణం
- సూర్యాపేట జిల్లాలో ఘటన
- సిద్దిపేట జిల్లా రాంపూర్‌లో బైక్, కారు ఢీ
- బైక్‌పై ఉన్న ఇద్దరు, కారులోని ఒకరి మృతి

మోతె, నంగునూరు, ఫిబ్రవరి 28: రోజూ కూలీ పనులకు వెళితే తప్ప బుక్కెడు బువ్వ దొరకని బడుగుజీవులు వారంతా! మిర్చి ఏరేందుకు పన్నెండు మంది కూలీలు పొద్దు పొద్దునే ఆటోలో బయలుదేరారు. ఒకట్రెండు నిమిషాల్లో మిర్చి చేనుకు చేరుకుంటారనగా ఘోరం జరిగింది. అండర్‌పాస్‌ను దాటుతుండగా ఆటోను ఓ ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఐదుగురు కూలీలు మృత్యువాతపడ్డారు. మరొకరు చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నారు. సూర్యాపేట జిల్లా మోతె మండల కేంద్రంలో ఈ రోడ్డు ప్రమాదం సంభవించింది. మృతుల్లో భార్యాభర్తలుండటం మరీ విషాదం. జిల్లాలోని మునగాల మండలం విజయరాఘవాపురం, రేపాలకు చెందిన మహిళా కూలీలు రోజూ వివిధ గ్రామాలకు మిర్చి ఏరేందుకు వెళుతుంటారు. బుధవారం ఆటోలో 11 మంది మహిళలు సహా 12మంది కూలీలు హుస్నేనాబాదకు బయలుదేరారు. ఉదయం 8 గంటలకు మోతెలోని అండర్‌పాస్ వద్దకు ఆటో చేరుకుంది. అదే సమయంలో ఖమ్మం నుంచి హైదరాబాద్ వెళ్తున్న మధిర డిపోకు చెందిన బస్సు అండర్‌పాస్ వద్ద ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటో మూడు పల్టీలు కొట్టింది. ఆటోలో ప్రయాణిస్తున్న వారిలో కందుల నాగమ్మ (60), చెరుకు నారాయణమ్మ(60), పోకల అనుసూయమ్మ (65) ఘటనాస్థలిలోనే మృతిచెందారు. క్షతగాత్రులను సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ రెమిడాల సౌభాగ్యమ్మ (58), కందుల గురువయ్య(63) మృతి చెందారు. మృతుల్లో కందుల గురువయ్య, నాగమ్మ భార్యాభర్తలు. చికిత్స పొందుతున్న వారిలో మరో మహిళా కూలీ పరిస్థితి విషమంగా ఉంది. ఆటోడ్రైవర్ పవన్ సహా ఏడుగురికి స్వల్ప గాయాలయ్యాయి. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం, అతివేగమే ప్రమాదానికి కారణమని స్థానికులు తెలిపారు. బస్సు డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.


చెవుల నారాయణమ్మ, కందుల నాగమ్మ(ఫైల్)


పోకల అనసూయమ్మ, రెమిడాల సౌభాగ్యమ్మ(ఫైల్)


ప్రమాదానికి కారణమైన బస్సు, దెబ్బతిన్న ఆటో

మరో ఘటనలో ముగ్గురి మృతి..


గురువయ్య(ఫైల్)

సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం రాంపూర్ శివారులో బుధవారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బైకును కారు ఢీ కొట్టి రోడ్డు కిందికి దూసుకెళ్లింది. ఈ ఘటనలో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు, కారులో ప్రయాణిస్తున్న వారిలో ఓ యువతి మృతి చెందారు. కొండపాక మండలం దుద్దెడ గ్రామానికి చెందిన జక్కుల అనిల్ కుటుంబ సభ్యులు, బంధువులు హుస్నాబాద్‌లో పెళ్లికి హాజరై కారులో తిరిగి వస్తున్నారు. ఈ వాహనం పాలమాకుల నుంచి బద్దిపడగ వైపు వెళ్తున్న బైకును ఢీ కొట్టి రోడ్డు కిందకు దూసుకెళ్లింది. ఈ ఘటనలో బైక్ పై ఉన్న నంగునూరు మండలం బద్దిపడగకు చెందిన కట్ట రవి (55), నాగరాజు పల్లికి చెందిన ముక్కెర ఐలయ్య (60) అక్కడికక్కడే మృతి చెందారు. కారులో ప్రయాణిస్తున్న వారిలో జక్కుల మమత (28) మృతిచెందింది. కారులోని మిగతాఏడుగురికి గాయాలయ్యాయి. వారిని సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ప్రపంచాన్ని ఐక్యం చేసిన మోదీ

- పాక్‌ను ఏకాకిని చేశారు.. ఉగ్రవాదాన్ని అంతం చేశారు: కిషన్‌రెడ్డి
- మహానీయులకు కాంగ్రెస్, బీఆర్ఎస్ అవమానం: సంజయ్
- సంజయ్ కాన్వాయ్‌పై కోడిగుడ్లతో దాడి


వంగరలో పీవీ విగ్రహానికి పూలమాల వేస్తున్న సంజయ్

జహీరాబాద్/భీమదేవరపల్లి/ఎల్కతుర్తి, ఫిబ్రవరి 28: ప్రధాని మోదీ ప్రపంచ దేశాలను ఐక్యం చేసి.. పాకిస్తాన్‌ను ఒంటరి చేశారని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. మోదీ హయాంలోనే భారత ప్రజలకు సమర్థ పాలన అందుతోందని చెప్పారు. విజయ సంకల్ప యాత్రలో భాగంగా సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో బుధవారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. 60 ఏళ్లలో ఐఎస్ఐ లాంటి ఉగ్రవాద సంస్థలతో చేతులు కలిపి కాంగ్రెస్ దేశాన్ని భ్రష్టు పట్టించిందని విమర్శించారు. ఉగ్రవాద సంస్థలకు మోదీ తగిన బుద్ధి చెప్పారని అన్నారు. ప్రపంచదేశాల ముందు పాకిస్తాన్‌ను ఏకాకి చేసిన ఘనత మోదీకే దక్కిందని తెలిపారు. మార్చి 5న సంగారెడ్డికి ప్రధాని వస్తున్నారని వెల్లడించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు మహానీయులను అవమానపరుస్తున్నాయని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ విమర్శించారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం, ఎల్కతుర్తి మండలంలోని పలు గ్రామాల్లో సంజయ్ బుధవారం పాదయాత్ర నిర్వహించారు. పీవీ నర్సింహారావుకు భారతరత్న వచ్చిన సందర్భంగా వంగరలోని ఆయన కుటుంబ సభ్యులను కలిశారు. ఈ సందర్భంగా సంజయ్ విలేకరులతో మాట్లాడారు. ప్రపంచ దేశాలు పీవీని కొనియాడుతుంటే సొంత పార్టీ కాంగ్రెస్ ఆయనను మరచిపోయిందని విమర్శించారు. పీవీ స్ఫూర్తి ముందు తరాలకు తెలియాలనే లక్ష్యంతో కేంద్రం ఆయనకు భారత రత్న ప్రకటించిందని తెలిపారు. 100 రోజుల్లో కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను అమలు చేయకపోతే ఆ పార్టీ నాయకుల భరతం పడతానని సంజయ్ హెచ్చరించారు. రాముడి జన్మస్థలాన్ని ప్రశ్నించే వాళ్లను తాను నిలదీస్తే.. తల్లిని అవమానించానంటూ.. ఆమెను అడ్డుపెట్టుకుని ఈ ప్రాంత మంత్రి రాజకీయం చేస్తున్నాడని మంత్రి పొన్నం ప్రభాకర్‌పై పరోక్ష ఆరోపణలు చేశారు. కేసీఆర్ తెలంగాణను నాశనం చేస్తే కాంగ్రెస్ సర్వనాశం చేయడానికి కంకణం కట్టుకుందని మండిపడ్డారు. కాగా, సంజయ్ గురువారం ఢిల్లీకి వెళ్లనున్నారు. దీంతో గురువారం జరగాల్సిన పాదయాత్ర శుక్రవారానికి వాయిదా పడింది.

పొన్నం దిష్టిబొమ్మ దహనం..

పీవీ కుటుంబ సభ్యులను కలిసిన అనంతరం వంగర నుంచి భీమదేవరపల్లికి వెళ్తుండగా వంగర బస్టాండ్ సమీపంలో బండి సంజయ్ కాన్వాయ్‌పై గుర్తుతెలియని వ్యక్తులు కోడిగుడ్లు విసిరారు. దీంతో సంజయ్ పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు, ఇంటెలిజెన్స్ వైఫల్యంతోనే తన కాన్వాయ్‌పై కోడిగుడ్ల దాడి జరిగిందని మండిపడ్డారు. కాగా, కాంగ్రెస్ కార్యకర్తలే కోడిగుడ్లతో దాడి చేశారని ఆరోపిస్తూ ముల్కనూర్‌లో బీజేపీ నాయకులు మంత్రి పొన్నం ప్రభాకర్ దిష్టిబొమ్మను దహనం చేశారు.

బీఆర్ఎస్ ఎంపీలు టచ్‌లో ఉన్నారు: లక్ష్మణ్

హైదరాబాద్: తెలంగాణలో భవిష్యత్ బీజేపీదేనని తేలిపోయిందని ఎంపీ కె.లక్ష్మణ్ అన్నారు. చాలా మంది సిటింగ్ ఎంపీలు తమను సంప్రదిస్తున్నారని, బీఆర్ఎస్ ఎంపీలు టచ్‌లో ఉన్నారని చెప్పారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో లక్ష్మణ్ బుధవారం మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ గ్యారెంటీలు మోసపూరిత వాగ్దానాలని విమర్శించారు. ప్రాంతీయ పార్టీలు ఇచ్చే సీట్ల కోసం కక్కుర్తిపడే స్థాయికి కాంగ్రెస్ దిగజారిపోయిందని అన్నారు. బీఆర్ఎస్ ఒక్క ఎంపీ సీటు కూడా గెలిచే అవకాశాలు లేవని లక్ష్మణ్ చెప్పారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No. 70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి

దిక్సూచి

హైదరాబాద్ ● గురువారం 29 ఫిబ్రవరి 2024

diksuchi@andhrajyothy.com

తిరుపతి ఐఐటీలో సైన్స్ హ్యాక్



తిరుపతిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీటీపీ)- నేషనల్ సర్వీస్ స్కీం(ఎన్ఎస్ఎస్) కింద 'సైన్స్ హ్యాక్-4.0' పేరుతో ఆన్‌లైన్ ప్రాజెక్ట్ కాంపిటేషన్‌ను నిర్వహిస్తోంది. దీనిని పాఠశాల విద్యార్థులకు ప్రత్యేకించారు. ఆరోతరగతి నుంచి పదోతరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఈ పోటీలో పాల్గొనవచ్చు.

పోటీ వివరాలు

- విద్యార్థులు సైన్స్‌లో ప్రయోగ/ప్రాజెక్ట్ అంశాన్ని స్వయంగా ఎంచుకోవాలి. ప్రాజెక్ట్ మోడల్‌ను స్వయంగా రూపొందిస్తూ మొత్తం ప్రక్రియను వీడియో రికార్డ్ చేయాలి. తెలుగు/హిందీ/ఇంగ్లీష్ భాషలో ప్రాజెక్ట్‌ను వివరించాలి. వీడియో నిడివి పదిహేను నిమిషాలకు మించకూడదు.
- ఈ వీడియోని సంస్థ వెబ్‌సైట్‌లో ఇచ్చిన లింక్ ద్వారా అప్‌లోడ్ చేయాలి. లింక్‌లో ఇచ్చిన దరఖాస్తు ఫారంలో విద్యార్థి వివరాలు నమోదు చేసి సబ్మిట్ చేయాలి.
- విజేతల వివరాలను సంస్థ వెబ్‌సైట్‌లో ప్రకటిస్తారు. విద్యార్థులకు ఈ మెయిల్ ద్వారా కూడా తెలియజేస్తారు. గెలుపొందిన వారికి బహుమతులతోపాటు ఈ-సర్టిఫికెట్ ఇస్తారు. అంతేగాక ఐఐటీ తిరుపతి నిర్వహించే ఓపెన్ స్కూల్ డే 2024 ప్రోగ్రామ్‌లో పాల్గొనే అవకాశం కల్పిస్తారు.

ప్రాజెక్ట్ వీడియోలు అప్‌లోడ్ చేసేందుకు చివరి తేదీ: మార్చి 15

వీడియోలు అప్‌లోడ్ చేయాల్సిన లింక్: https://forms.gle/1YTKn3UPUxWYcsve8. **వెబ్‌సైట్:** www.iittp.ac.in

సీయూఈటీ(యూజీ) 2024

దేశవ్యాప్తంగా ఉన్న సెంట్రల్ యూనివర్సిటీలు సహా పార్టిసిపేటింగ్ యూనివర్సిటీలు, డీమ్డ్ యూనివర్సిటీలు, అటానమస్ కళాశాలలు, ప్రభుత్వ/ ప్రైవేట్ యూనివర్సిటీలు అందిస్తున్న అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలకు ఉద్దేశించిన 'కామన్ యూనివర్సిటీ ఎంట్రెన్స్ టెస్ట్(సీయూఈటీ) యూజీ 2024 నోటిఫికేషన్ వెలువడింది.



ఈ పరీక్షని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్వహిస్తుంది. హిందీ, ఇంగ్లీష్, తెలుగు, ఉర్దూ సహా మొత్తం 13 మాధ్యమాల్లో పరీక్ష రాయవచ్చు. ఒక జనరల్ టెస్ట్ పేపర్, 33 లాంగ్వేజ్ టెస్ట్ పేపర్లు, 27 డొమైన్ సబ్జెక్ట్ పేపర్ల నుంచి అభ్యర్థులు కనిష్ఠంగా మూడు, గరిష్ఠంగా ఆరు టెస్ట్ పేపర్లు రాసే వీలుంది.

డొమైన్ సబ్జెక్టులు

అకౌంటెన్సీ/బుక్ కీపింగ్, అగ్రికల్చర్, ఆంత్రోపాలజీ, బయాలజీ/బయలాజికల్ స్టడీస్/బయోటెక్నాలజీ/బయో కెమిస్ట్రీ, బిజినెస్ స్టడీస్, కెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్, కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మాటిక్స్ ప్రాక్టీసెస్, ఎకనామిక్స్/ బిజినెస్ ఎకనామిక్స్, ఇంజనీరింగ్ గ్రాఫిక్స్, ఆంత్రప్రెన్యూర్‌షిప్, ఫైన్ ఆర్ట్స్/ విజువల్ ఆర్ట్స్/కమర్షియల్ ఆర్ట్, జాగ్రఫీ/జియాలజీ, హిస్టరీ, హోం సైన్స్, నాలెడ్జ్ ట్రెడిషన్ ప్రాక్టీసెస్ ఇన్ ఇండియా, లీగల్ స్టడీస్, మాస్ మీడియా/ మాస్ కమ్యూనికేషన్, మేథమెటిక్స్/అప్లయిడ్ మేథమెటిక్స్, పెర్ఫార్మింగ్ ఆర్ట్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్/నేషనల్ క్యాడెట్ కోర్/యోగా, ఫిజిక్స్, పొలిటికల్ సైన్స్, సైకాలజీ, సంస్కృతం, సోషియాలజీ, టీచింగ్ ఆప్టిట్యూడ్.

లాంగ్వేజ్ సబ్జెక్టులు

ఇంగ్లీష్, హిందీ, అస్సామీ, బెంగాలీ, గుజరాతీ, కన్నడ, మలయాళం, మరాఠీ, ఒడియా, పంజాబీ, తమిళం, తెలుగు, ఉర్దూ, అరబిక్, బోడో, చైనీస్, డోగ్రీ, ఫ్రెంచ్, జర్మన్, ఇటాలియన్, జపనీస్, కశ్మీరీ, కొంకణి, మైథిలి, మణిపురి, నేపాలీ, పర్షియన్, రష్యన్, సంతాలీ, సింధీ, స్పానిష్, టిబెటన్, సంస్కృతం.

అర్హత

గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు/చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. కనీసం మూడేళ్ల వ్యవధి గల డిప్లొమా పూర్తిచేసినవారు; హయ్యర్ సెకండరీ సర్టిఫికెట్ ఒకేషనల్ ఎగ్జామినేషన్ ఉత్తీర్ణులు; జనరల్ సర్టిఫికెట్ ఎడ్యుకేషన్ ఎగ్జామినేషన్ అడ్వాన్స్‌డ్ లెవెల్ పూర్తిచేసినవారు; కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ నుంచి హైస్కూల్ సర్టిఫికెట్ ఎగ్జామినేషన్ ఉత్తీర్ణులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వయోపరిమితి నిబంధనలు లేవు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** మూడు సబ్జెక్టుల వరకు జనరల్ అభ్యర్థులు రూ.1000; ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు రూ.900; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.800; విదేశీ అభ్యర్థులు రూ.4500 చెల్లించాలి. ప్రతి అదనపు సబ్జెక్టుకు జనరల్ అభ్యర్థులు రూ.400; ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు రూ.375; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.350; విదేశీ అభ్యర్థులు రూ.1800 చెల్లించాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 26
- **కరెక్షన్ విండో ఓపెన్:** మార్చి 28, 29
- **ఎగ్జామినేషన్ సెంటర్ వివరాలు వెల్లడి:** ఏప్రిల్ 30 నుంచి
- **అడ్మిట్‌కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** మే రెండో వారంలో
- **సీయూఈటీ యూజీ 2024 తేదీలు:** మే 15 నుంచి 31 వరకు
- **ఫలితాలు విడుదల:** జూన్ 30న
- **వెబ్‌సైట్:** www.nta.ac.in, https://exams.nta.ac.in/CUET-UG/

దీనిని హైబ్రిడ్ మోడ్(కంప్యూటర్ బేస్డ్ టెస్ట్/పెన్&పేపర్ టెస్ట్)లో నిర్వహిస్తారు. అన్నీ మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలే ఇస్తారు. ఇందులో మూడు సెక్షన్లు ఉంటాయి. మొదటి సెక్షన్‌లో లాంగ్వేజ్ టెస్ట్‌లు ఉంటాయి. రీడింగ్ కాంప్రహెన్షన్, లిటరరీ ఆప్టిట్యూడ్, ఒకాబులరీలకు సంబంధించి 50 ప్రశ్నలు ఇస్తారు. వీటిలో 40 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. రెండో సెక్షన్‌లో డొమైన్ సబ్జెక్ట్ టెస్ట్‌లు ఉంటాయి. ఇంటర్/పన్నెండోతరగతి సిల

ఎగ్జామ్ వివరాలు

బస్ ఆధారంగా 50 ప్రశ్నలు అడుగుతారు. వీటిలో 40 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. మూడో సెక్షన్‌లో జనరల్ టెస్ట్ ఉంటుంది. ఇందులో జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్, జనరల్ మెంటల్ ఎబిలిటీ, న్యూమరికల్ ఎబిలిటీ, క్వాంటిటేటివ్ రీజనింగ్, లాజికల్ అండ్ అనలిటికల్ రీజనింగ్ అంశాలనుంచి 60 ప్రశ్నలు ఇస్తారు. వీటిలో 50 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. ప్రశ్నకు అయిదు మార్కులు కేటాయించారు. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు.

అభ్యర్థులు జనరల్ టెస్ట్ సహా డొమైన్ సబ్జెక్టుల నుంచి 4 లేదా 5 పేపర్లు; లాంగ్వేజ్ సబ్జెక్టుల నుంచి 1 లేదా 2 పేపర్లు చొప్పున గరిష్ఠంగా 6 పేపర్లు ఎంచుకోవాలి. జనరల్ టెస్ట్ సహా కనీసం ఒక లాంగ్వేజ్ ఉండేలా చూసుకోవాలి.

మేథమెటిక్స్/అప్లయిడ్ మేథమెటిక్స్, అకౌంటెన్సీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఎకనామిక్స్, కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మాటిక్స్ ప్రాక్టీసెస్, జనరల్ టెస్ట్ పేపర్లకు ఒక్కోదానికి పరీక్ష సమయం ఒక గంట. మిగిలిన అన్ని పేపర్లకూ ఒక్కోదానికి 45 నిమిషాలు ఇస్తారు.

నైసర్‌లో సమ్మర్ ఔట్‌రీచ్ ప్రోగ్రామ్

భువనేశ్వర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(నైసర్)కు చెందిన స్కూల్ ఆఫ్ మేథమెటికల్ సైన్సెస్(ఎస్ఎంఎస్)- 'సమ్మర్ అవుట్‌రీచ్ ప్రోగ్రామ్ ఇన్ మేథమెటిక్స్ (ఎస్ఓపీఎం) 2024'లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇందులో ఆల్జీబ్రా అండ్ అనాలిసిస్‌కు సంబంధించి శిక్షణ ఇస్తారు. ఈ ప్రోగ్రామ్‌ను మే 20 నుంచి జూన్ 8 వరకు నిర్వహిస్తారు. అకడమిక్ మెరిట్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఎంపికైనవారికి రాను పోనూ స్లీపర్ క్లాస్ ట్రైన్ ఫేర్ ఇస్తారు. భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తారు.

అర్హత

బీఎస్సీ(మేథమెటిక్స్) రెండో ఏడాది, మూడో ఏడాది చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. మేథమెటిక్స్‌లో రాణించాలనుకొనేవారికి ఈ ప్రోగ్రామ్ ఉపయోగపడుతుంది.

చదువుతున్న కళాశాల నుంచి రికమండేషన్ లెటర్, ఇంటర్/పన్నెండోతరగతి నుంచి డిగ్రీ వరకు మార్కుల పత్రాలను దరఖాస్తుకు జతచేయాలి.

ముఖ్య సమాచారం

- స్పీడ్ పోస్ట్ ద్వారా దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ: మార్చి 27
- ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల: ఏప్రిల్ 2న
- దరఖాస్తు పంపాల్సిన చిరునామా: కోఆర్డినేటర్, స్కూల్ ఆఫ్ మేథమెటికల్ సైన్సెస్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్-భువనేశ్వర్, వయా జత్ని, ఖుర్దా జిల్లా, ఒడిశా-752050
- ఈ-మెయిల్: sopm@niser.ac.in
- వెబ్‌సైట్: www.niser.ac.in

జాబ్ కార్నర్

పీఎఫ్‌సీలో కో-ఆర్డినేటర్లు

న్యూఢిల్లీలోని పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్...కాంట్రాక్ట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది. **మొత్తం ఖాళీలు: 27**

1. కో-ఆర్డినేటర్(సీఎస్ఆర్)/లెవల్ 1: 2 పోస్టులు
2. కో-ఆర్డినేటర్(ఆర్‌డీఎస్ఎస్)-1/లెవల్ 3: 1 పోస్టు
3. కో- ఆర్డినేటర్(ఆర్‌డీఎస్ఎస్)-2/లెవల్ 3: 1 పోస్టు
4. కో-ఆర్డినేటర్(ఆర్‌డీఎస్ఎస్)-3/లెవల్ 3: 1 పోస్టు
5. కో-ఆర్డినేటర్(ఆర్‌డీఎస్ఎస్)-4/లెవల్ 3: 1 పోస్టు
6. కో-ఆర్డినేటర్(ఆర్‌డీఎస్ఎస్)-5/లెవల్ 3: 1 పోస్టు
7. కో-ఆర్డినేటర్(ఆర్‌డీఎస్ఎస్)-1/లెవల్ 2: 19 పోస్టులు
8. కో-ఆర్డినేటర్(ఆర్‌డీఎస్ఎస్)-2/లెవల్ 2: 1 పోస్టు

అర్హత: సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్, ఎంసీఏ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 21 నుంచి 60 ఏళ్ల మధ్య ఉండాలి. **జీతం:** లెవల్-1 వారికి రూ.65,000, లెవెల్-2 వారికి రూ.90,000, లెవెల్-3 వారికి రూ.1,25,000

దరఖాస్తు ఫీజు: రూ.500, ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ అభ్యర్థులకు మినహాయింపు ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 7

వెబ్‌సైట్: https://pfcindia.com/ensite

ఎన్‌టీపీసీలో అసిస్టెంట్ మేనేజర్లు

న్యూఢిల్లీలోని నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్..ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: 20

పోస్టు: అసిస్టెంట్ మేనేజర్(సేఫ్టీ)

అర్హత: సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ, పీజీ, పీజీ డిప్లొమాలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 40 సంవత్సరాలు మించకూడదు

వేతనం: నెలకు రూ.60,000- రూ.1,80,000 వరకు చెల్లిస్తారు


దరఖాస్తు ఫీజు: జనరల్, ఈడబ్ల్యూ, ఓబీసీ అభ్యర్థులకు రూ.300. ఎస్సీ, ఎస్టీ, ఎక్స్ సర్వీస్‌మెన్, మహిళా అభ్యర్థులకు మినహాయింపు ఉంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 8

వెబ్‌సైట్: https://www.ntpc.co.in/

నదీ జలాల వివాదాలు

టీఎస్‌పీఎస్సీ పరీక్షల ప్రత్యేకం



ఆల్మట్టి వివాదం

- కర్ణాటక, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నాటి నుంచి ఈ వివాదం ఉంది.
- దీనికి సంబంధించిన ట్రిబ్యునల్స్: బచావత్ ట్రిబ్యునల్, బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్
- ఆల్మట్టి డ్యాం వాస్తవ ఎత్తు: 517 మీటర్లు
- ఎత్తు పెంచడంలో భాగంగా కర్ణాటక ప్రతిపాదించిన ఎత్తు: 524. 25 మీటర్లు
- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదించిన ఎత్తు: 519.6 మీటర్లు

కృష్ణా నది జలాల వివాదం (బ్రిజేష్ కుమార్ ట్రిబ్యూనల్)

- 1969 ఏప్రిల్ 10: బచావత్ ట్రిబ్యూనల్ ఏర్పాటు (ఇంటర్ స్టేట్ వాటర్ డిస్ప్యూట్స్ యాక్ట్-1956 ప్రకారం)
- ఇది 1973లో తుది తీర్పు ఇచ్చింది. దీనిలో స్కీమ్-ఎ లో నికర జలాలు, స్కీమ్-బి లో మిగులు జలాలను పంపిణీ చేసింది. కృష్ణా నదిలో లభించే మొత్తం నీటిలో 75 శాతం నికర నీటి లభ్యతగా గుర్తించి పంచింది.
- 1976 మే 31: ప్రభుత్వం బచావత్ ట్రిబ్యునల్ తుది తీర్పు గెజిట్‌ను ప్రకటించింది.

దీని ప్రకారం కృష్ణా నదిలో నికర జలాల లభ్యత 2060 టీఎంసీలుగా పేర్కొంది.

- మహారాష్ట్ర - 560, కర్ణాటక-700, ఆంధ్రప్రదేశ్ 800 టీఎంసీల నీటి వాటా కలిగి ఉన్నాయి.

నోట్: మిగులు జలాలు అంటే...ప్రాజెక్ట్‌లలోని నీటిని కాలువల ద్వారా పొలాలకు మళ్లించి సాగునీటికి, వివిధ అవసరాలకు ఉపయోగించగా, మిగిలిపోయి తిరిగి నదిలో కలిసే జలాలు.

- ట్రిబ్యునల్ 70 టీఎంసీలను మిగులు జలాలుగా పేర్కొని, మహారాష్ట్రకు-25, కర్ణాటకకు-45, ఆంధ్రప్రదేశ్‌కు-11 టీఎంసీలు కేటాయించింది.
- 2004 ఏప్రిల్ 2: బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ఏర్పాటు చేస్తూ కేంద్రం నోటిఫికేషన్ జారీ చేసింది. 2006 ఫిబ్రవరి 1 నుంచి ట్రిబ్యునల్ అధికారికంగా అమలులోకి వచ్చింది. 2010 డిసెంబరు 31న కర్ణాటకకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. అదేవిధంగా మిగులు జలాల వాటాను ఆంధ్రప్రదేశ్‌తోపాటు కర్ణాటక, మహారాష్ట్రకు పంచింది. కృష్ణా నది నికర నీటి లభ్యతను 2594 టీఎంసీలుగా లెక్కించింది(మిగులు జలాలను కూడా కలిపింది). మహారాష్ట్రకు-666 టీఎంసీలు, కర్ణాటకకు-911 టీఎంసీలు, నది పరిరక్షణ కోసం-16 టీఎంసీలు, ఆంధ్రప్రదేశ్‌కు-1001 టీఎంసీలు కేటాయించింది.

నోట్: తదుపరి నది జలాల పునఃసమీక్ష 2050 తర్వాతే ఉంటుందని రిపోర్ట్ పేర్కొంది.

కావేరీ నది జలాల వివాదం

కావేరీ నది నీటిని తమిళనాడు గ్రాండ్ ఆనకట్ట (కల్లనై డ్యామ్)ను రెండవ శతాబ్దంలో నిర్మించడం ద్వారా, 1934లో నిర్మించిన మెట్టూరు డ్యామ్ ద్వారా చాలా సంవత్సరాల నుంచి వినియోగించుకుంటోంది.



అయితే కర్ణాటక 1932లో కృష్ణరాజ సాగర్ డ్యామ్ ద్వారా, తమిళనాడుకు వచ్చే కావేరీ జలాల లభ్యత తగ్గిపోవడంతో వివాదాలు ప్రారంభమయ్యాయి.

- కావేరీ నది పరివాహక ప్రాంతం: తమిళనాడు, కర్ణాటక, కేరళ, పాండిచ్చేరిలో ఉంది.
- 1990లో కేంద్ర ప్రభుత్వం కావేరీ వాటర్ డిస్ప్యూట్ ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేసింది.
- 1998లో కావేరీ రివర్ అథారిటీని ఏర్పాటు చేసింది
- 2028 సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కావేరీ నది జలాల పంపిణీ: మొత్తం 726 టీఎంసీలలో కర్ణాటకు 284.75, తమిళనాడుకు 404.25, కేరళకు 30, పాండిచ్చేరికి 7 టీఎంసీల వాటా లభించింది.

ముల్ల పెరియార్ డ్యామ్ వివాదం

ప్రస్తుత కేరళ రాష్ట్ర సరిహద్దు లోపల, ఒకప్పటి ట్రావెన్ కోర్ సంస్థానంలో పెరియార్ నదిపై ఈ డ్యామును నిర్మించారు. 1886లో బ్రిటిష్ ప్రభుత్వం, ట్రావెన్ కోర్ సంస్థానం నుంచి డ్యామ్ ఉన్న ప్రదేశాన్ని 999 సంవత్సరాలకు లీజుకు తీసుకుని నిర్మించింది. డ్యామ్ వెనుక భాగంలో సొరంగ మార్గాన్ని ఏర్పాటు చేసి, దాని ద్వారా తమిళనాడులోని వైగై నదిలోకి నీటిని సరఫరా చేస్తున్నారు. దీని ద్వారా 68 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నారు.

కేరళ వాదన: 120 సంవత్సరాల క్రితం నిర్మించిన డ్యామ్ భద్రత గురించి కేరళ అభ్యంతరాలను తెలియజేస్తోంది. ఇది తెగిపోతే దిగువన ఉన్న ఇడుక్కీ డ్యామ్, పెరియార్ బ్యారేజ్‌లు ప్రమాదంలో పడతాయి. కనుక, ప్రస్తుతమున్న డ్యామ్‌ని కూల్చివేసి, కొత్త డ్యామ్ నిర్మించాలి. అది కూడా ప్రస్తుత 142 అడుగుల ఎత్తు కాకుండా 136 అడుగుల ఎత్తు మాత్రమే నిర్మించాలని వాదిస్తోంది.



తమిళనాడు ప్రభుత్వ వాదన: 2010లో డ్యామ్ భద్రతపై పరిశీలన కోసం ఏ.ఎస్.ఆనంద్ కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీ డ్యామ్ భద్రతకు ఎలాంటి ప్రమాదం లేదని పేర్కొంది. 136 అడుగుల నుంచి 142 అడుగుల వరకు నీటిని నిల్వ చేసుకోవచ్చని స్పష్టం చేసింది.

పాలార్ నది వివాదం

పెన్నా, కావేరీ నదుల మధ్యలో కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు ద్వారా స్వతంత్రంగా ప్రవహించే మధ్యస్థ నది. ఈ నది తమిళనాడులోని వెల్లూరు, కంచి ప్రాంతాలకు జీవనాధారం. ఈ నదిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చిత్తూరు జిల్లా కుప్పం వద్ద డ్యామ్ నిర్మాణం ప్రారంభించింది. దీనిని తమిళనాడు వ్యతిరేకిస్తోంది.

సింధూనది జలాల ఒప్పందం

1960లో సింధూజలాల ఒప్పందం ఇండియా - పాకిస్థాన్ మధ్య జరిగింది. దీని ప్రకారం పశ్చిమ నదులైన- సింధూ, జీలం, చీనాబ్ నదులలోని మొత్తం నీటి ప్రవాహంలో 80 శాతం పాకిస్థాన్‌కి, 20 శాతం ఇండియాకి కేటాయించారు. తూర్పు నదులైన రావి, సట్లెజ్, బియాస్ నదులలో మొత్తం నీటిలో 80 శాతం ఇండియాకి, 20 శాతం పాకిస్థాన్‌కి కేటాయించారు.

బాగ్లీహార్: ఈ ప్రాజెక్టును సింధూ ఒప్పందానికి వ్యతిరేకంగా చీనాబ్ నదిపై భారత్ నిర్మించింది. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి వ్యతిరేకంగా ప్రపంచ బ్యాంక్‌లో పాకిస్థాన్ ఫిర్యాదు చేసింది. ఫలితంగా ఈ ప్రాజెక్టు పరిశీలన కోసం లఫైతే(స్విట్జర్లాండ్) కమిటీని నియమించారు. 2010లో ఈ వివాదం పరిష్కారమైంది.

కిషన్ గంగా: ఈ ప్రాజెక్టును సింధూ ఒప్పందానికి వ్యతిరేకంగా జీలం, కిషన్ గంగా నదుల ఆధారంగా నిర్మించారు. ఈ నిర్మాణానికి వ్యతిరేకంగా అంతర్జాతీయ న్యాయస్థానంలో పాకిస్థాన్ ఫిర్యాదు చేసింది. ఫలితంగా ఈ ప్రాజెక్టు పరిశీలనకు న్యూట్రల్ కమిటీ(బ్రిటన్)ని నియమించారు.



వి. వెంకట్‌రెడ్డి,
సీనియర్ ఫ్యాకల్టీ

లిటిల్స్



అభిప్రాయం

అనగనగా ఓ రాజ్యం. అది ఉత్తర దేశం. ఆ రాజ్యానికి పరమకోపిష్టి అయిన విశ్వదత్తుడు అనే రాజు ఉండేవాడు. ఏ ప్రశ్న అడిగినా..సమాధానం బావుండాలనే తత్వం అతనిది. తనను భజన చేస్తుంటే నచ్చదంటాడు. తనను వ్యతిరేకిస్తే మాత్రం అంతటితో ఊరుకోకుండా కటకటాల పాలు చేసి ఖైదీని చేసేవాడు.

అంతటి కోపిష్టి రాజుకు మంచి మనసు ఉంది. కిరీటం, బంగారు ఆభరణాలు, ఆ డాబు దర్పం పక్కన బెట్టి ఉండేవాడు. తన రాజ్యంలో ఒంటరిగా చెట్లకు నీళ్లు పోసేవాడు. బొమ్మలు గీసేవాడు. అతని మాటలకు.. అతని తీరుకు రాజ్యంలోని కొందరు ఆశ్చర్యపోయేవారు. ఏదీ పట్టించుకోకుండా.. పనివాళ్లతో కలసి తానూ కలసి పని చేసినట్లు ఉండేవాడు. రాజుగారితో ఏమి అన్నా తలనొప్పులేనని ఎవరూ ఆయన్ని వ్యతిరేకించేవారు కాదు. ఎదురు చెప్పేవారు కాదు. దీంతో రాజుగారు ఇదంతా తన గొప్పతనం అని అనుకునేవాడు.

రాజుగారికి మంచి మనసు ఉందని కొందరనేవారు. ఇది తెలిసి రాజ్యంలోని తోటమాలి తనకు ఏదైనా సాయం చేయవచ్చు కదా అనుకునేవాడు. తోటలో కాపలా కాసేప్పుడు రాజుగారు హుటాహుటిన అక్కడకు వెళ్లాడు. అక్కడ కొన్ని పూలు కోశారు రాజుగారు. తోటమాలిని పిలిచాడు. 'నేను పెట్టుకున్న ఉంగరం చూడు' అన్నాడు. అదిరిపోయాడు తోటమాలి. 'ఈ ఉంగరం భలే ఉంది కదా. ఈ బంగారం పని చేయటం కష్టం. ఉంగరంలో వజ్రం కూడా ఉంది. ఎంత ప్రతిభావంతుడో ఈ ఉంగరాన్ని చేసినవాడు' అంటూ పొగుడుతున్నాడు. తోటమాలి స్పందనేమీ లేదు.

'ఇంతగా మాట్లాడుతున్నా స్పందనేమీ లేదు ఎందుకూ' అని రాజుగారు ఆ తోటమాలిని అడిగారు. 'అయ్యా..మీరు రాజులు. ఏదైనా మంచి విలువైనదే ధరిస్తారు. ఆ ఉంగరం గురించి.. ఆ ఉంగరం చేసిన వారి గురించి మీరే ఇంతలా చెబుతుంటే నేనెందుకు వ్యతిరేకిస్తాను. అలా వ్యతిరేకిస్తే ఉండగలనా?' అన్నాడు. ఇంకా చెప్పు అన్నాడు రాజుగారు. 'నేను ఏకీభవిస్తే సంతృప్తిగా ఉండలేను. అది కూడా నాకు నచ్చదు' అన్నాడు తోటమాలి. 'నీ అభిప్రాయం బావుంది. ఇదిగో ఈ ఉంగరం నీదే తోటమాలి' అని రాజు వెళ్లిపోయాడు. అక్కడ ఉన్నవాళ్లకు ఏమీ అర్థం కాలేదు. రాజు మంచివాడు. తోటమాలి తెలివైనవాడు. అతని అభిప్రాయం విలువైనది అనుకున్నారంతా.

10 తేడాలను గుర్తించండి



దారి కనుక్కోండి



ఏవి ఎన్ని?





డైలీ సుడోకు - 242

			2					
1				8		6	4	
6								9
	1				3		2	
4		8	5		9	1		6
	7		8				9	
3								7
	2	9		6				1
					4			

సుడోకు - 241 సమాధానం

9	3	8	1	2	5	7	4	6
7	4	6	8	3	9	2	1	5
1	2	5	7	4	6	3	9	8
6	7	4	3	5	1	9	8	2
5	1	9	2	7	8	4	6	3
3	8	2	6	9	4	5	7	1
2	6	3	4	1	7	8	5	9
8	9	7	5	6	2	1	3	4
4	5	1	9	8	3	6	2	7

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.